# సం.సా:రా:లు

సుధామ



# సంస్కారాలు

(సంస్కృతి, సాహిత్యం, రాజకీయాలు)

## సుధామ

ఆంధ్రభూమి దినపత్రిక
ఎడిట్‌పేజి మిడిల్‌కాలమ్ వారంవారం రచనలనుండి ఓ యాభై.

సఖీకుమారి ప్రచురణలు
హైదరాబాదు

# SAM.SAA.RAA.LU

(Andhra Bhoomi Telugu Daily Column :
Lighter Vein Articles)

by

**SUDHAMA**

© Author

Copies 1000

25th Nov. 2001

Title Design : **Chandra**

For Copies
**Smt. S. Lakshmibai**
Sakhi Kumari Prachuranalu
G.12, Sadath Towers, Padmavathi Apartments
Saleemnagar Colony, Malakpet
Hyderabad - 500 036 (AP)
Ph : 4545780

Visalandhra Book House, Abids, Hyderabad
Nava yuga, Kachiguda, Hyderabad
Disha Pustaka kendram, Chikkadpally, Hyderabad

Composed by : Fontline Graphics, Bagh lingampally, Hyderabad
Printed at : Soundarya Printers, Hyderabad
Cover Printed at : Kalajyothi process Limited, Hyderabad

**Price : Rs. 50/-**



'ద్విభాష్యం' వారింట పుట్టి
'అల్లంరాజు'గా అత్తింట అడుగుపెట్టి
ఆరుగురు పిల్లల్నికని
అందరినీ సుశిక్షితులను చేసి
అందరి సంసారాలనూ వీక్షిస్తూ ఉన్న
ప్రియమైన మా అమ్మ
శ్రీమతి రాజేశ్వరమ్మకు
సప్రేమ ప్రీతి ఔర్ భక్తి రీతి....

**అంకితం**

# క్రమంలో సంసారాలు ...


* పాఠకులకి మహా ఇష్టుడైన బెస్టు కవి కాలమిస్టు - v * ఇంట్లో ఓ ఇంట్రో - ix * సం.సా.రా.లు - 1 * హైటెక్ ఉల్కా విందుపాతం - 3 * గడ్డమో రామచంద్రా! - 6 * హా! సీతా!.... ఫలం? - 9 * ఎథిక్ స్పీచ్ - 12 * అక్షరాలు ఇక అజంతాలు కావు - 14 * డైరీ కల్చర్ - 17 * గతిమారిన గీతి - 20 * ముక్కుచూడు ... ముక్కందం చూడూ - 23 * అఖండ (అ)శాంతి - 26 * డౌన్ విత్ మెమరీ లైన్ - 29 * పిల్ల(ల) సరదాలు - పెద్ద(ల) భారాలు - 32 * మహిళానీకు వందనం - 35 * కవితారసిక ప్రహసనం - 38 * ఖేల్ ఖూద్‌కీ జంగ్‌మే - 42 * సమకాల జ్ఞానం - 45 * కథల పెద్దాయన పెన్నుమూత-48 * గొడుగుతో అడుగువేసి గొణగనీ సణగనీ - 51 * స్తుతి. మా. 'లా' - 54 * అతిక్రమించిన వాస్తవాధీన రేఖలు - 57 * జ్వరరాగసాధ - 60 * (ప)రేషన్ గ్యాస్ - 63 * శిక్షణా (తర) గతి! - 66 * ఎన్నికల (ల) తార - 69 * మొదటి విడత - 72 * కుఛ్‌కుఛ్ హోతాహై - 75 * చెక్కని సంసారం - 77 * ప్రాయో(జిత) పదేశం - 80 * బుక్సూ - లుక్సూ - 83 * 'మోసం డిగా డిగా' - 86 * కంప్యూటర్ కర్మ (పరి) పాకం! - 89 * ప్రేమపోటు - 91 * మృత్యుసాధన జీవనం - 94 * చుట్టుకొనే పొగ - 97 * ఆవు సంగతులు - 100 * ఆ 'రోగమే' మహాభాగ్యం - 103 * అమ్మాయే పుట్టాలీ - 106 * 'పేపర్స్' న్యూస్ - 109 * స్వయం సేవక్ - 112 * వినికిడి సడి - 115 * అక్రూరమృగం - క్రూరమానవం - 118 * ఆ 'గాలి పటం' - 121 * మార్పు మన తీర్పు - 124 * గోతులు తవ్వుదాం రండి - 127 * 'తాళి' బన్స్ - 130 * రికార్డ్ బ్రేక్ - 133 * కలిపికుట్టే నైజం - 136 * అంతానాటకం - 139 * టీకప్పుసైన్స్ - 142 * స్వానరిజం - 145 *

# పాఠకులకు మహా ఇష్టుడైన బెస్టు కవికాలమిస్టు!

"If you don't enjoy writing it,

no one will enjoy reading it ! "

ఎవరన్నారో గుర్తుకు రావడం లేదుకానీ ఇది నాకు ఇష్టమైన, నేను గుర్తు పెట్టుకున్న మాటల్లో ఒకటి. రచయిత రాసేది ఏదైనా బాగా ఇష్టపడి రాయాలి. అంటే రాసేదాని పట్ల విశ్వాసం, ప్రీతి ఉండాలన్న మాట. అట్లా రాయని రాతలను చదువరులు ఇష్టపడరని తాత్పర్యం. ఇలాగ, ఏది చేసినా ఎంతో ఇష్టపడి చేసే బహుముఖ ప్రజ్ఞావంతులలో సుధామ ఒకడు. సుధామ పేరు చెప్పగానే, తెలుగునాట చాలామంది లాగే, నాకు కవిత్వమే ముందు గుర్తుకు వస్తుంది. 'యువభారతి' కళ్ళముందు కదులుతుంది. కవిత్వాన్ని పలవరిస్తూ బతికిన మా తరం కవుల్లో సుధామ ఒకడు. 'యువభారతి' సంస్థ పట్టుకొమ్మల్లో ఒకడుగానే నాకు తారసపడినట్టు గుర్తు. అవును, గుర్తుకొచ్చింది. పైగంబరకవుల తొలిసంపుటం వెలువడి అంతటా హల్‌చల్ నడుస్తున్న కొత్తల్లో 'యువభారతి' వారు నన్ను మా గురించి మాట్లాడటానికి ఆహ్వానించారు (1970లో). అంటే సుధామని నేను మొదటిసారి చూసి ముప్పయ్యేళ్లు దాటింది. ఈ మూడు దశాబ్దాలలో సుధామ చాలాదూరం ప్రయాణం చేశాడు. ఆకాశవాణిలో స్థిరపడి ఉండకపోతే, మంచికవిగా మరింతదూరం వెళ్ళి ఉండేవాడని నా నమ్మకం. ఉద్యోగాల్లో చేరగానే, పెళ్ళాం, పిల్లలు ఏర్పడగానే చాలా మంది ప్రతిభావంతులైన కవులు, రచయితలు ఎందుకు చల్లబడిపోతారో తెలియదు. సుధామ అట్లా పూర్తిగా చల్లబడిపోతే కథ వేరేగా ఉండేది. కవిత్వం సాధనచేయవలసినంత సీరియస్‌గా సాధనచేయడంలేదని మాత్రమే నా అభియోగం. గులామ్ గౌస్, సుధామ వంటి ఆనాటి గొప్ప ప్రతిభావంతులైన నవ కవులు వేరువేరు కారణాలవల్ల సీరియస్ కవిత్వంనుంచి వేరైపోయారనే బాధ నాకెప్పుడూ ఉంటుంది. సుధామ కవిత్వం రాయడం తగ్గించాడని బాధ పడుతున్నానే కానీ, కార్టూనులు వేయడం మానుకున్నాడనే బాధ లేదా? - చాలా వుంది. సుధామ కార్టూనులు కొనసాగించి వుంటే తెలుగు పత్రికల్లో రాజకీయ కార్టూనిస్టులకి ఇప్పుడున్నంత కొరత వుండివుండేది కాదు. నేను కుర్ర సంపాదకుడిగా ఉన్న రాజకీయ వార పత్రిక 'ప్రజావాహిని' (1974) లో సుధామ పొలిటికల్ కార్టూన్లు వేసేవాడని ఇప్పటి వారికి చాలామందికి తెలిసి వుండదు. అప్పట్లో సుధామ కథలు కూడా రాసేవాడు.

ఫీచర్లు రాసేవాడు. మా పత్రికలో వార్తావ్యాఖ్యలు కూడా రాసేవాడు. రేఖాచిత్రాలు గీసేవాడు. ప్రత్యేకించి నాకు సుధామ హాస్యప్రియత్వం, చతురోక్తులు బాగా నచ్చేవి. ఈ పుస్తకానికి నాలుగు ముక్కల ముందుమాట రాయాలని మొదలు పెట్టి సోదరుడి బయోగ్రాఫికల్ విశేషాల్లోకి కొట్టుకు పోతున్నట్టున్నానా! రచయిత గురించి బొత్తిగా తెలియకుండా, ఏమీ ప్రస్తావించకుండా పుస్తకాలకి పీఠికలు రాసే 'సులువు కళ' నాకింకా వంటబట్టనట్టుంది!

సుధామ 'ఆంధ్రభూమి' దిన పత్రికలో సుమారు మూడేళ్ళ పాటుగా ధారాపాతంగా రాస్తున్న ప్రతివార ఫీచర్ 'సం.సా.రా.లు'. ఈ 'సం.సా.రా.లు' ని వివరిస్తూ సుధామ రాసిన మొదటి 'విడత' లోనే దీని కథాకమామీషు తెలిసిపోతుంది. సుధామ ఈ ఫీచర్ నిర్వహణలో అవలబించింది కనీస హామీకి ప్రఖ్యాతి వహించిన కథాకథన పద్ధతి. కొన్ని పాత్రలు, కొన్ని కల్పిత సన్నివేశాలు సృష్టించుకుంటూ, చెప్పదల్చుకున్నది, తాను పాఠకులకి అందించాలని (కమ్యూనికేట్ చేయాలని) ఇష్టపడుతున్నదీ, తనకిష్టమైన మాటల్లో చెప్పడానికి సుధామ ప్రయత్నం చేశాడు. తెలుగు పత్రికలు ఇటువంటి ఫీచరురచనకి నిన్నమొన్నటివరకు కూడా పెద్ద ప్రాముఖ్యత ఇవ్వలేదు. 'ఈనాడు', 'ఉదయం' దినపత్రికలు వచ్చాక ఈ పరిస్థితి బాగా మారింది. లత, మాలతీచందూర్, రావూరి వంటి ఆ తరం ఫీచర్ రైటర్‌లు / కాలమిస్టులు కొందరి పేర్లే నాకు గుర్తున్నాయి. విజ్ఞానరచనలు, హాస్యరచనలు కొల్లలుగా చేసిన నండూరి రామమోహనరావు, పురాణం సుబ్రహ్మణ్యశర్మ, భమిడిపాటి రామగోపాలం, గోపాలశాస్త్రి, నండూరి పార్థసారధి వంటి వారున్నారు కానీ కాలమిస్టులుగా స్థిరపడటానికి అవసరమైన పరిస్థితులు వీరిలో కొందరికి ఏర్పడలేదు. కాలమిస్టుగా, ఒక రచయిత స్థిరపడాలంటే ఆ కాలమ్ ధారావాహికంగా, ఏడాదో, రెండేళ్లో ఒక ప్రముఖ పత్రికలో కొనసాగాలి. డి.వి. నరసరాజు, చలసాని ప్రసాదరావు, వాకాటి పాండురంగారావు, తెలిదేవర భానుమూర్తి, గొల్లపూడి మారుతీరావు, డా॥ జె. భాగ్యలక్ష్మి వంటి పేర్లు మనకి ఈ శ్రేణిలో ఇందువల్లనే గుర్తుండి పోయాయనుకుంటాను. 'ఉదయం'లో కె.ఆర్. మూర్తి, (సరదాల పరదాలు), కె.ఎన్.వై. పతంజలి (పతంజలి భాష్యం) రాసిన కాలమ్స్‌కి వచ్చిన ప్రఖ్యాతి రచయితల ప్రతిభా సామర్థ్యం వల్లనే కాకుండా, అనన్య ప్రచారం ఉన్న పత్రికలో వారు వరుసపెట్టి నిరంతరాయంగా రాయడం వల్లకూడా సాధ్యపడిందనుకుంటాను.

సుధామ మూడేళ్ళుగా రాస్తున్న 'సం.సా.రా.లు' (ఇంకా కొనసాగుతోంది) లో ఆయన తడమని అంశం లేదు. ఈతి బాధలనుంచి నీతిబోధల వరకు, ఆర్థిక సమస్యలనుంచి, అంతర్జాతీయ రాజకీయాల వరకు సుధామ ఈ ఫీచర్లో పరామర్శించాడు.

ధారావాహిక కాలమిస్టులు మధ్య మధ్య మొరాయిస్తుంటారు. విసుగుపుడుతున్నదనీ, రాయడానికి 'విషయం' దొరకడం లేదనీ, ఓపిక అయిపోయిందనీ రకరకాల నెపాలతో ఎడిటర్ల దగ్గరకి వస్తుంటారు. తెలివైన, బాధ్యత తెలిసిన ఎడిటర్ ఎవరూ ప్రతిభావంతులైన కాలమిస్టులను వదులుకోడానికి ఇష్టపడడు. మా 'చేరా' గారు ఇలాగే ఎన్నిసార్లు మొండి చేసేవాడో! విచిత్రం ఏమిటంటే, మంచి ప్రతిభాపాటవాలున్న ఫీచర్ రచయితలూ, కాలమిస్టులే, ఇలా చేతులెత్తేయడానికి చూస్తుంటారు! సుధామ విషయంలో ఇలాగ జరిగిందో లేదో కానీ, అవిచ్ఛిన్నంగా "సం.సా.రా.లు" సాగుతున్నందుకు మాత్రం అటు 'ఆంధ్రభూమి' సంపాదకుడినీ, ఇటు సుధామనీ శతథా అభినందించవలసిందే!

ఇంగ్లీషు పత్రికలలో నాకు ఇష్టమైన కాలమిస్టులు. కీ.శే. బెహ్రామ్ కాంట్రాక్టర్, ఆర్ట్‌బుచ్ వాల్డ్, కుష్వంత్ సింగ్, కెర్సీకత్రక్, శోభాడే, బచీ కర్కారియా, కొత్తగా రాస్తున్న శ్రీనివాసన్ జైన్ వంటి వారున్నారు. తెలుగు పత్రికల్లో ఇప్పుడు వరుసగా రాస్తున్న వారిలో నాకు ఇష్టమైన ఇద్దరు ముగ్గురు కాలమిస్టుల్లో సుధామ ఒకడు. మనం సాధారణంగా, మనకి సన్నిహితంగా ఉండే మిత్రుల, సహచరుల ప్రతిభనీ, ప్రత్యేకతనీ, ఒక పట్టాన పట్టించుకోము. కానీ అసాధారణంగా వెలిగే రత్నం మెడలో వేలాడుతున్నప్పుడు చూపు అక్కడ పడకుండా ఎంతటి అంధుడైనా ఉండగలడా? అతి సులువైన, సరళమైన తెలుగు, అతిసున్నితమైన హాస్యం, విస్తారమైన లోకజ్ఞానం, నిత్య సామాజిక, రాజకీయ అధ్యయనం సుధామ కాలమ్‌ని ప్రకాశింప చేస్తున్న సద్గుణాలు.

'సం.సా.రా.లు' కేవలం వినోదం కోసం కాదు, కేవలం సామాజిక పరమైన చురకలు వేయడానికే కాదు, కేవలం రాజకీయ మహానుభావుల్ని ఎత్తిపొడవడానికే కాదు, 'సం.సా.రా.లు' ఒక సమగ్రమైన సర్వవ్యాప్త 'కాలమ్'! అదే దాని ప్రత్యేకత. ముందే చెప్పినట్లు ఇది ఒక టైమ్ టెస్టెడ్, క్లాసికల్ ఫార్మాట్‌లో సాగుతున్న బాధ్యత గుర్తెరిగిన కాలమ్. 'ఉల్కాపాతం' అనే మాటనుంచి అలవోకగా అలకా'పాతం' వంటి చమత్కారపదాలను సృష్టించగల చాతుర్యం సుధామలో అపారంగా ఉంది. టెర్మినేటర్ విత్తనాల ముప్పుని గురించి వ్యంగ్యంగా హెచ్చరించే అవగాహన, నేర్పూ ఉంది. డైరీని, థియరీనీ ఒక చోటికి తెచ్చి ఆడుకునే చమత్కార శక్తి ఉంది. 'వాస్తవాధీన రేఖల' గురించి రాసింది చూడండి, దేశ, అంతర్జాతీయ దృక్పథాల విషయంలో సుధామ ఎంత స్పృహతో ఉన్నాడో అర్థమవుతుంది. నిజానికి సుధామ 'సం.సా.రా.లు'లో రోజువారీ రాజకీయ పరిణామాలని ఎప్పటికప్పుడు పట్టుకుని, ఎత్తిపొడుస్తూనే వుంటాడు. టెలివిజన్ మీదా, మీడియా మీదా (?), సాంస్కృతిక వేదికల మీదా విసిరే విసుర్లకి లెక్కే వుండదు. ఉన్నట్టుండి, మధ్యమధ్య మృత్యువిషాద యోగంలోకి వెళ్ళిపోతుంటాడు. మనల్ని కూడా

తనతో ఆ అంతర్లోక వేదనల్లోకి లాక్కుపోతుంటాడు. నిజమే. పాఠకులు రచయిత నవ్వితే నవ్వి, రచయిత బాధపడితే బాధపడి, విసుక్కుంటే విసుక్కునే ప్రతిస్పందనకంటే ఏ రచయితకైనా, కాలమిస్టుకైనా విజయం ఏముంటుంది! కవిత్వమైనా, కాలమ్ అయినా, పాఠకులను తన వెంట, తన లోపలి ప్రపంచంలోకి తీసుకువెళ్ళి, అక్కడ వున్న కొత్తరంగుల్నీ, అక్కడ వినిపించే కొత్తధ్వనుల్నీ వాళ్ళ అనుభవంలోకి తీసుకురాగలగాలి కదా!

'సం.సా.రా.లు' వంటి కాలమ్స్‌లో కొన్ని 'తక్షణ కర్తవ్యాలు'ంటాయి. సమకాలీనత, చదివించే ఆకర్షణ, విషయ పరిజ్ఞానం, సమగ్ర సమాచార స్పృహ వంటివి ఇటువంటి విలక్షణమైన కాలమ్ నిర్వహించేవారికి తప్పనిసరిగా ఉండాలి. ఈ సాధనాలు (టూల్స్) ఉంటేనే కాని పాఠకులు ఆశిస్తున్న ప్రయోజనం నెరవేరదు. అన్నింటినీ మించి ఒక బాధ్యత గల 'కాలమిస్టు' ఏ పత్రికలో రాసినా, ఎన్ని 'విధాన పరిమితులకి' లోబడి రాసినా 'వాస్తవాధీనరేఖ'ని మాత్రం దాటిపోడు. ఎంత కాల్పనిక సంవిధానాన్ని అనుసరించినా, అది ప్రక్రియకి సంబంధించే కాని, అభిప్రాయాలకి సంబంధించి కాదు. ఈ విషయంలో సుధామ సామాన్య మానవుడైన పాఠకుడి పక్షాననే ఉన్నాడని నేను ఢంకా బజాయించి చెప్పగలను. ఇందుకు ఈ 'సం.సా.రా.లు' సంకలనంలో ఎన్నయినా ఋజువులు చూపించవచ్చు.

ఒకటి చెప్పాలనిపిస్తోంది. అపారమైన, బహుముఖమైన ప్రతిభాసామర్థ్యాలుండి కూడా సుధామ ఎందుకిలా ఒక కాలమ్‌కి కట్టుబడి పోవడం! ఇప్పటికీ అడపాదడపా రాస్తూనే వున్న కవిత్వాన్ని మరింత ముందుకు తీసుకురావచ్చుకదా! దానికే ప్రాముఖ్యత ఇచ్చి పనిచేయవచ్చు కదా! కవిని ఏ పని చేయకుండానైనా నివారించవచ్చేమో, నిరోధించవచ్చేమో కానీ కవిత్వం చెప్పకుండా వుంచగల ఆ స్థితి ఎలా ఉంటుందా అని ఆలోచిస్తున్నాను. 'సం.సా.రా.లు' వంటి రసవత్తరమైన, సామాజికపరమైన కాలమ్‌ని దిగ్విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు అభినందిస్తూ, కవిత్వంలోకూడా, మళ్ళీ ఒళ్ళు విరుచుకుని లేచి నిలబడాలని సుధామని మనసారా కోరుతున్నాను. పదబంధ ప్రహేళికలు నిర్మించినంత అవలీలగానే కవిత్వం రాయగల కవిని మనం ఎందుకు పోగొట్టుకోవాలో నాకు ఒక్క కారణం కూడా కనిపించడం లేదు. కాలమిస్టుగా సుధామ ఎంత ప్రఖ్యాతి సంపాదించాడో, ఆధునిక కవిగా అంతకంటే ఎక్కువ కాకపోయినా దానితో సమానంగానైనా ప్రకాశించాలన్నదే నా అభిలాష. సుధామా! ప్లీజ్ కీప్ గోయింగ్!

20, నవంబర్, 2001
హైదరాబాద్

దేవిప్రియ

# ఇంట్లో ఓ ఇంట్రో....

"రచయితను అనిపించుకోవడం కన్నా పత్రికా రచయితను అనిపించుకోవడమే నాకు ఇష్టం. కారణం పత్రికా రచయిత నిత్యయాత్రికుడు" అంటాడు గిల్బర్ట్.

ఈ మాట నాకు ఇష్టం. అలా నిత్యయాత్రికునిగా ఉండగల అవకాశం అందరికీ రాదు, పత్రికలో నిరంతరాయంగా ఒక 'కాలమ్' రాసే 'కాలమిస్టు'లకు తప్ప. నిత్యం సచేతనంగా, సమధికోత్సాహంగా, ప్రపంచంలో జరుగుతున్న అనేకానేక విషయాలపట్ల ఆసక్తిగా, ఆలోచనాత్మకంగా ఉండగల అవకాశమూ, అవసరమూ పత్రికా రచయితలకే ఎక్కువ. పత్రికా సంపాదకునిగా వుంటూ ఏదో ఒక 'కాలమ్' రాయడం పత్రికా నిర్వహణలో ఒక బాధ్యత కావచ్చునేమో గానీ, 'కాలమిస్టు' రచయితలుగా పేరు తెచ్చుకోవడం, దక్షతతో, ఓర్పుతో, నేర్పుతో శీర్షిక నిర్వహించడం మాటలు కాదు. అందరూ చదివి ఆనందించేదిగా, ఆయా పత్రికల మీద అభిమానం పెంచుకునేవిగా పాఠకులను అలరించేవి ఈ కాలమ్సే.

శీర్షికా రచయితల రచనావ్యాసంగం - నిరంతరంగా, నిరవధికంగా సాగేది. ఏ విషయాన్నయినా తమ శీర్షికలోకి ఇమిడ్చిరాయగల నేర్పు, అభ్యాసం వలన కాలమిస్టులకు అలవాటైపోతుంది. వారంవారం ప్రత్యేకించి ఫలానా విషయాన్నే రాయాలన్న నిబంధన పెట్టుకోరు చాలామంది. అలా పెట్టుకుని గ్రంథాలనో, రచయితలనో పరిచయం చేస్తూ ఫక్తు సాహితీవ్యాసాలుగా లేక విమర్శనావ్యాసాలుగా, అకడమిక్‌గా కాలమ్స్‌ను మార్చేసిన వారూ ఉన్నారు. లేదా ఫక్తు రాజకీయ విశ్లేషణలగానో లేదా వ్యంగ్యం పేరున అతిశయోక్తుల కథలగానో శీర్షికారచనను అనిపింపచేసిన వారూ ఉన్నారు.

'జాక్ ఆఫ్ ఆల్ మాస్టర్ ఆఫ్ నన్' అనుకున్నాసరే! సామాన్య పాఠకుడిని దృష్టిలో పెట్టుకుని, అతనికి వారంవారం ఆసక్తికర వార్తాంశాలను సరదాగా, కబుర్లుగా చెబుతూనే - ఆ అంశాలపై ఆసక్తినీ, ఆలోచనలనూ రేకెత్తించడం 'కాలమిస్టు'గా నేను సంకల్పించిన మార్గం. సంస్కృతి, సాహిత్యం, రాజకీయాలు అనే అంశాల నుండి రూపొందించిందే 'సం.సా.రా.లు' అనే ఈ కాలమ్.

ఇంగ్లీషులో లైటర్ వెయిన్ అని వుంది. హాస్యమూ, వ్యంగ్యమూ అనేవి పెద్దపదాలూ, ప్రణాళికలేమోగానీ తెలుగులో తేలికగా, తేటగా అలా చెప్పాలనే

సంకల్పంతో - కొన్ని పాత్రలూ, కొంత వాతావరణమూ కల్పించుకుని చేసిన రచనలివి. లోకంలో అందరికీ అన్ని విషయాలూ తెలియవు. ఎవరికి తెలిసిన విషయాలు వారికి తెలుసు. విన్నందువల్లనో, చూసినందువల్లనో, ఎక్కడో చదివినందువల్లనో కొందరు కొందరికి, కొన్నికొన్ని మార్లు, కొన్ని కొన్ని విషయాలు తెలుస్తాయి. ఇవాళ ఒక విషయంలో ఏమీ తెలియని తనం వున్నవాడే మరుక్షణం మరోవిషయంలో తెలివిడిగా కనిపించవచ్చు. అందుకే 'సం.సా.రా.లు' లో వచ్చే అందరూ అనేక సంగతులు ఆయా సమయాలకు తెలిసినవారూ, ఒకోసారి ఏమీ తెలియనివారూ కూడా కావచ్చు. తమకు తెలిసిన సంగతులనన్నింటినీ కబుర్లుగా కలబోసుకోవడమే, ఇంటింటా మాటాడుకున్నట్లుగా ఉండగలగడమే ఈ కాలమ్ ఉద్దేశ్యం.

'ఆంధ్రభూమి' దినపత్రిక సంపాదకులు శ్రీ యం.వి.ఆర్.శాస్త్రిగారు 1998 దసరాల వేళ నాకు కబురంపించి, పిలిపించి సరదాగా ఏదైనా కాలమ్ రాయమని ఆదేశించి, అవకాశం ఇచ్చిన 'కాలమే' - ఈ 'సం.సా.రా.లు.' "సుధామ చిలికించే కొత్త శీర్షిక. మామూలయిన అలవరుసలలో.... ఇలవరసల ఇంటింటి సరదా'' అన్న శీర్షికా నిర్దేశం వారిదే. నవంబరు 16, 1998 సోమవారం సంచిక నుండి ఆంధ్రభూమి దినపత్రిక ఎడిట్‌పేజి మిడిల్‌కాలంగా మొదలయిన 'సం.సా.రా.లు' ఆ తరువాత 1999 నవంబర్‌లో మూడునాలుగు వారాలు శుక్రవారానికి మారి, ఆ తరువాత వారాంతపు శీర్షికగా శనివారాల్లో ప్రచురితమవుతూ ఇప్పటికి సుమారు మూడేళ్ళుగా నిరంతరాయంగా సాగుతూ పాఠకుల ఆదరణను నోచుకుంది. వారంవారం ఫోన్లు చేసే వారూ, క్రమం తప్పకుండా (హైదరాబాద్ బాగ్‌లింగం పల్లి నుండి శ్రీమతి సి. కృష్ణవేణి వంటి అభిమాన పాఠకులు కొందరు) ఉత్తరాలు రాసేవారూ ఉంటూనే ఉన్నారు. నాకీ అవకాశం ఇచ్చిన ఆంధ్రభూమి దినపత్రిక సంపాదకులు శ్రీ యం.వి.ఆర్. శాస్త్రి గారికి వినమ్రకృతజ్ఞతలు తప్ప ఏం చెప్పుకోగలను. వారు నాపై ఉంచిన నమ్మకానికీ, ఇచ్చిన స్వేచ్ఛకూ ఎంతగానో ధన్యవాదాలు.

కాలమ్స్ రాయడం నాకు 'సం.సా.రా.లు'తోనే ప్రారంభం కాదుగానీ, ఇంత సుదీర్ఘయానం మాత్రం దీనితోనే. తొలిరోజుల్లో 'చుక్కాని' వారపత్రికలో గుసగుసలు, బంగారుపాళీలు, డైరీలో ఓ పేజీ (1970 ప్రాంతాలలో) ఆ తరువాత ఉదయం దినపత్రిక ప్రారంభంనుండి ఆదివారాలలో దేవిప్రియ ప్రోత్సాహంతో 'హ్యూమర్‌మరాలు', కీ.శే. శ్రీకంఠమూర్తి కోరికపై 'సితార'లో 'సినీటాక్', 'టాకీవాకీ' వంటి కాలమ్స్ నిర్వహించాను. అవన్నీ ఆరునెలలనుండి ఏడాది కాలవ్యవధిలో సాగినవే. సరే! 'హాస్యప్రభ' మాసపత్రికలో 'గళ్ల నుడికట్టు', ఉదయంలోనే 'పదమ వ్యూహం', 'సితార' లో సుధామధురం సితార పజిల్స్, సినీమినీక్విజ్, 'ఆంధ్రభూమి' వారపత్రికలో క్విజిల్స్, వి.క్యూ, దినపత్రిక ఆదివారం అనుబంధంలో 'మాటాట' (గళ్లనుడికట్టు) జాలీట్రాలీ,

ఆంధ్రప్రభ డైలీలో కూడా 'పద'నిసలు వంటి కాలమ్స్ నిర్వహించాను. ఆంధ్రప్రభ 'ధీర' స్త్రీల పేజీలో అరవైవారాల పాటు "ఈమె' యిల్' వ్రాసాను. ఈ కాలమ్స్ రాయడానికి సరదాగా సుషమత్, స్నేహిత్, సుషారాణి, జింజర్కింగ్, ధామసు వంటి పేర్లు వాడుకున్నాను కూడాను.

ప్రస్తుతం 'ఆంధ్రభూమి' దినపత్రికలో 'సం.సా.రా.లు' శనివారాల్లో సాగిస్తూనే, ఆదివారం అనుబంధంలో 'క్రేజీపేజీలు', వారపత్రికలో 'తెలివి ఎవరిసొత్తు', మాసపత్రికలో పద'మ'వ్యూహం, ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం పేజీల్లో 'పద'నిసలు, ఆంధ్రప్రభ దినపత్రికలోనే బుధవారాల్లో ఏడాదిగా ఎడిట్‌పేజీ మిడిల్ కాలమ్ రాస్తున్నాను. నిత్యయాత్రికునిగా వుండే పత్రికారచయితగా, 'కాలమిస్టు'గా ఈ సాహితీ ప్రస్థానం సాగుతోంది. 'చదవడం' అనే గొప్ప పనికి దూరం కాకూడదనే - పుస్తక సమీక్షలూ, 'వార్త'లో రాగమాలికలో అడపాదడపా శ్రవణ కుతూహల జనకమైన క్యాసెట్ రివ్యూలు చేస్తున్నాను. కార్టూన్లయితే గీయడం లేదుగానీ, కవిత్వం తక్కువగానయినా రాస్తూనే వున్నాను. ఆకాశవాణిలో కార్యక్రమ నిర్వహణాధికారిగా నన్ను సచేతనంగా, సజీవంగా, ఉత్సాహంగా వుంచుతున్న వ్యావృత్తులూ, సాహిత్య ప్రవృత్తులూ ఇవి.

విద్యార్థి దశనుండి గణించుకుంటే దాదాపు 35 సంవత్సరాలుగా సాహిత్యాభిలాషనూ, సాహిత్య వ్యాసంగాన్నీ సాగిస్తున్నా పుస్తకాలు వేసుకోవడంపట్ల శ్రద్ధ లేదు. ఆర్థిక వనరుల లోపం సరేసరి! అయినా 1990లో నా తొలి కవితాసంకలనంగా 'అగ్నిసుధ' వెలువరించాను. దానికి కలహంసి - బాబయ్య అవార్డు, ఉమ్మడి శెట్టి సాహితీ అవార్డు ఆ ఏటి ఉత్తమ కవితా సంకలనంగా లభించాయి.

'అగ్నిసుధ' తర్వాత పదకొండేళ్లకు ఇప్పుడు 'సం.సా.రా.లు'లోని ఓ యాభై. రచనలను ఇలా సంకలనం చేసి ప్రచురించడానికి ప్రధాన ప్రేరకుడు, మిత్రుడు డా॥ నాళేశ్వరం శంకరం. అతని స్నేహామృత హృదయం గురించి ఎంత చెప్పినా తక్కువే. స్వయంగా కవి, విమర్శకుడు, సినిమా సమీక్షకుడు అయిన శంకరం పూనుకుని బాధ్యతను నెత్తిన వేసుకుని శ్రమించకపోతే ఈ పని జరిగేది కాదు.

తను కుర్ర ఎడిటరుగా 'ప్రజావాహిని' సంపాదకత్వం చేపట్టినప్పుడూ, ఆ తరువాత 'ఉదయం' ఆదివారం అనుబంధం నిర్వహించినప్పుడూ కూడా దేవిప్రియ నా చేత కలం పట్టించి, కవిగానూ, కార్టూనిస్టుగానూ, కాలమిస్టుగానూ నన్ను ప్రోత్సహించాడు. మా చిరపరిచితికి గుర్తుగా ఈ పుస్తకానికి ముందుమాట అందించిన ఆత్మీయుడు కవి, జర్నలిస్టు దేవిప్రియకు కృతజ్ఞుడిని.

'నీ బొమ్మ వేస్తాను' అని గత దశాబ్దంగా నన్ను ఊరించి, ఇప్పుడీ పుస్తకానికి

అందమైన, అర్థవంతమైన ముఖచిత్రంతో బాటుగా, నా క్యారికేచర్‌ను కూడా వేసిన ప్రముఖ చిత్రకారుడు, ఆత్మీయ మిత్రుడు 'చంద్ర'కు బోలెడు 'థ్యాంక్స్'లు!

ఈ 'సం.సా.రా.లు' వెలయింపచేసి, తమ ఆంధ్రభూమి దినపత్రికలో శనివారాల్లో మూడేళ్లకుపైగా - ఇప్పటికీ ఇంకా నా చేత రాయిస్తున్న ఆంధ్రభూమి సంపాదకులు, ప్రముఖ రచయిత, 'ఉన్నమాట' ఉన్నదున్నట్లుగా చెప్పే మా యం.వి.ఆర్. శాస్త్రిగారికి హృదయ పూర్వక కృతజ్ఞతాభివందనాలు.

నా సంసారసారథి, వారధి, నా జీవన భాగస్వామి, నర్తకి, నా శ్రీమతి ఉషారాణి. ఇంట్లోనే కాదు ఆఫీసులోకూడా తను నా సహచరి, సహోద్యోగి. నా సాహిత్యాభిరుచికి ప్రేరకమవుతూ అడుగడుగునా సహకరిస్తూ, పట్టుబట్టి నా యాభయ్యవ జన్మదినోత్సవం నాటికి ఈ పుస్తకం ప్రచురణ జరిపించింది తనే. ఎం.ఏ. ఇంగ్లీష్ గోల్డ్‌మెడలిస్ట్ తను. పబ్లిక్ రిలేషన్స్ డిప్లమో చేసి, ఆకాశవాణిలో కార్యక్రమ నిర్వహణాధికారిగా వుంటూ, ఫోర్డ్ ఫౌండేషన్ వారి సహకారంతో 2000 జులైలో వృత్తిరీత్యా బి.బి.సి. ఆహ్వానంపై లండన్‌లో వర్క్‌షాప్ అటెండయింది తను. ఇంటాబయటా అందరికీ తలలో నాలుకగా ప్రేమాస్పద వ్యక్తి ఉష. నా ఆకాశంలో సగానికి నిండు పున్నమి వెన్నెల జల్లులు.

మా చిరంజీవి స్నేహిత్‌కు బొమ్మలన్నా, పుస్తకాలన్నా, సంగీతమన్నా ప్రాణం. ప్రస్తుతం ఇంటర్‌మీడియట్ చదువుతున్నాడు. ఎక్కడో భీమవరంలో మెడికల్ రిప్రెజెంటేటివ్‌గా ఉద్యోగం చేసుకుంటున్న ఫణి మా ఆవిడకు తమ్ముడి వరస కనుక ఈ 'సం.సా.రా.ల్లో' చేరాడు. చి॥ స్నేహిత్‌కూ, మా విజయఫణికి కూడా థ్యాంక్స్‌లు.

అడుగడుగునా నా అభివృద్ధిని కాంక్షించే నా కుటుంబ సభ్యులకూ, ఆత్మీయతనూ, సహకారాన్నీ అందించే మిత్రబృందానికీ, ఆకాశవాణి సిబ్బందికీ ధన్యవాదాలు. ఈ పుస్తకాన్ని డి.టి.పి. చేసిన ఫాంట్‌లైన్ నిర్మలగారికీ, అందంగా ప్రచురించిన శ్రీ గంగా కిషన్ సౌందర్య ప్రింటర్స్‌కూ, ముఖచిత్రం ముద్రించిన కళాజ్యోతి ప్రాసెస్ లిమిటెడ్ వారికీ ధన్యవాదాలు.

ఈ లైటర్‌వెయిన్ ఆర్టికల్స్ 'సం.సా.రా.లు' మీకు నచ్చుతాయని ఆశ. చదివి మీ అభిప్రాయాలు రాస్తారు కదూ!

(25.11.2001, ఆదివారం)

సదా మీ

**సుధామ**

జి. 12, సాదత్‌టవర్స్
పద్మావతి అపార్ట్‌మెంట్స్
సలీంనగర్ కాలనీ, మలక్‌పేట
హైదరాబాద్ - 500 036
ఫోన్ : 4545780

# సం.సా.రా.లు

మరదే... సంసారాలు అనగానే మనకు కుటుంబం, పిల్లలూ బంధుమిత్రులూ గట్రా గుర్తొస్తాయి గానీ, ప్రపంచం గుర్తురాదు. పైగా 'సంసారం' అనకుండా, బహువచనంలో 'సంసారాలు'అనగానే ఇవాళ్టి తెలుగు సిన్మాలూ - ఫుల్ సూట్ హీరో, మినీస్కర్ట్‌ల ఇద్దరు హీరోయిన్లూ కళ్ళముందు గెంతుకుంటూ వెళ్ళిపోతారు. దాంతో అనుమానాలూ, అపార్థాలూ, త్యాగాలూ, రోగాలూ అమాంబాపతు అనేక విషయాలు గిర్రున బుర్రలో తిరిగిపోతాయి. పనిలో పనిగా నీతులూ, విలువలూ కూడా 'మేమూ ఉన్నాం. మహానుభావా' అని హాజరు వేయించుకునే అవకాశమూ ఉంది. తెలుసుకదా!

ఉత్తరాది వారిని - మరీ ముఖ్యంగా హిందీ మాతృభాష వారిని చూడండి. వారికి 'సంసార్' అంటే ది వరల్డ్. ది ఎర్త్. ఈ భూమి. ఈ ప్రపంచం యావత్తూను. ప్రాపంచిక సుఖాలన్నీ వారికి సాంసారిక సుఖాలే. మన ఔట్ లుక్కే వేరు. 'నేనూ', 'నా', అనుకునేంత, అనేంత సులభంగానూ, తొందరగానూ 'మన' అనుకోలేం. నా... నీలు, మా... మీలు అనుకునే లెవల్‌కి వద్దాం లెద్దురూ! అని సంతృప్తి పడిపోతుంటాం.

మా ఆవిడ తెలుగంతగా చదువుకోలేదు కానీ, తెలుగు చదువుకున్న నన్ను క్షుణ్ణంగా చదివేసుకున్నా ననుకుంటూంటుంది. కాబట్టి నేనన్నదానికి ఓ పట్టాన 'ఊ' కొట్టదు. ఆ ఒక అక్షరంలో సరే అనడం ఏదయితేవుందో, తాను అన్నదానికి నేననడమే బెటర్ అని సదరు బెటర్‌హాఫ్‌గారి ఉద్దేశ్యం. ఇంతకీ ఎందుకు చెప్పవచ్చా నంటే "నాకు మీ తోడిదే లోకం అయిపోయింది. ఇల్లూ ఇల్లాలూ అంటూ నేను వేలాడుతుండబట్టే టోటల్‌గా మన గృహమనే జన్మభూమి అభివృద్ధి జరగడం లేదు. విజన్ ట్వంటీ ట్వంటీతో నేను శ్రమదానం చేస్తే తప్ప మనది హైటెక్ గృహం కాజాలదు. మీదు మిక్కిలి స్వర్ణ గృహప్రదేశ్ అస్సలు కాజాలదు'' అన్నాననుకోండి, తల పంకించదు. ఎందుకంటే ఏం చెబుతాం! ఏం చెప్పలేం. అధికార పార్టీ ఆలోచనలు అంగీకరిస్తే ప్రతిపక్షం ప్రతిపక్షం కాకుండా పోతుందని ప్రగాఢ విశ్వాసం కదా! అసలు అధికార పార్టీ తనదే కానీ ఏదో తాత్కాలికంగా 'ఇష్యూబేస్‌డ్'గా నాకు పాలనాధికారాన్ని కట్టబెట్టినట్లు తల పోస్తుంది. 'కామ్'గానూ 'గ్రేస్'గానూఇల్లాలు లేకపోతే 'భరించువాడు' - అన్న పని అప్పజెప్పబడిన భర్త అన్నింటికీ వాచిపోయే నాయె!

'ఇంతకీ సామీ! తమరెటు తీసుకెడుతున్నట్టు' అని కదా తమరి ప్రశ్న.! భూమస్యగుంద్రః అన్నారు. అనగా భూమి గుండ్రంగా వుండబడెను. క్రికెట్‌లో వైడ్ బాల్' అన్నా 'బాల్' గుండ్రంగానే వుండేటట్లుగానే, విషయవిస్తరణ ఏదయినా సంసారాలుగా ఆవృత్తమై వుంటుందన్నదే చెప్పదలచిన మాట. పిండితార్థం.

సంసారాలు అంటే ప్రపంచాలు. ఈ ప్రపంచాలకు బహువచనం ఎందుకంటే అసలు ఆలోచనా ప్రపంచం నడుస్తున్నదే బహువచనాలతో. భిన్నత్వంలోనే ఏకత్వం వుంటుంది. వుండాలి అని ఆశా, సంకల్పమూను. ఇవాళ సంసారాల్లో కూడా కుటుంబం అంతా ఒకటిగా వుంటూనే భర్త ప్రపంచం భర్తది. భార్య ప్రపంచం భార్యది. పిల్లల ప్రపంచం పిల్లలిది. అంటే వ్యక్తిత్వాలు, అస్తిత్వాలూ కోల్పోకుండానే అంతా కలిసి వుండగలగాలనే సంసారాపేక్ష నేటిది. మన సంసారాలు మనసారా వుండాలేగానీ, ఎట్టి పరిస్థితులలోనూ సారహీనాలు కాకూడదు, మిగతా ప్రపంచం యావత్తూ 'భారతీయం' వైపు ఆసక్తిగానూ, ఆదరంగానూ, గౌరవంగానూ చూస్తున్న అంశం కూడాఇదే.

కోట్లు సంపాదించినా అనుబంధాలు, ఆత్మీయతలు, ప్రేమానురాగాలు సంపాదించుకోవడంలో భారతీయులకు సాటి రాలేకపోతున్నామనే అనేక అన్యదేశ వాసుల ఆవేదన. ఆంధ్రభూమికి, తెలుగువాడికి వున్న ఖ్యాతి కూడా ఈ విలువల ప్రాతిపదికమీదనే.

అందుకే ఇంటినే కేంద్ర బిందువుగా చేసుకుని ప్రపంచం యావత్తూ చుట్టిరాగల దక్షత మనది. 'ఢిల్లీకి రాజయినా, తల్లికి కొడుకే' అని హృదంతరాళాల్లో విశ్వసించి ఎక్కడెక్కడ, ఎందుకెందుకు, ఎట్లెట్లా తిరిగినా ఇల్లే చేరుకునే సంసారాలు మనవి. తద్వారా గొప్ప శాంతిని, సంతృప్తినీ, సంతోషాన్నీ పొందగలిగే భావనలు మనవి.

అంచేత సం.సా.రా.లు అంటే సంస్కృతి, సాహిత్యం, రాజకీయాలు అన్నీను. అమ్మా నాన్న, భార్యా పిల్లలూ, బంధువులూ మిత్రులూ అందరూ మన సం.సా.రా.లులో పాత్రలే. ఇల్లులలుకుతూ అలుకుతూ పేరు మరిచిపోయిన ఈగ తన అస్తిత్వం కోసమే ప్రపంచం యావత్తూ చుట్టివచ్చినట్లు మన సంస్కృతి, మన సాహిత్యం, మన రాజకీయాలు గురించే ఈ 'కాలం'లో ఆరాటపడుతూ తిరగడం.

ఒక ప్రయోజనం కోసమే హృదయాన్ని తేలిక పరుచుకుంటూ మాట్లాడడం, సం.సా.రా.లులో వచ్చే వ్యాఖ్యలు, వ్యాఖ్యానాలు, కబుర్లు, జుక్కులు, చురుక్కులు అన్నీ టోటల్‌గా మరో శతాబ్దికి పయనిస్తున్న వసుధైక కుటుంబ భావనల మన ప్రపంచం కోసమే.

మన సంసారాలు గురించి మాటాడుకుందుకు, ఆనందించేందుకు, ఆలోచించేందుకు వారం వారం 'ఇదే అలవరసల' మీద ఇలాగే కలుద్దాం.

*సోమవారం 16 నవంబర్ 1998*

# హైటెక్ ఉల్కా విందుపాతం

ఉల్లిధరలు హెచ్చె - ఉల్కపాతమె చచ్చె
కందిపప్పు పుచ్చె - నూని కారజొచ్చె
ఉప్పు రేటు పెరిగె - హైటెక్కు సిటి వచ్చె
వచ్చె సగటు సంసారికి - చేతికింక బొచ్చె

అంటూ మా ఫణిగాడు వాడి వచన పచనాన్ని సాధ్యమైనంత కవితాత్మకంగా చదివి 'ఎలావుంది బావా' అన్నట్లు మొహంపెట్టాడు.

'మంచిగనె గొట్టింది గాని, కవి సమ్మేళనం గిట్ట ఏమన్న వున్నదేంది మావా' అన్నాడు నా పుత్రరత్నం.

"ఒరేయ్ అల్లుడూ! కవి సమ్మేళనాన్ని అలా తేలిగ్గా తీసి పారెయ్యకు'. మన సంస్కృతిలో, సాహిత్యంలో, రాజకీయాల్లో కవికీ కవిత్వానికీ ఓ స్పెషల్ పొజిషన్ వుంది. 'అపారే కావ్యసంసారే కవిరేవ ప్రజాపతిః' అన్నారు వందలేళ్ళ క్రితమే మన పెద్దాళ్ళు.విశాలమైన కవితా ప్రపంచానికి కవే రాజు" అన్నాడు ఫణి. వాడి వాక్య నిర్మాణ ఫణితిలో తప్పులెన్నడం, తగురీతిన సరిదిద్దడం నా బాధ్యతగా మా ఆవిడ ఉటంకించినందువల్ల నేను కలగజేసుకోక తప్పలేదు-

'వందలేళ్ళు అన్నావ్ చూసావా బావమరిదీ! అది వందల ఏడులు అంటే సంవత్సరాలుగా ధ్వనించడం లేదోయ్! వంద లేళ్ళు, దుప్పులు, జింకలు అన్నట్లుగా ధ్వనించి, తద్వారా ఇటీవలి విందులూ వాటి వార్తలూ స్ఫురించి, పెరుగన్నం అన్నా ఉప్పు లేనట్లుగా చప్పగా ఉత్సాహం చచ్చే ప్రమాదం వుంది' అన్నాను.

'బావా నేను చెప్పమన్నది నా కవిత్వం గురించి నీ అభిప్రాయం తప్ప యథాలాపంగా అన్నమాటల గురించి కాదు' అని గయ్యిమన్నాడు ఫణిగాడు.

కవిత్వం మటుకు యథాలాపంగా కాక ఏదో సీరియస్‌గా రాసినట్లు ఆ సీనియర్ పొయట్ ఫోజేమిటో! 'చూడు ఫణీ! యథాలాపంగా రాసిన పదాలైనా, వేసిన పాదాలైనా, పలికిన పెదాలైనా జనంలోకి వేగంగా దూసుకుపోయి సంచలనం రేపచ్చు. ఉల్కాపాతాల విషయంలో సైంటిస్టుల మాట పట్టుకుని రాత్రంతా జాగారం చేయించాననే కదా, ఇప్పుడు మీ అక్క అంటే సదరు నా భార్య 'అలకాపాతం' సంధించింది. తనకు నిద్రముంచుకొచ్చేస్తోంది కనుకే ఇప్పుడు మన కాఫీ మనం కలుపుకోవాలి' అన్నాను వంటింట్లోకి నడుస్తూ నేను.

'కలుపుకోవడం అనేది ఎప్పుడైనా మంచిదే బావా! పది మందినీ కలుపుకోవడం వల్లే, విందయినా బందయినా రాణిస్తుంది. జనమమేకం కావడంవల్లే కవి రాణిస్తాడు' అన్నాడు ఫణి.

'నాన్నా! ముందు అర్జంటుగా మామయ్యకి కాఫీ ఇయ్యి. రాత్రంతా నిద్రలేకనే కాబోలు ఏమిటోలా మాటాడుతున్నాడు' అన్నాడు పుత్రరత్నం.

'అల్లుడూ! దిసీజ్ టూ మచ్! విషయం ఏదైనా దానికి భిన్నాభిప్రాయాలు, వేరువేరు కోణాలూవుంటాయి. పదాలను కూడా అర్థం చేసుకునే 'పదార్థ' విజ్ఞానాన్ని బట్టే సబ్జెక్టులు కూడా ఛేంజ్ అయిపోతూంటాయి. విలేఖర్లకు వినికిడిశక్తి బాగా వుండాలి. ఇప్పుడు - 'మరలావంట' చేసి విందు చేసుకోవాలి' అనగానే అది 'మర్లకుంట'గా వినిపిస్తోంది. 'బాగా 'నమిలి' తినాలి' అని మీ అమ్మ నీకు చెప్పిందనుకో, అది 'నెమలి' తినాలి అన్నట్లు వినిపిస్తోంది. 'నీళ్ళు తీసుకురా' అంటే 'లేళ్ళు తీసుకురా' అని వినిపిస్తోంది. ఇదిగో ఇలా - పదిమందినీ కలుపుకుని విందు చేసినప్పుడు; అందులో కొంచెం మందు కూడా పుచ్చుకున్నారనుకో - ఇంక తడబాటు - అనడం, వినడం, కనడం (అంటేచూచుట)లో కూడా వచ్చేసే ప్రమాదం ఉంది. అసలు కవి అంటే కప్పి చెప్పేవాడు అన్నారు. వొట్టి పతాకశీర్షికల్లో పొయట్రీ హెడ్డింగులు పెట్టడం కాదు. విలేఖర్లు సహజంగా కవులు కావాలన్నదే రాజకీయవేత్తల ఆకాంక్ష,' అన్నాడు ఫణి.

"ఒరేయ్ తమ్ముడూ! ఏమిట్రా ఆ సోది? నిద్రచెడగొట్టారు. అది చాలక ఇప్పుడు కొత్త తలనొప్పులు కూడా తెస్తారా' అని లోపల్నించి అరిచింది శ్రీమతీజీ.

'అంటే ఆల్‌రెడీ ఓ తలనొప్పి వున్నట్లేగా అక్కా! 'ఈ వయసులో మేం ఏం తింటామండీ' అంటే ఓ వయసులో మొత్తానికి తినే మోజు వున్నట్లేగా! నిజానికి వయసు పెరిగే కొద్దీ జిహ్వాచాపల్యం పెరుగుతుంది. బావా! ఉల్కాపాతం ఉధృతి వుంటే, విందు ఆఘాతం ఉధృతి తగ్గేదేమో. కానీ టెర్రెస్ మీద అసెంబుల్ అయినవాళ్లకు - టెంపుల్ టటుల్ శకలాలు కనబడకే అసెంబ్లీలో - తుమ్ముల్ దగ్గుల్ గోలల్ ఎక్కువయ్యాయేమో' అన్నాడు ఫణి.

'మామయ్యా! నువ్వు మాటాడేదాంట్లో తలా, తోకా.. తోకా... తలా, లింకూ, క్రమం... నాకేమీ అందడం లేదు. ఏంటిది? ఒక దాంట్లోంచి ఇంకో దాంట్లోకి ఇష్టం వచ్చినట్లు పోతున్నావ్' అని నెత్తుకొట్టుకున్నాడు పుత్రరత్నం.

'అల్లుడూ! ఇదే కవుల లేటెస్ట్ ట్రెండు. హైకూలు కూడా అయిపోయి, ఇప్పుడు హైటెక్ కవిత్వం వస్తోంది. అందులో సిటీ కవులు ముందుగా 'సీటీ' బజాయిస్తారు. నిన్ననే కదా! కవిత్వం కోసం మొహం వాచిపోయిన వాళ్లకు, 'ఇక కంప్యూటర్లు

కూడాకవిత్వం చెప్పగలవు' అన్న లెవల్లో హైటెక్ సిటీ అంకురార్పణ కూడా జరిగింది. నిత్యావసర వస్తువుల ధరలన్నీ ముందు ఆకాశానికి పంపించేసి, వాటికి ఏ ఉల్కాపాతాలతోనూ ఇబ్బంది లేకుండా - ఉపగ్రహాలకు అనుసంధానం చేసి, ఆ తరువాత ప్రజలు ఆగ్రహం చెందకుండా - ఇంటర్‌నెట్ కనెక్షన్లు ఇంటింటికీ ఇచ్చి - కంప్యూటర్ల ద్వారా ఆ ధరలను డౌన్‌లోడ్ చేసుకుంటామన్నమాట. ఆ తర్వాత డిస్కవరీ ఛానల్స్‌లో కొత్త కొత్త జంతువుల్ని కూడా చూసి మన అభిరుచుల నుండి మరలకుండా విందు చేసుకుంటామన్నమాట' అన్నాడు ఫణిగాడు ఆధునికోత్తర కవి పరిభాషలో.

'ఆకాశంలో ఉల్కాపాతాలే కాదు వంటింట్లో కాఫీ పొడుం, పంచదార ఎక్కడున్నాయో కూడా మీకు కనబడవు. టీపొడి వేసేసి, ఉప్పు కలిపేసి పాలన్నీ తగలెట్టారు' అని కేకలేస్తూ - మేము మొదటగా కలిపి పట్టుకెళ్లి తన బెడ్ దగ్గర పెట్టిన కప్పు పుచ్చుకుని శ్రీమతి రివ్వున దూసుకొచ్చేసరికి, విందు భోజనం సాక్షుల్లా ఫణిగాడూ, పుత్రరత్నం చెల్లాచెదరయ్యారు.

'అలకా' పాతమైనా, ఉల్కాపాతమైనా, ఎంతహైటెక్ నుంచి పడినా, భరించువాడు భర్తేకదా. అంచేత నేను దొరికిపోయానంతే!

*సోమవారం, 23 నవంబర్ 1998*

# గడ్డమో రామచంద్రా!

'అవతారం చూడండి ఎలావుందో. ఆ గడ్డం తీసేది లేదా?' అంది మా ఆవిడ. 'అది అలా వుంటే మటుకు ఏమిటట' అన్నాను. 'అడ్డదిడ్డంగా -బిజు పట్నాయక్ జనతాదళ్‌లో అసమ్మతిలా- పెరిగింది కదా తీసేస్తే నయం కదా' అని అంది మళ్లీ. ఆవిడగారు తన రాజకీయ పరిజ్ఞానాన్ని ఇలాగే మిళాయిస్తూంటుంది. ఒక్కోసారి ముచ్చటేస్తుంది గానీ, ఒక్కోసారి అదేమండుద్ది. పార్టీల అసమ్మతులు గడ్డం గీసుకున్నంత సులభంగా గీసి (లేదా తీసి) అవతల పారేయగలిగితే మన పొలిటికల్ సినేరియోలు ఇలా ఎందుకుంటాయి?

'ఎవరి ఇష్టాలు, అభిరుచులు వాళ్లవి. ఒక్కొక్కరి వ్యక్తిత్వంతో వారి ఒడ్డుపొడుగూ ఆకారాలు కూడా ముడిపడి వుంటాయి. టోపీల గురించీ, తలపాగాలగురించీ, మీసాల గురించీ, గడ్డాల గురించీ అక్కర్లేని ఆలోచనలు వేస్ట్. ఆరుద్రగారు - 'రోజా గీసుకోని మగవాడి గడ్డం - మోజున్న సరసానికి వస్తుందా అడ్డం' అన్నారు. అంచేత అసలు గడ్డాన్ని తక్కువ అంచనా వేయకు. వేదకాలంనుంచీ కూడా మన భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలు, ఆర్ష ధర్మాలు గడ్డంతో లింక్ అయి వున్నాయి. 'ఋషులు గడ్డాలు పెంచుకునే గొప్ప సంగతులు కనిపెట్టారు. ఋషులకు గడ్డాలు లేకపోతే అసలు ఋషే అనుకోలేం. అంచేత లలనా! గడ్డం అసమాన్యమైంది. ఆలనా పాలనా కూడా దాంతో ముడిపడ్డాయి. గడ్డం వున్న ఏకైక ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అవడంవల్లే బాబుగారు హైటెక్ సింబల్ అయ్యారన్నాడు మా చిదంబరం' అని చిరులెక్చర్ మొదలుపెట్టాను.

మా ఆవిడ కన్విన్స్ అయిన మొహం పెట్టలేదు. సరికదా నేను వేదాలు, పురాణాలు అంటే తను చరిత్ర-సంస్కృతి అని మొదలు పెట్టింది. 'ఉత్తర జర్మనీలో బురదమయమైన చిత్తడి అడవి ప్రదేశాలలో జర్మను తెగలతో పోరాడలేక అలెగ్జాండరు సైనికులు అనేక యుద్ధాలలో ఓడిపోయారు. శత్రువులు వీరిని సులభంగా గడ్డం పట్టి ఈడ్చి చేతిలో వుండే చిన్న పట్టా కత్తితో సఫా చేసారట. అంచేత అలెగ్జాండరు తన సైనిక దళంలో వారంతా నున్నగాగడ్డం గీసుకోవాలని శాసించాడట తెలుసా!' అంది. '18 వ శతాబ్దంలో రష్యాలో జార్‌పీటర్ ప్రభువు గడ్డం పెంచుకుంటే ఏడాదికి 42 పౌండ్ల పన్ను చెల్లించాలనిశాసించాడు. గడ్డం-పొట్టి, పొడవులను బట్టి పన్ను కూడా మారుతుండేది. పన్ను చెల్లించకుండా శాసనాన్ని ఉల్లంఘించిన వాళ్ల గడ్డాలను బలవంతంగా పీకించేసేవాడు. ఆ సంగతి తెలుసా' అని మళ్లీ తనే అంది.

'చూడూ! నువ్వు చెబుతున్నది సాక్షికమైన చరిత్ర. ఎందరో మేధావులు, రారాజులు, శాస్త్రజ్ఞులు గడ్డాలతో వుండే చరిత్ర ప్రసిద్ధి కెక్కే పనులు చేశారు. గడ్డం సంస్కృతిలో ఒక భాగంగా పెరిగిన దాఖలాలున్నాయి. కులాలకు మతాలకు అతీతమైనది గడ్డం' అన్నాను నేను.

'మరే మరే నాన్నా! గడ్డం మేధావి లక్షణం. రవీంద్రనాథ్ టాగూర్, బెర్నార్డ్ షా, అబ్రహాంలింకన్, మార్క్స్, లెనిన్, స్టాలిన్ ఎన్ని పేర్లు, ఎందరు సైంటిస్టులు తమ విశేష వ్యక్తిత్వంలో గడ్డం ఓ భాగంగా లేరూ! పొడుగాటి గడ్డాలు పెంచి గిన్నీస్ బుక్‌లోకి ఎక్కిన వ్యక్తులు వున్నారుగా' అంటూ నా పుత్రరత్నం సపోర్టింగ్‌కు వచ్చాడు.

'భేష్‌రా బేటా! మాతాశ్రీకి అట్లా చెప్పు! ఎవరైనాఎపుడైనా, ఎలాంటి గడ్డంతోనయినా జీవించవచ్చు. రాణించవచ్చు. గడ్డం లేకుండా సంస్కృతీ సమాదరణం ఊహాతీతం' అన్నాను మళ్లీ.

అవునాండీ! అనుకోకుండా ఆ సాయంత్రమే రవీంద్రభారతిలో సాంస్కృతిక కార్యక్రమాలకు వెళ్లాం. డాన్సులు, నాటకాలూను. భాంగ్రా డాన్స్ అన్నారు. అందులో గడ్డాలున్నాయి. ఉర్దూ నాటకం అన్నారు. అందులో గడ్డాలున్నాయి. అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం అన్నారు. గడ్డం వుంది. గమ్మత్తుగా చాలా ఐటమ్స్‌లో ,ఎక్కడో ఒకచోట గడ్డం తగిలింది. నాకు ముచ్చటేసింది. 'చూశావా! సాంస్కృతిక సమైక్యతకు గడ్డం ఓ చక్కని ప్రతీక. హిందూ, ముస్లిం, సిక్కు, క్రైస్తవ అనే మత భేదం లేదు. అన్ని మతాల ఆచార సంస్కృతులును ప్రతిబింబించే పాత్రల్లోనూ గడ్డం జాతీయ సమైక్యతా చిహ్నంగా వుంది చూశావా!' అన్నాను. 'మేకప్‌మెన్ దగ్గర గడ్డాలు ఎక్కువ వున్నాయేమో' అని డబాయించాలని చూసింది గానీ, పాపం గట్టిగా అన్లేకపోయింది మా ఆవిడ.

'ఓ గడ్డం గురించి మీకింత పట్టింపేమిటి?' అని తమరు అనచ్చు. నేను అనేదీ అదే. అత్యల్ప విషయాలకు అనవసర ప్రాధాన్యం ఇచ్చి అవసరమైన సంగతులను, అనివార్యమైన కార్యక్రమాలను పక్క దారులు పట్టించడం, అసలు విషయం పట్టించుకోక చిన్న వాటికి చిలువలు పలవలు చేర్చి భూతద్దాల్లో చూడడం కొందరి అలవాటు. 'గడ్డం వుండడం వల్లనే ఢిల్లీ పీఠం సాహిబ్‌సింగ్ వర్మనుండి సుష్మా స్వరాజ్ గారికి బదిలీ అయిపోయిందని ఓ జ్యోతిష్కుడు అన్నాట్ట తెలుసా?' అంటూచిన్న ఝలక్ ఇచ్చింది మా ఆవిడ. 'ఆ మాటకొస్తే ఆవిడకి గడ్డం ఉంది కదా! ఆవిడ గడ్డం బావుంటుంది కూడానూ' అన్నాడు పుత్రరత్నం.

'ఏడిశావ్ దాన్ని గడ్డం అనరు. చుబుకం అంటారు' అంటూ మా ఆవిడ పుత్రరత్నానికి చిన్న మొట్టికాయ ప్రసాదించింది.

'చూడు శ్రీమతీ! కొన్ని తెగల ప్రజలు ఒకప్పుడు గడ్డం పెరగడం దేవుడిచ్చిన వరంగా భావించేవారు. గడ్డాలున్న ఆడవాళ్లు ఇథియోపియాలోని కొండజాతుల్లో వుండేవారు. గ్రీస్‌లోని అమెథార్‌లో వున్న 'వీనస్' విగ్రహానికి గడ్డం వుంది. ఆమెను పూజించడానికి మగవారు స్త్రీల దుస్తులు, స్త్రీలు మగవారి దుస్తులువేసుకు వెడతారట. లండన్‌లో వెస్ట్ మినిష్టర్ బ్రిడ్జి దగ్గర గడ్డం మీసాలతో వున్న స్త్రీ మూర్తి శిల్పం వుంది. ఆమె పేరు విల్డ్‌ఫోర్డ్. పోర్చుగల్ రాణి. తనకు ఇష్టంలేని పెళ్లి తప్పి పోయేందుకు దేవుడిని ప్రార్థించగా ఆమెకు గడ్డం, మీసాలు పెరిగాయనీ, ఆతర్వాత ఆమె జీవితాంతం అవివాహితగా దేవుని సేవకు అంకితమైపోయిందనీ కథనం' అంటూ ఆడాళ్ల గడ్డాల గురించి నేను చెప్పేసరికి మా ఆవిడ కొంచెం డంగయింది.

గడ్డం సంస్కృతి అనుకున్నాం కదూ! అవును! మొహంజదారో హరప్పా కాలం అంటే అయిదువేల సంవత్సరాల వెనకనే హరప్పా కాలంలో పూజారులు గడ్డం పెంచిన దాఖలాలు తవ్వకాల్లోని ప్రతిమల్లో కనబడ్డాయి. ఢిల్లీ మ్యూజియంలో సదరు ప్రతిమ ఒకటి ఇప్పటికీ వుంది. ఆరవ శతాబ్దపు బౌద్ధ సాహిత్యంలో గడ్డాల వర్ణనలున్నాయి. వేషం మార్చడమంటే గడ్డం తగలించుకోవడమనే బలమైన పాయింటు నేటికీ సినిమాల్లో చెలామణీ అయిపోతూనే వుంది. ఏమంటారు!

మొత్తానికి 'అయ్యా! గడ్డాలు వుంచడం తీసేయడం అన్నది మీమీ, వారి వారి ఇష్టం. ఏ గడ్డం ఎలావుంటుందో ఎప్పుడు ఎందుకు పెంచుకుంటారో నాకు అనవసరం. గడ్డం మీదకు దృష్టి డైవర్ట్ చేసి చేయాల్సిన మంచి పనులకు అడ్డం కొట్టనంతవరకూ ఎవరితోనూ నాకు పేచీలేదు' అని తేల్చింది మా ఆవిడ.

*సోమవారం, **30** నవంబర్ **1998***

# హా సీతా!... ఫలం?

"ఈ కాలం పిల్లలకు ఐస్‌క్రీంలు, ఫ్రూటీలు, పిజ్జాలు, కోలాలు నచ్చుతాయికానీ - అరిసెలు, ఆవడలు, సున్నుండలు, సీతాఫలాలు నచ్చుతాయా? ఎంత నాగరీకం ముదిరిపోయిందంటే చేత్తో తయారుచేసే ఫుడ్‌స్టఫ్ అంతా బార్బేరియస్ అంటే అనాగరికం. సహజసిద్ధంగా ఏ కాలంలో వచ్చే ఫలాలను ఆ కాలంలో ఆరగించడం అనే అభిరుచి బొత్తిగాశూన్యం. వీళ్లకన్నీ యంత్రాల మీద తయారైతేనే ఇష్టం. ఫాస్ట్‌ఫుడ్స్, హాట్‌ఫుడ్స్ కావాలి. చేగోడీలు, జంతికలు, చెక్కవడలు అని మనం అంటే బిక్కమొహం వేస్తారు. కట్‌లెట్, పావ్‌భాజీ, సమోస, రగడ అంటే ఏ రగడా లేకుండా పరిగెట్టుకొస్తారు. పళ్లు సంగతీ అంతే! యాపిల్, పైనాపిల్, ఆరెంజ్ అంటే తినడానికి కొంచెం ఒప్పుకుంటారేమోగానీ రేగుపళ్ళూ, జాంపళ్లూ, సీతాఫలాలు అంటే అవేవో పల్లెటూరి బైతు సరుకన్నట్లు మొహం చిట్లిస్తూ 'యాక్' అభినయిస్తారు' అంటూ మా మామయ్య ఓ చింకి లెక్చర్ మొదలెట్టాడు.

అసలు మా మావయ్యది అసెంబ్లీలో నోరు విప్పని బాపతే. కానీ ఒకసారి మైకు రుచి మరిగి - పైగా టి.వి. కవరేజి కూడా వుందంటే రెచ్చిపోయే ఛాన్సు దొరికిన సంఖ్యాబలం లేని ప్రతిపక్ష సభ్యునిలా వీలు దొరికితే వీరంగం చేసేస్తాడు. ఆరంభించిన చింకి లెక్చర్‌కు ఆధారభూతమైన అసలు పాయింటేమిటా అనేది అన్వేషించాల్సిందే మరి!

'సీతాఫలాలు వచ్చినట్లున్నాయి. పిలవరా కొనుక్కుందాం' అన్నాట్ట మామయ్య. 'అవేమిటి?' అన్నట్లు మొహం పెట్టాట్ట మా అబ్బాయి. పైగా 'వాటంతట అవేవచ్చేవి - ఇంటికొచ్చి తలుపు కొట్టకుండా వుంటాయా' అన్నాట్ట. మా మామయ్యకు అందులో తన మీద కూడా అబ్బాయి ఏదైనా విసురు విసిరాడేమోనని డౌట్ వచ్చి వొళ్ళు మండిపోయింది. 'ఏ సీజన్‌లోవచ్చే పండ్లూ, ఫలాలూ ఆ సీజన్‌లో తినాల్రా కుర్రాడా! సీతాఫలం తినడంలో ఓ మజా, ఓ ఆర్టూ వున్నాయి. చక్కగా వొడుపుగా కళ్లు అన్నీవొలిచి, ఆ తెల్లటి గుజ్జుని మెత్తగా లోనికి ఆస్వాదిస్తూ, సదరు గింజలను బయటకు ఉమ్మేస్తూ, తియ్యగా, చల్లగా సీతాఫలం తినడంలో వున్న రుచే రుచి' అన్నాట్ట మామయ్య. అని ఊరుకోలేదు. వీధిలో పోతున్న సీతాఫలాలు అమ్ముతున్న మనిషిని పిలిచి, యాదృచ్ఛికంగా అమ్మే యువతి పేరు 'సీతే' అని తెలిసి మరింత

ముచ్చటపడి, ఓ రెండు డజన్లు కొనేసాడు. కొని ఊరుకుంటే లేదా తన అభిరుచి మేరకు తానే ఆరగిస్తే సరిపోను. కానీ మా అబ్బాయి చేత బలవంతంగా ఓ పండు తినిపించడానికి శ్రమపడ్డాడు. 'సీతాఫలం అంటే కస్టర్డ్ యాపిల్ నాన్నా! పచ్చటి వంటి మీద నల్లటి మచ్చల్లా అసలు దాని లుక్కే బాలేదు. పైగా పళ్ళతో నోట్లోకి ఆతెల్లటి గుజ్జు లాక్కుని... పెదవులతో, నాలుకతో ఆ గింజల మీది ఆ తెల్లటి గుజ్జు కూడా తింటూ.. మాటిమాటికీ అడ్డుగా ఉండే ఆ నల్లటిగింజలను ఉమ్మేస్తూ... ఓహ్ వట్టి నాన్సెన్స్ తిండి అనుకో! చినతాత ఆ తినడం తెగ ఎంజాయ్ చేశాడు. కానీ ఒక్క పండు తినేసరికి నాకు నిజంగా తాతలు దిగొచ్చారు. పైగా నాలుగయిదు గింజలు మింగేసాను కూడా! ఇప్పుడు కడుపులో ఏమవుతుందో ఏమిటో' అంటూ అసహ్యాన్నంతా మొహంలో ప్రదర్శిస్తూ ఆనక ఏడుపు మొహం వేశాడు పుత్రరత్నం నా దగ్గర.

'ఒరేయ్ అబ్బాయ్! మీ వాడికి సీతాఫలం తినడం రాదేమిట్రా! అసలు నువ్వు అలవాటు చేయలేదా ఏమిటి? ఆ గింజలు కడుపులోకి పోయాయని ఒకటేగోల అనుకో!మళ్ళీ కడుపులో సీతాఫలం చెట్టు మొలుస్తుందో ఏమిటో అని ఒహటే కంగారు పడుతున్నాడు. ఆ గింజలన్నీ కావాలని నేను బలవంతంగా వాడి కడుపులోకి రవాణా చేసినట్లు గింజుకు పోతున్నాడు'అన్నాడు మామయ్య పడీపడీ నవ్వుతూ.

'మామయ్యా! కొన్ని కొన్ని కొందరికి సరిపడవు. బలవంతంగా రుద్ద ప్రయత్నాలు... అవి ఎంత మేలుకోసమనే ఉద్దేశంతోనైనా సరే ఎందుకు చెప్పు? అనవసరంగా కొత్త భయాలు ఆందోళనలు పెంచి వాళ్ల సామర్ధ్యాలను దెబ్బతీయడం తగనిపని. ఇప్పుడు నీ సంగతేతీసుకో! టెర్మినేటర్ విత్తనాల గురించి నువ్వు భయపడుతున్నావా లేదా? సీతాఫలం గింజలు మింగేసి మావాడు అవిఎక్కడ కడుపులో మొలకెత్తుతాయో అని భయపడుతున్నాడన్నావ్. అది సైకలాజికల్ ఫీలింగ్. సైన్సు తెలుసు కాబట్టి అవి ఏమవుతాయో వాడు గ్రహించగలడు. కానీ టెర్మినేటర్ విత్తనాలు దేశంలోకి చొచ్చుకువస్తే, సాగుచేస్తే, పునరుత్పత్తి శక్తిలేని పంటలతో దేశ ఆహార భద్రతకే పెనుముప్పు ఏర్పడుతుందనే విషయం రైతుల సైకలాజికల్ ఫీలింగని కొట్టి పారేయగలవా చెప్పు' అన్నాను.

మామయ్య పక్కలో బాంబు పడినట్లుగా అదిరిపడ్డాడు. ' ఓర్నాయనో! ఓరి బాబోయ్! నిజమేరా అబ్బాయ్! ప్రయోగాల పేర పంటల జీవశక్తినే హరించే విత్తనాలు అనుమతించుకుని, పొరపాటున నాలుగు సీతాఫలం గింజలు కడుపులోకి వెడితే ఏమవుతుందన్నట్లు అనుకోలేం గాక అనుకోలేం! భారత దేశం వాతావరణానికీ, మన

పొలాలకూ టెర్మినేటర్ పడదనే కదా, వాటిని అమెరికాలోనే టెర్మినేట్ చేసేసి, మనదాకా రాకుండా,ఆ సీడ్‌ప్రొసీడ్ అవకుండా జాగ్రత్తపడాలనుకుంటున్నది. 'విత్తు ముందా చెట్టు ముందా' అనే మన తరతరాల ఆలోచనని చంపేసి, తన విత్తనాలతోనే పెత్తనం చేయాలనే సంకల్పంతో, విషపూరిత జన్యువుల విత్తనాలతో పంటల జీవశక్తిని హరింపచేస్తూ, తిరిగి తిరిగి పంటలకోసం ఎప్పటికప్పుడు వారి విత్తనాల మీద ఆధారపడే కుట్ర జరుగుతూంటే ఎలా నోరు మూసుక్కూర్చోగలం' అన్నాడు మామయ్య.

'బిటి పత్తి విత్తనాలను ప్రయోగస్థాయిలో పరీక్షించడానికి అమెరికా మోన్‌సాంటో సంస్థను ఇప్పటికే అనుమతించాం చినతాతా! టెర్మినేటర్ విత్తనాలను ప్రవేశపెట్టడానికి తామేమీ ప్రయత్నించడం లేదని గత యాభై ఏళ్ళుగా మన దేశంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆ సంస్థ గట్టిగా నమ్మబలుకుతోంది. అసలు టెర్మినేటర్ పరిజ్ఞానం అమల్లోకి రావాలంటే ఇంకో పదేళ్లయినా పడుతుందని సైంటిస్టులే అంటున్నారు. అదిగో పులి అంటే ఇదిగో తోక అని భయపడటం వేస్ట్. పంటనుంచి పంటకు విత్తనాన్ని సమకూర్చుకునే రైతు హక్కులకు హాని కలిగించే టెర్మినేటర్ టెక్నాలజీని అసలు మన పొలాలు, మన ప్రకృతే తిప్పి కొడతాయేమో' అంటూ మావాడు అలవోకగా అనేసరికి వాడి సమాచార పరిజ్ఞానానికి మామయ్యా, నేనూ ఇటీవలి ఎన్నికల ఫలితాల్లాగా డంగైపోయాం.

*సోమవారం, 7 డిసెంబర్ 1998*

# ఎ 'థిక్' స్పీచ్

నేను గృహాంగణమున ప్రవేశించుసరికి మా మామయ్య ఇట్లుపన్యసించుచుండెను. "మందపాటి అనేమాట విన్నావా! అదో ఇంటి పేరు అన్న సంగతిపక్కన అట్టిపెట్టేయ్! మందపాటి అంటే దళసరి అని అర్థం. కళ్ళజోడు కొందరిది మందపాటిగా ఉంటుంది. అదేనన్రా! కళ్ళద్దాలు అని నా ఉద్దేశ్యం. అలాగే కొందరిది మందపాటి చర్మం కూడాను. 'దున్నపోతు మీది వర్షం' అనే నుడి వుంది. అంటే ఏమిటిట? హోరున వర్షం కురుస్తున్నా సదరు వర్షంలో తడిసే దున్నపోతుగారు ఏ మాత్రం చలించక వర్షహర్షాన్ని కానీ, వర్షభయాన్ని గానీ ఫీలవక సుఖదుఃఖాతీతమైన యోగిగారిలా వుండిపోతారని. ఇక్కడ యోగి అన్న ఉపమానం తప్పయితే ఆధ్యాత్మికవాదులు క్షమించెదరుగాక! ఇంతకీ అట్లుండ గలుగుటకు హేతువు - చర్మ సంబంధమైన, స్పర్శ స్పందనాతీతమైన మందపాటి తనమే అన్నది గ్రహించవలసిన విషయం

అయితే హిప్పోపోటమస్లూ, ఖడ్గమృగాలూ కూడా సిగ్గుపడగలిగే దళసరి చర్మాలూ- దున్నపోతుల తలదన్నేంత మందపాటి చర్మాలూ కేవలం కొందరి సొత్తులే. అయితే తమాషా ఎక్కడంటే దున్నలూ, హిప్పోపోటమస్‌లూ, ఖడ్గమృగాలూ స్పర్శానురాగాన్ని ఆలపిస్తూ -,స్పందన గురించీ, విలువల అనుభూతి గురించీ సామూహికంగా చర్చించి తీర్మానించడం. ఇందులో తప్పేముందండీ? చర్మాలు దళసరే అయినా హృదయాలు ఉల్లిపొరలే అంటారా! ఉల్లి అనగానే ప్రస్తుతం తరగని కన్నీటి గాథలు కూడా గుర్తుకొస్తున్నట్లున్నాయి. ఏడవకు ఏడవకు బిజేపిపాయీ (బుజ్జిపాపాయి అనే అక్షరాలను **డి.టి.పి.లో - టి.డి.పి.**లో కాదు - అలాగే ఊరడిస్తున్నట్లున్నారు కంప్యూటర్ ఆపరేటర్లు) డొంక తిరుగుడు మానేసి మళ్ళీ అసలు విషయానికి వస్తే మందపాటిని ఇంగ్లీషులో ఏమంటారు అని కదా స్నేహితూ నీ డౌట్!

చెబుతాచెబుతా! ముందు ఇక్కడో సంగతి థింకాలి. అదేంటంటే 'నేరమయ రాజకీయాలు', ఆ 'రాజకీయాల్లో అవినీతి' అనేవి కూడా 'దున్నపోతు మీది వర్షం' లాంటి కొత్త నుడులే తప్ప, అవేవో చర్చనీయాంశాలనుకోవడం పొరపాటు అని మా శర్మగారు నుడివారు. మరి అలాంటప్పుడు అసలు బాహిర చట్టాలే రాజకీయ పలుకుబడిముందు కాళ్ళు బార్లచాపి సామూహిక పోలియో చుక్కలు లేక చచ్చుబడినట్లు కాగా, సెల్ఫ్ ఇంపోజ్‌డ్ అనగా స్వయమాపాదిత ఆంతరంగిక చట్టాలు పనిచేస్తాయా అన్నది సందేహం. ప్రవర్తనా నియమావళి ఏర్పరుచుకోవడం బానే ఉంటుంది.

ఆచరణలో అనుసరణీయం కావాలి కదా! నైతిక సూత్రాలు లేక కాదు. ఆ సూత్రాలకు నిబద్ధమై, నిమగ్నమై లేకపోవడం వలన కదా విలువల పతనం గురించిన ఆందోళన కలిగేది. ధర్మపన్నాలు వల్లిస్తే కాదు. అనుష్ఠించడంలో నిజాయితీ కావాలి.

ఒకరు శాసనసభ్యునిగా ఎన్నికవంగానే స్పీకరుకు తన ఆస్తి వివరాలను వెల్లడించాలని ఓ సూత్రం చేస్తారు. బానే వుంది. అది స్పీకర్‌కే వెల్లడించడం ఎందుకు?ఎన్నుకున్న అశేష జన సమూహానికీ వెల్లడించవచ్చు కదా! ఆ తర్వాత సదరు ఎమ్మెల్యే గారు ఆర్థికంగా తన అధికార హయాంలో ఎలా ఎదిగారన్నది పారదర్శకంగా కనపడాలి అంటే మరి ఆయన గారికి నచ్చుతుందా? అసలు ఆయన వెల్లడించే వివరాల్లోనే లొసుగులేవీ లేవన్నది ముందు నిఖార్సుగా తేలాలి కదా! హంతకుడే హతుడి శవం మీద భోరునపడి ఏడ్చినట్లు, చట్టం విలువను కాపాడాల్సిన చట్టసభల సభ్యులే చట్టాలను అతిక్రమిస్తూ పైకి మాత్రం నేరమయ రాజకీయాల గూర్చి, అవినీతి గురించీ మొసలి కన్నీరు కార్చడం రుద్రాక్షమాల తిప్పే పులి పంథాలో వుంటుంది.

ఇంతకీ మందపాటిని ఇంగ్లీషులో 'థిక్' అంటారు తెలుసుకదా! ఎథిక్‌ల గురించి మాట్లాడే వారికీ, కమిటీలు వేసేవారికీ, ఎ 'థిక్' స్కిన్ వుందనేది ప్రజలకు పారదర్శకంగా కనబడుతున్న నగ్న సత్యం. దున్నలూ, ఎనుములూ, హిప్పోపోటమస్‌లూ, రైనో (ఖడ్గమృగా)లూ కలిగివుండే బాపతు చర్మాల థిక్‌నెస్ - రాజకీయ నాయకులకు వుండడం వల్లనే వారు జన వర్షాన్ని తట్టుకోగలుగుతున్నారన్నది సామాన్యుడు పాపం తట్టుకోలేక పోతున్నాడు. అందువల్లే చట్టాలు ఏవయినా అధికారంలో వున్న వారి చుట్టాలే అనీ, తాము ఎన్నుకున్న నేతలు తమ కష్టాలను గట్టెక్కించలేరు సరికదా - గట్టిగా ఎదురు తిరిగితే తగలెట్టి చుట్టముట్టించుకుంటారని బడుగు వారికి అడుగడుగునా అర్థమవుతూనే వుంది.

దేశంలోనే మొదటిసారిగా నైతికత గురించి ఆలోచిస్తున్నట్లుగా వేరు రాష్ట్రాన్నుంచి దీనికి ఫాలోఅప్ కూడాను! శాసనసభల లోపల ప్రవర్తనా నియమావళి, బయట సదరు సభ్యుడు చట్టాలతో ఆడే కళాకేళి ఈ రెంటికీ అనుసంధానం, సమన్వయం కనబడాల్సింది ఎన్నుకున్న పౌరులకు. అధికారులు, ప్రభుత్వం అంతా ప్రజలకు జవాబుదారీ కావాలి. అలా కానప్పుడు బుద్ధి చెప్పి గడ్డి తినడం వల్ల ఒక నాటికి నడ్డి విరగక తప్పదు'' అంటూ మామయ్య ఊరి నుంచి వచ్చిన పెద్దమనుషులతో సహా వాకౌట్ అయ్యాడు.

*సోమవారం, 14 డిసెంబర్ 1998*

# అక్షరాలు ఇక అజంతాలు కావు!

"ఉదయం నిద్రలేవగానే, సూర్య బింబాన్ని ఒకసారి నావైపు త్రిప్పుకొని, మా ఆవిడ పాదాల వైపు చూస్తాను పువ్వులు చల్లుతున్నట్లు; వృద్ధాప్యంలో తల్లి తర్వాత తల్లి ఇప్పుడు నేను బ్రతుకుతున్నది ఆమె చేతుల లోనే; సుఖ దుఃఖాలలో తడిసిన ఆమె చేతులను ఆప్యాయంగా ఒకసారి స్పృశిస్తాను. ఆమె స్పర్శలో, సాహచర్యంలో మృదువైన ఆమె వేళ్ళ నుంచి ప్రసరిస్తున్న జీవశక్తిని కన్నుల నిండా నింపుకుని తడబడుతున్న అడుగులతో నా ప్రపంచంలో అప్పుడు అడుగుపెడతాను"

కవి అజంతా స్వప్నలిపి సంపుటిలోని 'వేళ్ళు ఇక్కడే' కవితలోని ఈ వాక్యాలు చూపిస్తూ మా ఆవిడ - భార్య మీద అంత అనురాగం, ప్రేమ, డిపెండెన్సీ ఉండబట్టే ఆయన గొప్పవారయ్యారు అంది. అసలు కవిత్వంలోనైనా భార్యమీద అంత అనురాగం చూపించిన వారెవరు చెప్పండి అని తాదాత్మ్యంగా అంది. అని ఊరుకోలేదు. నేనేదో నా రాతల్లో తనను చిత్రించడంలో ఏవో 'చిత్రాలు' ధ్వనిస్తున్నాయందిలెండి!

"అసలు 'వేళ్ళు ఇక్కడే' అంటే ఏమిటనుకున్నారు. ఎంత మహానుభావుడి మూలాలయినా, పునాదులయినా సంసారం, కుటుంబం నుంచే వుంటాయి" అంది ఆయన కవితాఖండిక శీర్షికను విశ్లేషిస్తూ.

అవునవును! అందుకే సోక్రటీస్ అంతటివాడు మగాడికి ఇచ్చిన సలహాఒక్కటే - "శుభ్రంగా పెళ్ళి చేసుకో. పెళ్ళాం అనుకూలవతి అయిందా సుఖపడతావ్. లేదూ గొప్ప వేదాంతివీ, తాత్త్వికుడివీ అవుతావ్" అని అన్నాను కావాలని కొంచెం రెచ్చగొట్టినట్లుగా. - 'గొప్ప కవులంతా మంచి తాత్త్వికులు కూడా సుమా' అన్నాను అందులో నిజానిజాల సంగతి ప్రక్కన పెట్టేసి.

"కవులందరినీ ఒకే గాటకు కట్టేయకండి. అజంతా ఒక్కరే ఒక్కరు. ఆయనకు అక్షర రహస్యం తెలుసు. ఆయన కవిత్వంలో రోడ్డు పట్టుకు తిరిగినా, ఓ మధ్య తరగతి సగటు కుటుంబీకుడి కోసమే తపించాడు. మనిషి మనిషిగా బ్రతకాలని తపించాడు" అంది మా ఆవిడ. కవిగా అజంతాను అంచనా వేయడం ఎలాగో తెలియక మల్లగుల్లాలు పడే విమర్శకులు ఎందరో వుండగా మా ఆవిడ యథాలాపంగా అలా ఎలా అనేసిందో నాకు తెలీలేదు.

"మనం సగటు మధ్య తరగతి జీవులం. రోజు రోజూ ఛస్తున్నాం. మనిషి ఒక్కసారి చావకుండా ముక్కలు ముక్కలుగా చావడం అంత ఘోరం ఇంకేంటుంది చెప్పండి. అయినా మనం ఆశలతో, కలలతో బ్రతుకుతున్నాం. నిజానికి స్వప్నాల్లోనే మరీ బతుకుతున్నాం. వర్తమాన జీవితం అగమ్యం, అస్పష్టం, అగోచరం, అర్థరహితం.. అజేయంగా వున్నదల్లా స్వప్న శక్తి ఒక్కటే" అంటూ అజంతా కవిత్వ పంక్తులను కలిపేసుకుని మా ఆవిడ నా ముందు నిట్టూర్పుతో మాట్లాడటం నాకు నిజంగా ఆశ్చర్యానందాలు కలిగించింది.

'భయ విభ్రమాల మధ్య విషాద వాక్యం వలె సాగే జీవితంలో మృత్యువు ఒక్కటే నిజం' అన్న తాత్త్వికత అజంతాకు ముందు నుంచే వుంది. 'క్షణక్షణ జీవితం క్షణక్షణ మృత్యువు' అన్న ఫిలాసఫీని ఆయన జీర్ణించుకున్నాడు. 'అంతా ఒకే వృత్తం, ఒకే లిపి... వాస్తవం అందంగా వుండదు. వాస్తవం చేదు విషం. గరళకంఠుడైన కవి ఇక్కడే ఉద్భవిస్తాడు' కుటుంబాన్ని, సంసారాన్ని, సమాజాన్ని, మొత్తంగా మనిషిని క్షణక్షణం మృత్యువు గూర్చిన హెచ్చరికలు చేస్తూ కుటుంబం కోసమే రోడ్లమీద పడుతున్న మధ్యతరగతి మనుషుల పట్ల ఆత్మీకంగా వకాల్తా పుచ్చుకుని రోడ్లే ప్రాణంగా, రహస్య సంకేతంగా, జీవన వ్యాకరణంగా, అంకిత శరీరంగా, సర్వస్వంగా, ఇతివృత్తంగా, ఛందస్సుగా మారిపోగా - కంప్యూటర్ చిత్రాలతో మీట నొక్కగానే తర్జని రివాల్వర్‌గా మారుతుందా? అని బెంబేలు పడుతూ, అనుక్షణం చెట్లు కూలుతున్న దృశ్యాల భీతావహ పరిస్థితుల్లో జీవన మాధుర్యం కోసం పరివేదన చెందిన కవి అజంతా.

నేను నా ఆలోచన ధారలో కొట్టుకుపోతుండగా మళ్ళీ మా ఆవిడే కుదిపింది "వేళ్ళు ఇక్కడే అన్న అజంతా కవిత స్పష్టంగా అర్థమవుతున్నప్పుడు, అందులో ఆయన అందించిన కవిత్వపు తాళం చెవిని పట్టుకుంటే మిగతా కవితలు అర్థంకానట్లుగా పైకి వున్నా ఆయన కవిత్వ తాత్త్వికతను అందిపుచ్చుకోవడం కష్టమేమీ కాదు కదండీ" అంటూ. అన్ని కవితల ఇతి వృత్తాలూ 'వేళ్ళు ఇక్కడే' లో కనబడుతూ, ఆయనదంతా ఒకే దీర్ఘ కవిత అనిపించడానికి కారణం అక్షరాలను, ధ్వనులను, చిత్రికబట్టిన ఆయన పెర్ఫెక్షన్, క్రిస్టలైజేషన్ అనిపించడం అందుకేననిపించింది. రాజకీయ ఘస్మరుడుని సైతం మాంత్రికుడిగా మహా నిశ్శబ్దంలోకి పంపే వేదశాల అజంతా కవిత్వపు చీకటి చిత్రశాల. 'ఇండియా! ఇండియా!' అంటూ మృత్తిక నుంచి శరీరం నుంచి ఆత్మ నుంచి స్రవిస్తున్న నెత్తురు చూసి శాంతి కోసం విహ్వలుడయిన వాడు అజంతా.

"స్నానాదికాల అనంతరం శరీరం మీద మరో శరీరం తొడుక్కుని ముఖం మీద ముడతలన్నీ ఒక్కసారి సర్దుకుని, వీధి గుమ్మం వరకూ మా ఆవిడ వెంట రాగా రోడ్డుమీద అడుగు పెడతాను; దిన చర్యలో ఇది తప్పని సరి..." మా ఆవిడ అజంతా కవిత పైకి మళ్ళీ చదువుతోంది.

"అన్నిటికీ కారకుడు మనిషి కనుక ప్రతి మనిషిలో నన్ను చూసుకోవడం నాకెంతో ఇష్టం. మనిషి ఎక్కడవున్నా ఒక్కడే. పృథ్వీ తలంపై మనిషి అడుగుల చప్పుడు వినబడిన తొలి క్షణం నుంచి మనిషి అంతరాత్మ ఒక్కటే. నేను ప్రతి మనిషిలో వుంటాను. ప్రతిమనిషి స్వప్నంలో ఉంటాను. స్వప్న సౌందర్యంలో ఉంటాను. బాధలో దుఃఖంలో, మండుతున్న గాయాలలో వుంటాను. ఎడారి మనిషి ఆక్రందనలో వుంటాను. అధఃపతితుడైన మనిషిని ఆప్యాయంగా లేవనెత్తుతున్న కారుణ్య హస్తాలలో వుంటాను" అజంతా స్వప్న లిపి అట్ట వెనుక నుంచి పలుకుతున్న కంఠం నాకు వినిపిస్తూనే వుంది.

సంస్కృతి సాహిత్యం రాజకీయాలు అనే సం.సా.రా.లు అన్నిటి కోసం - 'భూగోళంపై సరిహద్దులు లేవు. అక్షరాలకు సంకెళ్ళు లేవు' అని ప్రతి అక్షరం ఒక మనిషిగా, ప్రతిమనిషి ఒక అక్షరంగా స్వచ్ఛతకై అక్షరీకరించిన అజంతా మనిషికి సంసారాలు, కుటుంబాలు సంకెళ్ళు కాక కళ్ళు, కాళ్ళు కావాలనుకున్నవాడే అనిపించింది.

"అజంతాగారూ, ఆరుద్రగారూ కూడా పోవడంతో తెలుగు కవిత్వంలో అలలు పోయినట్లేకదా నాన్నగారూ" అని మా అబ్బాయి స్నేహిత్ అంటే కళ్ళు చెమ్మగిలి వాడి వీపు నిమిరాను.

*సోమవారం, 28 డిసెంబర్ 1998*

# డైరీ కల్చర్

'బావగారూ! డైరీ కల్చర్ బొత్తిగా తగ్గిపోతోందండీ! మీరు గమనించారో లేదో. మునుపు ఇలా వుండేది కాదు' అన్నాడు ఫణి. 'అదేంటి మావా అలా అంటావ్! డైరీ వినియోగ స్థాయిని పెంచి మార్కెటింగ్‌లో భారీ మార్పులు చేస్తామనీ, ప్రైవేట్ డైరీలకు పోటీగాకొత్త ఉత్పత్తుల్ని మార్కెట్లో ప్రవేశపెట్టేసన్నాహాలు చేస్తున్నామనీ' పాడి సమాఖ్య ఛైర్మన్ జనవరి ఫస్టునే కదా అన్నారు' అన్నాడు నా పుత్రరత్నం. 'అవునోయ్ బామ్మరిదీ! నిజానికి - 'వినియోగదారులకు స్వచ్ఛమైన పాలను అందించడమే తమ లక్ష్యమనీ, పాల ఉత్పత్తిదారులకు గిట్టుబాటు ధరను అందించాలనేదే సంకల్పమనీ' పశుసంవర్ధక శాఖా మంత్రి గారు కూడా చెప్పారు. మరి నువ్వు డైరీ కల్చర్ బొత్తిగా తగ్గిపోతోందని ఎలా అనుకుంటున్నావో అర్థం కావడం లేదు.' అన్నాను నేను. ఫణి జుట్టు పీక్కుంటూ - 'అక్కా' అని గట్టిగా అరిచాడు. తమ్ముడుం గారికి ఏమైందో అర్థం కాక మా ఆవిడ వంటింట్లోంచి తటాలున పరిగెత్తుకొచ్చింది. - 'ఏమైందిరా ఎందుకలా కేకేసావ్' అంటూ. 'అక్కా!వీళ్లిద్దరితో మాట్లాడ్డం ఎలాగో నాకు తెలీడం లేదే! నేనోటి అంటే, వాళ్లొకటిగా క్లాస్ తీసుకుంటున్నారు' అన్నడు ఫణి ఏడుపు మొహం ఒక్కటే తక్కువగా. ' ఇంతకీ ఏమిటన్నావురా' అంది ఆవిడ. 'మనలో డైరీ కల్చర్ బొత్తిగా తగ్గిపోతోందన్నాను. వాళ్ళేమో పాడీ-పంటా-పాలూ అంటూ మొదలెట్టారు' అన్నాడు ఫణి. మా ఆవిడ పడీపడీ నవ్వడం మొదలు పెట్టింది; 'భలేదొరికార్రా మీరు' అంటూ.

'డైరీ కల్చర్' అంటే మా ఫణిగాడి ఉద్దేశ్యం వేరని మా ఆవిడ నవ్వు వల్ల నాకు బుర్రలో వెలిగింది. కొత్త సంవత్సరం వచ్చింది కదా! ఒకరికొకరు గ్రీటింగ్ కార్డులు పంపుకోవడం, శుభాకాంక్షలు చెప్పుకోవడం ఆనవాయితీయే. కొత్త సంవత్సరం క్యాలండర్ సంపాదించడం, న్యూ ఇయర్ డైరీ సంపాదించడం అనేది అందరికీ లభించే అదృష్టం కాదనీ, మనకు ఎవరైనా కొత్త క్యాలండరూ, డైరీ ఇచ్చారంటే మనమెంతో పెట్టిపుట్టిన వాళ్ళమై వుంటామనీ మా ఫణి తీర్మానించాడు. ఈ రోజుల్లో డైరీలు ఇవ్వడమనే పద్ధతి బాగా తగ్గిపోతోందనీ. 'డైరీ కల్చర్' అంటే మా బామ్మరిది ఉద్దేశ్యం అదనీ అప్పటికి అర్థమైంది మాకు.

'ఫణి మామా! నువ్వు డి.ఐ.ఎ.ఆర్.వై. అనే స్పెల్లింగు గల డైరీ గురించి కాక, డి.ఎ.ఐ.ఆర్.వై అనే స్పెల్లింగు గల డయిరీ గురించి మాటాడుతున్నావనుకున్నాను.

సారీ! అయినా నీకు డైరీలంటే అంత ఇష్టమా' అన్నాడు నా పుత్రరత్నం కిసుక్కున నవ్వి.

'ఒరే బచ్చాగాడా! నువ్వు కావాలనే టాపిక్ మార్చి మొదలెట్టి మీ నాన్నను కూడా కన్ఫ్యూజ్ చేసి వుంటావ్! నేను డైరీ ప్రాముఖ్యత గురించే మొదలెట్టా. స్పెల్లింగులు నాకూ తెలుసు. కానీ ఉచ్చారణ ఒక్కలానే వుంటే నాదా తప్పు. గాంధీగారే మన్నారో తెలుసా! - 'నిజాన్ని ఆరాధించే వారికి డైరీ ఒక కాపలాదారుడిగా పని చేస్తుంది' అన్నారు 'ఒకసారి క్రమం తప్పకుండా రాసే అలవాటు చేసుకుంటే ఏది రాయాలో, ఎట్లా రాయాలో మనకు తెలిసిపోతుంది. అయితే డైరీ వ్రాయడానికి మనలో నిజాయితీ అనేది ఉండాలి. అది లేని పక్షంలో డైరీ చెల్లని నాణెంగా తయారవుతుంది. కానీ మీరు నిజాలనే రాసినప్పుడు అదిబంగారం కంటే విలువైన దవుతుంది.' అన్నారు గాంధీగారు అంటూ ఫణి మొదలెట్టాడు డైరీ గురించి ఇష్టపూర్తిగా.

'బామ్మరిదీ! నువ్వెలాంటి వాడివో తెలుసుకోవడానికి పై వాళ్లెవరికీ ఉత్సాహం ఉండకపోవచ్చు. కనీసం నీ గురించి నువ్వయినా తెలుసుకోవడానికి స్వంత డైరీ సహాయపడుతుంది అన్నాడట ఓ ఆంగ్లకవి. డైరీ అనేది ఆత్మ విమర్శకు నూటికి నూరుపాళ్ళూ తోడ్పడుతుంది' అన్నాను నేను. డైరీ రాసే అలవాటు కలిగి వుండడం అనేది మనల్ని అనేక రకాల చెడు అలవాట్లనుండి రక్షిస్తుంది. కారణం మనం చేసే తప్పులకు అది సాక్షి అవుతుంది. తప్పు చేసినా తప్పకుండా అందులో నోట్ చేసుకోవాలి. ఆత్మస్తుతికీ, ఇతరుల తప్పులు నమోదు చేయడానికీ కాదు డైరీ అన్నారు గాంధీగారు' అని కూడా అన్నాను.

'సరే! అసలు డైరీ రాయడం అందరికీ చేతనవుతుందేమిటి అలాగ? అమ్మకు ఇచ్చావనుకో!...' ఇవాళ వంకాయ కూర చేసాను. ఇవాళ పెళ్లినాటి నీలంచీర కట్టుకున్నాను అని రాసుకుంటుంది అంతేగా' అన్నాడు పుత్రరత్నం. 'వెధవా! నేనేం రాసుకుంటానో నీకేం తెలుసురా? అయినా పెద్దంతరం చిన్నంతరం ఉండనక్కర్లేదా అమ్మను అలాగేనా అనడం' అని కోప్పడింది మా ఆవిడ.

'అక్కా! అదే నేనంటున్నదీను. మనకు డైరీవిలువ తెలియాలి. డైరీ రాసేకల్చర్ పెంచుకోవాలి. చదివిన ఓ మంచి పుస్తకం గురించో, చూసిన ఓ మంచి దృశ్యం గురించో, కలిసిన ఓ వ్యక్తి గురించో రాసుకోవచ్చు. జీవన విధానాన్ని క్రమశిక్షణతో మలుచుకోడానికి డైరీ సహాయకారి' అన్నాడు ఫణి తాదాత్మ్యంగా.

'అసలు ఈ డైరీ అనే మాట ఎలా వచ్చింది మామా' అని ప్రశ్నించాడు పుత్రరత్నం. ఫణి- గొంతులో వెలక్కాయ పడ్డట్లు మొహం పెట్టి 'బావా' అన్నట్లు నా వైపు చూసాడు. మా ఆవిడ వాళ్ళ తమ్ముడికి అభయహస్తం చూపి మా పుత్రరత్నంతో -

'డైరీఅనే మాట లాటిన్ భాషనుంచి వచ్చింది. డైరియస్ అంటే తెలుగులో దినచర్య అని అర్థం. అందుకే మనం దినచర్య గ్రంథం అని డైరీకి తెలుగు చెప్పుకోవచ్చు. కానీ డైరీ అనే మాటే అంతటా వాడుకలోవుంది. డైరీ రచన గ్రీకు, రోమనుల కాలంలో వున్నట్లు ఆధారాలున్నాయి. 15వ శతాబ్దంలో మాత్రం బాగా అభివృద్ధి చెందింది. అలనాటి డైరీ రచనవల్ల మనకు అప్పటి సాంఘిక, సాంస్కృతిక విషయాలు తెలుస్తాయి' అంది.

'భేష్! నేను చెప్పిన విషయాలు బాగా గుర్తుపెట్టుకున్నావోయ్' అన్నాను నేను నవ్వుతూ, మా ఆవిడ 'ఊ' అని గుడ్లురిమి చూసింది.

'డైరీలకు సాహిత్యంలో విశిష్ట స్థానం వుంది. ఇంగ్లీషు భాషలో శామ్యూల్ పెపిన్ అనే బ్రిటిష్ నౌకాదళపు సివిలియన్ ఉద్యోగి 1660 నుంచి రాసిన డైరీల్లో 1669 జనవరి ఒకటి నుండి మే 29 వరకు రాసిన డైరీకి చాలా గణనీయమైన గుర్తింపు వచ్చింది. అలాగే జాన్ఎవిలిన్ డైరీ - రెండవ ఛార్లెస్ గురించి అనేక విషయాలు వెలుగులోకి తెచ్చింది. ఎల్లర్, జార్జిఫాక్స్, బాస్వెల్, జాన్సన్, టాల్‌స్టాయ్‌లు తాము ఏ ఉద్దేశ్యంతో అలనాడు డైరీలు రాసుకున్నా, కాలక్రమేణా అవి బహుళ ప్రచారం పొందాయి' అన్నాను నేను.

'హిందీలో ప్రేంచంద్, తెలుగులో గురజాడ డైరీలుకూడా సాహిత్యంలో స్థానంకలవే కదా బావా' అంటూ ఫణి - 'బావా నువ్వు కూడా డైరీ రాయకూడదూ ఈ ఏడాది నుంచయినా' అంటూ గదిలోకి వెళ్ళి తను కొన్న డైరీలు తీసుకొచ్చి నాకూ, మా ఆవిడకీ, మా పుత్రరత్నం స్నేహిత్‌కు కూడా ప్రజెంట్ చేసాడు. మా వాడి ముఖం విప్పారింది. 'మామా! డైరీ కల్చర్‌ను నీలాంటి వాళ్ళు నిలబెడుతున్నందుకు నేను గర్విస్తున్నాను. జైన్, హవాలాలతో డైరీలు అంటే భయపడడం వల్లనే రాజకీయంగా డైరీలు ఇచ్చుకునే, రాసుకునే సంస్కృతికి అవరోధం ఏర్పడుతూండగా, నువ్వు అధిగమించడం బ్రేవో!' అని మా స్నేహిత్ అనేసరికి అంతా నవ్వేశాం.

*సోమవారం, **4** జనవరి **1999***

# గతిమారిన గీతి

'తుణుక్ తుణుక్ తు-తుణుక్ తుణుక్‌తు-తుణుక్ తుణుక్‌తు దాదాదా' అంటూ దలేర్ మెహందీని దరువులేస్తూ మరీ ఆనందిస్తున్నాడు పుత్రరత్నం. సినిమా పాట కన్నా ప్రైవేట్ ఆల్బమ్సే బాగుంటున్నాయని వాడి వ్యాఖ్య. ఆ వ్యాఖ్యతో ఆగడు కదా! ఇంట్లో మ్యూజిక్ సిస్టమ్ కోసం ఎంత కస్టమ్ పడయినా వాటిని కొనాలని పట్టుబడుతుంటాడు. ఎ.ఆర్.రెహ్మాన్ 'వందేమాతరం'కు 'మా తుఝే సలాం' అంటూ వాడు మైమరచిపోవడం చూసి, వాడిలో గొప్ప పేట్రియాటిజం - అంటే దేశభక్తి భావాలు పెంపొందుతున్నాయని వాళ్ళ అమ్మ కూడా పేట్రేగి పోతూంటుంది.

రెహ్మాన్ వందేమాతరం విడుదలయిన కొత్తలో 'వందేమాతర గీతం వరుస మార్చు కుంటున్నదని' ఎంతగానో నొచ్చుకోవడం, వందేమాతరాన్ని సంగతులు పలకడంలో ఎంత భ్రష్టు పట్టించవచ్చో అంత స్థాయిలోనూ ఇటీవల సరికొత్తగా ఓ గాయనీ మణి 'పాప్ సంగీతం' పేర అంత పాపానికీఒడి గట్టిందని' మా మిత్రుడు భాస్కర్ గగ్గోలు పెట్టడం నాకు గుర్తుంది.

'అమ్మ' అని పలకడంలోనూ ఒక నిర్దుష్టమైన తీరుంటుందనీ, ఉండితీరాలని శంకరాభరణం శంకరశాస్త్రి వాక్రుచ్చినట్టు 'బ్రోచే వారెవరురా'ని అన్ని రకాలుగా ముక్కలు చేసి విరిచి పాడేస్తుంటే బ్రోచే వారెవరు? ఇటీవల 'వందేమాతర' గీతానికి సరికొత్త వరసల పేర సంక్రమిస్తున్న సరికొత్త నాదాలు, వాదాలు కూడా నిజానికి విని ఆనందించదగినవి కన్నా, ఆగి ఆలోచించదగినవి అవుతున్నాయన్నది ఎందరు పట్టించుకుంటున్నారో తెల్వద్ కదా! ఆ తరాన్ని ఉర్రూతలూపిన 'వందేమాతర' నాదం, నినాదం అదే వరుసలో ఈ తరాన్ని ఉర్రూతలూపాలంటే కుదర్దు. ఈ కాలానికి తగిన 'ట్యూన్', ఈ కాలానికి కతగిన 'షాను' దానికి సంతరిస్తేనే ఆ జాతీయతాభావ స్ఫూర్తి ఈనాటి తరంలో జాగృతం చేయడానికి వీలుంటుంది. ఆ ప్రాచుర్యాన్ని వందేమాతర గీతానికి పునరుజ్జీవింప చేయడానికే రెహ్మాన్ సంగీతం సారథ్యం వహించింది. అందులో తప్పేం వుంది. అని నన్ను నేను అప్‌టుడేట్‌గా వుంచుకోడానికి మనసును సమాధాన పరుచుకుంటుండగా ఇవాళ మరో గాయనీమణి మరోలా ఆ గీతాన్ని ఢాకిని ఢీకొన్నట్లు, శంఖిణి భయపెట్టినట్లు జలదరింపు వరుసల్లో భయపెడుతూంటే ఎంతగా దేశభక్తి, గణతంత్రం అని సరిపెట్టుకుందామన్నా పులకరం కాదుకదా, సలపరం కలుగుతోంది.

పంజాబ్ జానపదాన్ని దలేర్ మెహందీ పాప్‌గా మలచి పరవశింప చేయడాన్ని కొత్తపాటగా, కొత్త బాటగా ఆహ్వానించగలం కానీ, వరుస తప్పుతున్న దేశభక్తి గురించి సీరియస్‌గా ఆలోచించకపోతే ఎలా? జాతీయతా స్ఫూర్తి పాటతోనూ, ఆటతోనూ చెలగాటలాడే పరిస్థితులు రావడం చూసి మనల్ని మనం 'ఐ పిటీ యు' అనుకోవాల్సిందే. పాకిస్థాన్ క్రికెట్ టీమ్‌ను దేశభక్తి పేరనే నిరోధించడానికి శివసేన వీరంగం చేసి చివరకు క్రీడారంగంలో - ఆ క్రీనీడలు క్రమ్ముకోకుండా, అద్వానీ పుణ్యమా అని - ఓ అధ్వాన్న స్థితి తాత్కాలికంగానయినా తప్పినందుకు, తప్పించినందుకు థ్యాంక్స్!

దేశభక్తి ప్రదర్శించుకోడానికి అటా, పాటా మార్గాలు కావనీ, కాకూడదనీ అనడం లేదు. కానీ ఆటకు ఒక గిరి, పాటకు ఒక వరుస ఉండాలి కదా! బరులు దాటి బర్రెల్లా మీదపడితే ఇక పశువుకీ, రస పిపాసువుకీ తేడా ఏమిటి?

"ఒరేయ్! తుణుక్ తుణుక్ తు దాదాదా ఫోఫోఫో అంటూ ఏమిట్రా ఆ గెంతులు. దాని బదులు చక్కగా తెలుగులో ఏ ఎంకిపాటో పాడుకోవచ్చు కదా" అంది పుత్రరత్నంతో మా ఆవిడ.

'ఎంకి పాటా? అదేంటి ('నీ ఎంకమ్మ!' అనే బ్రహ్మానందం ఊతపదం అనబోయి వీపు ఛీరేస్తుందని బయటకు అనకుండా కంట్రోలు చేసుకుని) అన్నట్లున్నాడు మా వాడు.

"ఇదిగో వీణ్ణి చూసారా! వీడికి ఎంకిపాటలు అంటే కూడా తెలీదు. మీరేమో పెద్ద తెలుగు కవి. పండితుణ్ణి అంటారు. మీ అబ్బాయికి ఎంకిపాట అంటే తెలీదంటే అంతా నవ్వుతారు" అంది మా ఆవిడ.

"ఎందుకు నవ్వుతారు? నవ్వరు. ఎందుకంటే నువ్వెవరైతే నవ్వుతారు అంటున్నావో ఆ నవ్వే తరం అంతరించి పోతోంది. ఇప్పుడొచ్చే నవ్యతరం నవ్వు అనేది కూడా బార్బేరియస్ అనుకుంటోంది. వారిని నవ్వించడం నీ తరం నా తరం కాదు. వందేమాతరం తరం కూడా కాదు. ఈ 'సమరం' వేరు. ఇప్పుడంతా గరంగరం. ఇహం పరంలో వీరికి కావాల్సింది సగం సగం. ఇహమూ, అహమూ చాలు. ఇప్పుడు నువ్వు నవ్వుతారు అనుకుంటున్న వారెవరికీ కూడా ఎంకి పాటల గురించి తెలిసే అవకాశం తక్కువ. అంచేత నీ కొడుక్కి ఏమీ ప్రమాదంలేదు. నీ పాటలమక్కువ సరికొత్తగా మలుచుకుని సరికొత్త రాగాల అభిరుచిని ఎక్కుపెట్టకపోతే తక్కువగా చూడబడి అభాసుపాలయ్యేది నువ్వే" అన్నాను నేను నా ఆదోళనాంతరంగ తరంగిత ఆవేదనా భావ నేపథ్యంతో (సమాస భారానికి కారణం హృదయ భారమే అని పాఠకులు గ్రహింతురు గాక!)

అప్పాజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ వారు ఇటీవల బాలసరస్వతికి సన్మానం చేస్తే పేపర్లో చదివి ఓ కుర్రాడు 'ఈ బాలసరస్వతి ఏమిటి? బాల సుబ్రహ్మణ్యం బిరుదా' అంటూంటే, మరొకడు 'ఆయన సిస్టర్ అనుకుంటాను' అన్నాట్ట. "అసలు దలేర్ మెహందీని చూడు ఎంత పాపులర్ అయ్యాడో! మన గద్దర్ కూడా తెలుగు జానపదం గీతాలని అలా పాప్ ట్యూన్స్‌లోకి మౌల్డ్‌చేసి క్యాసెట్లు ఇస్తే మన తెలుగు ఆల్బమ్స్ కూడా రికార్డ్స్ బ్రేక్ చేస్తాయి తెలుసా! వరల్డ్ మొత్తాన్ని గద్దర్ అదరగొట్టేయగలడు' అని ఇంకో లెఫ్టిస్టు కుర్రాడు గద్దర్ ఈ కాలానికి వెనుకబడిపోయినట్లుగా ఆయన అజ్ఞానానికి లెఫ్ట్ అండ్ రైట్ ఇస్తున్నాడు. ఇదంతా గుర్తొచ్చి 'ఎక్కడికి పోతున్నాం మనం? ఉత్తుంగ హిమవన్నగ శృంగాల వైపుకా? అథఃపాతాళ కుహరాలలోకా' అన్న కవిగారి పంక్తులు స్ఫురించి ఉచ్చరించాను.

రేపు గణతంత్ర దినం.

జనగణమనం వందేమాతరం అని ఏ ట్యూన్‌లో పలికితేబాగుంటుందో మల్లగుల్లాలు పడుతున్నట్లే ఉంది.

మావాడు పొడుగాటి కర్రపట్టుకొచ్చాడు. క్రికెట్టు వికెట్టు అనుకున్నాగానీ కాదు. దానికి జెండా తగిలించినట్లే వున్నాడు. 'మూడు రంగుల జెండ - మువ్వన్నెల జెండా' అని పాటేమీ వినిపించడం లేదు. వర్తమానంలో జీవించాలంటే ఈ తరంతో గళం కలపాల్సిందే అన్నాననేమో ఆ జెండా ముందే -

'తేరా రంగ్ భల్లే భల్లే - తేరా రూప్ భల్లే భల్లే' అని దేశభక్తిగల 'సోల్జర్' స్ఫూర్తితోనే - మా ఆవిడా పుత్రరత్నంతో సమానంగా ముచ్చటగా స్టెప్స్ వేస్తోంది. 'మా తుఝే సలామ్' అనుకున్నాను.

*సోమవారం, 25 జనవరి 1999*

# ముక్కు చూడు...ముక్కందం చూడూ...

'ఆ ముక్కు శోణాలు చూడండి ఎంతెంత వున్నాయో' అంది మా ఆవిడ నవ్వుతూ. ఏమనిషి పరిచయం విషయంలోనైనా మొహంలో ముక్కుకే ప్రాముఖ్యం అని అవిడ అనుకోవడంలో తప్పేంలేదు. ముక్కూ మొహం తెలియకపోతేనే అపరిచయస్తుని కింద జమ కదా!

ముక్కుసూటిగా చెప్పాలంటే అసలు అందం అనేది ఒకరి ముక్కుని బట్టే ఉంటుందనేది సిద్ధాంతం. క్లియోపాట్రా ముక్కు ఓ ఇంచ్ తక్కువగా వున్నా, బిల్ క్లింటన్ ముక్కు చప్పిడిగా వున్నా ఖచ్చితంగా చరిత్ర మరొకలా వుండేదే. ఎన్ని లక్షల కోట్ల మంది మనుషులో అన్ని లక్షలకోట్ల ముక్కులు. ప్రతిదీ ఒక విలక్షణమైందే. దేని తీరు దానిదే. తద్వారా దేని అందం దానిదే. ఏ మొహానికి ఏరకం ముక్కు నప్పుతుందనేది బ్రహ్మగారి కంప్యూటర్ బ్రెయిన్ ఎలా చెబితే అలా! అంతే కదా!

ముక్కుకు వున్న ఇంపార్టెన్స్ గురించి ముక్కుతూ మూల్గుతూ చెప్పనక్కర్లేదు. ముక్కు గుద్దినట్లు చెప్పవచ్చు. అసలు ముక్కు అనేది లేకపోతే ఈ చరాచర జగత్తునీ, అందులోని వివిధ పరిమళాలనూ పసిగట్టడం కుదరదుగాక కుదరదు. కొంచెం జలుబు చేసిందనుకోండి. మాట తీరు కూడా మారిపోతుంది. 'మా జెడ్డ జళుబు చేసేసిందళ్లి' అని పలుకుతాం. అబ్బే! పలకడం సరిగ్గానే పలుకుతాం. వినిపించడం అలా వినిపిస్తుంది. అంటే భావవినిమయ సాధనమైన భాష అభివ్యక్తి కూడా ముక్కుమీద ఆధారపడి వున్నట్టే కదా! భాష ఉచ్చారణ మొహంలో ప్రధానంగా నోటికే అయినా, ముక్కు కూడా ఉచ్చరించే పదాలున్నాయి. దంత్యాలు, తాలవ్యాలు మాత్రమే కాదు అనునాసికాలు కూడా వున్నాయి కదా! నాసిక అనగా ముక్కు. నాసిక అనునవే అనునాసికాలు అనేసుకోవాలన్న మాట.

'సుబ్బలక్ష్మి ముఖ్ఖు బావుంది' అని బుడుగు బాబాయ్ అన్నాడనుకోండి. రైట్ స్పిరిట్‌లో తీసుకుంటే ఎవ్విరిథింగ్ గోస్‌వెల్. లేదా! నేను ముఖ్ఖు అనలేదు ముగ్గు అన్నాను. సుబ్బలక్ష్మి వేసిన ముగ్గు బాగుంది అని నా అభిప్రాయం' అంటూ రంగోలీ పోటీల న్యాయనిర్ణేత వార్తాహరునిలా సవరించుకోవాల్సి వస్తుంది.

వాసన, అది ఎలాంటిదయినా ఇట్టే పసిగట్టేసే ఇన్‌స్టాంట్ శక్తియుక్తులు ముక్కువే.. కాఫీ ఘుమఘుమల ప్రకటనలు చూడండి. ముక్కుని ఎంత చక్కగా డెపిక్ట్ చేసి

చూపిస్తారో. కోటేరు లాంటి ముక్కు, సంపంగి పువ్వులాంటి ముక్కు అనేవి అందమైన ముక్కుని వర్ణించే పదబంధాలే. ముక్కు గురించి 'వసు చరిత్ర' కారుని పద్యం నాకెప్పుడూ గుర్తొస్తుంటుంది. ఇది రామరాజ భూషణుడు రాయలేదనీ, నందితిమ్మన రాయడంవల్లే ఆయనకు 'ముక్కు' తిమ్మన అనే పేరువచ్చిందనీ కొందరంటారు. అన్నిపువ్వులమీదా వాలే తుమ్మెద సంపంగి పువ్వుమీద వాలేదికాదుట. ఆ ఆవేదనతోనే సంపంగి పువ్వు ఘోర తపస్సు చేసిందట. ఆ తపఃఫలంగానే మరుజన్మలో అది నాయిక యొక్క ముక్కుగా అవతరించిందట. అప్పుడు ఒకటికాదు రెండు తుమ్మెదలు దానిపై వాలాయట. ముక్కును సంపంగిపువ్వు గానూ, కంటిచూపులను తుమ్మెదలుగానూ పోల్చడమనే కవి సమయం ఆధారంగా "నానా సూనవితాన వాసనల నానందించు సారంగమేలా నన్నొల్లదటంచు గంధఫలి బల్కాకన్ తపంబొంది..." అనే ఈ అందమైన ముక్కు పద్యం రాసాడు కవి. దీనికి ఎన్ని శభాష్‌లయినా ఇచ్చేయచ్చు.

ముక్కు అందమైనదనీ, అందునా ఆడవారికి మరీ ముఖ్యంగానూ అనీ అనడానికి మరో నిదర్శనం ఏమిటంటే - అందమైన వాటినే అలంకరించుకోవడంతో మరీ ద్విగుణీకృతం చేస్తాం కదా. ముక్కు కుట్టించుకుని - చీపురుపుల్ల నుండి వజ్రపు తునక వరకూ రకరకాలుగా ముక్కుపుడకలు, ముక్కెరలు పెట్టుకుని స్త్రీలు శోభాయమానంగా కనిపిస్తుంటే; రంగురంగుల, రకరకాల ఆ ముక్కు పుడకలు పలికే ధరలకు మగాళ్ళు ముక్కున వేలేసుకుని ఆశ్చర్య పోతుంటారు ఒక్కోసారి. 'పరిమళ వస్తు పరిశ్రమలో ముక్కు విలువ ముక్కోటి' అన్నాడొకాయన. నిజమే ముక్కు లేకపోతే నిరుద్యోగం మరింత ప్రబలేదే. మహిళల ముక్కువల్లే కాస్మెటిక్ పరిశ్రమలు అభివృద్ధి చెందుతున్నాయి. ముక్కు, ఆ ముక్కుకు జలుబు అనేవి వున్నాయి కాబట్టే, చేతి రుమాళ్ళ పరిశ్రమ ఇబ్బడి ముబ్బడిగా వర్ధిల్లుతోంది.

మగవాళ్ళలో కూడా నశ్యం (ముక్కుపొడి) పీల్చే అలవాటు గతంలో విరివిగా వుండేది. 'అంబాళ్ నశ్యం' ఎంత ప్రసిద్ధో ఈరోజు కొందరికి తెలియక పోవచ్చు. 'తెలుగు మాస్టారు ముక్కునకు నశ్యంబు నిత్యంబగు' అని పూర్వం విద్యార్థులు వ్యాకరణ సూత్రాన్ని పేరడీ చేసేవారు.

నోస్‌డ్రాపులు, ఇన్‌హేలర్లు తయారు చేసే కెమిస్టులు, ఎడినాయిడులు (అంటే ముక్కులో పెరిగే దుర్మాంసం), సైనస్ రోగాల నివారణకు కృషి చేసే డాక్టర్లు అందరికీ ముక్కుమీదే జీవనం. వీళ్ళెప్పుడూ అవతలివారి ముక్కువల్లనే బతుకుతారు. ఆయిల్ రిఫైనరీల్లో స్మెల్ అబ్జర్వర్స్ వుంటారు. తయారయ్యే నూనెల వాసనలు, పరిమళాలు సరిగా వున్నాయా లేవా అని నిర్ధారించే ఉద్యోగాల్లో వున్నవారికి వారి ముక్కే వారికి

జీవనోపాధి మరి. పెద్ద పెద్ద పరీక్షలద్వారా కూడా తేలని వాసనలను ముక్కే పట్టుకోగలదుట.

సినిమా రంగంలో కూడా 'ముక్కు' అనేది అందానికి పరాకాష్ట అనుకోబట్టే శ్రీదేవి లాంటి తార ప్లాస్టిక్ సర్జరీ ద్వారా తన ముక్కును అందంగా తీర్చిదిద్దుకుని నెంబర్‌వన్ అయింది. అక్కబాటలో మహేశ్వరివంటి నటి మాత్రమే కాదు, పలువురు తారలు తమ ముక్కుని ముఖానికి తగినట్లు అందంగా మలచుకోడానికి లక్షలు ఖర్చు పెట్టడానికి సిద్ధమయ్యారు. ముక్కుకు శస్త్రచికిత్స అనేది మన దేశంలో మూడువేల సంవత్సరాల క్రితమే ఉందట. ఇటలీలో 16వ శతాబ్దంలో ముక్కును తీర్చి దిద్దే నిపుణులకు ఎక్కువ గిరాకీ వుండేదిట. ముక్కు అందం తీర్చిదిద్దేందుకు చేతులమీదిచర్మం తీసి అతుకుతుండేవారుట!

'డేనిష్ ఖగోళ శాస్త్రవేత్త 'టైకోబ్రహేకి' ఓ ఘర్షణలో ముక్కును పోగొట్టుకుని వెంటనే బంగారంతో చేసిన ముక్కును తాపడం చేయించుకున్నాడు. ప్రపంచ ప్రసిద్ధ సినీనటుడు జిమ్మీ డ్యూరాన్ట్ అప్పట్లోనే తన ముక్కును లక్షా నలభై వేలకు బీమా చేసుకున్నాడు.

--ఏతావాతా తేలిందేమిటయ్యా అంటే ముక్కు కోణాల సైజు ఏదయినా, ముక్కు తీరు ఏదయినా అందం విషయంలో ముక్కుసాటి ముక్కే. ముక్కుని సుతారంగా పట్టుకుని లాగడం గొప్ప శృంగార చేష్ట. ప్రేమానురాగాల గుర్తు. అందమైన ముక్కు చూడగానే మనసులో 'కుచ్‌కుచ్ హోతాహై'. ఇలా ఓ నాలుగు ముక్కలు రాయడానికీ 'ముక్కు' కారణం అయిందంటే ముక్కు ప్రాముఖ్యం వేరే చెప్పాలా.

*సోమవారం, 1 ఫిబ్రవరి 1999*

# అఖండ (అ) శాంతి

'దేశం అఖండమైనది.

ఖండ ఖండాంతరాల్లోనూ మనదేశం గ్రేట్. బిల్‌గేట్స్ సైతం మెచ్చుకుని 21వ శతాబ్దంలోకి గేట్లు తెరిచి ఆహ్వానిస్తున్న ప్రదేశం మనది. విదేశాల వాళ్ళు పెట్టుబడులు పెట్టడానికి నెట్టుకుని వస్తున్న దిట్టతనంగల దేశం మనది - అని అనుకోడానికీ, వినుకోడానికీ బేషుగ్గానే వుంటుంది గానీ బావా! అసలు 'దేశం అఖండమైనది' అన్న లైనే తప్పు. ఏ దేశం ఎన్నిసార్లు ఎంత స్వతంత్రతతో ఖండాలు కాలేదు. చీలికలకు పర్యాయపదం ఏలికలు. వాళ్ల మెడల్లో ఎన్ని మాలికలు వేసినా మాటల్లో, చేతల్లో 'తూలికలు' తమ జన్మసిద్ధ నైజం అన్నట్లే -ఊగుతూంటారు, ఊరేగుతూ ఉంటారు. జనం చెవుల్లో గోబీ పువ్వులు పెట్టడం మానరు. ఇంతకీ దేశం అంటేనే - ప్రపంచంలో దేశం వేరు. దేశంలో దేశం వేరు. రాష్ట్రంలో దేశం వేరు. దేశానికి ముందు తెలుగు, కన్నడ, మలయాళ, తమిళ, తుళు అంటూ ఛప్పన్నారు భాషల పేర్లుపెట్టుకోవచ్చు. అన్న, అమ్మ, అక్క, అయ్య అంటూ నానా గోత్రేభ్యాం వావి వరసలు దేశం ముందు తగిలించుకోవచ్చు. 'జన్మభూమి నా దేశం నమోనమామి' అని పాటలు పాడుకోవచ్చు. కానీ దేశం అఖండం అంటే మాత్రం ససేమిరా ఒప్పుకోలేం" అంటూ మా ఫణిగాడు పొద్దున్నే వీరావేశంతో ఓ చింకి లెక్చర్ మొదలెట్టాడు.

"శుభ్రంగా కవిత్వం రాసుకోక నీకు రాజకీయాలెందుకు మామా" అన్నాడు నా పుత్రరత్నం. అంతే! ఆ ఒక్కమాట ఫణిని నాగఫణిని చేసినట్టయింది. బుస నస లెవెల్ దాటిపోయింది. అందులో పస సంగతి ఏమయినా గానీ. విసవిసలు రుసరుసలు విజృంభించాయి.

"ఒరేయ్ భాంజా! మాంజా తెగిన గాలిపటంలా విశాల ఆకాశం లాంటి నా ఉపన్యాస విన్యాసంపై గిరికీలు కొట్టాలని చూడకు. 'కలం గొప్పదా కత్తి గొప్పదా' అన్నది ఓల్డ్ డిబేట్. 'కవిత్వం గొప్పదా - రాజకీయం గొప్పదా' అని ఇప్పుడు డిబేట్ పెట్టి ప్రధానమంత్రిని కూడా ఆహ్వానించవచ్చు. అసలు కవిత్వం ఏమిటి, ఏ కళ అయినా ఇవాళ రాజకీయం ముందు దిగదుడుపే. చతుష్షష్టి కళల్లోని చోర, జారాదులతో సహా నేడు సమస్త కళలూ రాజకీయంలో సమాహారమై పోయాయి. పైకి కలం లాగానే కనిపిస్తుంది, చూసావో లేదో. కానీ పెన్ క్యాప్ తీస్తేకత్తి వుంటుంది. అలా ఇవాళ...

యాక్టర్లు, రియాక్టర్లు, డాక్టర్లు, కండక్టర్లు, గూండాలు, పాండాలు, కవులు, కౌరవులు ఎవరు రాజకీయాల్లో లేరు! ఎవరికి రాజకీయాలు లేవు! అంతా రాజకీయమే. ఏ దేశమేగినా ఎందు కాలిడినా అంతా రాజకీయమే? కవిత్వాన్ని రాజకీయాలు నడిపిస్తాయి. రాజకీయాలను మాత్రం రాజకీయాలే నడిపిస్తాయి. మామ అల్లుడిముందు మటాష్! అల్లుడు అత్త దగ్గర పొటాష్! బావతో బామ్మరిది డాష్! అమ్మ పేరునో, అన్న పేరునో ఓ కొత్త క్రాష్! ఓట్లు క్యాష్ చేసుకోవాలని మైనారిటీ పేర సంఘటనలపై ఫ్లాష్ ఫ్లాష్! అంతా నిజానికి ఒక పెద్ద ట్రాష్" అంటూ ఫణిగాడు కాఫీ, టీ రెండూ కలిపేసి జ్యూస్‌లో కలిపి తాగమన్నట్లు కవిత్వం, పైత్యం, రాజకీయం అన్నీవాడి చింకి లెక్చర్లో ఇరికించి డైలాగ్ శృతి మించడం మొదలెట్టాడు.

'హరి హరీ' అని చెవులు మూసుకున్నాడు ఒక్క ముక్క అర్థంకాక బిక్క చచ్చిన మొహంతో పుత్రరత్నం.

'హరి హరీ అని చెవులు మూసుకోవడం నిన్నే చూసాను. అంతా చెవులు విచ్చి వింటున్నారు. ఆఫ్ కోర్స్! 'అన్న' పథకాలు మళ్ళీ విచ్చుకుంటాయి అన్న ముక్క ఎవరికీ బిలీవబుల్‌కాక దానికి రీజనింగ్ హరికథల్లో ఎక్కడా లేక, గుసగుసలుగా నవ్వుకుంటున్నారు కూడా అనుకో. ఒరేయ్ అల్లుడూ! ఎక్కడయినా బావగానీ రాజకీయాల్లో కాదు. ఆ మాట కొస్తే - ఏ వరస అయినా రాజకీయాల్లో కసాపిసా కసాయిగానయినా తొక్కిపారవేయబడేదే. ఇంతకీ అసలు నేను చెబుతున్న అంశాన్ని పక్కదారి పట్టించకు. 'దేశం అఖండం కాదు' అనేదే కదా ఫస్టు లైన్. ఆ మాటే చెబుతున్నాను. దేశం అనగా -రాష్ట్రంలో దేశానికి అర్థమైన తెలుగుదేశం - ఎన్టీఆర్ హయాంలోనే ఖండమయింది. అంటే చీలికలు మొదలయ్యాయి. మొదటగా దేశం ఆవిర్భవించి, తొమ్మిది నెలల కాలంలోనే ఒక రాజకీయ పార్టీ అద్భుత విజయాన్ని సాధించిన రికార్డు బ్రేక్ చరిత్ర సృష్టించిన తెలుగుదేశంలో, ఆ అఖండమైన గెలుపులో - పాలల్లో పులుపు ఎక్కువ పడ్డట్లు 'పెరుగు' తోడు కోవడం బదులు 'విరుగు' మొదలయింది. 'తెలుగుదేశం ఇన్నేండ్లుగా ఇట్లుండనేల' అన్నట్లుగా నాదెండ్ల తొలిపోటు పూటుగా వేశారు. దేశం స్వర్గం లోంచి తర్వాత ఉపేంద్రుడు నిష్క్రమించాడు. నల్లపురెడ్డి వేరే పల్లానికి జారిపోయాడు. ఫైర్‌బ్రాండ్ రేణుక తెలుగుదేశం నెంబర్ 2గా గుర్తించబడిన కాలం వుంది. "పార్వతీ పతయేనమ:" అనాల్సిన శివుడి జటా జూటంలోని చంద్రుడు హరి హరా భేదంతో, రాముడు కైలాసం చేరే పనిచేసాడు. వైజ్‌గా ఓ 'రాయి' వేసేసరికి నిలువుటద్దం బద్దలయింది. ఆహ్వానం దగ్గుకుంటూకూడా

అందుకుని, ముందు చంద్రకళల్లోనే చేరింది. ఆ తర్వాత కళ తప్పింది. తండ్రి హరీ మనడానికి కారణం తేలాలని తనయుడు చంద్రుడిని నిలదీసాడు. వారసత్వం మాట - ఎవరి తత్త్వం ఏమిటో, సత్తా ఏమిటో తేల్చుకుందామనే లెవెల్‌కు వచ్చింది. జన్మభూమి, ప్రజలవద్దకు పాలన, గ్రీన్ అండ్ క్లీన్, హైటెక్ సిటీ "నా కృషే నా కైలాసం" అన్నది చంద్రుని ధీమా. ఒంటరి విరహంతో తపిస్తున్న పార్వతి "అర్ధనారీశ్వర తత్త్వం" జనం ఏనాటికైనా అంగీకరించరా అని ఆశపడుతోంది. కృష్ణునిగా పేరు తెచ్చుకుని రాజకీయ భారతాన్నీ నడిపిన తండ్రికి వారసునిగా - రెండవ కృష్ణునిగా రాణించాలని హరికృష్ణ 'బావా ఎప్పుడు వచ్చితీవు' అన్న పద్యం బదులు, 'చెల్లియో చెల్లికో' పద్యం ఎత్తుకుని బావపాలనకు చెల్లుచీటీ రాయించాలని చైతన్యరథం బ్రేకులు సరిచేసి యాక్సిలేట్ చేయడానికి 'తహతహ లాడుతున్నారు. 'ఏమైపోతుంది దేశం. ఎటుపోతుందీ దేశం' అని సెవన్టీ ఎమ్మెమ్ స్క్రీన్ పై చూడ్డానికి అందరికీ ఉత్సాహంగా వుంది.

రాష్ట్రంలోదేశం ఇలా వుండగా అసలు దేశం దేశమే రకరకాల మిత్రపక్షాలతో బోలెడుగ్యాస్ కొట్టించుకుని పంచర్లు వేయించుకున్న ట్యూబ్‌తో - పెరిగిన గ్యాస్ ధరతో, బియ్యం ధరతో నూకలు చెల్లి ఎప్పుడు సిలిండరై పేలుతుందా అన్నట్లుంది.

ఏకత్రాటిమీద నడపాల్సిన ప్రధాని, దేశాన్ని అఖండంగా ఉంచాల్సిన అధినేత, పెరిగిన ధరలకు భయపడాల్సిన పనిలేదని సామాన్యుడికి హామీ ఇవ్వాల్సిన ఆయన - తానే స్వయంగా ఉపవాసానికి పూనుకుని తాము కొనసాగితే ఇక అందరూ ఉపవాసాలే ఉండాల్సి వుంటుంది అని సూచిస్తున్నట్లుగా, అందరినీ కూడా ఉపవాసం చేయమనడం అత్యంత శోచనీయం. అంచేత అసలు దేశమేకాదు, ఏదయినా అఖండ మనుకోవడమే తప్పు. లడ్డూ అయినా ఉన్న ఫళంగా మింగేయం కదా! ముక్కలు చేసుకునే తింటాం. జంతికలో, చేగోడీలో అలాగే మింగేస్తే గొంతుక్కి అడ్డంపడి ఛస్తాం అంతే. ముక్కలు చేసుకుని కరకరా నమిలి తినాల్సిందే. అలాగే జనాన్ని కూడా అఖండంగా ఉంచకూడదు. ముక్కలు చేసుకుంటేనే పబ్బం గడుస్తుంది అనేదే అసలు రాజకీయం" అంటూ ఫణి చింకి లెక్చర్ ముగించాడు. మా ఆవిడ కాఫీ తేవడంతోనే ఫణీంద్రుడు శాంతించడం ఓ గొప్ప శాంతి గదా!

*సోమవారం, 8 ఫిబ్రవరి 1999*

# డౌన్ విత్ మెమరీ లైన్

"ఈ మధ్య అసలేమీ గుర్తుండడంలేదు" అంది మా ఆవిడ.

"అవును. నేను కాఫీ అడిగి అరగంటయింది. ఇంతవరకు ఇవ్వలేదంటే అదే కదా అర్థం" అన్నాను.

"నేను పొద్దున్నే వంటింట్లో అష్టావధానం చేస్తుంటే, ఓ పక్క స్నేహిత్ గాడికి ఆటో వచ్చే టైమైపోతుంటే ఆ పనిమనిషి పుష్ప ఇంకా రాకుండా తట్టెడంట్లు అలా పడేడుస్తూంటే సరిగ్గా టైంకి - లేవడమే బారెడు పొద్దెక్కి లేచి టింగురంగా అని తయారై, కాఫీ, గీఫీ అంటూ హడావుడి పెడితే కుదర్దు" అంది మా ఆవిడ విసుక్కుంటూ, ఉప్పు డబ్బా ఎక్కడ పెట్టానని వెతుక్కుంటూ. "ఎక్కడ తీసిన వస్తువులు అక్కడే పెట్టుకుంటే ఈ వెతుకులాట ఉండదు మరి. నీకూ, మీ వాడికీ కూడా ఆ అలవాటులేదాయె" అన్నాను నేను.

"మీరాట్టే మాట్లాడకండి. ఇల్లన్నాక అన్ని వస్తువులు మ్యూజియంలో లాగానో, ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో లాగానో ఎక్కడివక్కడే ఉండాలంటే కుదర్దు. నేను కాఫీ తెచ్చిస్తాగానీ, నా కాళ్లకడ్డం పడక... అలవాటేగా... పోయి ఆ పేపర్ చదువుకోండి. ఈ కుక్కర్ వెయిట్ ఎక్కడ పెట్టానో కనపడక ఛస్తున్నాను" అంది తను.

"ఊరికే అలాకంగారు పడకు. అయ్యే పనులు ఎలాగూ అవుతాయి. ఊరికే హడావిడీ, కంగారు పడడంవల్లే ఆలోచనల్లో క్రమం తప్పి గుర్తుకు రావలసిన సంగతులు సమయానికి గుర్తుకు రాక, మరుపు వస్తూవుంటుంది. స్లో అండ్ స్టెడీ విన్స్ ద రేస్" అన్నారు. అందువల్ల అనవసరంగా కంగాళీ పడిపోకు" అన్నాను నేను, తను బియ్యం కొల్చుకునే సోలలో పడేసిన కుక్కర్ వెయిట్‌ను తీసిస్తూ...

"కబుర్లకేం నేనూ చెబుతా. అసలు మా ఆడవారి కున్నంత ధారణాశక్తి, ఆలోచనా క్రమం మీ మగవాళ్లకి తక్కువ. పనులు ఒక ఆర్డర్‌లో చేసుకోవడం మీ కస్సలు చేతకాదు. రెండు బజారుపన్లు ఒకసారి చెప్తే రెండూ ఒకసారి చేయక, ఏదో ఒకటి మరిచిపోయి రెండుసార్లు బజారుకి తిరగడం మీ మగాళ్లకే చెల్లింది. దీన్నిబట్టి మతిమరుపు మాకెక్కువో,మీకెక్కువో, తెలియడంలేదా?" అంది శ్రీమతి.

"మరుపనేది నువ్వనుకున్నంత దుర్లక్షణం కాదోయ్. మతిమరుపు ఉండడం నిజానికి మేధావుల లక్షణం. ఆబ్సెంట్ మైండెడ్ కాకపోతే అసలు ఒహణ్ణి ప్రొఫెసర్

అనడమే వేస్ట్. అదీకాక మర్చిపోవడంలో ఓ సుఖం ఉంది. చాలామంది పాపం ఆ సుఖానికి కూడా నోచుకోరనుకో. అయిపోయిన దాన్ని - అది మంచి కానీ, చెడుకానీ, తవ్వుకుని, తల్చుకుని, వర్తమానం గడపడంవల్ల, నిజానికి వర్తమానంలో అందుకోవాల్సిన సుఖాల్ని పొగొట్టుకుంటుంటారు కొందరు. ఏమంటావ్" అన్నాను.

"మరే మరే... 'అప్పుడలా జరిగింది', 'అప్పుడలా చేసాను', 'ఆరోజులే వేరు', 'మా చిన్నప్పుడైతేనా...!' అటూ గతాన్ని మరీ మరీ తల్చుకుని వర్తమానంతో తులనాత్మక పరిశీలన చేస్తూ, ఎప్పుడో అణాకి కిలో బియ్యం వచ్చాయనీ, ఇప్పుడు రావడంలేదనీ అనుకోవడంలో అర్థం ఏమన్నా వుందా చెప్పండి. అలా బేరీజులు వేసుకోవడం మర్చిపోతే తప్ప, ఇప్పటి పరిస్థితులకి అనుగుణంగా ఆచరణశీలురం కావడం కష్టం. ఎంత గొప్పదైనా గతమంతా ఒక స్వగతం మాత్రమే. 'మంచి గతమున కొంచెమేనోయ్' అనుకోవడమే విజ్ఞత కదా!" అంది తను.

"సర్లే మన సామెతలూ జాతీయాలూ పరస్పర విరుద్ధాలు. 'గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్' అని కూడా అన్నారు. 'తేహినో దివసా గతాః" అని గతించిన రోజుల్ని తల్చుకోవడంలోనే అసలు మనకి జ్ఞాపకశక్తి ఎంతుందో తెలుస్తుంది కదా. ఈ విషయంలో తప్పకుండా మీ ఆడవాళ్లనే మెచ్చుకోవాలిలే. పదేళ్ల క్రితం పుట్టినరోజునాడు నేనే చొక్కా వేసుకున్నానో, ఆ రోజు ఏ కూర చేసావో కూడా నీకు గుర్తుంటుంది కానీ, నా కస్సలు తెలీదు. అంతెందుకు! మనింటి ఫోన్ నెంబర్ ఏమిటో ఒక్కోసారి వెంటనే నాకు సరిగ్గా గుర్తొచ్చి చావదు" అన్నాను నేను.

"అదేం మేధావుల లక్షణం కాదు. అలా అని మురిసిపోతున్నారేమో! పదేళ్ల క్రితం సంగతులు కాదు కానీ, ఇప్పటి సంగతులు, మీరు చెయ్యాల్సినవీ ఎప్పటికప్పుడు గుర్తుపెట్టుకోక మతిమరుపు గొప్పవారి లక్షణమని దబాయించవచ్చని చూడకండి. మీ మగవాళ్ల తెలివేంటంటే ఉన్న మరుపుకంటే, నటించే మరుపు ఎక్కువ. చాలా సుఖంగా పనుల్ని అవతల వాళ్లమీదకి నెట్టేయడానికీ, ఇష్టంలేని పనిని ఎగవేయడానికీ, మరుపుని మీకో సాకుగా, వరంగా అన్వయించుకుంటారు. ఓ మంత్రి మహానుభావుడెవరో కోట్ల ఆదాయప్పన్ను ఎగ్గొట్టి తీరా నిలదీసి అడిగితే 'సారీ, మర్చిపోయాను' అన్నాట్ట సింపుల్‌గా. అసలు నిజానికి ప్రజల మతిమరుపుమీదే రాజకీయ పార్టీల భవిష్యత్తుంది. ఎన్నికల ముందు తాము చేసిన వాగ్దానాలు నెరవేర్చలేదు అన్న విషయం ప్రజలు మర్చిపోయేలాగా, కొత్త ఫీట్లు, కొత్త వాగ్దానాలు చేయగల చేవ రాజకీయులదే. పార్టీని స్థాపించిన పెద్దని మర్చిపోయేలా ప్రజల్ని తన వైపు తిప్పుకోవాలని ఓ పక్క తపన పడుతూనే, ఎక్కడ పెద్దాయన్ని తను మర్చిపోయానని ప్రజలు అనుకుంటే తనకు

ముప్పొస్తుందోనని, మళ్ళీ ఆ పెద్దాయన్ని అవసరానికి గుర్తు చేసుకుంటూండడం... ఇదంతా మరుపు మైమరుపుల మధ్య రాజకీయ క్రీడ కాదుటండీ" అంది మా ఆవిడ నవ్వుతూ. "భేష్! ఓ పొలిటికల్ సూత్రాన్ని చక్కగా ఫిల్టర్ కాఫీలా కాచి వడబోసావోయ్. ఇంతకీ సంగతేమిటంటే మతిమరుపు అవసరానికి వరం, అక్కర్లేనప్పుడు శాపం. కొన్ని మర్చిపోవడం ఎంత ముఖ్యమూ, సౌఖ్యమూ, లౌక్యమూనో, కొన్ని గుర్తుకు రాకపోవడం అంత డేంజర్. భాగస్వామ్య పార్టీల వ్యవహారమే తీసుకో. ఆయా పార్టీల వారు అవతలివారు చేస్తున్న మంచిని మర్చిపోయి, తమకి నచ్చనివి మాత్రమే గుర్తుంచుకుని, వాటి గురించే అవతలి వారిని హెచ్చరిస్తుంటే - అవతలివారు తమ అస్తిత్వం నిలుపుకోడానికి చేయాల్సినవి మాత్రమే గుర్తుంచుకుంటూ ఏదో విధంగా నెట్టుకొస్తున్నారా లేదా? అసలు సమస్యల్ని మర్చిపోయేలా ప్రజల్ని పక్కదారి పట్టించడమే అధికార పార్టీల ధ్యేయం. చిన్న చిన్న అంశాలే అయినా గోరంతలు కొండతలు చేసి ప్రజలకు మాటి మాటికీ గుర్తుచేసి ఎలాగో అలాగ తాము తిరిగి అధికారంలోకి రావాలనేదే ప్రతిపక్ష పార్టీల ధ్యేయం. ప్రభుత్వమూ, ప్రతిపక్షమూ నడుమ, ఏది గుర్తుంచుకోవాలో ఏది మర్చిపోవాలో తెలియక, సతమతమవ్వడమే సామాన్య ప్రజల ఖర్మం" అన్నాను నేను.

"అసలు మీలాంటి మగాళ్ళు రెచ్చిపోయేలా ఏ వయాగ్రాలో కనిపెట్టే బదులు, ప్రజల జ్ఞాపకశక్తిని పెంచే మందులు కనిపెట్టొచ్చుకదా!" అంది మా ఆవిడ.

"ఉన్నాయి. ఈ మధ్యే సరికొత్తగా ఎన్.జి.డి. 97-1 అనే రసాయనిక మిశ్రమాన్ని మాత్రల రూపంలో సరికొత్తగా రూపొందించారుట. పార్కిన్సన్స్ డిసీజ్‌ని రూపుమాపడంలో ఇదెంతగానో దోహదపడి, మెదడులోని జీవకణాల్ని బాగా యాక్టివైజ్ చేస్తుంది. జ్ఞాపకశక్తి పెంచుతుంది. అత్యవసరమైన విషయాలను కంప్యూటర్ మెమరీఅంత ఖచ్చితంగా గుర్తుంచుకుని, పని చేసుకోవడానికి ఇదెంతో సహకరిస్తుందంటున్నారు. పరీక్షార్థులైన విద్యార్థులకే కాక, అందరికీ కూడా ఇదెంతో ఉపయోగకరం. అంటున్నారు" అన్నాను నేను.

"అది సరే! స్నేహిత్ ఆటోవాడు రానని చెప్పాడు ఇవాళ, అది గుర్తుందా? త్వరగా తయారయి వాడ్ని స్కూల్లో దింపేసి, అట్నుంచటు ఆఫీసుకి వెళ్లిపోండి. మీ లంచ్ నేను పట్టుకొస్తాను..." అని మా ఆవిడ అనేసరికి ఒక్క ఉదుటున స్నానానికి బాత్‌రూం వైపు పరుగెత్తాను.

*సోమవారం, 22 ఫిబ్రవరి 1999*

# పిల్ల(ల) సరదాలు - పెద్ద(ల) భారాలు

"చుక్ చుక్ రైలు వస్తోంది. పక్కకు పక్కకు జరగండి..... జోజో పాపాయి ఏడవకు" అంటూ పాడింది మా సాధన, 'ఏదయినా ఓ రైమ్ చెప్పు చిట్టి తల్లీ' అంటేను. 'మధ్యలో లైన్లన్నీ ఏమయ్యాయే' అన్నాడు వాళ్ల నాన్న నవ్వుతూనే. 'వాటిదీ రైల్వే లైన్ల కథాకమామీషే అయి వుంటుందిలే. అన్ని లైన్లకూ ఒకే బడ్జెట్‌లో క్లియరెన్స్ ఇమ్మంటే ఎలా కుదుర్తుంది. టోటల్ రైల్వే బడ్జెట్‌కు ప్రతిస్పందనగా అది పాడిన మూడు లైన్లూ చాల్లే" అన్నాడు మా అన్నయ్య.

ఆదివారం వస్తే చాలు. మా ఇల్లు ఎంతో సందడిగా, కళకళగా వుంటుంది. సాధారణంగా మా అన్నయ్య, తమ్ముళ్లూ, చెల్లెళ్లూ, పిల్లలూ ఏ మాత్రం వీలున్నా ఓ విజిట్ చేస్తూంటారు. నలుగురూ కలుసుకోడానికి వీలుకాని 'ఇరుకు' కొంప కాకపోవడంతోనూ, ఆ ఇరుకులూ, బెరుకులూ మా ఎవరి మధ్యా కూడా లేనందువల్లనూ 'సన్‌డే మాకు జాలీడే' గానే భాసిస్తూంటుంది.

'పిన్నీ, ఓ టెన్ రూపీస్ ఇవ్వు' అన్నాడు మా పెద్దతమ్ముడి కొడుకు రక్షిత్. వాడికీ వాళ్ల అక్క సుషమాకూ నన్నూ, మా ఆవిడనీ బాబాయ్, పిన్నీ అని పిలవడమే అలవాటు. 'ఇప్పుడు నీకు డబ్బు లెందుకురా' అంది మా ఆవిడ.

'కావాలి. రఫెల్స్... అదే... పొటాటో చిప్స్ కొనుక్కుంటా' అన్నాడు రక్షిత్ విషయ విపులీకరణ చేస్తూ.

'ఇవ్వకు పిన్నీ. వాడు ఆ చిప్స్ ఏమీ తినడు. వాడికి దాంతో వచ్చే టాజో కావాలి అంతే. టాజోస్ కలెక్ట్ చేయడం కోసమే అనవసరంగా అవి కొంటూంటాడు. డాడీ కూడా ఏమీ అనరు' అంది సుషమ ఫిర్యాదుగా.

'ఈ టాజోస్ ఏమిట్రా' అన్నాను నేను.

'చూడ్డానికి గుండ్రం సైజు చిన్న అట్ట ముక్కల్లానే వుంటాయి. కానీ వాటి మీద రకరకాల బొమ్మలు, వాటికి పాయింట్లు వుంటాయి. ఒక సిరీస్‌గా వాటిని తమ అమ్మకపు సరుకుతో ఉచితంగా ఇస్తూ పిల్లల్లో తెగ క్రేజ్‌ను సృష్టిస్తున్నారులే' అన్నాడు మా పెద్ద తమ్ముడు.

'అవున్నాన్నా. చిప్స్ ప్యాకెట్‌తో వచ్చే టాజోస్‌లో త్రీడి టాజోస్ మైఖేల్ జోర్డాన్ బొమ్మతో కూడా వచ్చింది. టెక్నో టాజో కూడావుంది తెలుసా!' అన్నాడు స్నేహిత్.

'శుభ్రంగా అటుకులు వేయించి, పప్పులూ పల్లీలు వేసి ఛుడువా చేసాను తినండి. కాలక్షేపానికి కాలక్షేపం, కడుపూ నిండుతుంది' అంది మా ఆవిడ.

'ఛీ! థ్యాంక్స్' అన్నారు కోరస్‌గా పిల్ల గ్యాంగ్.

'ఈ ఉచితాల పేరున పిల్లల్ని ఆకర్షించి పెద్దల బడ్జెట్‌కు లోటు ఏర్పరుస్తున్నారు వ్యాపారస్తులు. అవసరం వున్నా లేకపోయినా కొనమని పిల్లల పేచీ' అంది పెద్దమరదలు.

'అవసరం ఎందుకు లేదు. మమ్మల్ని మాల్టోవాలు,బోర్నవిటాలు, కాంప్లాన్‌లు తాగమని మీరే అంటున్నారు కదా. ఆ కాంప్లాన్‌తోనే ఓ మగ్, బోర్నవిటాతో జార్, కప్, మాల్టోవాతో బ్యాడ్‌మింటన్ రాకెట్, కాలిక్యులేటర్ ఫ్రీగా ఇస్తూంటే కొనుక్కుంటే తప్పేంటి' అంది సుషమ వాళ్లమ్మని అడ్డుకుంటూ.

'ఏయ్ సుషమా! 'మిలో'తో డిక్షనరీ ఫ్రీ తెలుసా' అంది చెల్లెలు కూతురు ప్రియాంక.

'పెప్సీతో క్రికెట్ కార్డు ఫ్రీ' అన్నాడు ప్రీతమ్.

'తెలుసు. సెంటర్‌ఫ్రెష్ తో గోల్డ్‌కార్డు, అంకుల్‌చిప్స్‌తో హాల్‌మార్క్ పోస్టర్లు ఉచితం. 'కోక్'తో నయితే షార్జాకు ఫ్రీ టికెట్ సంపాయించొచ్చు. 'థంప్సప్'తో ఉడ్‌లాండ్ షూస్ ఫ్రీ' అని ఏకరవు పెట్టాడు చైతన్య.

'బిగ్‌బబుల్ బబుల్గంతో కూడా మెరిసే బొమ్మ, పెప్సీతో టట్టూస్ వస్తాయి తెలుసా!' అంది సాధన. సాధన యూ.కే.జీ. చదువుతోంది.

'టట్టూస్' ఏమిటే అడిగాను నేను.

'చేతిమీద వేసుకుంటారు బొమ్మలు. కలర్స్‌లో వుంటాయి. టట్టూస్. ఇగో చూడు... కావలిస్తే... రచన చెయ్యి మీద,' అంటూ సాధన వాళ్ల అక్క రచన చెయ్యి చూపించింది. దాని నోట్లో బబుల్‌గమ్ లేదు గానీ చేతి మీద టట్టూస్ వున్నాయి రెండు.

"ఈ పిల్ల గ్యాంగ్ పరిజ్ఞానానికి ఆశ్చర్యం వేస్తోంది. మన చిన్నప్పుడు ఇలా లేం కదా. పీచు మిఠాయి, జీళ్లు, పప్పు బెల్లాలు ఇదీ వరస. అప్పట్లో చాక్లెట్ అంటేనే ధనవంతుల పిల్లల సరుకు" అన్నాడు అన్నయ్య.

టాజోస్ కారణంగానే రక్షిత్‌కు ఐజక్ న్యూటన్ గురించీ, యూరీగెగరిన్ గురించీ, లూయి పాశ్చర్ గురించీ, మదర్ థెరిస్సా గురించి కూడా ఇప్పుడే తెలుసు. వాళ్లకు జ్ఞానం కలుగుతోందని సంతోషించాలో, అనవసరపు తిండి సరుకు కొనాల్సి వస్తోందని విచారించాలో తెలీడంలేదు' అన్నాడు మా పెద్ద తమ్ముడు.

'సెంటర్ ఫ్రెష్‌తో డబ్ల్యు. డబ్ల్యు.ఎఫ్ కార్డులు, షిడో డిడో స్టిక్కర్లు, డైనోసార్ టట్టూలు మునుపు ఇచ్చేవాడా! ఇప్పుడు గోల్డ్‌కార్డ్స్ అంటున్నాడు. పెప్సికో వాళ్ల హెడ్‌క్వార్టర్స్ గుర్‌గాంవ్‌లో టాజోస్ సెంటర్ పెట్టారట. అక్కడ మనకు కావల్సిన

టాజోస్ నేరుగా కొనేసుకోవచ్చుట. ఆస్ట్రేలియా, మెక్సికో, థాయ్‌లాండ్స్ పిల్లలు కూడా టాజోస్ బాగా కలెక్టు చేస్తున్నారట' అన్నాడు స్నేహిత్ లావణ్యతో.

'డాడీ డాడీ! సమ్మర్‌లో గుర్‌గాంవ్ వెడదాం డాడీ' అంటూ అది విని గునుస్తున్నాడు రక్షిత్. 'ఛప్! ఊర్కో' అనివాళ్ల డాడీ ఓ గదుము గదిమాడు.

'ఏం పిల్లలో నర్రా! వీళ్ల బొమ్మలు, వీళ్ల పుస్తకాలు, వీళ్ల బట్టలు, వీళ్ళ సరదాలు.. అవి తీర్చడానికే.. సగం జీతాలు హుష్‌కాకీ అయిపోతున్నాయి. కాదంటే అలకలు, పంతాలు. ఇద్దరూ ఉద్యోగాలకు పోయి వీళ్లతో గడపలేక పోతున్నాం కదా, వాళ్ల చిన్న చిన్న సరదాలు కాదనడం దేనికిలే అనిపిస్తుంది. కుర్రపిల్ల సాధన సైతం లూనీట్యూన్ జింగిల్స్ క్యాసెట్‌తోపాటూ లేచి, మిక్కీమౌస్‌మగ్‌లో డొనాల్డ్‌డక్‌బొమ్మవున్న స్ట్రాతో పాలు తాగి, బగ్స్ బన్నీ స్కూల్ బ్యాగ్‌తో కాన్వెంట్‌కి వెడతానంటుంది. రాత్రి పక్కలోకి టెడ్డీబేర్ బొమ్ముండాలి. అమెరికన్ పిల్లల్లా తయారవుతున్నారు. రక్షిత్‌గాడి మీద కార్టూన్ నెట్‌వర్క్ ప్రభావం వుందంటే అలాంటి పిల్లలు ఇవాళ లక్షల్లో వున్నారు. తమ ప్రకటనలు మిగతా ఛానెల్స్ కంటే కార్టూన్ నెట్‌వర్క్‌లో ఇచ్చేందుకు 52 మంది వ్యాపారవేత్తలు క్యూలోవున్నారట. ప్రకటనల ప్రభావం పిల్లల మీదా, పిల్లల ప్రభావం పెద్దల మీదా, టోటల్‌గా ఈ ప్రభావంతో కన్స్యూమరిజం పెరిగి ఆ ప్రభావం మన కుటుంబ బడ్జెట్‌ల మీద ఎక్కువవుతోంది. ఆశలు కోర్కెలు అనంతం. ఆదాయపు అవకాశాలు మాత్రం అంతంత మాత్రం. అందివదినో పెద్ద నిట్టూర్పు విడుస్తూ.

రైల్వే బడ్జెట్‌లో సరుకు రవాణా చార్జీలు నాలుగు శాతం పెరిగాయి. పరోక్షంగా ఆ ప్రభావం మరి నిత్యావసర సరుకుల మీద పడుతుంది. అదీ కాక- అసలు బడ్జెట్ సాధారణ పౌరుల పక్షమేనంటూనే - కనబడేవి కొన్ని నేరుగా కనిపిస్తుండగా, కనబడనిపరోక్ష వడ్డింపులతో నడ్డి విరిగే భారాలు సామాన్యులు భరించక తప్పదనుకో. పైకి 'పిల్ల' కబుర్ల సరదాలుగా కనిపించేవే 'పెద్ద'లకు భారాలుగా పరిణమించగలవనడంలో సందేహం ఏముంది? అన్నాడు పెద్ద తమ్ముడు వదినకు వంతగా. నా వెన్ను నొప్పి మళ్ళీ సలిపింది విన్న మాత్రానికే.

*సోమవారం, 1 మార్చి 1999*

# మహిళా! నీకు వందనం

"ఇవాళ వంటింటికి లాకౌట్ ప్రకటిస్తున్నా" అన్నాను మా ఆవిడతో సంతోషిస్తుంది కదా అని. నెలకొకసారయినా ఏ హోటల్‌కో పోయి భోజనం చేయడంకన్నా మిడిల్ క్లాస్‌కి మహా సరదా ఏముంటుంది కనుక.

"మీరెవరు వంటింటికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోడానికి? మరీ ముఖ్యంగా అది నా సామ్రాజ్యం. మీరేం దానికి యజమానులు కారు. నేను దయదలిస్తేనే మీకు ప్రవేశం. అందులో మీకు ఆవగింజంత భాగస్వామ్యం కూడా లేదు. మీరు 'వంట వచ్చిన మొగుడు' అయ్యుంటే ఆ అవకాశం దక్కేది. కాఫీ కూడా కలుపుకోవడం రాని ముఖానికి వంటిల్లు గురించి మాటాడే హక్కులేదు" అంది మా ఆవిడ. 'ఓర్నాయనో! కాశ్మీరు భూభాగంలో ఆవగింజంతయినా వదిలేది లేదని వాజ్‌పాయ్ గారి బస్సు ప్రయాణం రివర్స్‌గేర్‌లో పడినట్లు, మంచికిపోయినా (ఈ భీష్మించుకోడాలతో) సుహృద్భావ వాతావరణం నెలకొనేలా దోహదపడటం లేదేమిరా!' అని కించిత్ విచారించాను. నా ప్రపోజల్ మరీ ఇలా ఎదురు తిరుగుతుందనుకోలేదు.

"అది కాదోయ్! ఇవాళ్టికి సరదాగా బయట భోంచేసేద్దాం. ఇల్లాలుకు ఓ పూటయినా వంటపని తప్పించడం మగాడి కనీస బాధ్యత కాదంటావా" అన్నాను.

"మీరు బాధ్యతలు తెలిసిన మనిషే అయితే బానే వుండును. ఇంటిదాని చాకిరీలో స్వచ్ఛందంగా పాలుపంచుకునే నైజం మొగుడికి ఉండాలి. ఉద్యోగస్తురాలైన భార్య అయినా కాకపోయినా, ఇంటి పనుల్లో సహకరించడం భర్తకు నైజంగా ఉండాలి. మీకు వంట రాకపోవచ్చు. కానీ వంటలో సాయం చేయచ్చు. కూరలు తరగచ్చు. గ్రైండర్ వేయొచ్చు. బట్టలు ఉతక్కపోయినా కనీసం నానబెట్టచ్చు. గదుల్లో బూజులు దులిపి ఇల్లు ఊడ్వచ్చు. ఇవన్నీ చెబితేచేయడం, మెహర్బానీ పోజు పెట్టడం కాదు. స్వతహాగా అలా చేయాలన్న ధ్యాస, కాంక్ష ఉండాలి. గంటలకొలదీ మేం వంటిళ్ళలో మ్రగ్గుతూంటే మీరు పేపర్ ముందేసుకునో, టీవీల ముందో కాలక్షేపం చేయడం కాదు. పేపర్ మాకూ చదవాలని వుంటుంది. టీవీ మాకూ చూడాలని వుంటుంది. ఇంటి పనుల్లో రెక్కలు ముక్కలవుతూంటే ఎలా కుదురుతుంది. బాబిగాడి స్కూల్‌యూనీఫాం ఇస్త్రీ చేయడం కూడా మీరు పట్టించుకోకపోతే ఎలా? 'ఇవాళ వంట వండకు. బయట హోటల్లో తినేద్దాం' అని బడాయిపోతే ఎగిరి గంతేసి చంకలు గుద్దుకుంటూ మీ వెనకాలే పడి వస్తాననుకోకండి" అంటూ క్లాస్ తీసింది శ్రీమతి. అందులో బడ్జెట్ అంకెల్లా కాకుండా

'అసలు విషయాల' విశ్లేషణ వుంది కాబట్టి నేను కిమ్మనలేదు. నా చేతగానితనం కొంతా, బద్ధకం కొంతా, 'తీరా చేయబోయి అపసవ్యంగా చేసి పని రెట్టింపు చేయడమెందుకులే తనకు' అని చెప్పి కొంతా - నిజం చెప్పద్దూ! నేను నా హక్కుల గురించి తపించేంతగా, బాధ్యతల గురించి విచక్షణాయుతంగా ఉండడం లేదనాల్సిందే మరి. ఎప్పటికప్పుడు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూనే మమతకొద్దీ జయలలితంగా కొమ్ముకాస్తున్న భాగస్వామ్య పక్షాల చంద్రహాసం లాగానే చిన్న నవ్వొకటివిసిరింది మా ఆవిడ.

"రాత్రి ఫణిగాడు ఏదో మీటింగూ, పార్టీ అని భోం చేయలేదా ఇంట్లో. స్నేహిత్ వాళ్ల ఫ్రెండు బర్త్‌డే విందుకని వెళ్లి వాడూ భోంచేయలేదు. మీరేమో సాయంత్రం హెవీ టిఫిన్ పడిందని చెప్పి మజ్జిగ అన్నం తినేసి ఊరుకున్నారు. రాత్రి వండిన కూరా, పెట్టిన సాంబారూ ఫ్రిజ్‌లో అలానే వున్నాయి. అన్నం కూడా బోలెడు మిగిలింది. పనిమనిషి పుష్పకిస్తే అది అన్నం డస్ట్‌బిన్‌లో పారేస్తుందే కానీ పట్టికెళ్లదు. అంతంత అన్నాలు వేస్ట్ చేసుకుంటామా ఏమిటి? అందుకే శుభ్రంగా పులిహోర చేస్తాను. పొద్దున్న పాలు ఎక్కువ పోయించుకున్నాను. పరమాన్నం చేస్తాను. శుభ్రంగా ఇంట్లో తిందాం. ఏ హోటల్‌కో పోయి డబ్బులు తగలేసే బదులు... అంతగా అయితే ఆ డబ్బులేవో నాకే ఇవ్వండి. పిండి తడిపి పెట్టాను. రొట్టెలూ చేస్తాను. టమాటాలున్నాయి. రైతా చేస్తాను" అంది మా ఆవిడ. మళ్లీ తనే కొనసాగించింది. -

'అంతర్జాతీయ మహిళా దినోత్సవం అంటే ఆ ఒక్క రోజూ స్త్రీలను గుర్తించి వాళ్లను సంతోషపెట్టడం కాదు. వాళ్లకో చీరో, నగో కొనిచ్చి - సినిమాకో, షికారుకో తీసుకెళితే -వాళ్ళ హక్కులను గుర్తించి తమ బాధ్యత నెరవేర్చేసినట్లనుకుంటారు కొందరు మొగాళ్ళు. స్త్రీలకు కావలసింది మగవారితో సమానంగా గౌరవం, విలువ. స్త్రీలు మగవాళ్లకు ఏ రంగంలోనూ తీసిపోరని నిరూపించుకుంటూ వున్నారు ఇవాళ. అదనంగా తమ వంట చాకిరీ, గృహ నిర్వహణ,పిల్లల పెంపకం ఏ లోటూ లేకుండా నిర్వర్తిస్తూనే వున్నారు. శారీరకంగా కూడా నిజానికి మహిళలు బలహీనులేమీ కాదు. బహిష్టులు, ప్రసవాలు మొదలయిన వాటి వల్ల తాత్కాలికంగా సంభవించే సహజ శారీరక పరిణామాలనే ఆసరా చేసుకుని, వారిని బలహీనులుగా మగవారు ఆధిపత్యం చేయాలని చూస్తున్నారంతే. పాల అమ్మకం నుండి దేశ పరిపాలన దాకా, భూమిలోవిత్తు నాటడం నుడి ఆకాశంలో విమానం నడిపే దాకా స్త్రీల వల్ల కాని పని అంటూ లేదు. స్త్రీలకి స్వేచ్ఛ ఒకరు ఇచ్చేది కాదు అది వారికీ జన్మసిద్ధ అధికారమే'' అంది.

"బ్రేవో అక్కయా బ్రేవో. చక్కటిమాటన్నావ్. 'పబ్లిక్ లైఫ్ పురుషుడి స్వభావానికి సహజం. స్త్రీ స్వభావానికి విరుద్ధం' అన్నమాట తొలగిపోతోంది నేడు. డబ్బూ, పదవీ

అనేవి - మగవాడి అధికారం నుంచి తప్పించుకున్న స్త్రీలనూ, బానిసలు చేస్తూనే వున్నాయి. అయితే నిజమైన స్వేచ్ఛతో వికసించిన స్త్రీ ముందు పురుషుడెపుడూ బానిసే" అన్నాడు ఫణి చప్పట్లు కొడుతూ.

"ఒరేయ్ నువ్వేదో కడుపులో పెట్టుకుని మాటాడుతున్నట్టున్నావ్. ఆ శషభిషలేం పనికిరావు. స్త్రీ స్వేచ్ఛ స్త్రీ స్వేచ్ఛ అని ఊరికే వెంపర్లాడుతున్నాం అనుకోకు. ఆ స్వేచ్ఛ వల్ల సుఖమూ, శాంతీ, ఆత్మవైశాల్యమూ కలగటం కోరుకునేది. అసలు - పని గంటలు తగ్గించాలని 1857లో అమెరికాలో శ్రామిక మహిళలు చేపట్టిన ఉద్యమమే స్త్రీ స్వేచ్ఛా వాదానికి, అణచివేతను ఎదుర్కోడానికి నాంది. రోజుకు 16 గంటలు పనిచేసే వెట్టిచాకిరీ నుంచి పది గంటల పనిని సాధించడమే తొలి విజయం. 1917లో రష్యాలో భుక్తి కోసం పోరాటం చేసి స్త్రీలు తమదైన ఆర్థిక స్వాతంత్ర్యం కోసం ఎలుగెత్తారు. 1927లోతమపై అణచివేత విధానాలకు నిరసనగా స్పెయిన్ దేశ మహిళలు, ఆ తర్వాత ఇటలీలోముస్సోరి నియంతృత్వ ధోరణులకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించారు. వియత్నాంలో, ఇరాన్‌లో కూడా మహిళలు తమ సమస్యలపై ఉద్యమించారు. మన దేశంలోనూ స్వాతంత్ర్యోద్యమం నుండి, సారా వ్యతిరేక ఉద్యమం వరకూ మహిళలు పాల్గొన్న ఉద్యమాలన్నీ తామూ సమాజంలో సగభాగం అనీ, వంటింటి కుందేళ్లం కాము అనీ నిరూపిస్తూసాగినవే. ఎన్ని అవమానాలు, నిందలు, నిష్టురాలు ఎదుర్కొంటూ ఈరోజు కనీసం ఈ స్థాయికి వచ్చాం! చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు ప్రవేశపెట్టడానికి సైతం ఎంత ఉద్యమించాల్సి వచ్చింది! మార్కెట్‌లో వినిమయ ప్రపంచాన్ని నిర్వహించే మహిళ తానే ఒక మార్కెట్ వస్తువు కాకూడదని ఇంకా పోరాడుతూనే వుంది. తమపై అణచివేతలకు నిరసనగా, తమ సమస్యల పరిష్కారానికి నిబ్బరంగా ఉద్యమిస్తూనే వున్నారు స్త్రీలు. స్త్రీ స్వేచ్ఛ అంటే బరితెగించడం కాదనీ, కుటుంబాల్నీ, పిల్లల్నీ సంసారాల్నీ ఉత్తపుణ్యాన వదిలేసుకుని పోవడం కాదనీ, పోవలసి వచ్చినప్పుడు లేకిగా దీనంగా పట్టుకు వ్రేలాడడమూ కాదనీ విజ్ఞురాలయిన ప్రతి స్త్రీకి తెలుసు. అంచేత అట్టే మాటాడకు. రేపు నీ పెళ్లయ్యాక చేతల్లో భార్య పట్ల ఆ గౌరవాదరాలతో కనబడు" అంది మా ఆవిడ, ఫణితో.

"శరీరానికి వ్యాయామంతో, మెదడుకి జ్ఞానంతో, హృదయానికి అనుభవంతో స్వేచ్ఛా ప్రపంచంలో వికసించే మహిళా నీకు వందనం" అన్నాను నేను తనకు షేక్ హ్యాండ్ ఇస్తూ, 'ఆడదె ఆధారం మన కథ ఆడనె ఆరంభం' అని పాడుతూ కదిలాడు ఫణి.

*సోమవారం, 8 మార్చి 1999*

# కవితారసిక ప్రహసనం!

'ఏమిటి? మీ తమ్ములుంగారు ఈ మధ్య చాలా బిజీగా కనిపిస్తున్నారు' అన్నాను మా ఆవిడతో.

"సీజన్ అండీ సీజన్. ఉగాది వస్తోంది కదా! వారం రోజులుగా సాయంత్రాలు ఏవో సభలూ - సమావేశాలూ. పొద్దున్నంతా రాతకోతలు. ఒకటే కవి సమ్మేళనాలు అనుకోండి! చదివిన కవిత చదివిన చోట చదవకుండా కొత్తదనంకోసం ఆరాటపడుతున్నాడు. మా తమ్ముడేమీ అల్లాంటిల్లాంటి కవికాడు. ఎంత పేరూ... ఎంత ఫాలోయింగూ... కానీ చూశారూ! ఎండలు అప్పుడే ముదిరిపోయాయా! అయినా పాపం శాలువాలే కప్పుతున్నారుట" అంది మా ఆవిడ.

'ఇది మరీ బావుందోయ్! లేకపోతే తడి బట్టలు కప్పి గొడుగులు మెమెంటోలుగా ఇమ్మన్నావేంటి? అది సరే గానీ! ఇన్నాళ్లుగా కవిత్వం రాస్తున్నట్టున్నాడు కదా పాపం! ఓ పుస్తక ప్రచురణో, ఓ అవార్డో అయినా వచ్చాయా మీవాడికి' అన్నాను నేను సానుభూతిగా.

'వింటున్నా బావా వింటున్నా, అడిగేదేదో సహజోక్తిగా నన్నే అడుగు. అక్కను అడ్డం పెట్టుకుని శ్లేషలు, వ్యంగ్యాలు వద్దు' అంటూ ఎంటరయ్యాడు ఫణి మా మధ్యకి.

'చూడు బామ్మరిదీ. అర్థం అయ్యేలా నేరుగా, తీరుగా మాట్లాడకూడదూ' అన్నాను నేను.

'మామూలు మాటలనే కవి అయినవాడు కవిత్వీకరించి చెబుతూంటాడు బావా! అదే మీ సామాన్యులకూ, మాన్యులైన మా కవులకూ వుండే అంతరం. ఉదాహరణకు నువ్వు కోకిలను ఏమంటావ్? కోకిలే అంటావ్. అదే నేనయితే - 'ఆకుల మాటున మాటేసిన గుండెగూటి పాడు పిట్ట' అంటాను. నువ్వు మామిడి పండును ఏమంటావ్? మామిడి పండే అంటావ్. అదే నేనయితే 'బుగ్గన సొట్టతో చిరునగువొలికే ప్రీతీజింతా' అని పోలుస్తాను. మామిడాకులను 'ద్వారానికి తారాతోరణం చేసిన శోభాపల్లవాలు' అంటాను. అన్నాడు ఫణి.

'ఒక్క ముక్క అర్థం కాలేదు. ఉన్నవాటిని ఉన్నట్లుగా ఉండనివ్వక తిక్కలా మరేమిటోగా అనడం ఎందుకు మామా! అలా అడ్డదిడ్డంగా మాటాడితే తప్ప తోచదా నీకు' అన్నాడు పుత్రరత్నం తలపట్టుకుంటూ.

'ఉరేయ్! నువ్వింకా బచ్చాగాడివి. తలలూ, గెడ్డాలు నెరిసిన పెద్ద పెద్ద వాళ్లకే ఎందరికో కవిత్వపు ఆల్కెమీ తెలీలేదు. చిరదీక్షా తపస్సమీక్షణలో తప్ప కవితాక్షరపు ఆత్మలు బయటపడవు' అన్నాడు ఫణి.

'ఆత్మలు బయటపడి తిరుగుతూంటే వాటిని దెయ్యాలంటారేమో! కొందరు కవుల్నీ చూసీ, కొన్ని కవిసమ్మేళనాలంటేనూ అందుకే భయపడి జనం పారిపోతూంటా రనుకుంటా' అన్నాడు స్నేహిత్ మళ్ళీ.

'జనం పారిపోవడమా? పిచ్చివాడా! కవిత్వాన్ని అందుకునే అర్హత కూడా అందరికీ వుండద్దూ! దానికి బోలెడు సహృదయమూ, రసహృదయమూ కావాలి' అన్నాడు ఫణి.

'మామిడి పండు రసం చాలుద్దా...'

'అట్టే మాటాడకు. రసం అంటే నిమ్మరసం, అల్లపు రసం గట్రా కాదు. 'శృంగార హాస్య కరుణా రౌద్ర వీర భయానకా బీభత్సాద్భుత శాంతశ్చ నవనాట్యే రస స్మృతాః' అన్నారు. నవరసాలు అనేవి కవిత్వంలో... ' ఫణి క్లాసు మొదలెట్టాడనేమో తెలివిగా మా ఆవిడ - 'ఉండరా తమ్ముడూ! స్టవ్ మీద టమాటా రసం మరిగిపోతోంది. చారు గిన్నె దింపేసివస్తా' అని వంటింట్లోకి జారుకోబోయింది. పుత్రరత్నం స్నేహిత్ అప్పుడే నీరసం ప్రకటించడం మొదలెట్టాడు. ఇదో హ్యూమరసం కాబోతోందని నాకు ముచ్చటేసింది.

'అక్కా అక్కడే ఆగు. స్టవ్ అమ్మ ఇందాకే కట్టేసింది. ఆ! ఇందాక ఏమిటన్నారు బావగారూ అక్కతో! నాకు అవార్డు రాలేదనీ, పుస్తక ప్రచురణ కాలేదనీ కదూ! అక్క చెప్పినట్లు - నేను అల్లాంటిల్లాంటి కవిని కాను. అవార్డులు నాకు ముఖ్యం కాదు. పాఠకజన హృదయ స్పందనల రివార్డులు ముఖ్యం. ఇవాళ ప్రతి ఛోటామోటా సంస్థా అవార్డుల తిరునాళ్ళు చేస్తోంది. పాతికాయాభై మందికి అవార్డులు ప్రకటించేసి - ఫైనాన్స్ చేసేవాళ్ళు టైంకి హ్యాండ్ ఇస్తే - శాలువాల బదులు జేబురుమాళ్ళు కప్పేసి, చేతిలోఓ చిన్న కప్పో, స్టీలు చిప్పో పెట్టి అవార్డు అనేస్తున్నారు. అలాంటివి కావాలంటే సవాలక్ష నాకు రెడీగావున్నాయి. అంతెందుకు గౌరవ డాక్టరేట్ కూడా కావాలంటే తెచ్చుకోగలను...'

'తెచ్చుకోవడమేంట్రా' అంది మా ఆవిడ.

'అదే అదే, పుచ్చుకోగలను. కానీ అట్లాంటి తుట్రు బుట్రు వ్యవహారాలు నాకు గిట్టవు. బావా! పుస్తక ప్రచురణ అన్నావ్ కదూ! ఇవాళే ఓ పబ్లిషర్ రమ్మన్నాడు. ఇవాళ అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కవిత్వం సరుకును విరివిగా

చెలామణి చేయగల ఓ బ్రహ్మాండమైన అయిడియా ఆ పబ్లిషర్‌కు ఇవ్వబోతున్నాను' అన్నాడు ఫణి. 'ఏమిట్రా అది' అంది ఆత్రంగా మా ఆవిడ.

'అదే చెబుతున్నా. ఇప్పుడు నవలలకు కూడా చెలామణీ కాలం కాదనీ, ప్రఖ్యాత రచయిత యద్దమూరి రాణీంద్రమూర్తి నవల్లు కూడాపోవడం లేదనీ పాపం ఆ పబ్లిషర్ నా ముందు వాపోయాడు. అందుకే - అతని నవల ఒకటి కొంటే నా కవితా సంకలనం ఒకటి ఫ్రీగా పాఠకుడికి అందించే గొప్ప ఆఫర్‌ను కల్పిస్తూ, ఆ సదరు పబ్లిషర్‌ను నా కవిత్వం పుస్తకం అచ్చేయమని చెప్పి పర్మిషన్ ఇవ్వబోతున్నాను'అన్నాడు ఫణి. పుత్రరత్నం స్నేహిత్ కిసుక్కున నవ్వాడు. ఫణి గుడ్లురిమి చూస్తూ -

'ఒరే అల్లుడా అర్భకా! నా సత్తా నీకు తెలీదు. ఈ ఆఫర్‌తో ఆ నవలా రచయిత నవలలూ, నా కవితా సంకలనం ప్రతులూ హాట్ కేక్స్‌లా అమ్ముడు పోతాయి చూస్తూండు' అన్నాడు.

'తూకానికేనా' అన్నాడు స్నేహిత్ 'సరియైన తూకం - సరైన కొలత కన్స్యూమర్ హక్కు, టింగ్ టింగ్' అని కూడా అన్నాడు.

'నా కవిత్వాన్ని కొలిచే తూనికరాళ్ళు విమర్శకుల దగ్గరేలేవు' అని లేని మీసం దువ్వుకుని ఫణి అన్నాడు కదా- 'ఇంతకీ కవితా సంకలన ప్రచురణలో నేను ప్రవేశపెడుతున్న కొత్తదనం ఏమిటని అడగరేం' -

'అడక్కపోయినా చెబుతావు గదా' అన్నాను నేను మెల్లిగా.

'అవును బావగారూ! మీరంటే అందుకే నాకు గౌరవం. అసలు కవితా సంకలనం మీకే అంకితం...'

'వొద్దురొరేయ్! కావాలంటే మీ అక్కకి ఇచ్చుకో. రసం బాగా చేస్తుందికదా!' అన్నాను నేను ఉలిక్కిపడి.

'బావా! అదీ పాయింటే! - ఈ సంకలనం విశిష్టత ఏమిటంటే - పూర్వం పంచపదులు, నాలుగు పాదాల లిమరిక్కులు, హైకూలు, నానీలు వంటి కవితా ప్రయోగాలతో పాఠకులు విసిగిపోయారు. నావి సరికొత్త 'పద' కవితలు.' అన్నాడు ఫణి ఫ్రెష్‌గా ఉద్యుక్తుడవుతూ.

'పద కవితలా! అన్నమయ్యా, త్యాగరాజా..' అనబోయింది మా ఆవిడ.

'నో!నో!నో! ఇది లేటెస్టు మోడరన్ ట్రెండ్. అత్యంతాధునిక కవిత్వంలో అపురూప ప్రయోగం. సాహిత్యం ఆలోచనామృతం అన్నారు. పిండిన కొద్దీ అర్థాలు, విశ్లేషించిన కొద్దీ విశేషార్థాలు వీటి ప్రత్యేకత. పేజీకి ఒకటి చొప్పున ప్రఖ్యాత ఆర్టిస్టులు ఎవరి చేతనో బొమ్మలు వేయించి మరీ పబ్లిష్ చేస్తా. ఈ కవిత్వం విశేషం ఏమంటే మొత్తం

కవిత అంతా ఒకే పదం. ముందు శీర్షిక. తర్వాత కవిత. ఉదాహరణకు కొన్ని కవితలు చిత్తగించండి. శీర్షికను కవిత చేసుకోవచ్చు. కవితను శీర్షిక చేసుకోవచ్చు. అదో నవ్యత.

| **కవితా శీర్షిక** | **కవిత** |
|---|---|
| జీవితం | గాలి |
| ఆకాశం | చిల్లు |
| వాన | చొల్లు |
| జ్వరం | అలారం |
| జన్మ | ద్వారం |
| మతం | గోడ |
| రాజకీయం | క్రీడ |
| విద్య | బంతి |
| జ్ఞానం | కన్ను |
| అజ్ఞానం | వెన్ను |
| అమ్మ | కడుపు |
| భార్య | జేబు |
| అహం | నీడ |

అంటూ ఫణి కవితా పఠన పారవశ్యంలో తలమునకలవుతూంటే - 'భేష్! ఇలాంటివి మామా! నేనూ చెబుతా - కవిత్వం: పైత్యం, కవి : ఉగాది' అంటూ స్నేహిత్ వాళ్ల అమ్మ చెవిలో మెల్లగా - 'ఉ.గా.ది.కి ఫుల్‌ఫామ్ తెలుసా మమ్మీ ఉ(ట్టి) అడ్డ)గా(డి)ది.' అంటూ ఫణి చేతికి అందకుండా పారిపోయాడు.

*సోమవారం, 15 మార్చి 1999*

# ఖేల్ ఖూద్‌కీ జంగ్‌మే

"త్రీ సిక్స్‌టీ ఫైవ్ నాటౌట్" అన్నాడు స్నేహిత్.

"ఎవర్రా? ఏ మ్యాచ్‌లో? ఎక్కడా" అని ప్రశ్నార్థక త్రయం వదిలాడు ఆశ్చర్యంగా ఫణి.

"మన ప్రధాని వాజ్‌పేయ్‌గారు మామా! కేంద్రంలో ఏడాది పాలన పూర్తి చేశారుగా! పోఖరాన్ ఓ సెంచరీ అనుకుంటే లాహోర్ బస్సు ట్రిప్పు మరో సెంచరీ" అన్నాడు స్నేహిత్. "మిగతా వాటిల్లో వైడ్ బాల్స్ ఎక్కువనుకో" అనీ అన్నాడు.

"నీ క్రికెట్ పిచ్చి తగలెయ్య! అన్ని విషయాలకీ అదే జార్గానా! అయితే బౌలర్స్ ఎవర్రా అల్లుడూ ఇంతకీ" అన్నాడు ఫణి.

"ఇక్కడ ప్రతిపక్షాలే ప్రతికక్షులు అనుకోవడం పొరపాటు. నిజానికి ఔట్ అయిపోతారేమో ప్రధాన బ్యాట్స్‌మెన్ అనిపించేలా, బంతులు విసిరింది కొందరు ముద్దబంతులే" అన్నాడు స్నేహిత్.

"ఓరి ఓరి! నీకూ కవిత్వమూ భాషా బానే అబ్బుతున్నాయిరా. పర్లే. నా సావాసంలో నీ మేధో కమలం బానేవికసిస్తోంది" అని ముచ్చటపడ్డాడు ఫణి.

"గాడిదగుడ్డు కాదూ! ఉల్లిపొరల ధాటికి కమలం రేకులు వడలిపోయిన సంగతి మర్చిపోకు మామా" అన్నాడు స్నేహిత్. చూస్తున్నాగా నిజంగానే ఈ మధ్య వాడికి భాషాపాటవం ఎక్కువయింది. తెలుగు సినిమాల్లో బాల పాత్రల ముదిపేరక్క డైలాగుల్లా, వాడి మాటలు ఒక్కోసారి అనౌచిత్యంగానూ, అసహజంగానూ అనిపించినా 'పోన్లే! ఇంగ్లీష్ మీడియం చదువుయినా చక్కని తెలుగు వంట పట్టించుకుంటున్నాడు' అని కొంత సంతోషంతో సర్దుకుపోతున్న మాటా వాస్తవమే. దూర్‌దర్శన్ నేషనల్ ఛానెల్ సీరియల్స్ పుణ్యమా అని హిందీభాషా వ్యాప్తి ఎలా జరుగుతోందో, మన తెలుగు టీవీ పుణ్యమా అని మంచి తెలుగు ఎందుకు వ్యాప్తి చెందదా? అని ఆందోళన కలిగిన మాటా వాస్తవమే. పరభాషా పదాలు, సంస్కృతి మనం తెలుగు వారం జీర్ణించుకుని వాడేంత ఉదారంగా, విశాలంగా మరే భాషవారూ వాడరనిపించడమూ వాస్తవమే. మనకు అంతగా మాతృభాషా వినియోగదీక్ష లేకపోవడమూ వాస్తవమే. నేను ఇలా ఎటో ఆలోచిస్తూంటే -

"ఒరేయ్ అల్లుడూ, రాజకీయాలనూ, క్రీడలనూ కలిపేయడం మంచిది కాదేమోరా" అన్నాడు ఫణి మళ్ళీ మా వాడితో.

"అలాఅనకు మామా! ఏడాది పాలన పూర్తయినసందర్భంగానే జాతికి దూరదర్శన్ స్పోర్ట్స్ ఛానెల్ అంకితం ఇచ్చారు. అప్పుడు ప్రధానిగారు మాటాడుతూ 'హార్ జీత్‌కా సవాల్ ఛోడ్‌కర్ ఖేల్‌తో ఖేల్‌నా హీహై. హమ్ ఖేల్‌తే రహేంగే మైదాన్‌మే' అంటూ 'జయాపజయాలకు అతీతంగా ఆట ఆడుతూనే వుండాలి. క్రీడా మైదానంలో దిగాక ఆట సాగించడమే కర్తవ్యం' అంటూ అన్యాపదేశంగా రాజకీయాలు కూడా క్రీడే అని ధ్వనింప చేసారు కదా" అన్నాడు స్నేహిత్. "ప్రమోద్ మహాజన్‌గారు కూడా స్పోర్ట్స్‌డ్రెస్ వేసుకుని మరీ వాజ్‌పాయ్‌గారికి - ఛానెల్ ఓపినింగ్‌కు - రిమోట్ అందించారు" అని టీవీ దృశ్యాన్ని విశదీకరించాడు.

"కనీసం ఆ రిమోట్ అయినా ఆయన చేతికి అందినందుకు సంతోషించి వుంటార్లే. అసలు 'ప్రభుత్వం మనుగడ' అనే రిమోట్ మటుకు ఆయన చేతిలో లేకుండా పోయింది కదా! అనుక్షణం ఎప్పుడు ఔటవుతామోననే భయంతో బరిలోవుండడం కష్టమే కదా. ఇది ఏదోఎగ్జిబిషన్ మ్యాచ్‌లా సరిపెట్టుకునేది కాదు కదా! వరల్డ్ కప్ అంత కాంపిటీషనేనాయె" అన్నాడు ఫణి.

"మామా! చూశావా చూశావా, నాది క్రికెట్ పిచ్చి అని చెప్పి నువ్వూ అదే జార్గాన్‌లో మాటాడుతున్నావ్. పర్లే. నా సావాసంలో నీ క్రీడాస్ఫూర్తి బానే పుంజుకుంటోంది" అన్నాడు నవ్వుతూ స్నేహిత్.

"స్పోర్ట్స్ అంటే కేవలం క్రికెట్ మాత్రమే నేమిట్రా! అసలు అలా అనుకోవడంవల్లనే ఒలింపిక్స్ వచ్చినప్పుడుపతకాలన్నీ వేరేదేశాలు బోలెడు ఎగరేసుకుపోతుంటే - క్రికెట్ బ్యాట్ తప్ప మరేమీ పట్టుకోక, పట్టించుకోక, గోడకు తగిలిన బంతిలా మనం వెనక్కు వస్తున్నాం. మనం అభివృద్ధి సాధించాల్సిన రంగాలు అనేకం వున్నాయి" అంది మాఆవిడ వాళ్ళిద్దరి సంభాషణా విని.

"రంగాలు అంటే వేరే. ఒక్క క్రీడారంగం గురించి మాటాడుతున్నప్పుడు అందులో అభివృద్ధి సాధించాల్సిన అనేక అంశాలు అనాలి" అన్నాను నేను సవరిస్తూ.

"ఇప్పుడు భాషమీద, వ్యాకరణం మీదా మీలెక్చరా మహానుభావా" అంది మా ఆవిడ.

"మీద అనకూడదు. గురించి అనాలి" అని సవరించాడు స్నేహిత్.

"నా మొహంలా వున్నాయి మీ సవరింపులు" అంది మా ఆవిడ.

"ఏదో నీ అభిమానం కొద్దీ అలా మెచ్చుకుంటావ్" అన్నాను నేను.

ఫణిగాడు నవ్వేస్తూ "బావా! మనం సాంకేతిక రంగంలో, అందునా ప్రింటింగ్ టెక్నాలజీలో బాగా డెవలప్ అయ్యాం అని చెప్పాలి. ముఖ్యంగా మన రాష్ట్రం.

ఎందుకంటే అయిదువందల రూపాయల నోటు అసలు దేదో కనిపెట్టడానికి బ్యాంకులు, ప్రముఖ వ్యాపార సంస్థలు స్కానింగ్ మెషీన్లవంటివి నెలకొల్పుకోవడం అవసరం అని స్వయానా ముఖ్యమంత్రిగారే సలహా ఇచ్చారు కదా. కంప్యూటర్ సహాయంతో అయిదువందల రూపాయల నోటు అద్భుతంగా ప్రింటయిపోయిన ఘనత ఈ దేశానిదే కదా'' అన్నాడు.

"ఒరేయ్ తమ్ముడూ! మొన్న కవి సమ్మేళనంలో పాల్గొన్నప్పుడు కవరులో అయిదొందలనోటు గానీ ఇచ్చారేమిట్రా నీకు'' అంది మా ఆవిడ ఆందోళనగా.

'అంత సీనేంలేదులే! శాలువా, మెమెంటోతో కవులు సంతోషపడిపోతాం. ప్రముఖ నేతలతో, తారలతో ఫోటోలు దక్కుతుంటాయి. అది చాలదూ'' అన్నాడు ఫణి.

"ఒరేయ్ తమ్ముడూ! అలాఎవరితో బడితే వారితో ఫోటోలు కూడా దిగకురా బాబూ! రేప్పొద్దున్న ఆ ఫోటోలో వున్న ఎవరో, - దొంగో, హంతకుడో, మోసగాడో అని తేలితే నీ పరువుపోయి నానా రభసా అవుతుంది. భుజాల మీద చేతులేసి అస్సలు ఫోటోలు తీయించుకోకు'' అంది మా ఆవిడ ఫణితో.

"ఇప్పుడు నేను మాధురీదీక్షిత్‌తో ఫోటో దిగినా జనం నమ్ముతారని లేదులే మమ్మీ! కంప్యూటర్ మహాత్మ్యంతో పత్రికల ముఖచిత్రాలే గోల్‌మాల్ చేసి సెన్సేషన్ సృష్టించగల రోజులివి. నిజాలు తెలియాలంటే నిజనిర్ధారణ కమిటీలో, సర్వేలో అవసరం'' అన్నాడు స్నేహిత్.

"ఎక్కడో అమాయకుడిలా వున్నావురా అల్లుడూ! సర్వే అంటే ఏమిటి? సార్ గారి వే సరిగానే వుందని ఆయన్ని సంతోషపెట్టడానికి ఒహరు చేసే భట్రాజు ప్రక్రియ. మొన్న ఉత్తరాది రాష్ట్రాల ఎన్నికల్లో ఏమయింది. ఎన్నికల ముందు చేసిన సర్వేలు బి.జె.పి.కి అనుకూలం అని చెప్పినా "బోల్తా కొట్టింది రోయ్ బుల్ బుల్ పిట్టా'' అని కొన్ని చోట్ల తేల లేదా. అఫ్‌కోర్స్! 'సర్వే జనా సుఖినోభవంతు' అని చెప్పి సర్వేల వల్లే జనం సుఖంగా వున్నారని అనిపిస్తూంటుందనుకో. ఏదో ధీమా కావాలి కదా! ఫలితాలు స్పోర్టివ్‌గా తీసుకున్నా తీసుకోక పోయినా, కనీసం ఇలాంటివయినా కొందరికి స్పోర్టివ్‌నెస్ కలిగిస్తాయంటే సంతోషం కదా! ఆ క్రీడాస్ఫూర్తిని జన వ్యాప్తం చేయడానికే స్పోర్ట్స్ ఛానల్ కనీసం దోహద పడుతుందని ఆశిద్దాం'' అన్నాడు ఫణి.

ఇంతలో స్టవ్‌మీద పాలు పొంగిపోతున్నాయని 'బుస్'మని సిగ్నేచర్ ట్యూన్ రావడంతో హాల్లోంచి వంటింట్లోకి మా ఆవిడ 'ఫోరర్' చేసింది. కాదు కాదు. పరుగుల రాణి ఉష అయింది.

*మంగళవారం, 23 మార్చి 1999*

# సమకాల జ్ఞానం

నేను ఇంట్లో అడుగు పెట్టేసరికి ఫణి ఎవరికో హితోపదేశం చేస్తున్నాడు.

'ఏ గతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరే కదా! అని చేమకూర వెంకటకవి ఏనాడో వాపోయాడు. సమకాలికుల్ని మెప్పించడం అనేది 'బస్తీమే సవాల్' లాంటిది. ఛస్తే ఒహాడు మరొహాడిని మనస్ఫూర్తిగా మెచ్చుకోడు. అవతలివాడి గొప్పతనం అనేది కూడా ఈయన మంచితనం, తన గొప్పతనం వల్లనే రాణిస్తోందని ఎవడికి వాడికి గట్టి నమ్మకం. అందుకని ఎదుటివాడిని పొగిడినా 'ఆహా! ఆయనెంత మంచి వాడండీ! అంత గొప్ప వాడైవుండీ ఎదుటివారిలోని ఏకాసింత మంచినైనా, ప్రతిభనయినా గుర్తించి ప్రశంసిస్తాడు' అని తను ప్రశంసలను అందుకోవడానికి పొగుడుతాడు. లోకంలో చాలా మందిది ఇదే తంతు. కానీ కొందరుంటారు. వారికి అవతలి వారిని చెడ్డ తిట్టడమే హాబీ. అందునాఅవతలివారు ఎంత గొప్ప వారయితే వారిని అంత గొప్పగా విమర్శించడం (అంటే కేవలం తిట్టడమనే రూఢ్యర్థం) వీరి నైజం. ఎంత ప్రముఖుడినైనా, ప్రసిద్ధుడినయినా అర్భకునిగా, బచ్చాగాడిగా వ్యాఖ్యానించడంలోనే వీరికి మహదానందం. కేవలం ఆనందం మాత్రమే కాదు అందులోనే వాళ్లదో లౌక్యం వుంటుంది. అదేంటంటే - 'ఆహా! ఆయనదండీ కలేజా అంటే. సూటిగా, నిర్భయంగా అంత గొప్పవాడిలోని దోషాల్నీ బలహీనతల్నీ కడిగి పారేస్తాడు' అని నలుగురూ తన గురించి అనుకోవాలని సదరు పెద్దమనిషి అభిలాష. తను గొప్పపని చేయకపోయినా ఓ గొప్పవాడిని చెడతిట్టి పేరు తెచ్చుకోవడం కూడా కీర్తికి దగ్గరదారి కదా!

పోతనగారికి వ్యాకరణం తెలీదు. శ్రీశ్రీది వట్టిమూస.కృష్ణశాస్త్రిది నస. అసలు గురజాడే గిరీశం.వట్టి నస్మరంతిగాళ్లేతిలక్ లాంటి కవులు. విశ్వనాధకు జ్ఞానపీఠం ఎలావచ్చిందో తెలిందెవరికి' అమాం బాపతు వ్యాఖ్యానాలు చిమ్ముతూ, వీరంగం చేస్తూ కొందరు గొప్ప విమర్శకులుగా చెలామణి అవుదామని భావిస్తుంటారు. అంటే వీళ్లు విమర్శించడానికి సమకాలం వాళ్లకన్నా, ఈసరికే సుప్రసిద్ధులైన గతకాలం వాళ్లనే ఎంచుకుంటూండే రకం అన్నమాట. కొండను లాగడానికి వెంట్రుక ముడేస్తారు. వస్తే కొండ ఊడివస్తుంది. లేకపోతే - పోయేది వెంట్రుకముక్కే కదా. అదీ వారిధైర్యం.

అయితే ఇంకొందరుంటారు. వీరు నిజంగా సమకాలం వాళ్లే. సమకాలం వాళ్ల గురించే, మరీ మాట్లాడితే ఏ రంగంలో తామున్నారో ఆ రంగంలో లబ్ధప్రతిష్ఠులైన

వారి గురించే మాటలంటుంటారు. రవిశంకర్‌కు భారతరత్న ఇవ్వడంలో ఆయనగారు 'పైరవీశంకర్'గా వ్యవహరించారని, హిందుస్తానీ సంగీతం రంగంలోని జెగ్రాజ్‌గారే అన్నారు. జెగ్రాజ్‌గారిది కడుపుమంట అనీ, లతామంగేష్కర్ మహావిద్వాంసురాలనే ఆయన టేస్ట్, ఆయన కొలమానాలు ఏమిటో చెబుతోందనీ గిరీష్‌కర్నాడ్ గారన్నారు. అసలు రవిశంకర్‌కు కూడా ఏ పద్మవిభూషణో ఇస్తే సరిపోయేదనీ, భారతరత్న ఇవ్వాల్సినంత సీనేమీ లేదనీ మరొహాయన అన్నారు. సరే. భారతరత్న దాకా ఎందుకు రాష్ట్రప్రభుత్వం చలనచిత్రాల కిచ్చే నంది అవార్డుల విషయమే వివాదాస్పదం అయింది కదా! కమిటీలోని వారు అస్మదీయులకు నందులు పంచుకున్నారని మాటొచ్చింది.

పదవి అనేదో, అవార్డు అనేదో ఒకటే వున్నప్పుడు - అందుకు అర్హులైనవారు పలువురున్నప్పుడు కేవలం ఎవరికో ఒకరికే లభిస్తుందనేది సత్యమే. కానీ ఆ లభించిన ఒకరూ పోటీలో ఏ రీతిగా లాభించారనేదే చర్చనీయాంశ మవుతుంది. ఎంపిక చేసిన వారి నిజాయితీ, నిష్పక్షపాతం ప్రశ్నింపబడే సందర్భాలుంటాయి. పని చేసిన కుల, మత, ప్రాంత వివక్షతలూ అందుకు జరిగిన లాబీయింగ్‌లూ తెర వెనక నుంచి తెలివస్తుంటాయి. ప్రతిభకు పట్టం అనేది నూటికి నూరు శాతం సాధ్యం కాదు. కనుకనే అదృష్టం అనేది దృష్టమై ఆదుకుంటూంటుంది. అంచేత ఎవడికి దక్కింది వాడు అబగా అనుభవించాలే తప్ప భేషజాలకు పోయి వదులుకోవడమూ దండగే. అలా చేస్తే అది మళ్లీ ఓ జిమ్మిక్కే అవుతుంది. దూషణ భూషణ తిరస్కారాలేవైనా ఆశీస్సులుగా తలిచే వాడికే మనుగడ. అంతరాత్మ ప్రబోధాలను, ఆత్మ న్యూనతలను సమంగా తొక్కిపట్టి నిచ్చెన ఎక్కాలి. నిచ్చెన లాగేసే వాడుంటాడని నిశితంగా గమనిస్తూ మరీ ఎక్కాలి. చేతనైతే ఆ లాగేసేవాడిని కూడా అస్మదీయునిగా కలిపేసుకునే తెలివితో - తాను ఎక్కేప్పుడు వాడే నిచ్చెన పట్టుకునేవాడిగా మలుచుకోవాలి. అదీ సామర్థ్యం అంటే. అంచేత నువ్వు మరేమీ ఆలోచించకు. చక్కగా ఒప్పేసుకుని ధైర్యంగా పుచ్చీసుకో' అంటూ ఫణి అతగాడిని గేటుదాకా సాగనంపి వచ్చాడు.

'ఎవర్రా ఫణీ! ఎవరికిరా ఫణీ! నీ లెక్చరూ, నీ హితోపదేశం' అని ఇంట్లోకి అడుగుపెట్టిన నేనూ, వంటింట్లోంచి మా ఆవిడా ఒక్కసారే అడిగాం.

'ఆయనో కవిలే బావా! ఓ సాంస్కృతిక సంస్థ వారెవరో సన్మానం చేసి బిరుదు ఇస్తామని వచ్చారుట. పాపం కొంచెం ఆత్మావలోకనం ఎక్కువేమో 'నేను ఇందుకు తగుదునా' అని నిజాయితీగా ఆలోచించి, ఏం తేల్చుకోవాలో తెలీక నా సలహాకోసం వచ్చాడు. పైగా వాళ్లతో - తనకంటే అర్హులైన వారున్నారని వాళ్లపేర్లు కూడా చెప్పాడట. తీరా చెప్పాక అనవసరంగా చెప్పానేమో అని కూడాఅనిపించలేదట' అన్నాడు ఫణి.

'లోకంలో ఇంకా ఇలాంటి అమాయకులున్నారటరా తమ్ముడూ! అవతలి వాళ్లకి అందకుండా తాము ఎగరేసుకుపోవాలని శతథా ప్రయత్నం చేసేవాళ్లేగానీ ఏమీ పట్టకుండా నిర్వికారంగా అలా ఎలా ఉండగలిగాడట' అంది మా ఆవిడ.

'అక్కా! అవినీతి అవినీతి అంటే మనం డబ్బు తీసుకోవడం, 'లంచం' గురించే ఎక్కువ ఆలోచిస్తాం. అధికార దుర్వినియోగం గురించి - ఆ తర్వాత ఎప్పుడైనా అనుకుంటాం. కానీ పైరవీలు పైకంతోనే ముడిపడి వుండవు. పొగడ్తలతో కొంతా, ఆడియేం దాసోహంతో మరికొంతా, ఆ తర్వాత చిరునైవేద్యాలతో ఇంకొంతా ముడిపడి వుంటాయి. భగవంతుడు అంతటివాడికే సహస్రనామం జపించి, గంటకొట్టి, అగరుధూపం వెలిగించి, కొబ్బరికాయ కొట్టి ప్రసాదం సమర్పించుకుంటే గానీ ప్రసన్నుడు కాడని కదా! పూజలుంటే గానీ ప్రార్ధనలు నెరవేరవు. మానవుడే మాధవుడు కనుక నేడు ఎలక్షన్‌లో టికెట్ ఇప్పించే వాడూ, రిగ్గింగ్ చేసేవాడూ, పదవి ప్రసాదించేవాడూ, బిరుదునిచ్చి సన్మానం చేసేవాడే పరమాత్ముడు. పరమాప్తుడు. అందుకే అధికారిని 'పైవాడు' అన్నది. పైవాడు అంటే భగవంతుడనే. మనం కోరినదేదీ భంగవంతం కాకుండా కాపాడువాడే అసలు భగవంతుడు' అన్నాడు ఫణి హితోపదేశాన్ని కొనసాగిస్తూ. 'కాబట్టి ఏ రంగానికా రంగంలో ఓదేవుడు వుంటాడు. వాడు తలచుకుంటే మనని పైకి తేగలడు. లేదా అణగ దొక్కేయగలడు. వాడిని పట్టుకుని దేవులాడడమే, వాడిని ప్రార్థిస్తూ పూజించి మేలు పొందడమే బతక నేర్చిన వాడి తెలివి' అని కూడా తన లౌక్య స్వభాషిత్వాన్ని ప్రవచించాడు ఫణి.

'ప్రార్థించే పెదవులు కన్నా పనిచేసే చేతులు పవిత్రమైనవి' అని విశ్వసించే రోజులు క్రమంగా గతిస్తున్నాయే అని నేను ఒక నిట్టూర్పు విడిచాను

*సోమవారం, 29 మార్చి 1999*

# కథల పెద్దాయన పెన్నుమూత

మధ్యాహ్నం లంచ్ టైంకో రాత్రి డిన్నర్ టైంకో ఎప్పుడయినా ఓ పెద్ద హోటల్‌కి వెళ్ళి చూడండి. భోజనం బల్లలన్నీ కిటకిట లాడుతుంటాయి. బయట వెయిటింగ్‌లో మనుషులు క్యూలు కట్టినట్లుంటారు. కొన్ని హోటళ్ళ వాళ్ళు వెయిటింగ్ నెంబర్ చీటి కూడా ఇస్తుంటారు. లోపల భోంచేస్తున్న వాళ్ళ వెనకాల నిలబడి కొందరు "వీడింకా పెరుగన్నం కలపలేదే. ఎప్పుడు కలుపుతాడు. ఎప్పుడుతిని లేస్తాడు. ఎప్పుడు నేను వీడి సీటు ఆక్రమించాలి" అన్నట్లు తినే వాడిని తినేసే చూపులతో చూస్తుంటారు 'తొందరగా కానీవోయ్' అన్నట్లుగా. అలా వెనకాల ఒకడు నుంచుని తొందర పడుతూంటే - తినేవాడికి తిండి తాపీగా, తృప్తిగా తినే వీలేదీ? కంచంలో ముద్ద కమనీయంగా కలుపుకుని, రుచులను ఆస్వాదిస్తూ భోజనం చేసిన తృప్తి అనుభవించే అవకాశం ఏదీ! గబగబా నాలుగు ముద్దలు నోట్లో కుక్కుకుని, అంతగా అయితే చివరి ముద్ద చేతిలో వుండగానే లేచిపోయి, వెనకాల తినడం కోసం నించున్నవాడికి భోజనంబల్ల వద్ద తన సీటు ఖాళీచేసి అప్పగించడమే మేలు అనిపిస్తుంది. ఇంకొంచెం సేపుంటే - 'ఎంతసేపు తింటావయ్యా' అని వెనకాల నుంచున్నవాడు మీదబడి కరుస్తాడేమో; ఆకలికి తననే తింటాడేమో అన్నట్లుంటుంది. అవునా కాదా?

'భలే చెప్పావ్ బావా! నూరుశాతం నిఖార్సయిన నిజం' అన్నాడు ఫణి.

'లేదు ఫణీ!ఈ సన్నివేశాన్ని నగర జీవితంలోఎందరో ప్రత్యక్షంగా చూడటమో,ఆ సన్నివేశంలో ఒకరుగా ఉండటమో జరుగుతూనే ఉంటుంది. కానీ దానికి విపరీతంగా స్పందించి బాధపడుతూ ఇదంతా అన్నదెవరో తెలుసా! రాయలసీమ కథల పెద్దాయన మధురాంతకం రాజారాంగారు" అన్నాను నేను.

"అవునా బావా ఏ కథలో...'

'ఏ కథలోనయినా దీన్ని చిత్రీకరిస్తానని 'రాబోయే శతాబ్దంలో రాగోరే కథలు' అనే విషయంపై మునిపల్లె రాజు, శ్రీపతి గార్లతో బాటుగా సెప్టెంబర్ 93లో విజయవాడలో ఓ రేడియో ప్రోగ్రాంలో మాట్లాడడం ఇంకా నాకు గుర్తుంది. మధ్యతరగతి వాడికి సమస్యలుగా మారుతున్న జనాభా సమస్య,కాలుష్యం, పర్యావరణ స్థితిగతులు, విలువల మార్పులు వీటన్నింటి గురించి 21వ శతాబ్దంలో ఇంకా ఎక్కువ ఆలోచించాల్సి ఉంటుంది అన్నారాయన'.

'ఏ రంగంలో చూసినా చెప్పే మాటలకు చేతలకు పొంతన కుదరటం లేదు. నిజాయితీ కొరవడి అవినీతిని నీతిగా భావిస్తున్నారు'. అని గత బుధవారం తిరుపతి యూనివర్శిటీలో చివరగా పాల్గొన్న సభలో కూడా ఆయన ఆవేదన చెందారు బావా! ఆయన్ను చూస్తే ఎవరికయినా అచ్చెరువే కలిగేది. ఏనాడూ సూటూ బూటూ వేయలేదు సరికదా, అచ్చమైన బడిపంతుల్లా పంచెకట్టు, భుజంపై ఉత్తరీయం తోనే తిరిగారు. విదేశాల్లో తెలుగు కథాకేతనం ఎగరేసినా, ఆయన నిరాడంబరత, నిజాయితీ - కథకులే కథలుగా చెప్పుకునే కబుర్లు' అన్నాడు ఫణి చెమర్చిన కంటితో.

'చెరువులోతామర లాగానే వ్యవస్థలో జీవించారాయన. ఎక్కడికెళ్ళినా తాను నివసించే దామల చెరువులోని తన ఇంటికి చేరుకోడానికే ఆయన ప్రాణం పరితపించేది. కథా ప్రపంచంలో 'తాను వెలిగించిన దీపాలు' ఎందరి జీవితాల్లోనో 'కమ్మ తెమ్మరలు వీచి, 'మేఘం నుండి సహజ సిద్దంగా వర్షించిన నీరులాగా తడిపి, వారిచేత 'ప్రాణదాత' అని చేతులెత్తి మొక్కించాయి. రాయలసీమ మాండలికంలో, తానెరిగిన జీవితంలోని తనచుట్టూ మనుషులే ప్రాతిపదికగా కథనం చేసి, తనలాంటి నిరలంకార నిరాడంబర వాక్యాల కథాకథనంతో కథల కాణాచిగా నిలిచి ఒక గొప్ప కథగా జీవించి కథగానే అస్తమించాడాయన.'

'అచ్చమైన తెలుగు కథకు మూర్తీభవించిన రూపం రాజారాంగారు. ఆయన రాసిన అయిదు వందలకు పైగా కథల సంగతి గొప్పతనం అలా వుంచు. ఆయన సంకలించిన 'ఒక దశాబ్ది తెలుగు కథలు' వంటి సంపుటాలు, కథా రచయితల శైలీ విశిష్టతలను వివరిస్తూ కూర్చిన సంపుటి, తెలుగు కథా చారిత్రక వైభవంతో నిలిచిపోయే గొప్ప మైలురాళ్ళు బావా' అన్నాడు ఫణి.

'ఎందరికిగుర్తుందో నాకు తెలీదు కాని ఫణీ! ఆయన మనిషికోసం, మనిషితనం కోసం, మనిషిలోని మంచితనం కోసమే తన అనేక కథల్లో దేవులాడాడు. జనాభా లెక్కల కోసం బడిపంతుళ్ళనే నియమిస్తుంటుందిట ప్రభుత్వం. అవునా! అలా నియమింపబడిన ఓ మాస్టారు - ఆ ఊరి జనాభా లెక్కలు సేకరిస్తూ, ఊరికి చివరగా ఎక్కడో అడవిలో మారుమూల బతుకుతున్న ఓ మనిషి కోసం మైళ్ళ దూరం వెతుక్కుంటూ వెళ్ళి - అతనిని చూసి మరీ నమోదు చేయడం గురించి ఓ కథ రాసారు. గుండె లోతుల్ని తడిమే అలాంటి కథలను ఎలా మరిచి పోగలం?

'చిన్న ప్రపంచం సిరివాడ' అనే మధురాంతకం వారి నవల ఆయన వ్యక్తిత్వానికి ఐడెంటిటీ కార్డు అనిపిస్తుంది బావా! 'ప్రపంచం అంతటా విస్తరించినా వేళ్ళు పుట్టిన వూళ్ళోనే వుంటాయి. వుండాలి' అని నిరూపించి, తన కథా రచనతోనూ, జీవన

విధానంతోనూ కూడా దాఖలా పరిచిన నిజాయితీ వారిది. రష్యా భాషలోకి అనువాదం పొందినా నవలకు ఆ భాషలో కూడా అదే పేరు ఉండడం ఇందుకు నిదర్శనం మరి" అన్నాడు ఫణి.

కథకులకే కథలు చెప్పిన పెద్దాయన కథగా మిగిలిపోయాడు
నీటి కరువున్న రాయలసీమలో
మధ్యతరగతి కన్నీటి బ్రతుకులను మధించి
అమూల్య కథారతనాలను ప్రకాశింపజేసిన మధురాంతకం -
అంతకంతకూ స్మరణ కొచ్చే ధన్య కథాజీవి.
జీవితాలను కథలకు అనువదించి
నింగీ- నేలలను తన కథావరణంలోనే కుదించి, దించి, ఆవిష్కరించి
మంచితనాన్నీ, మనిషితనాన్నీ
పరివ్యాప్తం చేసిన అక్షరశిల్పి.

బక్కచిక్కిన రైతు, బడిపంతులు ఆయన కథనం తోనే ప్రధానంగా ఊపిరి పోసుకుని ఊరట చెందారు. బ్రతుకు ఆరాటాలను, పోరాటాలను ఆశావహంగా కదంతొక్కించిన కథనరంగ కలం యోధుడాయన.

"కథా రచనే తన జీవితంగా బోలెడు కథలు రాస్తూ అస్తమించిన ప్రసిద్ధ కథకులది - కన్నుమూతకాదు, పెన్నుమూత అని మాత్రమే అనాలి. ఎందుకంటే ఆయన కథలతో లోకంకన్ను తెరిపిస్తూ, ఆ కథలతో, ఆ కథల్లో - ఆయనెప్పుడూ చిరంజీవే" అని స్నేహిత్ అనేసరికి, 'అవున్రా అల్లుడూ'అంటూ ఫణి సజలమైన కళ్ళతో వాడి తల మీద ముద్దుపెట్టుకున్నాడు. మధురాంతకం రాజారాం గారి మరణంతో - అవును! మూతబడింది ఆయన పెన్నే కానీ - ఆయన మనకు అమర్చిన 'కథానేత్రం' కాదు.

*మంగళవారం, 6 ఏప్రిల్ 1999*

# గొడుగుతో అడుగువేసి గొణగనీ... సణగనీ...!

"అయిదుగురు మనుషులు ఒకగొడుగు కింద నడుస్తున్నారు. ఒరేయ్ స్నేహితూ! వాళ్ళల్లో ఎవరు తడుస్తారు చెప్పు" అని ప్రశ్నించాడు మా మామయ్య.

"అసలు అయిదుగురూ ఒక గొడుగు కిందికి ఎలావచ్చారో ఆ సంగతి చెప్పు తాతయ్యా! ఆ అయిదుగురులో గొడుగును పట్టుకున్నదెవరు? ఆ గొడుగు అసలు వాళ్ళకి ఎవరిచ్చారు? వారందరూ మూక ఉమ్మడిగా కలిసి కొన్నారా? లేక ఎవరయినా ఒకరు కొంటే, మిగతావారు కొన్న వారితో ఏదయినా ఒప్పందం చేసుకున్నారా? అసలు ఆ గొడుగుని భద్రంగా పట్టుకున్న వారితో, మిగతా భాగస్వాముల వ్యవహార సరళి ఎలా వుంది? ఆ గొడుగుకి ఏదయినా చిల్లువుందా? ఉంటే ముందు నుంచీ వుందా? మధ్యలో వీళ్ళల్లో ఎవరయినా ఆ చిల్లు పొడిచారా? ఆ ఒక్క గొడుగు కిందకి చేరిన ఆ అయిదుగురి ఒడ్డూ, పొడువూ ఆకారాలు ఏమిటి? వారి మనస్తత్వాలేమిటి? ఆ అయిదుగురిలో మగవారెందరు? ఆడవారెందరు? ఆడవారయితే వారికి చోటు కల్పించిన శాతం ఎంత? అందులో అధిక్యం చూపుతున్న వారెవరు? ఇవన్నీ చెప్పకుండా ప్రశ్నను ఏకవాక్య తీర్మానంగా అడుగుతానంటే కుదర్దు" అన్నాడు స్నేహిత్ చేతులు వెనక్కి కట్టుకుని బుడుగు ఫోజులో.

"వార్నీ! వార్నీ! చూసావుటే అమ్మాయ్. మీ వాడు రాజకీయ పరిజ్ఞానంలో నన్ను మించిపోయి ఎలా దద్దరిల్ల చేస్తున్నాడో! టీవీలో పార్లమెంటు ప్రత్యక్ష ప్రసారంలో కూడా వీడిలా ఎవరూ అడగలేదు సుమా" అన్నాడు మా మామయ్య ఆశ్చర్యంతో దంగైపోతు మా ఆవిడతో.

"ఒరేయ్! తాతయ్యతో ఆ పరాచికా లేమిట్రా? అడిగిందానికి సమాధానం సూటిగా చెప్పాలి గానీ" అంది మా ఆవిడ స్నేహిత్‌తో, మా మామయ్య వాడి తీరుకు ఏమయినా నొచ్చుకున్నాడేమోనని కొంచెం కంగాళీ పడుతూ.

"భేష్‌రా అల్లుడూ! నాకు తగిన భాంజాగాడివనిపించావ్" అంటూ ఫణిగాడు స్నేహిత్ భుజం తట్టి మా మామయ్యతో "బాబాయ్ గారూ! వాడి ప్రశ్నలకు ఆన్సర్లు ఇవ్వడం ఇవాళ్టి అవసరం. విశ్వాస తీర్మానం మీద చర్చలుఎలా జరిగాయో చూసారు కదా! ఎవడికి వాడికి వాడి గొడుగు వుంది. కానీ అవతలివాడి గొడుగు కిందకి తన గొడుగు ముడుచుకుని వెళ్ళి, వాడు దంచుతూ వుంటే తను భుజాలెగరేయాలనే ఆశ కొందరిది. గొడుగు పట్టించుకోవడం సరదాగానీ, గొడుగు పట్టడం సరదా కాదు

కొందరికి. చిన్న చిన్న గొడుగులతో ఓ పెద్ద గొడుగు కిందకు చేరి, తనదే ఏకఛత్రాధిపత్యం కావాలనే ఆశ ఇంకొందరిది. తన గొడుగు కిందకి రమ్మనమని పిలిచేవారు కొందరయితే, తనకే అందరూ గొడుగు పట్టాలనీ, అందరూ గొడుగు పట్టేంత గొప్ప గొడుగు తనదేనని కొందరి ధీమా? అసలు మనుషులెందరు? గొడుగులు ఎన్ని? ఎవరిది అందరినీ దరిచేర్చుకోగల పెద్ద గొడుగు? అందరూ ఆ గొడుగును ఆశ్రయిస్తారా? సమాదరిస్తారా? అని తర్జన భర్జనలుపడి విషయం రూఢి కావడమే కదా వర్తమానం భవిష్యత్తు కావడం" అన్నాడు ఫణి.

"అబ్బాయ్ నాకు పిచ్చెక్కించకు. అయినా నేను ప్రశ్నించింది ఆ కుర్రవాడిని. మధ్యలో నీ ప్రేలాపనలు ఏమిటి?" అని జుట్టు పీక్కుంటూ గయ్యిమన్నాడు మామయ్య.

"బాబాయ్‌గారూ! మీరు బుడుగు గాడిని అడిగినా - అడిగింది గొడుగు గురించి. గొడుగు తాలూకు మనుషుల గురించి. వారి సమస్యల గురించి. వాళ్ళల్లోని హెచ్చు తగ్గుల గురించి. అంచేత గొడుగు చరిత్ర తెలిసినవాడెవడికయినా మాట్లాడడానికి, సమాధానం ఇవ్వడానికి హక్కుంది" అన్నాడు ఫణి ఓ పార్లమెంటేరియన్‌లా.

"బాబాయ్‌గారూ! మీ నల్లగొడుగు చాలా పెద్దదిగా వుంది. పాతదా? కొత్తదా?" అని అడిగింది మా ఆవిడ మామయ్య తెచ్చుకున్న గొడుగు గురించి ప్రస్తావిస్తూ.

"అమ్మాయ్!, ఇది కాంగ్రేస్ ప్రభుత్వాలంత పాతది. అయినా కొనసాగుతున్న సంప్రదాయంలో బి.జె.పి. అంత కొత్తది. నా గొడుగులో ఎంత జీవితం వుందనుకున్నావ్! నా పెళ్ళయిన కొత్తలో ఈ గొడుగునే దాపుడు సంచీచేసి మీ పిన్నికి మల్లెపూలూ, జిలేబీ తెచ్చేవాడిని. ఉమ్మడి కుటుంబాల్లో ఏకాంతాలూ, దాపరికాలు దొరకడం దుర్లభం కదా! ఇదిగో ఈ గొడుగే మా దాంపత్యానికి అనురాగపు తొడుగుఅయింది. దారిన పోతుంటే గిట్టనివాడికి మొహం చాటు చెయ్యాలన్నా, అప్పు ఇచ్చిన వాడి బారిని తప్పించుకోవాలన్నా, ఆప్తమిత్రుడి డొక్కలో సున్నితంగా, ఆప్యాయంగా పొడవాలన్నా గొడుగే సహకరించేది. నా మతిమరుపుతో గొడుగును మంచంమీద పెట్టి నేనెళ్ళి మూలన నించుంటానేమోనని మీ పిన్ని ఎకసెక్కం చేస్తూంటుంది కూడాను" అన్నాడు మామయ్య తన గొడుగు గురించిన స్మృతులతో మీసాల చాటు నుంచి నవ్వుతూ.

"సంతాప సూచకాల్లాంటి నల్లగుడ్డగొడుగులు పాతబడి ఇవాళ రంగురంగుల గొడుగు లొచ్చేసాయి. గొడుగుల తయారీలో నేటికీ తైవాన్ దేశందే ముందంజ. అమెరికాకు సైతం ఆ దేశం నుంచి గొడుగుల ఎగుమతి జరుగుతోందిట. మన దేశంలోనూ గొడుగుకు కావలసిన నైలాను బట్టా, ఇతర పరికరాలూ అక్కడ నుండే

దిగుమతి చేసుకున్నాం. మనదేశంలో చిన్న, మధ్య తరహా యూనిట్లే గొడుగుల ఉత్పత్తి చేపట్టి ఏటా 75 లక్షల గొడుగుల వరకూ తయారు చేస్తున్నాయి. దేశీయ పరిశ్రమను రక్షించడానికి గొడుగుల తయారీకి కావలసిన బట్ట, ఫ్రేములు దిగుమతి చేసుకోవడం విరమించాలనే భావన చాలాకాలం క్రితమే కలిగింది మనకు. ఒకప్పుడు గొడుగు సంపన్నులది మాత్రమే. గ్రామాల్లో మునసబులూ, కరణాలూ - అనుచరులు గొడుగు పట్టగా పొలం గట్ల వెంట నడవడం నేటికీ సినిమాల్లో సీనే" అన్నాడు ఫణి. "తమ్ముడూ! మన ప్రాచీన గ్రంథాల్లో కూడా గొడుగు ప్రస్తావన వుంది. రాజులు వారి రాజసానికి హోదాగా గొడుగులు కలిగివుండేవారు. గొడుగు పట్టించుకోవడం అంటే మహారాజ వైభోగం. ఛత్రపతి, ఏకచ్ఛత్రాధిపత్యం అనే మాటలు గొడుగువల్ల వచ్చినవే కదా!" అంది మా ఆవిడ.

"గొడుగును ఇంగ్లీషులో అంబ్రెల్లా అంటాం. అంబ్రా అన్నది లాటిన్ పదం. దానికి అర్థం నీడ. క్రీ.పూ. 12వ శతాబ్దం నుంచే చైనాలో గొడుగుల గూర్చి ప్రసక్తి వుంది. వెదురుకర్ర, ఇనుప తీగెలు, తోలు వున్న గొడుగు చైనావారే తొలుత రూపొందించారట. అయితే గొడుగును తయారుచేసి అందరికీ అందుబాటులో వుండటానికి పాటుపడింది బ్రిటన్‌లోని బిషప్‌గేటు దగ్గరుండిన 'జోన్స్ హార్వే' అనే అతనుట. జాన్‌మెక్ డోనార్డ్ అనే ఆయన ఇంగ్లాండులో ఎక్కువ ప్రాచుర్యం కల్పించాడుట. 1773లో సిల్కు గుడ్డతో ఆకర్షణీయమైన రంగుల్లో గొడుగులు రావటం, జనం వాడటం ఫ్యాషన్ అయింది. 50వ దశాబ్దంలో బ్రిటన్ నుంచి పశ్చిమ జర్మనీ, ఇటలీ దేశాలకు వెళ్ళిన గొడుగుల వ్యాపారం 70వ దశాబ్దానికి జపాన్ చేరింది. గొడుగుల పరిశ్రమకు ప్రధానంగా శ్రామికశక్తి అవసరం. అందువల్లే పారిశ్రామిక దేశాల్లో నిలవలేక పోయిన గొడుగుల ఉత్పత్తిలో, ప్రపంచంలో ఇవాళ్టికీ మొదటిస్థానం తైవాన్ దేశానిదే" అన్నాను నేను.

"అబ్బ ఎంత చరిత్ర చెప్పార్రా గొడుగు గురించి. 'ఏ ఎండకు ఆ గొడుగు' అన్నమాట రాజకీయానికి ప్రత్యామ్నాయం అయింది. గొడుగు అంటే రక్షణ, చల్లదనం. ఒంటరికి గొడుగు చేయూత, ధైర్యమే కాదు - ఆయుధం కూడాను, ఒక గొడుగుకింద జీవించడం అంటే సమైక్యతతో మనుగడ సాగించడం. ఇంతకీ స్నేహితూ! ఇప్పుడేనా చెప్పరా నా ప్రశ్నకు సమాధానం. అయిదుగురు ఒక గొడుగులో పోతున్నారు. వాళ్ళలో ఎవరు తడుస్తారు?" అని మళ్ళీ అడిగాడు మామయ్య.

"తాతయ్యా! ఎవరూ తడవరు. ఎందుకంటే అసలు వానే లేదు. ఎండాకాలం నీడకోసం ఒకే గొడుగు కిందకు చేరారు. ది ఎండ్. శుభం" అన్నాడు స్నేహితు. మామయ్య మెచ్చుకోలుగా 'శభాష్' అంటూ నవ్వాడు.

*సోమవారం, 19 ఏప్రిల్ 1999*

# స్తుతి.మా. 'లా'

"ఓహో అద్భుతం. అమోఘం. కాఫీ అంటే ఇది. దిసీజ్ కాఫీ. ఈ రుచి కాఫీదో, కలిపిన చేతిదో తెలీదుకానీ ఇలాంటి కాఫీ ఇస్తానంటే అమృతం కోసం చేసే సముద్ర మథనం వదిలేసి దేవతలూ, రాక్షసులూ పోటీపడి వస్తారు" అన్నా మా ఆవిడతో.

"నిజంగా అంతబాగుందా కాఫీ."

"తమరు చేయడమూ, అది బాగుండక పోవడమూనా. దానికి ఎన్ని గుండె లుండాలి."

"కాఫీకి వుండేది కాఫీ గుండ. గుండెకాదు. ఇంతకీ కాఫీ నేను చేశాననుకుని తెగపొగిడేసారుగానీ..." అని మా ఆవిడ అంటూండగానే "చూసావుటే అమ్మాయ్ నువ్వు కలిపావంటే అల్లుడుగారు తప్పక మెచ్చుకుంటారని చెప్పానా! ఇంతకీ ఇవాళ ఆ కాఫీ కలిపింది నేనబ్బాయ్" అంది మా అత్తగారు. నేనో క్షణం గతుక్కుమన్నమాట నిజమే కానీ - "మీరా! ... అయితే మటుకు ఏమండీ! అసలు తను కాఫీ కలపడం నేర్చుకున్నదే మీ దగ్గరకదా. కూతురుకంటే తల్లెప్పుడూ గ్రేటే. నేను ముందే అనుకున్నాను. ఇలాంటి కాఫీ మీరు తప్ప మరొకరు కలపలేరు గాక కలపలేరు' అనేసాను.

'పంచదారగానీ ఎక్కువైందా ఏమిటి నాయనా' అందావిడ.

"నిన్ను ఎవరైనా అభినందించి ప్రశంసించినప్పుడు నీవు చేసిన తప్పు ఏమిటో అడుగు. వారు నిన్ను విమర్శించినపుడు నీవు చేసిన మంచిపని ఏదో తెలుసుకో - అని ఓ సూక్తి ఉంది. నాన్న పొగిడాడు కదా అని ఉబ్బితబ్బిబ్బు కాకుండా నీ చేతిలో ఒక్కోసారి కాఫీలో పంచదారో, డికాషనో కాస్త ఎక్కువే పడుతూంటుందని గ్రహించావు. దటీజ్ గ్రేట్ అమ్మమ్మా" అన్నాడు స్నేహిత్.

"పొగడ్తకు లొంగని వాళ్ళెవర్రా. భగవంతుడంతటివాడు పొగడ్తకు ప్రత్యక్షమై భక్తులకు వరాలిచ్చేయడం పురాణకథ లెన్నింటిలో లేదూ! దండకాలు, శ్లోకాలు పొగడ్తల సాహిత్యమే కదా. రాజయోగం తర్వాత భట్రాజ యోగమే విలువైనదంటూండే వారు మీ తాతయ్య. అవతలివారి చేత పనులు చేయించుకోడానికి ప్రశంసని మించిన పనిముట్టు లేదని లౌక్యం తెలిసిన వాళ్ళెవరైనా అంగీకరిస్తారు. పొగడడం కూడా అందరికీ చేతకాదు. అదీ ఒక కళే. దానికీ ఓ క్రమం, ఓ పద్ధతీ, ఓ శైలీ ఉంటాయి. అసలు నిన్ను కూడా చిన్నప్పుడు బంగారు తండ్రీ, బాచాలకొండా అని మెచ్చుకుంటే

తప్ప గడగడా పాలు తాగేవాడివి కావు కదా! నక్క బావ కాకి బావను పొగిడి ఎలా దాని నోట్లో రొట్టె ముక్క సంపాదించిందో ఆ కథ మరీ మరీ అడిగి చెప్పించుకునే వాడివి'' అంది స్నేహిత్‌తో మా అత్తగారు. ఐమీన్ వాడి అమ్మమ్మ.

"అవునే అమ్మా! నువ్వన్నది నిజం. మనం పంజగుట్ట ఇంట్లో వున్నప్పుడు పక్కింటి లక్ష్మి వచ్చి 'మీరు నాగపూర్ నుండి తెచ్చిన కప్పు చాలా బాగుందండీ. మీ నాగపూర్ కప్పుతో నాగపూర్ కప్పుడు కాఫీ పొడుం అప్పివ్వరూ' అంటే మురిసిపోయి నువ్వు చటుక్కున ఇచ్చేసే దానివి కావూ. పొగడ్తల వైవిధ్యం అంతా చూపి కార్యసాధన చేసుకోవడం కొందరికే చెల్లు'' అంది మా ఆవిడ.

నాకు ముళ్ళపూడి పొగడ్త గురించి అన్న విషయం స్ఫురణకు వచ్చింది. అహంకార మమకారాలను ఆత్మవంచనలో రంగరించి ఉడకేసి ఆహా ఓహోలు పోపువేస్తే హుషారైన పొగడ్త తయారవుతుందట. అక్కడ నుంచి ఆయా వ్యక్తుల రుచులనుబట్టి పరనింద, పరవంచన, ద్వేషం, హేళన, ఆనందం, ఆహ్లాదం, దిగులు, అసూయ, స్పర్థ వగైరాలను వాళ్ళ ప్రకారం కలిపితే మసాలా గుమాయిస్తుంది. చెప్పిన ముడి సరుకులను బట్టి విషం అనుకోకూడదు. అదే అమృతం అని అంతా పుచ్చుకోకమానరు. ఎందుకంటే ఇచ్చేవాడి హృదయాన్నిబట్టి, పుచ్చుకునే వాడి బుద్ధినిబట్టి దీని రంగు, రుచి, ప్రభావం, ఫలితం మారతాయి. పొగడ్త అగ్నిక్షిపణి లాంటిది. పోఖ్రాన్ అణుశక్తిలాంటిది కూడాను. రాజకీయంలో స్తుతులు చేసే అనుచరగణమే అధినాయకుడి వరాలు, వివరాలు సొంతం చేసుకోగలరు. నాయకుడి సుత్తులు భరించగలవారే పొత్తులు, గుత్తులు, సొత్తులు సంపాయించగలరు. స్తుతులు-సుత్తులు పొగడ్త అనే నాణేనికి బొమ్మా బొరుసుగా అమిరిపోతాయి. నిప్పు రేణువయినా కామ్‌గానూ, గ్రేస్‌గానూ మారిపోడానికి పొగడ్తే పనిచేస్తుంది. స్తుతి - మా 'లా' అంటే 'పొగడుటయే మా న్యాయం' అనే వారుంటారు.

"పొగడ్త అనేది పన్నీరు వంటిది. వాసన చూసి వదిలేయాలేగానీ తాగుతూ కూచో కూడదు కదండీ అత్తయ్య గారూ!'' అన్నాను నేను.

"పొగడడం ఎంత గొప్పకళో పొగడ్త అందుకోవడం కూడా కళే. అందులోనూ సంస్కారం వుండాలి. ఎదుటి వాడు మనని మెచ్చుకుంటూంటే ఆ పొదురూ నేనుత్తి వెధవని అని మనం అంటే పొగిడినవాడు అవమానపడతాడు. సవినయంగా స్వీకరించి కృతజ్ఞత చూపాలి'' అందావిడ.

"మరి సన్మానసభల్లో కొందరు సన్మానితులు తనకు వస్తున్న ప్రశంసలు అస్సలు ఇష్టంలేనట్లు ఎందుకొచ్చిందిరా భగవంతుడా అన్నట్లు మహావిచారకరమైన భంగిమ పెడుతూంటారే'' అన్నాడు స్నేహిత్.

“ఆ పోదూ బడాయి. పొగిడితే ‘అబ్బే’ అనేవాళ్లు చాలా మంది ఇంకో నాలుగుసార్లు పొగిడించుకుందుకు అలా అంటారు, ఉంటారు అని షేక్స్‌పియరే అన్నాడు” అంది మా ఆవిడ.

మనలను పొగిడేవారిని మనం ఎప్పుడూ ఇష్టపడతాంగానీ మనం పొగిడే వారిని ఎప్పుడూ ఇష్టపడతామన్న గ్యారంటీ లేదుట. పొగడ్తలపట్ల అప్రమత్తంగా ఉండమని హెచ్చరించడానికే కాబోలు లోవెల్ అనే రచయిత - ‘పొగడ్తలకు సత్యానికి ఎంతో దూరం, మనిషిపోయే వరకు అవి రెండూ కలవవు. పొగడ్తలకు మురిసిపోయే వాడు వెనుతిరిగి సత్యాన్ని చూడలేడు, గుర్తించలేడు అన్నాడు. చంద్రబాబుగారు కూడా పొగడ్తలు స్వీకరించడానికి ఇష్టపడతారటగానీ, మళ్ళీ ఆ కమలచ్ఛాయలను పొగిడేందుకు ఇష్టపడరట. ‘జయప్రద జన్మభూమి, అన్నమాట వినడమే ఆయనకి అపరిమితానంద అంశం.

ఇంగ్లీష్ లిటరేచర్ స్టూడెంటేమో మా ఆవిడ మళ్ళీ కోల్టన్ అనే రచయితను కోట్ చేసింది పొగడ్త గురించి - ‘ముఖ స్తుతులతో పరస్పరం పొగుడుకొని, అభినందించుకునేవారు ఎదుటి వ్యక్తిని మోసగిస్తున్నామనే అనుకుంటారు. చివరకు ఎవరూ మోసపోరు” అన్నాడట ఆయన.

“ఆంజనేయుడంతటివారు సముద్రాన్ని లంఘించడానికి పనికి వచ్చిన దివ్య ఔషధం ‘నీ అంతటివాడు లేడ’న్న పొగడ్తే అమ్మాయ్! పొగడ్త వ్యసనమైతే ఎంతగా మనిషిని దిగలాగుతుందో, తగు మోతాదులో వుంటే మనిషికంత ఆత్మవిశ్వాసాన్ని, ఉత్సాహాన్ని కలిగించి ముందడుగు వేయిస్తుంది” అంది మా అత్తగారు.

“అసలు అన్ని శిక్షణా శిబిరాల్లోనూ కూడా స్తుతులు చేయడం - సుత్తులు భరించడం అనే ప్రయోజనకరమైన విద్య గరపడానికి ప్రత్యేక తరగతులుండాలని నా ప్రతిపాదన” అన్నాడు స్నేహిత్.

“నా మొహంలా ఉంది నీ ప్రతిపాదన” అంది మా ఆవిడ.

“ఏదో నీ అభిమానం కొద్దీ అలా మెచ్చుకుంటున్నావ్” అన్నాను నేను.

*సోమవారం, 10 మే 1999*

# అతిక్రమించిన వాస్తవాధీన రేఖలు

చెప్పానా! మళ్ళీ మా మామయ్యొచ్చాడు. రాజకీయం సందడి ఎక్కడ ఎలా జరుగుతున్నా సరే 'హైదరాబాద్ పిలుస్తోందిరా!' అంటూ దిగబడి పోతాడు. 'ఎన్టీఆర్ జయంతి', 'మహానాడు' అన్నాక మరి రాకుండా ఎలా వుండగలడు. అటుమొన్న అత్యుత్సాహంగా సభకు వెళ్ళి, అత్యంతుత్సాహంగా ఇంటికొచ్చి 'అబ్బా! అంతా పచ్చగా కనిపిస్తోందర్రా' అనేసరికి ఏ పచ్చకామెర్లో వచ్చాయేమోనని క్షణం మా ఆవిడ కంగారుకూడా పడింది కానీ, అదంతా 'సంబరం కలర్' అని గ్రహించాక నిమ్మళించింది.

మామయ్యకు - మంచో, చెడో చెప్పలేను గానీ ఓ అలవాటుంది. కుర్ర జనాభానంతా కూడవేసుకుని న్యూస్ పేపర్ గట్టిగా చదువుతాడు. నిన్న ఆదివారం కదా! ఇంక సెలవులు కూడా అయిపోయి పిల్లవాళ్లంతా మళ్ళీ జూన్‌లో స్కూళ్ళ హడావుడిలో పడిపోతారు కదా అని మా ఇంట్లో హాలిడే ఎంజాయ్ కోసం కూడారు. ఎల్.కె.జి. సాధన దగ్గర్నుంచి ఫోర్త్ క్లాసు రక్షిత్‌గాడు, టెన్త్‌కొచ్చిన ప్రీతమ్, ప్రియాంక వీళ్ళందర్నీ ముందేసుకుని మా మామయ్య పేపర్ వినిపించాలని కుతూహల పడడం ఎంత ఫార్సో చెప్పాలా! చైతన్య, లావణ్య, రచన ఎవరికెవరూ తీసిపోరుగా! స్నేహిత్ సంగతి సరే సరి. మా హాలంతా గొప్ప 'కోలాహల్'గా తయారయింది. ఇంతలోనే -

"పాకిస్తాన్ అని అను" అన్నాడు రక్షిత్ సాధనతో.

"పాకిస్తాన్" అంది సాధన.

"నీ పిలక పీకిస్తాన్" అంటూ రక్షిత్ రబ్బర్ బాండ్‌లతో పైకికట్టిన దాని రెండు పిలకల్నీ పట్టుకుని పీకాడు. అది బేర్‌మని ఏడుస్తుంది అనుకున్నాం గానీ తిరగబడి వాడి చేతిలోని రెండు విమానం బొమ్మల్నీ లాక్కుని గిరాటేసింది. వాడికి ఉక్రోషం వచ్చి దబదబా బాదాడు. దాంతో గోలగోల!

"ఒరేయ్ అసలు దానిని జడలు పట్టుకు ఎందుకు పీకావురా" అని అడిగాడు మా మామయ్య.

"తాతయ్యా మీరు చూడలేదు. అంతకు ముందు నేను కారుతో ఆడుకుంటూంటే అది నా కారుని గిల్లింది" అని ఆరోపించాడు రక్షిత్.

"కారుని గిల్లడమేమిట్రా? నిన్ను ఏమయినా గిల్లిందా?"

"నా కారుని గిల్లుతే నన్ను గిల్లినట్లు కాదా! అసలు అది నేను కారు పెట్టుకుని ఆడుకుంటున్న దగ్గరకి పరిగెత్తుకుంటూ వచ్చి నా మీద ఎందుకు పడాలి?" అని ఆరోపించాడు రక్షిత్.

"తాతయ్యగారూ వీళ్ళిద్దరిదీ ఇందాక మీరు పేపర్లో చదివిన భారత్, పాకిస్తాన్ సరిహద్దుల సంగతి లానే వుంది కదూ" అంది లావణ్య.

"మరే మరే పాకిస్తాన్ - కార్గిల్ దగ్గరేగా మొదట రెచ్చగొట్టింది" అన్నాడు చైతన్య.

"అసలు సాధనే కామ్‌గా గొడవ రేపింది. అసలు రక్షిత్ వాడిమానాన వాడు ఆడుకుంటూంటే ఎందుకు వాడిని రెచ్చగొట్టేలా చొరబడాలి" అన్నాడు ప్రీతమ్ రక్షిత్‌పై ప్రీతి చూపిస్తూ.

"అదేం కాదు. సాధన దానిమానాన అదేదో సాధన చేసుకుంటోంది. వీడే అందరి దృష్టి తనవైపుకు మళ్ళించుకోవాలని 'నీ పిలక పీకిస్తాన్' అంటూ అల్లరి చేసాడు" అంది ప్రియాంక సాధనిది తప్పేం లేదన్నట్లు.

"ఒరేయ్ పిల్లలూ! మీరే ఇండియాగా, మీరే పాకిస్తాన్‌గా మీలో మీరే విడిపోతే ఎలారా! అంతా ఓ కుటుంబంగా కలిసికట్టుగా వుండాలి తప్ప దెబ్బలాడుకో కూడదు" అన్నాడు మామయ్య హితకారిణీ సమాజం ప్రెసిడెంట్ లెవెల్లో.

"ఐక్యరాజ్య సమితి లెవెల్లో బానే చెప్పారు తాతయ్యా" అన్నాడు స్నేహిత్.

అందరూ సామరస్యం కోసం ప్రయత్నించారు. వాజ్‌పాయ్ లెవెల్లో రక్షిత్‌గాడు బస్సు పట్టుకొని వెళ్ళి సాధనకు ఇచ్చాడు. అది గూడా బోలెడు సంతోషించింది. ఓ పాకిస్తాన్ రచయిత్రి వాజ్‌పాయ్‌పై మోజు ప్రకటించి నట్లుగా సాధన తన దగ్గరి ఓ బొమ్మతో రక్షిత్‌కు ముద్దు కూడా పెట్టించింది. 'ఫ్లయింగ్ కిస్సే'లే!" అని కూడా అన్నాడు స్నేహిత్.

"తాతయ్యగారూ! భారత పాకిస్తాన్‌లు క్రికెట్‌లో ఎన్నోమార్లు తలపడ్డాయి. అదంతా ఆటే కానీ దెబ్బలాట (గురించి) కాదు కదా! క్రీడాస్ఫూర్తిగా తలపడడం వుండాలి గానీ, శత్రువైఖరి యుద్ధాలు పనికి రావు" అన్నాడు ప్రీతమ్.

"నువ్వు చెప్పడం బానే వుంది. అన్నీ అలా ఎలా తీసుకోగలం? రక్షిత్ బోర్నవిటా చిన్నమగ్‌తో తాగుతుంటే - తనకన్నా ముందే ఆ శక్తి వాడికి దొరికిందనేమో సాధన తిక్కఏదోపుట్టి ఆ మగ్‌ని కింద పడేసింది. 'అదేంటే అలా చేసావ్' అంటే - 'ఇంకో మగ్ కూడా ఇస్తే పడేస్తా" అంది పొగరుగా. 'అదేం పడేయలేదు. ఆ మగ్ చెవి బాలేదు.

నేను సరిగ్గా పట్టుకోలేకపోయా. అందుకే పడిపోయింది" అన్నాడు రక్షిత్. మరి ఇలా మగ్‌లు పడేస్తే అది కూడా స్పోర్టివ్‌గా తీసుకోవాలా మనం" అంది లావణ్యా సాధన చేసిన పనేమీ బాగోలేదని.

మా మామయ్యకు - కార్గిల్‌లో పాక్ భారత్ మిగ్‌లు కూల్చేయడం, వాస్తవాధీనరేఖ దాటి వచ్చిన చొరబాటు దారులను భారత్ తరిమికొట్టడం, ప్రజల దృష్టిని రాజకీయ అస్థిరతవైపు నుంచి మరల్చడానికి ఇదంతా బి.జె.పి. నాటకమని ఎవరో వ్యాఖ్యానాలు చేయడం - అటు చదువుతున్న వార్తలూ, ఇటు పిల్లల గోలా అన్నీ కలిసిపోయి పిచ్చెక్కినట్లయింది.

"ఒరేయ్ మీరు దూరంగా పోయి ఆడుకోండర్రా! నన్ను ప్రశాంతంగా పేపర్ చదువుకోనీయండి" అన్నాడు విసిగిపోయి.

"పేపర్ చదివి వినిపిస్తానని పిలిచింది మీరే కదా తాతయ్యా మేం ఆడుకుంటూంటే మీరే డిస్టర్బ్ చేసారు" అన్నారు రక్షిత్, సాధన కోరస్‌గా.

"అయితే తాతయ్యా! వాస్తవాధీన రేఖను అసలు దాటి వచ్చింది మీరేనన్నమాట. పిల్లలు ఆడుకుంటున్న జోన్‌లోకి చొచ్చుకు వచ్చి, వారి బుర్రల్లో మీ పేపరు రీడింగ్ ఎక్కించాలనుకున్న చొరబాటు దారులు మీరే" అన్నాడు స్నేహిత్.

మా మామయ్య ఇక లాభం లేదని "బోర్డర్ సెక్యూరిటీ" అని పేపర్లోంచి చదువుతూ లేస్తుంటే "అవును బాబాయ్‌గారూ! చీరకు బోర్డర్ చాలా ముఖ్యం. చిరుగులూ అవీ లేవు కదా అని జాగ్రత్తగా చూసి తీసుకోవాలి. మంచి బోర్డర్ వున్నప్పుడే, గట్టి బోర్డర్ వున్నప్పుడే చీర పదికాలాలపాటు మన్నుతుంది. పిన్నిగారికి మీరు తీసుకున్న చీర బోర్డర్..." అంటూ మా మరదలు ఎదురొచ్చింది ఆయనకు.

అప్పుడు మా మామయ్య ముఖమూ, ఆయన పరిస్థితీ ఎలా వున్నాయో నేను చెప్పను. యుద్ధవార్తలు రాసే జర్నలిస్టయినా చెప్పగలడో లేదో నాకు తెలీదు.

*సోమవారం, 31 మే 1999*

# జ్వర రాగ సాధ

నిన్నటిదాకా 'జ్వరం వచ్చినట్లుగా ఉంది' అని తరుచు అంటూ వుండిన స్నేహిత్ మొహం ఇవాళ పూర్తిగా తేరుకున్నట్లుగా కనబడింది. 'స్కూలు కూడా మొదలుకదా, వీడిలా అంటున్నాడేమిటా' అని వాళ్ళమ్మ బెంగపడింది కూడాను. వాడి మొహం చూసేసరికి ఇవాళ ఈవిడ మొహమూ విప్పారింది - 'అమ్మయ్య. డాక్టరు దగ్గరకెళ్లాలేమో అని కంగారుపడ్డాను. తగ్గిపోయింది లెండి' అంది వాడి టెంపరేచర్ నార్మల్‌గా ఉండటం చూసి.

"అక్కా! నేను ముందే చెప్పాను కదా! కంగారు అక్కర్లేదని. నిన్నటిదాకా వీడికొచ్చింది క్రికెట్ ఫీవర్. వరల్డ్‌కప్ ఫైనల్స్ కూడా అయిపోయాయికాబట్టి ఇప్పుడు వీడిలాగానే చాలా మంది జ్వరం నుంచి తేరుకున్నట్టేలే. ప్రతి మ్యాచ్‌కూ, ప్రతి బాల్‌కూ ఇంట్లో టీవీల ముందు కూచుని వాళ్ల ఆట సంగతి ఎలా వున్నా - ఏమవుతుందో, ఎలా అవుతుందో అనే ఉత్కంఠతో వీళ్ళు టెన్షన్ పడిపోయి, కుర్రాళ్ళేమిటి కొందరు పెద్దాళ్లు కూడా బి.పి.లు పెంచుకున్నారు. దానికి తోడు మీడియా ప్రకటనలు అగ్నికి ఆజ్యం పోసినట్లు క్రికెట్ పేరుతో మరింత ఊదరగొట్టాయి. సూపర్‌సిక్స్‌వరకూ 'కమాన్ ఇండియా' అని అరిచి అరిచి సెమీస్ దగ్గరే కామ్ అయిపోయారు చాలా మంది. కార్గిల్ సంఘటనల పుణ్యమా అని పాకిస్తాన్ గురించి ఫైనల్స్ వరకూ సహజంగానే ఉత్కంఠ పడ్డారంతా ప్రపంచవ్యాప్తంగా. ఏమైనా ఈ జ్వరం ఇంక తగ్గినట్టే" అన్నాడు ఫణి.

"నిజమే జ్వరాలు పలురకాలు. ఎప్పుడు ఏది జ్వరంగా పరిణమిస్తుందో, ఏ జ్వరం - 'జరిగితే జ్వరం అంత సుఖం లేదు' అనిపింపచేస్తుందో, ఏ జ్వరం వరంగా భాసించి ఒక సరికొత్త పరిణామస్వరం వినిపిస్తుందో చెప్పలేం" అన్నాను నేను యాథాలాపంగా. అంతే! నా మాటలు విని మా మామయ్య చింకి లెక్చర్ మొదలెట్టాడు -

'ఒరేయ్ దీన్నే జ్వరవైరాగ్యం అంటారు. రకరకాల వైరాగ్యాల్లో జ్వరవైరాగ్యం కూడా ఒకటి. బ్రతుక్కీ మృత్యువుకీ మధ్య ఒక్కోసారి జ్వరం గోడమీది పిల్లిలా ఉంటుంది. దూకేదాకా ఊగిసలాటే, మంచానికంటుకుని మనిషి - అసహాయతను, ఒంటరితనాన్ని ఇబ్బడిముబ్బడిగా ఊహించుకుని - అంతా మిథ్య అనీ, ఎవరూ తనవారు కాదనీ, ఏదీ శాశ్వతం కాదనీ ఏదో ఓ క్షణం అనుకోకుండా పోడు. జ్వరంవల్ల గొప్ప అనుభవాలు వస్తాయి కొందరికి. పలకరించేవాడూ, పట్టించుకునేవాడూ లేనప్పుడు జ్వరం మరీ

భయంకరంగా తోస్తుంది. ఓటమికన్నా దానివల్ల వచ్చే ప్రతిస్పందనలు కొందరికి జ్వరం తెప్పిస్తాయి. జ్వరం తీవ్రమైన కొద్దీ మనిషికి తెలిసినట్లవుతుంది - తానెంత ఒంటరో. దగ్గరలో మృత్యుస్పర్శ తప్ప మరే ఆత్మీయతా కూచుని వుండదు. నుదుటి మీద వర్తమానం ప్రశ్నార్థకంగా, గుండెలమీద గతం బాధలా బరువుగాతప్ప మరో చల్లటి హస్తం పడటం వుండదు. అసలు 'ఈ లోకంలోకి నువ్వొచ్చిన పనేమిటో, నీ కర్తవ్యం ఏమిటో గుర్తు చేసేందుకు మ్రోగే మానవయంత్రపు అలారం, ఓ హెచ్చరిక మ్రోత - జ్వరం 'ట'' అన్నాడు మామయ్య.

"అది నిజమే బాబాయ్‌గారూ! కానీ చూసారూ! ఓ చిన్నతరహా పెద్ద జ్వరం వచ్చి పెద్దతరహా చిన్న హాస్పటల్లో జాయిన్ అవ్వాల్సి వచ్చినా అందమైన నర్సు సేవకు తారసపడిందంటే - అసలు జ్వరం ఇంకొన్నాళ్లుంటే బాగుండుననిపిస్తుంది. జ్వరం తగ్గినా తొందరగా డిశ్చార్జి అవ్వాలని సుతరామూ వుండదు. నిజానికి అందమైన నర్సుల్లేని ధర్మాసుపత్రులు కూడా కొందరిపాలిటి వరాలే. ఎందుకంటే బయట ఎంత కష్టించినా పూటతిండి ఆర్జించుకోలేక ఆకలి, దారిద్ర్యంతో అలమటిస్తున్న కొందరికి జ్వరమే వరంగా భాసించి రెండుపూటలా రొట్టె, పాలు దొరుకుతాయనే నమ్మకంతో - ఆ 'రోగమే' మహాభాగ్యం అనిపిస్తుంది'' అన్నాడు ఫణి.

"ఒక రకం అస్వస్థత ప్రతివారికి అప్పుడప్పుడు కలుగుతూండాలని నా ఉద్దేశం. అస్వస్థత శరీరాన్ని కడిగి శుభ్రపరుస్తుంది. మనస్సుని పవిత్రం చేస్తుంది. ఉద్రేకాలని సుడిగుండంలో తిప్పి స్వప్నంలో కదులుతున్న ఉపనదిలా ప్రవహింపజేస్తుంది. కాంక్ష, కామం, మమకారం అన్నీ శిఖరం తాకిడికి విడిపోయిన నల్లమేఘాల్లాగా చీకటి హృదయాలని వికాసంతో పొడుచుకుని విడిపోయి తీయటి వర్షంగా కళ్లల్లో పడి తడితో మెరుస్తాయి. అందుకే ఒక రకం అస్వస్థత అప్పుడప్పుడు కలుగుతుండాలి' అని రచయిత బుచ్చిబాబు 'చివరకు మిగిలేది'లో రాసాడు తెలుసా!'' అంది మా ఆవిడ తన నవలాపఠన పరిజ్ఞానం ప్రకటిస్తూ.

"అమ్మాయ్! కొన్ని జ్వరాలు తాత్కాలికంగా శరీరాన్ని నీరసపరిచినా మనసును క్షాళనం చేస్తే, కొన్ని జ్వరాలు మానసిక వికాసంలో కొత్త తలుపులు తెరుస్తాయి. కొన్ని ఒంటరితనం భయంకరత్వాన్ని బోధపరిచి మనిషిని సమగ్ర సంఘజీవిగా మలిస్తే, కొన్ని ఎంతైనా బ్రతుకు ఎవడిది వాడిదే అంటూ వేదాంత భావనల్ని ప్రేరేపిస్తాయి. ఇది జ్వరాల ఫిలాసఫీ' అన్నాడు మామయ్య.

"బాబాయ్‌గారూ! రోగితోపాటు రోగిని కనిపెట్టుకుని వున్న వాళ్ళు కూడా నీరసంగా, బలహీనంగా కనబడటం సహజం. ఈ ప్రాతిపదిక మీదే సేవా లక్ష్యాన్ని చాటి

మనుషుల్ని దగ్గర చేసేందుకు జ్వరం వారధి అవుతోందేమో! సినిమాల్లో జ్వరసేవలకు మంచి ప్రాముఖ్యం వుంటుంది అంచేతే. నాయికా నాయకుల మధ్య ప్రేమానురాగాల అంకురానికీ, పటిష్టతకీ, అలాగే కుల, మత, వర్గాతీత సందేశాన్ని చాటడానికీ కొన్ని పాత్రలకు జ్వరాలు తెప్పించి, మరికొన్ని పాత్రల చేత సేవలు చేయించి జ్వర సన్నివేశాలను అమోఘంగా అల్లుతూంటారు. ఎన్టీఆర్‌గారు అస్వస్థులైనప్పుడు సేవలు చేసినందుకే లక్ష్మీపార్వతి గారి ప్రవేశంతో అసలు తెలుగునాట రాజకీయ చరిత్రే మారిపోయింది కదా" అంది మా ఆవిడ.

"జ్వరాలు వచ్చి తగ్గాక మహనీయమైన మార్పులకు లోనైన, అయ్యే మనుషులెందరో వున్నారు. అంత వరకూ వున్నట్లు కాక కొత్త లోకాలను, మానసిక వికాసాలను జ్వరం నుండి ఆవిష్కరించుకున్న రచయితలూ, కవులూ, మేధావులూ వున్నారు. అభ్యుదయ కవితా ప్రస్థానం చేయడానికి ముందు తనకు వచ్చిన టైఫాయిడ్ జ్వరం మార్పుకు ఒక కారణంగా శ్రీశ్రీ స్వయంగా తన జీవితకథనంలో చెప్పాడు. ఆ జ్వరం తనలో ఒక కొత్త లోకాలకు తలుపు తెరిచిందన్నాడు. ఇప్పుడు మరి వరల్డ్‌కప్ ఫీవర్‌తగ్గాక దేశదేశాల క్రీడారంగాలు ఏ నేర్చుకుంటాయో చూడాలి" అన్నాడు ఫణి.

*సోమవారం, 21 జూన్ 1999*

# (ప)రేషన్ గ్యాస్!

"అక్కా! గ్రామీణ స్త్రీని వివాహం చేసుకుంటే బావుంటుందా లేక నగర స్త్రీని వివాహం చేసుకుంటే బాగుంటుందా" అని అడిగాడు ఫణి.

"ఏమిట్రోయ్ పెళ్ళి మీదకు గాలి మళ్ళిందేమిటి? శుభం. ఇంతకూ నాకు తెలియకుండా పల్లెటూరి నుంచి గానీ, పట్నం నుంచి గాని నీకొచ్చిన పెళ్ళి సంబంధం ఏమిటబ్బా! లేక ఏ అమ్మాయినయినా..." అని మా ఆవిడ అంటుండగానే...

"స్టాప్ స్టాప్ స్టాప్! నేను అడుగుతున్నది నా గురించి కాదు. ఓ ఫ్రెండ్ గురించి. నన్ను సలహా అడిగాడులే. అందుకని నిన్ను అడుగుతున్నానంతే" అన్నాడు ఫణి.

"స్త్రీ స్త్రీయే. ఆమె రూపురేఖలు, గుణగణాలు ఇవి కావాలా లేక గ్రామంలో వుండడం, నగరంలో వుండడం అనేది కావాలా? ఎవరు ఎక్కడ పెరిగినా పరిస్థితుల ప్రభావం వల్ల వ్యక్తిత్వం రూపొందుతుందనేది కొంతమేరకు నిజమే కానీ, గ్రామీణ స్త్రీ, నగర స్త్రీ అని ఏ బేసిస్ మీద క్యాటగిరీ చేస్తాడు మీ ఫ్రెండు" అంది తను.

"ఫణి మామా! మీ ఫ్రెండ్‌కి పెళ్ళయ్యాకయినా గ్యాస్ కావాలంటే గ్రామీణ స్త్రీయే బెటర్" అన్నాడు పుత్రరత్నం స్నేహిత్. "గ్యాస్ కనెక్షనూ, గ్యాస్ స్టవ్ సంపాదించడం అనేది ఒక హోదా! ఎందరో వెయిటింగ్ లిస్టులో వున్నారు. కానీ ప్రభుత్వం సబ్సిడీపై గ్రామీణ స్త్రీలకు అందునా డ్వాక్రా గ్రూపుల్లో చురుకుగా పాల్గొనే మహిళలకు జూలై నెలాఖరులోగా పదివేల కనెక్షన్లు ఇవ్వబోతోంది కదా! కాబట్టి అలా గ్యాస్ కనెక్షన్ పొందగల ఏ చురుకయిన గ్రామీణ మహిళనో చేసుకోవడం బెటర్ కదా" అన్నాడు వాడు.

మా ఆవిడ పడీపడీ నవ్వింది వాడి మాటలకు.

"ఒరేయ్ ఫణీ! మీ ఫ్రెండు ఇప్పుడు పింక్ కార్డున్న తెల్ల అమ్మాయి కన్నా, తెల్లకార్డున్న పింక్ అమ్మాయి దొరుకుతుందేమో అని వేటాడాలన్న మాట. అయినా గ్యాస్ కనెక్షన్ ఎక్కువ ముద్దు అయినప్పుడు అది తెచ్చే అమ్మాయి ఎలాంటిదయినా ముద్దే కావాలి కదా" అంది అలా నవ్వుతూనే.

ఫణికి కోపం వచ్చినట్టుంది. "మా ఫ్రెండు పెళ్ళంటే మీకంత నవ్వులాటగా వుందా?" అన్నాడు.

"ఆలూ లేదు చూలూ లేదు కొడుకు పేరు సోమలింగం' అన్నారట వెనుకటికి. మీ ఫ్రెండు ఇంకా ఏ పిల్లనయినా చూడనయినా చూడలేదు కదా. అప్పుడే పెళ్ళంటావేమిటి'' అంది మా ఆవిడ. "గ్రామీణ స్త్రీయా, నగర స్త్రీయా ఎవరు బెటరు? అని నువ్వడిగితే స్నేహిత్‌కు ఇవాళ గ్రామీణ స్త్రీకి లభించబోతున్న గ్యాస్ కనెక్షన్ వార్త గుర్తొచ్చి సలహా ఇచ్చాడు. నీకు కోపం దేనికి'' అని కూడా నిలదీసింది ఫణిని.

"అక్కా! ప్రభుత్వం అంటున్న గ్యాస్ కబురు 'గ్యాస్' కబురు కాకపోయినా, ఎలక్షన్లు దగ్గర పడుతున్న తరుణంలో ఇలాంటి జనాకర్షక పథకం వార్త లాఫింగ్ గ్యాస్ గానే అనిపిస్తుంది జనానికి. రెండు రూపాయలకు కిలో బియ్యాన్ని, అలానే చౌకగా జనతా వస్త్రాలను పంపిణీ చేస్తూ ఖజానాకు ఎన్ని ఒడుదుడుకులు వచ్చినా మద్యపాన నిషేధాన్ని ఎన్టీఆర్ చిత్తశుద్ధితో అమలు పరిస్తే ఆ తరువాత వచ్చిన నారా బాబు గారు మళ్ళీ సారా షాపులు తెరిపించి, జనాకర్షక పథకాలు పని చేయవంటూ ప్రభుత్వ బొక్కసం నిండడానికి బియ్యం ధరను కూడా పెంచక తప్పదని ప్రజలు విశ్వసించేలా చేసారు. గ్యాస్ కనెక్షన్‌కు కుటుంబానికి సుమారు వెయ్యి రూపాయలు సబ్సిడీలు భరిస్తూ ఇప్పుడు మొదటి దశగా వచ్చే నెలాఖరుకే పది లక్షల కనెక్షన్లు ఇస్తామంటున్న వారు, అందుకు బదులు సబ్సిడీపై బియ్యాన్నే ఇవ్వవచ్చు కదా! ఇప్పటికీ అర్హులయిన ఎందరో పేద కుటుంబాల వారు తెల్ల రేషన్ కార్డులు లేక సబ్సిడీ బియ్యం సదుపాయం పొందలేక పోతున్నారు. కొత్త రేషన్ కార్డులు మాత్రం ఇవ్వరుట. పైగా సంవత్సరం క్రితమే తెల్లకార్డు పొందడానికి అర్హత సంవత్సరాదాయం ఆరువేల నుంచి పదకొండువేల రూపాయలకు పెంచామన్నారు కూడాను. అయినా పింక్ కార్డులు తప్ప తెల్లకార్డుల పంపిణీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఇచ్చేది లేదని ఖచ్చితంగా వెల్లడించారు. మరి తినడానికి బియ్యం లేకుండా వండుకోడానికి గ్యాస్ కనెక్షన్ అంటే హాస్యాస్పదంగానే వుంటుంది'' అన్నాడు ఫణి.

"అవునామరి! గ్రామీణ స్త్రీకి ముందుగా ఏది ముఖ్యమో గ్రహించకుండా గ్యాస్ కనెక్షన్ల గురించి అధిక ప్రాముఖ్యం ఇవ్వడం దేనికి? నగరంలో ఉద్యోగాలు చేసుకుంటూ ఇంటిపనీ, వంటపనీ కూడా తప్పని స్త్రీలకు గ్యాస్ కనెక్షన్లు అత్యావశ్యకంగానీ, డ్వాక్రా పథకాల్లో చురుకుగా వుంటూ ఇంటి సంపాదన, కుటుంబ పోషణ చేస్తున్న స్త్రీలకు రోజూ రెండు పూటలా తినడానికి సబ్సిడీ బియ్యం ముఖ్యావసరం గానీ, బియ్యం కాకుండా గ్యాస్ కనెక్షన్ కాదు. పైగా నిజానికి ఎంతమందికి నెలనెలా కొత్త సిలిండర్‌ను సమకూర్చుకుంటూ, గ్యాస్‌స్టవ్ మెయిన్‌టెయిన్ చేసే ఆదాయం - నిరుపేద కుటుంబాల

వారికి వుంది. ఇలా అంటే గ్రామీణ స్త్రీలకు గ్యాస్ కనెక్షన్ ఇవ్వకూడదని నా ఉద్దేశం కాదు. నగర స్త్రీ పని వొత్తిడులతో పోల్చినప్పుడు గ్రామీణ స్త్రీకి గ్యాస్ కన్నా ముఖ్యావసరాలు వేరేవున్నాయి'' అంది మా ఆవిడ.

"ఆగస్టు నెల నుంచి పేపర్లలో కొత్తవార్తలు వస్తాయమ్మా - "గ్యాస్ స్టవ్ పేలి గ్రామీణ స్త్రీ మృతి'' అని. కిరోసిన్ చావులు బదులు గ్యాస్ చావులు నగరాల నుంచి గ్రామాలకు విస్తరిస్తాయన్న మాట. గ్రామీణ అత్తగారు కూడా గ్రామీణ కోడల్ని ఇప్పుడు ఖరీదయిన చావుకు గురి చేయచ్చు. గుడిసెల్లో, పాకల్లో, పెంకుటిళ్ళలో గ్యాస్ సిలిండర్లు ఇకపై గ్రామీణస్త్రీల జీవితాల్లో కొత్త పొగలు, కొత్త మంటలు, కొత్త ప్రేలుళ్లు సృష్టించగలవు'' అన్నాడు స్నేహిత్.

"ఒరేయ్ వెధవా! ఆ విధ్వంసక భావాలు ఏమిట్రా! మన విజన్ ఎప్పుడూ బాగుండాలి. మంచే జరుగుతుందని ఆశిద్దాం. నాయకుల ఉపన్యాసాల్లోనూ, ప్రగతి పథకాల ఆచరణలోనూ కనిపించడం కన్నా 'గ్యాస్' - సిలిండర్ రూపంలో వంటింట్లో వుండడమే బెటర్ కదా'' అని సర్దిచెప్పాడు ఫణి.

*సోమవారం, 28 జూన్ 1999*

# శిక్షణా (తర)గతి!

"అవును తాతాజీ! రాజకీయ శిక్షణా తరగతులు అంటుంటారు కదా! అవేమిటి? వాటిల్లో ఏం చెబుతారు?" అని ప్రశ్నించాడు స్నేహిత్ మా మామయ్యని.

"భేష్! భావిపౌరుడు వేయాల్సిన ప్రశ్న వేశావురా మనవడా! ఎన్నికల్లో నిలబడే అభ్యర్థులకు ఆయా పార్టీలవారే రాజకీయ శిక్షణా తరగతులు ఏర్పాటు చేయడం నన్నడిగితే అసలు పద్ధతి కాదు. అవతల పార్టీని దుమ్మెత్తి పోయడం ఎలాగ, ఆవేశంతో ఎగస్పార్టీ మీద కారాలు మిరియాలు నూరడం ఎలాగ, బూతులు మాట్లాడ్డం ఎలాగ, పోలింగ్ బూతులు ఆక్రమించుకుని రిగ్గింగులు చేయడం ఎలా?.... ఇలా... ఇదిగో ఇలాంటి అంశాల మీద వారి దృష్టి పోతుంది గానీ, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించకుండా న్యాయబద్ధంగా ప్రచారం చేసుకుని ప్రజల నుంచి ఓట్లను తమ సేవలతో, నిజాయితీతో రాబట్టుకోవడం అనేది వాళ్ళ పాఠ్య ప్రణాళికలో వుండదు. అసలు ఏ పార్టీ కూడా ఇప్పుడు తన అభ్యర్థులకు ఈ శిక్షణా తరగతులు ఇచ్చే పొజిషన్‌లో కూడా లేదులే" అన్నాడు మామయ్య.

"అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలరు మీరు" అని అడిగాడు ఫణి.

"వస్తున్నా అబ్బాయ్! అసలు ఏ పార్టీ వాడికయినా, ఇప్పుడు అసలు తమ పార్టీ సిద్ధాంతం ఏమిటి? ఆ సిద్ధాంతానికి అనుగుణంగా వున్న తమ సభ్యులు ఎవరు? తమ పార్టీ ఏ పార్టీతో ఎన్నికల పొత్తు పెట్టుకోవాలి అనే అంశాలు ఖచ్చితంగా తెలుసా అన్నది అనుమానమే. తమకే తెలియని అంశాలు, తమ పార్టీ అభ్యర్థులు అనుకుంటున్న వారికి బోధించడానికి అధిష్ఠానానికయినా అభీష్టం ఎక్కడిది? అసలు నన్నడిగితే రాజకీయ శిక్షణా తరగతులు పార్టీల కతీతంగా ఎన్నికల కమీషన్ చేపట్టి నిర్వహించాల్రా అబ్బాయ్! అసలు సిసలు రాజకీయ అభ్యర్థులు పార్టీల కతీతంగా ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్.ల్లాగా (శిక్షణా తరగతులూ, పొలిటికల్ కోర్సుల ద్వారా) రాగలిగినప్పుడు, ప్రజలు ఆ అభ్యర్థులు తమ నియోజకవర్గాల్లో కొంతకాలం తమతోపాటు అప్రెంటిస్‌లుగా కలిసి మెలిసి పనిచేసిన సంవిధానాన్ని బట్టి ఎన్నుకునే వీలు కలిగినప్పుడు, మనం ఎన్నికల సంస్కరణలకు పూనుకుని ప్రజాస్వామ్య పద్ధతిని పరిరక్షించుకున్నట్లవుతుంది" అన్నాడు మామయ్య.

ఫణి పడీపడీ నవ్వాడు - "బాబాయ్ గారూ! మీరేదో ప్లేటోని మించిన ఆదర్శ రాజ్య పద్ధతులు కలగంటున్నట్లున్నారు. అవసరాల మేరకు ప్లేటు ఫిరాయించే సంవిధానం మనది. డాక్టర్లను, ఇంజినీర్లను తయారు చేసినట్లు రాజకీయ నాయకులను కూడా తయారు చేయాలనడం వినడానికి బాగున్నా, వాస్తవానికి విడ్డూరంగానే వుంటుంది. రాజకీయ నాయకుడంటే ఫలానా క్వాలిఫికేషన్లుండాలి, ఫలానా ఫలానా సబ్జెక్ట్స్‌లో అభినివేశం కలిగి, ఇంత శాతం మార్కులతో పాసయ్యి వుండాలి. ఎలక్షన్ కమిషన్ నిర్వహించే పొలిటికల్ లీడర్స్ రిక్రూట్‌మెంట్ పరీక్షల్లో పాసయిన సర్టిఫికెట్ వుండాలి. ఫలానా నియోజకవర్గంలో ఇంత కాలం అప్రెంటిస్‌గా ప్రజాసేవ చేసిన అనుభవం వుండాలి అంటూ నియమాలు ఏర్పాటు చేస్తే రాజకీయాల్లోకి ఇప్పుడున్న ఒక్క పిట్టంటే ఒక్క పిట్టకూడా రాదు. ఏ క్వాలిఫికేషన్, చదువూ అక్కర్లేదు కనుకే, వయః పరిమితి అంటూ ఏదీ లేదు కనుకనే, బుర్ర బదులు బొర్రా - అంతో ఇంతో దాదాగిరి వుంటే చాలు కనుకనే, పొలాలూ, తోటలూ అమ్ముకునయినా డబ్బు పెట్టుబడి పెట్టగలిగే చొరవా, ధైర్యమూ వుంటే చాలు కనుకనే. రాజకీయాల మీద మోజు చాలా మందికి" అన్నాడు ఫణి.

"మీరు మాటాడుకుంటున్నదేమిటో నాకు ఒక్కముక్క కూడా సరిగ్గా అర్థం కావటం లేదు. రాజకీయ శిక్షణా తరగతులంటే ఇలానే వుంటాయా" అన్నాడు స్నేహిత్ ఫణివైపు కోపంగా చూస్తూ.

"ఓరేయ్ బచ్చా! తలలు నెరసిన వాళ్ళకే తలకెక్కని అంశంలో తలదూర్చకురోరేయ్! వెళ్ళు. వెళ్ళి నీ చదువేదో నువ్వు చదువుకో! పద్దెనిమిదేళ్ళు రానిదే ఓటు హక్కు కూడా లేదు. నీకు ఓటు హక్కు వచ్చేసరికయినా ఎన్నికల సంవిధానంలో సంస్కరణలేమైనా వస్తాయేమో" అన్నాడు ఫణి.

"అప్పటి సంగతేమో కానీ, ఇప్పుడే మా ఫ్రెండ్స్ కొందరిపేర్లు ఓటర్ల జాబితాలో వున్నాయట తెలుసా" అన్నాడు స్నేహిత్ ఫణిని వెక్కిరిస్తున్నట్లుగా.

"చూసావుటోయ్ ఫణీ! వీడన్నమాట అబద్ధమేమీ కాదు. మన ఓటర్ల నమోదు పద్ధతి కూడా ఎంత అపసవ్యంగా లేకపోతే ఇలా కొందరు కుర్రవెధవల పేర్లు ఓటర్ల జాబితాలో నమోదవుతాయి! ఇంటింటికీ వెళ్ళి నమోదు చేసుకోవడం, ఓటర్ల జాబితాను తనిఖీ చేయడం, సరియైన ఓటరు ఎవరూ జాబితాలోంచి తొలగిపోకుండా ఖచ్చితంగా నమోదు కావడం ముఖ్యం కాదూ! ఇవేవీ ఓ వంక సరిగ్గా వుండవు. మరో వంక ఏ వంకా లేని అభ్యర్థి అంటూ కనబడడు. పార్టీలన్నీ మటుకు "మాదే విజయం ప్రజలు

మా వంకే" అని ఊదరగొట్టేస్తూ వుంటారు. ఇంత రణగణాల ఎన్నికల ఆర్భాటమూ చివరికెలా తేలుతుందో చెప్పగలిగేదెవరు? ఏ వెలుగులకీ ప్రస్థానం అన్నది పెద్ద ప్రశ్న" అన్నాడు మామయ్య వేదాంతికంగా.

"బాబాయ్ గారూ! 'పాలిటిక్స్ ఈజ్‌ది లాస్ట్ రిసార్ట్ ఆఫ్ స్కాం(డల్స్' అన్నాడో పాశ్చాత్యుడు. కోపం వస్తే వచ్చింది గానీ - నిజంగా అంత భ్రష్టుపట్టి సమాజాన్ని భ్రష్టు పట్టిస్తున్న రంగంగా మారుతోంది. తమకోసం నేతలు చేస్తున్న మంచి ఏదయినా తమ వల్లనే చేస్తున్నారని, తాము లేనిదే తమ ఆసరా లేనిదే వారు చేయగలిగేదేమీ లేదనీ, వాళ్ళు చేస్తున్నది కూడా వాళ్ళ కర్తవ్యమే కానీ, మరింకేమీ కాదనీ, ప్రజలు గుర్తించినప్పుడు, గుర్తించి తమ శక్తి సదరు నేతలు గుర్తించేలా వర్తించినప్పుడు మార్పు సంభవ మవుతుంది" అన్నాడు ఫణి.

*సోమవారం, 16 జూలై 1999*

# ఎన్నికల (అ) తార

రాజకీయ చిత్రంలో
చిత్ర తార నటన.
షూటింగ్ రద్దయినట్లుగ
సీటింగ్ మిస్సయిన ఘటన.

సోనియాగాంధీ అంటే
సోనాలీ బింద్రేనా?
పోటీకై బరిలోకి
సినిమా నటి తగునా?

అంటూ ఫణిగాడు తన టుమ్రీలు అందుకున్నాడు.

'ఎన్నికైతలు' పేరుమీద ఎన్నికల కవితలు అర్జెంటుగా వండేసి, 'ఓటర్స్ అవేర్‌నెస్' పేరున - కనీసం మా మామయ్య దగ్గరయినా తన సత్తా నిరూపించుకోవాలని ఫణికి మా చెడ్డ బులబాటంగా వుంది. ఫక్తు రాజకీయ నాయకుడికి మల్లేనే మామయ్యకి కూడా తన ఆదర్శాలకు ఆశయాలకు అండగా ఫణిలాంటి ఓ వందిమాగధ కవి వెంట వుంటే బావుండునన్న కాంక్ష కూడా వుందేమో, ఫణిని తనవెంట తీసుకెడుతూ హోటల్స్‌లో కాఫీ టిఫిన్లు ఇప్పించి ఎంకరేజ్ చేస్తున్నాడు. కవికి కావల్సిందికూడా ఏదో పార్టీ తనచేత రాయించుకోడమే కదా! కవిత్వం కమర్షియల్ కాలేదు అని ఎవడన్నా అంటే - ఈ ఎన్నికల సీజన్‌లో మహా మహా కవిశేఖరులు పరోక్షంగానైనా ఎవరికోసం కలం పట్టి గిలుకుతున్నారో, ఎవరిచ్చే డబ్బులతో కులుకుతున్నారో, ఎన్నికల స్పీచ్‌లు, ప్రచారగీతాలు ఎవరెవరికి రాసిపెడుతున్నారో ఓ నిఘావేసి సర్వేచేయిస్తే కవుల బండారాలు కూడా బయట పడతాయి. పొద్దున్న కాంగ్రెస్ గీతం, సాయంత్రం టిడిపి పాట, మధ్యలో మధ్యాహ్నం ఏ ప్రైవేట్ ఛానెల్‌కో, ఏ బార్‌సోప్ ప్రకటనదారుడికో ఏ స్పాటో, జింగిలో రాసి పారేసి పైకి మాత్రం రహస్యోద్యమ కా(వ్య)ర్య కర్తగా చెలామణి అయిపోయే కవికిశోరాల గురించి ఫణిగాడు చెబితేనే తెలిసింది నాకు. దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోమన్నట్లు - 'దీపం' వొప్పుకోకపోతే, కనీసం ఏ కొవ్వొత్తి వెలుగులోనయినా అవకాశాలు అందిపుచ్చుకోవాల్సిందేనుట. అదీ ప్రజెంట్ ట్రెండ్!

ఫణిగాడి టుమ్రీలు స్నేహిత్ కూడా బానే ఎంజాయ్ చేస్తున్నట్టున్నాడు. "అవునుగానీ ఫణిమామా! ఈ సినిమావాళ్లు రాజకీయాల్లోకి ఇలా ధారాపాతంగా ఎందుకు పోతూ ఉన్నారీమధ్య. ఎలక్షన్ సినేరియోలో ఈ ఫిల్మీడ్రామాలు ఏమిటి? ఎందుకు? రాజకీయ అధినేతలు సైతం సోనియాగాంధీ మీద విజయశాంతినో, జయప్రదనో పోటీ పెట్టాలనుకోవడం ఏమిటి? పొలిటికల్ గ్రామర్‌కన్నా సినిమా గ్లామర్ గొప్పనుకునే దుస్థితి ఎలా సంప్రాప్తించే" అన్నాడు స్నేహిత్ వాళ్ల ఫణిమామతో అధిష్ఠానం వుండగా ఛోటా నాయకుడు నోరు విప్పడానికి కుదరనట్లుగా, ఫణిగాడిని ప్రత్యుత్తరం ఇవ్వనీయక, మామయ్యే పార్టీ స్పోక్స్‌మెన్‌లా తుట్రుబుట్రు బచ్చాగాడి ప్రశ్నలకు కూడా ప్రతిస్పందించడం ఈ సీజన్ రివాజయిపోయింది కదా! అంచేత మామయ్యే చింకిలెక్చర్ షురూ చేశాడు.

"ఓరేయ్ స్నేహితుడూ! మనవడివయినా మన'వడి' తెలుసుకునే ప్రశ్న అడిగావురా! సి అంటే సిగ్గు. నీ అంటే నీతి. మా అంటే మానం. 'సిగ్గు నీతి మానం వదిలేసినవే సినిమాలు'. అన్న నిర్వచనం ఇప్పటిదికాదు. మన దేశంలో సార్వత్రిక ఎన్నికలు మొదలు కాకముందునుంచీ ఉన్నమాటే. అయితే స్వర్ణోత్సవ భారతంలో రాజకీయాలు కూడా ఎప్పుడయితే పదవి, అధికారం, డబ్బూ, అవినీతి, హింసా, నేరం అనే వాటి సమాహారంగా మారిపోయాయో, సదరు మార్పు కారణంగా - సిగ్గు నీతి మానం వదిలేయడంలో సినిమాలని అధిగమించాయో, ఇంక వాటికీ వీటికీ అభేదం మొదలయింది. కెమెరా ముందు నటించే థ్రిల్‌కన్నా, ప్రత్యక్షంగా జనంలో, జనంతో, జనంకై నటించడంలోని థ్రిల్ అనుభవిస్తూ - తద్వారా సినిమా వ్యాపారంకన్నా రాజకీయ వ్యాపారంలో కీర్తి ప్రతిష్టలతో బాటు డబ్బూ, అధికారం, మందీ మార్బలం అనుభవించే అవకాశంవుందని గ్రహించారు. సమాజ సేవ, ప్రజా సంక్షేమంవంటి చిలకపలుకులు నేర్చుకుని, సినిమాల్లో డైలాగ్ రైటర్ వ్రాసిన సంభాషణలు వల్లించి, నిర్మాతా దర్శకులను బెల్లించి రాబట్టుకున్న అనుభవంతో రాజకీయాలు అంటే సినిమా పాట స్టెప్పులకన్నా, ఫైటింగ్ సీన్లకన్నా కష్టమేమీ కాదని అర్థమైపోయింది. అంచేత హీరో హీరోయిన్లే కాదు, కుప్పిగంతుల, కోతిచేష్టల కొందరు హాస్యనటులనే కేతిగాళ్లు కూడా లీడర్స్ అయిపోవాలని పరుగులు తీస్తున్నారు. అందుకు తగినట్లుగానే సినిమానటుల గ్లామర్ తమకు ఓటు బ్యాంకు పెంచుతుందనే భ్రమతో, ప్రతిష్టాత్మక పెద్ద చరిత్రగల పార్టీలు సైతం వాళ్లవైపు మొగ్గు చూపుతున్నాయి. ఎప్పుడయితే నిజమైన రాజకీయానుభవం, పాలనా దక్షత, నేతృత్వ ప్రతిభగల వ్యక్తులు రాజకీయ పార్టీలలో కనుమరుగై పోతూండడం మొదలయిందో, అప్పుడే జూనియర్ ఆర్టిస్టులు ప్రధాన

పాత్రలకు ఎదిగినట్లుగా - సినీ గ్లామర్ రాజకీయ గ్రామర్ కావడం మొదలైంది. ఇది పతనం కాక మరేమీ కాదు. ఎంజీఆర్‌లూ, ఎన్టీఆర్‌లూ, జయలలితలూ అందరూ కాలేరు. వారు రాజకీయాల్లోకి వచ్చిన సన్నివేశాలూ, సందర్భాలూ, సమయాలూ వేరు. వారు చూపిన రాజకీయ దక్షత వేరు. జయలలితకూడా రాజకీయంగా ఎంత దెబ్బ తిన్నదీ ఇప్పుడు ప్రత్యక్షంగా తెలుస్తున్నదే. కడపనుండి సోనియాగాంధీ పోటీ చేస్తే బిజెపి అధినేతలకుగానీ, తెలుగుదేశం అధిపతులకుగానీ విజయశాంతి, జయప్రదలు తప్ప పోటీకి నిలువగల మరో రాజకీయ దురంధరుడు స్ఫురించకపోవడమంత దౌర్భాగ్యం మరోటి లేదు. కనీసం బళ్లారిలో సుష్మాస్వరాజ్‌ని నిలపడం సముచితంగా ఉందనాలి" అన్నాడు మా మామయ్య.

"భేష్ తాతాజీ! రాజకీయం - సినిమాకొంగు పట్టుకోవడం అంత అభాసు ఇంకోటి లేదని తేల్చారు. రాజకీయ దురంధరుల, మేధావుల పతనం ఇలాంటి సిగ్గులేని తనాన్నే సమాజం తెరకెక్కిస్తోంది. లేకపోతే ఏమిటి? ఎన్నికల కమిషనర్‌గా ఎన్నికల వ్యవస్థకే కీర్తితెచ్చి, రాజకీయ పార్టీల అక్రమాల పాలిట సింహస్వప్నమైన టి.ఎన్. శేషన్ ఇవాళ కాంగ్రెస్‌లో చేరడం చూసినప్పుడూ, విలువలకూ సిద్ధాంతాలకూ కట్టుబడిన వ్యక్తిగా పేరుతెచ్చుకున్న జైపాల్‌రెడ్డిగారూ ఇవాళ అదే పని చేసినప్పుడూ, మొన్నటి పార్లమెంటు రద్దయి ఇవాళ ఎన్నికల భారం ప్రజలనెత్తిన పడడానికి హేతువయిన జయలలిత, సుబ్రహ్మణ్యస్వామిల ప్రస్తుత తీరుతెన్నులను తిలకించినప్పుడూ, కంప్యూటర్‌లో పడిపోయి పూర్‌ని మరిచి, ఇప్పుడు హఠాత్తుగా చంద్రబాబు మళ్ళీ పేదలకోసం మేనిఫెస్టో రాసానన్నప్పుడూ - రాజకీయం తెలుగు సినిమాకన్నా ఎంత అధ్వాన్నంగా, అసంబద్ధ కథగా, అనౌచిత్య సంభాషణగా, మెలోడ్రామా సన్నివేశంగా, గందరగోళపు పాటగా, జుగుప్సల స్టెప్‌గా తోస్తోందో వేరే చెప్పాలా" అన్నాడు స్నేహిత్. మామయ్యకి స్నేహిత్ పొలిటికల్ విశ్లేషణకు కళ్ళు చెమర్చాయి - "ఓరే అబ్బాయ్ ఫణీ! చూడరా! "విద్యార్థులు - రాజకీయాలు" అంటూ పెద్దలు లెక్చర్లు దంచుతారుగానీ - ఇవాళ స్కూలు కుర్రాళ్ళు కూడా నేటి రాజకీయాలను బానే గమనిస్తున్నారనడానికి స్నేహితే నిదర్శనం. ఎటొచ్చీ ఓటున్న పౌరులంతా చైతన్యం తెచ్చుకుని దేశం భవిష్యత్తును ఏం చేస్తారనేదే ఈ ఎన్నికల్లో తేలాలి" అన్నాడు మామయ్య.

"ఓటు పోటు వేస్తేనే
దారికొచ్చు బండి
ఓటు హక్కు వినియోగం
కర్తవ్యం సుమండీ" అంటూ ఫణి ఇంకో టుమ్రీ గిలికాడు.

*సోమవారం, 23 ఆగస్టు 1999*

# మొదటి విడత

"ఏడెవడండీ బాబూ! ప్రభుత్వ ఉన్నత పదవుల్లో 'తలతిరుగుడుతనం' వుండడం మంచిది అంటాడు. అందువల్ల అందరిలో కార్యనిర్వాహణా దక్షత పెరుగుతుందనీ, సమస్యలపట్ల ప్రతి వారికీ అవగాహన కలిగి ముందంజ వేయగలరనీ రాశాడు పైగాను" అన్నాడు మామయ్య తాను చదూతున్న దినపత్రికనొకదాన్ని ఫణిముందు గిరాటేసి. మామయ్య చెప్పిన ఆర్టికల్ తీసి చదివి ఫణి పడీపడీ నవ్వడం మొదలెట్టాడు. "బాబాయ్ గారూ! కొన్ని అనువాదాలు, కొందరి అనువాదకుల తీరుతెన్నులు చూస్తుంటే ఇలాంటి విపరీతాలే బయట పడతాయి. 'రొటేషన్ హెడ్‌షిప్' అన్న ఇంగ్లీషు మాటను రొటేషన్ అంటే తిరగడం, హెడ్ అంటే తల, బుర్ర అని ముక్కస్యముక్క తెలుగు చేసుకుని, ఫ్రెండ్‌షిప్ లాగా హెడ్‌షిప్ అన్నదానికి ఓ 'తనాన్ని' ఆపాదించి, ఈ అనువాద మహానుభావుడు 'రొటేషన్ హెడ్‌షిప్'కు 'తలతిరుగుడు తనం' అని రాశాడు. అంతకన్నా చిత్రం చూసారా! ఈ వ్యాసంలో మధ్యలో గోవిందయ్య ఎవరో ఊడిపడ్డాడు. ఈ గోవిందయ్య ఎవరో మీకు అర్థమైందా? Govt. of India అని వున్నదాంట్లో 'ఆఫ్' ఎగిరిపోయి ఇంగ్లీషులో T అని వున్నదాన్ని సైలెంట్ అనుకుని మొత్తానికి గోవిందయ్య అని చేసాడు ఈ అనువాదకుడు. ఇంతకన్నా భయంకరం ఇంకోటుంటుందా" అన్నాడు ఫణి.

అతిశయోక్తి ఏం కాదు. అచ్చం ఈ బాపతు అనువాద రచనలు తారసపడుతూనే వుంటాయి. అయితే తమాషా ఏమిటంటే ఒక్కోసారి ఈ విచిత్ర అనువాదార్థాలే యదార్థమైపోతూంటాయి. తలతిరుగుడుతనం వల్ల కార్యనిర్వహణా దక్షత పెరుగుతుందని, సమస్యల పరిష్కారం సాధ్యమౌతుందనీ అంటే - నిజంగా కొందరు అధికారుల, పార్టీ అధినేతల అహంకారం, బుర్ర తిరుగుడూ కొన్ని అసమ్మతులనూ చిన్నచిన్న ప్రాబ్లమ్స్‌నూ అణచివేయడం, అధినేతపట్ల భయభక్తులు కలిగి 'ఎందుకొచ్చిన గొడవల్లే' అని పనులు చేసేసుకుపోవడం, జరుగుతూనే వుంటోంది కదా! ఎన్నికల ప్రచారంలో 'భయం' కూడా ఒక భాగమే అన్నాడు మామయ్య. అంటే భయపెట్టడం, భయపడడం, రెండూ కూడా నేమో. 'ఫలానా వారికి ఓటేస్తే ఫలానానే గతి' అని ఓటర్లను భయపెట్టడం ఒక వంకయితే, 'ఓటేయకపోతే మాకు - నీగతి చూస్కో' అని భయపెట్టడం మరో తరహా. తామే రక్షకులమనీ అవతలివారు భక్షకులనీ ప్రతివారూ

అంటారు. నేరచరితులకు మా పార్టీలో స్థానం లేదని నీతి సూత్రాలు వల్లించిన వారే ఒక్కొక్కరూ ఎందరు రౌడీలకూ, గూండాలకూ, నేరగాళ్ళకూ సీటు ఇచ్చి ఆహ్వానించారో లోక్‌సత్తా లిస్టులు సహితం ప్రత్యక్షంగా చాటి చూపడం లేదూ! రాష్ట్రంలో సాక్షాత్తూ అధికారపక్షం అమాత్యుల సొంత భవనంలో పోలింగ్‌కు ముందుగానే బాంబు పేలడం దేనికి సంకేతం? అని ప్రశ్నించారంటే ప్రశ్నించరా మరి?

"తాతాజీ! మొదటి విడత పూర్తయింది. రెండో వాయి ఎక్కిస్తున్నారు. చునోతీ చర్చలో - ఉడుకుతున్నదేమిటో, ఆవిరవుతున్నదేమిటో చెప్పగలరా?" అన్నాడు స్నేహిత్ వాళ్ళమ్మ ప్లేటులో తెచ్చిచ్చిన ఇడ్లీని పచ్చడితో నంచుకుంటూ.

"ఒరేయ్ మనవడా! నీ శ్లేషలు చూస్తుంటే ఆశ్లేషా నక్షత్రంలో పుట్టావేమో అని డౌటొస్తుంది. ఇంతకీ అమ్మాయ్ వీడి నక్షత్రం ఏమిటే" అన్నాడు మామయ్య.

"పుష్యమి" అంది వంటింట్లోంచి మా ఆవిడ.

"అలా చెప్పు. అందుకే విషయాలను వీడు పుష్ చేస్తూంటాడు యమాగా" అన్నాడు నవ్వుతూ ఫణి.

"తాతాజీ! ఎప్పుడూ అధికారంలో వున్న ప్రభుత్వానికే ఎక్కువ భయం ఉంటుంది. రుచిమరిగిన అధికారం ఎక్కడ 'చే' జారిపోతుందోనని. పైకి ఎంత బీరాలు పలికినా, ఓట్లకోసం సారాలు పొలికినా, ప్రజల నాడి ఏమిటో గ్రహించడం అంత సులువేమీ కాదు. అందునా మన తెలుగు ఓటర్లు స్పెషల్ అని నువ్వేగా చెప్పావ్! దేశమంతా ఓ వైపు మొగ్గితే, మనవాళ్ళు మరోవైపు మొగ్గిన సందర్భాల కథలూ నువ్వే చెప్పావ్! ప్రతిపక్షం వాళ్ళకు వుండేది ఎన్నికలంటే భయం కాదు - ఆశ. మరీ చెప్పాలంటే అత్యాశ కూడాను. 'ఇన్నాళ్ళూ వాళ్ళు తిన్నారు. ఇకనైనా మాకు తినేఛాన్సు రాదా. ఈ వాయి అయినా పూర్తిగా మాకు దక్కదా. ఈ విడత అధికారం మా చేజిక్కదా' అని అందుకోసం ఆరాటం, పోరాటం" అన్నాడు స్నేహిత్.

"భేషుగ్గా అన్నావురా తాతా! ఇందాకా 'తల తిరుగుడు తనం' అని ఓ పేపర్లో అనువాదమైన 'రొటేషన్ హెడ్‌షిప్' ఆశే ఇదీను. 'క్రితం సారి పాలన మీది కాబట్టి ఈసారి పాలన మాది' అనే అండర్‌స్టాండింగులు అధికార దాహం ముందు హుళక్కి కాబట్టే, ఎన్నికలు - సమరాంగణాలయ్యాయి. అధికారం ఊడలాక్కోవడం కుదరదు, కుదర్లేదు కాబట్టే ఏ పార్టీలయినా పోటీ బరిలోకి దిగేది. అవతలి వారిని దుమ్మెత్తి పోస్తేనే తమ నెత్తిన ప్రజలు పాలుపోసి అభిషేకిస్తారని ఆశ. అందుకోసమేగా ఆశయాలు, సిద్ధాంతాలు గాలికొదిలి వ్యక్తి దూషణ స్థాయిలకు దిగజారేది" అన్నాడు మామయ్య.

"బాబాయ్‌గారూ! ఎవరు ఏ పోకడలు ఎందుకుపోతున్నదీ గ్రహించలేని అమాయకులు కాదండీ ప్రజలు. వారు క్రమక్రమాగత చైతన్య ధనుష్ప్రాణులుగా, ప్రజాస్వామ్య పరిరక్షణకు తమ చైతన్యాన్ని ప్రదర్శించక మానరు" అన్నాడు ఫణి.

"మరే మరే ఓటు శాతం చూస్తే తెలీడంలే" అన్నాడు స్నేహిత్.

"అబ్బాయ్ ఫణీ! ఒక విషయం మటుకు వుందోయ్. విజ్ఞులూ, మేధావులూ, తామూ సదరు వర్గం వారమేననుకునే మీ బోటి కవులూ - జనాన్ని ఓటు హక్కు వినియోగం గురించి బాధ్యతాయుతులుగా మలిచే కృషి చేయడంతోబాటు, తామూ ఆ కర్తవ్య నిర్వహణలో విధిగా భాగస్వాములవ్వాలి. అసలు నన్నడిగితే ఓటు వినియోగించడమనేది కంపల్సరీ చేయాలి. ప్రజాస్వామ్యం గురించీ, పార్టీల గురించీ, పార్లమెంటరీ వ్యవస్థ గురించీ వేదికల మీదా, రేడియోల్లో, టీవీల్లో చర్చలు చేసే వారంతా ఓటు నిజంగా వేశారా లేదా? అని ఆరాతీయాలి. 'స్వచ్ఛందంగా ఓటు వేయడానికి ఎంత హక్కు వుందో, మానేయడానికి అంత హక్కుంది' అనే వితండ వాదన చేయకుండా దేశ పౌరునిగా ఓటు వేయడం ప్రతివాడి బాధ్యత. నేను ఓటు వేయగల నాకు నచ్చిన అభ్యర్థి ఎవరూ లేరంటూ, ఓ రాజకీయపక్షం పట్లనయినా కనీస విశ్వాసం లేకుండా - అసలు ఓటు వేయడం మానేస్తే మేలు జరగదు సరికదా! ఏ మాత్రం సరిపెట్టుకోలేని - హీనులే మననెత్తినెక్కి పరిపాలించే స్థితి రావచ్చు. అందువల్ల - "అసలు లేని దానికన్నా అంతో ఇంతో ఫరవాలేదు" అనుకునే వీలున్న, మనసుకు పూర్తిగా నచ్చకున్నా నచ్చుబాటు చేసుకున్న, మంచి మార్పుకు అవకాశమున్న వారికయినా ఓటువేసి ఎన్నుకోవడమే కావలసిన కార్యం" అన్నాడు మా మామయ్య.

"ఇడ్లీ ఇంకా ఎన్నివాయిలు వేయమంటారు. మిత్రులు ఎవరైనా కూడా వస్తారా బాబాయ్‌గారూ" అని అడిగింది వంటింట్లోంచి మా ఆవిడ.

"రావాలమ్మా! వస్తారనే ఆశ. కడుపునిండినవారే వస్తారో? కడుపు నింపుకోవాలనే వారే వస్తారో? తాము తినడం గురించి కాకుండా, కాలే కడుపులకు తృప్తినిచ్చే ఆలోచన వున్నవారు కావాలి. రావాలి. నువ్వు తిన్నా తినకున్నా ముందు అన్నపూర్ణలా ఇంటిల్లిపాది గురించి ఆలోచిస్తావ్ చూసావ్! అలా వట్టి "సర్వే"లతో కాకుండా, నిజంగా సర్వజనహితం కోరి ఆచరించేవారు రావాలి" అన్నాడు మామయ్య.

"తాతాజీ ఆశ్లేషా నక్షత్రం మీదిలా వుందే" అని స్నేహిత్ అనేసరికి అందరం కలిసి నవ్వుకున్నాం.

*సోమవారం 6 సెప్టెంబర్ 1999*

# కుఛ్‌కుఛ్ హోతాహై!

"హిందీ మేరే బిందీ" అన్నాడు స్నేహిత్.

"నీ బొంద. అందుకేనేంటి హిందీలో అలా తక్కువ మార్కులు వచ్చేది? నేషనల్ నెట్‌వర్క్‌లే కాకుండా 'జీ' టీవీ ఛానెళ్లూ అవీ పెట్టించేది నీ హిందీ అయినా ఇంప్రూవ్ అవుతుందనేకదా! అయిన ఆ ఛానెల్స్ ఛానెల్సే. మార్కులు మార్కులే" అంది వాళ్లమ్మ. అదే మేరీ బీవీ.

"నాకు హిందీ సబ్జెక్టురాక కాదు. ఆ 'మాత్రా'లూ అవీ డౌట్. ఎక్కడ 'కీ' అనాలో ఎక్కడ 'కా' అనాలో అలాంటివి డౌటొస్తూంటాయి" అన్నాడు స్నేహిత్ మళ్ళీ.

"అదే మరి. బిందీ అంటే బొట్టు. 'హిందీ మేరీ బిందీ' అని భారతదేశానికి కోడలుగా వచ్చిన ఏ ఇటాలియన్ సోనియాగారో అంటే సెంటిమెంటల్‌గా బావుంటుంది కానీ, ఇండియాలో పుట్టి ఇండియాలో పెరిగిన నీలాంటి ప్రబుద్ధుడు అలా తప్పుల తడక గ్రామర్‌తో హిందీ మాట్లాడడం అంత విషాదం మరోహటి ఉండదురా భాంజా" అన్నాడు ఫణి.

హిందీ రాజభాషా వారోత్సవాలు మొన్న పధ్నాలుగున మొదలయ్యాయి. ముఖ్యంగా కేంద్రప్రభుత్వ కార్యాలయాల్లో, బ్యాంకుల్లో హిందీ భాష గురించి శ్రద్ధ తీసుకునే ప్రత్యేకమైన సెల్స్ వున్నాయి. జాతీయభాషగా హిందీవ్యాప్తికి పైకి తమిళనాట వ్యతిరేకత ఉన్నట్లు కనిపిస్తూ వున్నా, నిజంగా వాళ్లుకూడా హిందీ నేరుస్తూనే వున్నారు. కానీ తమ మాతృభాషను అధిగమించేలా మరోభాషకు దాసోహం అనని కలేజా వారిది. కానీ "మన వాళ్ళుట్టి వెధవాయిలోయ్" అని గిరీశం అన్న తంతులో తెలుగు అధికార భాషా సంఘం వంటివివున్నా రానురాను తెలుగుకు పడుతున్న తెగులు మితిమీరుతోందనే బాధ కలుగుతుంటుంది నా బోటి వారికి.

హమ్ కిసీసే కమ్ నహీ" అన్నాడు స్నేహిత్.

"హమ్ 'బాద్‌షా' హై" అన్నాడు ఫణి.

భాష విషయంలో "ప్యార్‌తో హోనా హీతా" అంది మా ఆవిడ. వీళ్ల సినిమా హిందీ భాష వింటుంటే మరి నాకు కూడా 'కుఛ్‌కుఛ్‌హోతాహై'.

"మీరేమయినా అనండి గానీ దూరదర్శన్ పుణ్యమాఅనే హిందీ భాషా వ్యాప్తి బాగా జరుగుతోంది. ఎన్నో సీరియళ్లు ప్రాంతీయభాషల్లోకి అఘోరంగా అనువదించుకుని ప్రసారాలు చేసుకుంటున్నా, హిందీ పరిజ్ఞానం మటుకు ఛానెల్సు బాగా పెంచుతున్నాయి.

ఎటొచ్చీ మన తెలుగు ప్రైవేట్ ఛానెల్సే కమ్మని తెలుగు భాషను దిమ్మతిరగేలా ఖూనీ చేస్తూ తెలుగును 'టెల్గూ'గా - ఠెంకహా అనిపిస్తున్నాయి'' అన్నాడు ఫణిగాడు.

"మామాజీ! ఆంధ్రులకు ఐమీన్ అదే టోటల్‌గా తెలుగువారికి సోనియా అంటే ప్రియాంకలా ప్రియమెందుకు కాగల అవకాశాలున్నాయో చెప్పగలవా?'' అని ప్రశ్నించాడు స్నేహిత్.

'ఇందిరమ్మ కోడలనో, రాజీవుని భార్య అనో అనేనా'' అన్నాడు ఫణి.

"తుమ్ సమఝ్‌నైసకా మామాజీ!'' "తెలుగూ ఈజ్‌దీ ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్'' అన్నారు. కాబట్టి ఇటాలియన్ అయిన సోనియాజీ తెలుగూస్‌కు మాస్‌గా నచ్చితే ఆశ్చర్యపోనక్కర్లేదు. 'ఇటాలియన్ ఈజ్ ది తెలుగూ ఆఫ్‌సౌత్' అని వెలిగిపోవచ్చు. హమ్ దిల్‌దే చుకే సనమ్ అని ఆ మధ్య ఓ తెలుగు పిచ్చివాడు ప్రియాంక నా భార్య అని కోర్టు కెక్కిన కథకూడా నీకు గుర్తుండే ఉండాలి కదా. అంచేత టోటల్‌గా 'మస్త్' గా మన 'తాల్' - 'హమ్ తుమ్‌పై మర్‌తేహై' అని చెప్పి, ఓటర్ 'మన్' అటువైపు 'గులామ్' అయినా కావచ్చు. ఊరందరిదీ ఒకదారి ఉలిపికట్టె దింకోదారి అని మనం ఒక్కసారి విభిన్నంగానే తేలుతుంటాం కదా'' అన్నాడు స్నేహిత్.

"మూడో విడతకూడా అయిపోయిందిరా భాంజా. నువ్విప్పుడు దూరదర్శన్ ఎగ్జిట్‌పోల్‌లా అర్జున్ 'పండిట్' అవతారంతో హస్త సాముద్రికానికి పూనుకుంటే పూనుకోవచ్చు. కానీ తెలుగువాడి ఆత్మగౌరవం ఏమంటుందో కూడా ఆలోచించి మరీ మాట్లాడు. బాబు మధ్య సున్నా పెడితే బాంబు అవుతుంది. 'వై? ఎస్' అంటే 'వై? నో' అని ఇంకోరనచ్చు. అదంతా అలా ఉంచు. అసలు ఫలితాలు బయటపడితే గానీ ఎవరికి వారు "హమ్ ఆప్‌కై హై కౌన్'' అన్నది ఎదుటివారితో తేల్చుకోలేరు. అందాకా నిరీక్షణా 'సంఘర్ష్' తప్పదు అన్నాడు ఫణి.

"హిందీ సినిమా పేర్లు బట్టీపట్టీ హిందీ మాట్లాడేయడం ఈజీ అని 'మరోచరిత్ర' సినిమాలో కమల్‌హాసన్ పాటపాడినట్లుగా, బావుందర్రా మీ వరస! జాతీయ భాషగా హిందీని గౌరవించడం, వినియోగించడం అందరినీ ఏకత్రితం చేసే - భావ వినిమయ మార్గమే. కాదనను. నిజానికి స్వాతంత్ర్యోద్యమ కాలంలో హిందీభాషకూడా ఒక వాహికగా పనిచేసింది. ముఖ్యంగా తెలుగునాట దక్షిణ భారత హిందీ ప్రచారసభలాంటి సంస్థలు అంతటి ఉద్యమ స్ఫూర్తిని కలిగించాయి. మరి ఇవాళ తెలుగువాళ్లంగా మన భాష అస్థిత్వాన్ని మరింత పదిలపరుచుకుంటూ జాతీయ స్ఫూర్తితో హిందీ కుందెను వెలిగించుకోవాలి'' అంది మా ఆవిడ.

'ఠీక్‌కహా బీవీ నెంబర్ వన్' అన్నాను నేను ఉత్సాహంగా. 'నెంబర్ టూ ఎవరు' అని మా ఆవిడ నిలదేసే సరికి - స్నేహిత్, ఫణీ ఒకటే నవ్వు. సంసార్‌మే ఐసా కుఛ్‌కుఛ్‌హోతాహై.

*సోమవారం, 20 సెప్టెంబరు 1999*

# 'చెక్కని' సంసారం

మొత్తానికి ఇల్లు కొంచెం సద్దుమణిగింది. మా పాత ప్రభుత్వాలు మాకొచ్చాయి. చంద్రముఖి మా ఆవిడ - ప్లస్ మా బాబులది కలిసి రాష్ట్ర ప్రభుత్వం వంటిదైతే, కళ్లార్పుకుంటూ అన్నింటికీ మొహం వాచిపోయేలా సిన్సియర్‌గా తాపత్రయపడే నాది కేంద్ర ప్రభుత్వం. వెరసి టోటల్‌గా మా సంసారంలో ఓ సయోధ్య అధికారం తిరిగి నెలకొంది. ఇంతకీ కారణం నేను చెప్పాలా? ఎన్నికల సంరంభంగా వచ్చిన మావయ్య తన మాట ప్రకారం ఫలితాలు వచ్చి ప్రభుత్వాల పదవీ స్వీకార ప్రమాణాలు అవడంతోనే ఊరెళ్లిపోయాడు. మావయ్యకూ, మావయ్య మిత్రులకూ చేసి పెట్టడానికి దానికీ ఏమీ కాదుగానీ, వాళ్ల రాజకీయాల చుట్ట పొగలే కొంచెం మా ఆవిడని ఉక్కిరి బిక్కిరి చేసేవి. అందునా తనకు కొంచెం సదరు ఎలర్జీ వుంది. కాబట్టి - చాకిరీకి తగిన ఎనర్జీ లేదని - వగపు చెందుతూండేది. పని భారానికి తాను ఎప్పుడూ వెనుతిరిగిన మనిషి కాదుగానీ, అదనపు పనిభారం తగ్గితే వెట్టిచాకిరీ విముక్తి అంత సంతృప్తే కదా! 'బాబాయ్‌గారు వెళ్లాక ఇల్లు హడావుడి లేక కొంచెం చిన్నబోయినట్లుంది కదండీ' అనేసింది కూడానూ. గొప్ప కలరవం ప్రశాంతతలోకి మారాక, ఆ స్థితీ అలవాటుపడడానికి ముందు - కొంత కలవరంగానే వుంటుందేమో!

ఇంట్లో కొన్ని పునర్నిర్మాణ కార్యక్రమాలు చాలా రోజులుగా వాయిదావేస్తూ వచ్చాం. జన్మభూమిలో శ్రమదానానికి వెరచి మాత్రం కాదు. ప్రధానంగా బడ్జెట్ ప్రాబ్లం. ఆర్థిక వనరులు సమకూడితేగానీ అభివృద్ధి కార్యక్రమాల అమలు సాధ్యం కాదు కదా! అప్పు పుట్టించగలగడమూ పెద్ద విద్య. అది మా ఇంట్లో మా చంద్రవదనకూ, బాబుకూ చేతనైనట్టు నాకు కూడా చేతకాదు.

'మీ ఇంట్లో చెక్కహా పనులు చేయిస్తున్నట్టున్నారు అక్కయ్యగారూ! ఏమయినా మీ సంసారం చూడముచ్చటగా చెక్కహా ఉంటుందండీ' అంటూ పై ఇంటి సరళ వచ్చి నిన్న మా ఆవిడని పలకరించింది. సరళ పేరుకే సరళంగానీ, ఆవిడ - భాషను చాలా విరళంగా తనకు తోచినట్లు చంపుతూంటుంది. 'చ'ను 'చె'గానే పలుకుతూంటుంది. మా సంసారం చెక్కహా వుంటుందని, మేం చెక్కగా వుంటామని ఆవిడ అంటుంటే - మావి 'చెక్కమొహాలు' అని ఎద్దేవా చేస్తోందేమో అని ముందు అనుమానించా గానీ, ఆవిడకు 'చెక్కదనం' అంటే (ఆవిడ భాష ప్రకారం 'చక్కదనమే' అని తెలిసాక

మనసు నిమ్మళించింది). ఆవిడ నిన్నవచ్చి మా ఇంట్లో చెక్కహో పనులు సాగుతున్నాయన్నమాట అంది అంటే - అది నిజమే. మేం నిజంగానే చెక్కపనే పెట్టుకున్నాం. పుస్తకాల సంసారం పెరిగిపోయి, అందువల్ల జ్ఞానమధూళి సంగతి ఎలావున్నా (గూళ్లు ఓపెన్‌గా వుండడంవల్ల) ధూళి ఎక్కువై రోజూ ఇల్లు వూడ్చుకోడానికే కాదు, ఒక్కోసారి ఊపిరి స్వచ్ఛంగా పీల్చుకోడానికి కూడా ఇబ్బందే కదా! అంచేత వాటికి చెక్క తలుపులు పెట్టించుకుందామన్న సంకల్పానికి ఇప్పటికి శ్రీకారం చుట్టగలిగాం.

మా ఆవిడా, పై ఇంటి సరళగారూ నిన్న పనివాళ్లు భోజనం సద్దుబాట్లకు వెళ్లిన తరుణంలో చిన్న 'జుగల్‌బందీ'యే వేశారు. ఇంక ఇద్దరికీ కబుర్లే కబుర్లు. ఆ కబుర్ల మధ్యలోనే -

'కొత్త ప్రభుత్వాలయినా చెక్కహో పనిచేస్తాయంటారా?' అని ప్రశ్నించింది సరళ మా ఆవిడని.

'చెక్కపని కూడా అంత సులభం కాదు సరళగారూ! చూస్తున్నాగా! ప్రభుత్వంలో మంత్రులను తీసుకున్నట్టే పనికోసం పదిమందిని తీసుకోవాలి. ఎంత ఎక్కువ మందిని తీసుకుంటే అంత తొందరగా పనులు అవుతాయనుకుంటాంగానీ ముందు వాళ్లందరికోసం అయ్యే ఖర్చు కూడా చూసుకోవాలి. వాళ్లకి టీలు, టిఫిన్లు ఇచ్చి అవసరమైతే రాత్రింబవళ్లు పనిచేసేలా చూడాలి' అంది మా ఆవిడ.

'ఎక్కువమందిని అందునా డబ్బై మందిని కేంద్రంలో తీసుకున్నారంటే అభివృద్ధి కార్యక్రమాలు త్వరత్వరగా జరగడానికే అంటారా? లేక వాజ్‌పేయ్‌గారు తమ ప్రభుత్వ సుస్థిరత కోసం అందరినీ కూడగట్టుకోవడానికా? అప్పుడే హెగ్డేలాంటి వాళ్ల అలకలు మొదలయ్యాయటగా' అంది సరళాజీ.

'చెక్క పలకలు కోయడానికే బోలెడు టైం తీసుకుంటుందండీ! ఎంతమందిని తీసుకున్నా అందరూ సరిగ్గా పనిచేయరు కదా! కొందరికి మంచి పని నైపుణ్యం వుంటుంది. కొందరు ఊరికే ఉత్సవ విగ్రహాల్లా వుంటారు. మేస్త్రీ ఎంత గట్టివాడయినా పనివాళ్లలో నిజాయితీ వుండాలి' అంది మా ఆవిడ.

'అందరూ భిన్న ప్రాంతాలనుంచి వస్తారు కదండీ! అన్ని రాష్ట్రాలకూ మంత్రివర్గంలో ప్రాధాన్యం ఇవ్వాలి. అన్ని కులాలకూ, వర్గాలకూ కూడా ఇవ్వాలి. అందుకే బహుశా అంతమందిని తీసుకుని వుంటారు. శాఖల కేటాయింపు కూడా జరిగిపోయింది కాబట్టి ఇంక ప్రజాసంక్షేమం పట్లా, దేశ ఆర్థిక స్థితిపట్లా శ్రద్ధ పెట్టాలి' అంది సరళ.

'ఎవరు ఏ పని చేయాలి అన్నది మేస్త్రీ కేటాయిస్తాడు. వాటిని శ్రద్ధగా, మనసుపెట్టి నైపుణ్యంతో వాళ్లు చేయాలి. ఏశాఖకు ఆ శాఖ పని బాగా చేసినప్పుడే మొత్తంమీద నిర్వహించవలసిన కార్యం సజావుగా జరుగుతుంది' అంది మా ఆవిడ.

ఇలా సరళాజీ రాజకీయం, మా ఆవిడాజీ చెక్క పనీ గురించి 'జుగల్‌బందీ'గా మాటాడుతుంటే రెండూ కలిసిపోయి టోటల్‌గా మాత్రం అర్థాలు బాగానే స్ఫురిస్తుంటే స్నేహితూ, ఫణీ తెగ నవ్వుకున్నారు. ప్రభుత్వ పరిపాలనకీ, కార్పెంటరీ పనికీ మహిళామణులిద్దరూ తమ కబుర్లలో కలిపించిన సారూప్యత వింటుంటే నాకూ ముచ్చటేసింది. భిన్న ధృవాలైన విషయాలైనా ఎవరి ధోరణిలో వారు మాటాడుతూనే ఎవరి ప్రపంచంలో వారుంటూనే, గొప్ప మిత్రత్వాన్ని నెరపగల దక్షతను సరళగారూ, మా ఆవిడా చూపించాక కేంద్ర ప్రభుత్వంలో ఎనిమిదిమంది మహిళా మంత్రులను తీసుకుని అష్టలక్ష్మీవైభవానికి వాజపేయి గారు పూనుకోవడంతో ఎంతదక్షత చూపిస్తారో కదా అనిపించింది. ఏమైనా భవిష్యత్తు 'చెక్కహో' సాగుతుందని విశ్వసిద్దాం. 'చెక్కభజన' గాళ్ల పట్ల మాత్రం మంత్రులూ, అధికార యంత్రాంగం అప్రమత్తంగా వుండి చక్కహో రాణించెదరుగాక!

*సోమవారం, 18 అక్టోబర్ 1999*

# ప్రాయో(జిత) పదేశం

"ఓ కవితా సంకలనం వేసుకుందాం అనుకుంటున్నా బావా" అన్నాడు ఫణిగాడు.
"భేష్! అలానే కానియ్యి. కానీ నీ ఆర్థిక వనరుల మాటేమిటి" అన్నాను నవ్వుతూ.
"బావా! సంకల్పబలం వుండాలే గానీ, ఈ రోజుల్లో అసాధ్యం లేదు. అందునా కవి స్వేచ్ఛా జీవి కనుక సిగ్గుపడితే లాభం లేదు. పేజీపేజికి ఒక పోయమ్‌ను స్పాన్సర్ చేయడానికి జనాన్ని వెతుక్కుందామనుకుంటున్నాను. రైల్వే కాంట్రాక్టర్లు, చిట్‌ఫండ్ అధినేతలు, రియల్‌ఎస్టేట్ బిజినెస్‌మెన్లు దగ్గర నుండి మొదలెట్టి, చివరకు కిరాణాషాపు ఓనర్ దాకా సాహిత్యాభిమానం పొంగిపొరలుతున్న శాల్తీలు లేకపోలేదు. వాళ్ళందరిమీదా తలా ఓ కవిత రాసేసో, ఎవరయినా లొంగేట్లయితే అంకితం లెవల్ ఆశపెట్టేసో, గ్రంథావిష్కరణ సభరోజు తమకు సన్మానం చేసుకుందామనుకుంటున్నానని చెప్పేసో విరాళాలు వసూలు చేసుకోవాలి. నీకూ ఒక దండా, శాలువా శాంక్షన్ చేస్తాను గానీ ఓ వెయ్యి నూట పదహార్లతో నువ్వే బోణీ కొట్టకూడదూ" అన్నాడు ఫణి.

"ఆ శషభిషలు నా దగ్గర కుదరవు. అవునుగానీ 'ఇమ్మనుజేశ్వరాధములకిచ్చి' అన్నదెవరోయ్! పోతనా లేకపోతే ధూర్జటా" అన్నాను నేను.

"వద్దు బావగారూ వద్దు. నన్ను అలా విలువలూ, సెంటిమెంట్లతో కొట్టాలని చూడకండి. పోతన్నలు, ధూర్జటులు ఇవాళ కవులకు ఆదర్శం కాదు. సరస్వతి మా దగ్గర ఎలాగూ వుంది. మాకు కావలసింది లక్ష్మి. 'మా సరస్వతి వెలుగు చూడడానికి మీ లక్ష్మి మాకు కావాలి' అని అంతా డబ్బున్నవారి చుట్టూ తిరగడం ఇవాళ నామోషీ కాదు. కామోషీ వదిలి నిస్సిగ్గుగా, నిర్లజ్జగా, నిస్సంకోచంగా ప్రాయోజకులను అంటే స్పాన్సర్లను వెదుక్కోవడంలోనే ఇవాళ అసలు సిసలు ప్రయోజకత్వం వుంది. డి.టి.పి. చేయించి ఆఫ్‌సెట్‌లో ప్రింట్ చేసి వీలైతే కవితా సంకలనాన్ని మొత్తం ఇంటర్‌నెట్‌లో ఫీడ్ చేయాలనుకుంటున్నా" అన్నాడు ఫణి.

"పుస్తకాలు గొప్ప ఆట్టహాసంగానూ, రిచ్‌గానూ వస్తున్నాయి. గానీ ఆ అక్షరాల్లో నాకు ఆత్మకనపడడం లేదోయ్ ఫణీ! పూర్వం లెటర్ ప్రెస్‌లో కంపోజిటర్లు శ్రమ వెచ్చించి అక్షరాలు కూర్చి, ప్రూఫ్ రీడర్లు వాటిని దిద్ది, గ్యాలీలూ పేజీమేకప్ అయ్యాక, ఆ తర్వాత ఫైనల్‌గా మిషన్ ప్రూఫ్ కూడా చూసుకుని స్ట్రైక్ ఆర్డర్ ఇచ్చి ముద్రించిన

పుస్తకాల్లో కనిపించిన సజీవత్వం నాకు వీటిల్లో కనిపించటం లేదు. అక్షరం అందంగా వుంది కాదనను. కానీ ఏదో లోపిస్తోంది అనిపిస్తోంది" అన్నాను నేను.

"బావగారూ! నా దగ్గర అంటే అన్నారు గానీ, మరెవరిదగ్గరా అనకండి. మీ పరువు పోతుంది. మీరు 'ఓల్డ్ మాంక్' అయిపోతారు. అసలుసిసలు కవిత్వధారే కవిలో లోపిస్తుంటే కనీసం అందమైన పుస్తకముద్రణయినా వారిని ఆదుకుంటుండగా, మీరింకా పాత ప్రింటింగు గురించీ, ఆగిపోయిన భారతి గురించీ, చందమామ గురించీ, వావిళ్ళవారి ప్రచురణల గురించీ, క్రౌన్ సైజులో బ్రౌను గురించి మాట్లాడడం చేస్తే మీరు వెర్రివారవుతారంతే - 'ఆంధ్ర భాషావికాసంలో మైలురాళ్ళు - ముందుసవాళ్ళు' అంటూ చర్చించుకుంటూ కూచుంటే లాభంలేదు. ఇప్పుడంతా ఫాస్ట్‌ఫుడ్, ఈ మెయిల్ సర్వీస్, ఇకపై కవిత్వం అసలు కవి రాయడం వుండదు. కంప్యూటరే రాస్తుంది. జీవితం మొత్తం ప్రాసెసింగ్ హైటెక్ సిటీలో పెట్టేయడమే" అన్నాడు ఫణి.

"ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం నాడయినా మనభాష గురించీ, తెలుగుతనం గురించీ, తెలుగువాడి వ్యక్తిత్వ వికాసం గురించీ తలపోయక పోతే ఏం బాగుంటుందోయ్. మకరంద బిందు బృంద స్యంద తుందిల మగు మాతృభాష గురించి పానుగంటి వారి స్థాయిలో కాకపోయినా కనీసం మాతృభూమికి దూరమైన ఎన్.ఆర్.ఐ. సెంటిమెంట్ స్థాయిలోనయినా మనం ఏడవకపోతే ఎలా?" అన్నాను నేను.

"బావగారూ! భాష, వ్యాకరణం, అలంకారం, రసం అన్నీ ఔట్ డేటెడ్ పదాలు. కథ, కవిత, నవల, వ్యాసం టోటల్‌గా అన్నీ పాత చింతకాయ ప్రక్రియలు. కనీసం మిలియనియపు కొత్త శతాబ్దిలో నయినా కొత్త ప్రక్రియలు ఆవిష్కరించుకోవాలి. దాని గురించి ఆలోచించాలి. కమర్షియల్ పొటెన్సీలేని సాహిత్యాన్ని ప్రపంచ బ్యాంకు సైతం తిరస్కరించమంటుంది. ఇవాళ గ్లోబలైజేషన్ దిశగా ఎదుగుతున్న మనం మనసాహిత్యాన్ని కూడా అంతర్జాతీయ విపణిలో నిలపగలగాలి. ఇవాళ నోబుల్స్, రూబుల్స్ ఏవీ ఊరికే రావు.కైరో సంస్కృతికీ, యూరో మనీకి ముడిపెట్టగలిగాలి. ఇన్‌స్టెంట్ కవిత్వం ఆటాలకు, తానాలకు వెళ్ళగల తందానతాన రచనలు నేటి అవసరాలు. కావలసింది కవితాత్మలు కాదు. బుర్రలు. దాన్ని బట్టే పెరిగే బొర్రలు. హృదయం చవిటిపర్ర అయినా నోప్రాబ్లెం! విమర్శ ఏదయినా అంతా టేకిటీజీ పాలసీయే. ఇవాళ ఇంటర్నెట్ కనెక్షన్‌తో పర్సనల్ కంప్యూటర్ వుందా? మీకు ఎన్ని క్రెడిట్ కార్డులున్నాయి? షేర్ మార్కెట్‌లో మీ లావాదేవీ లేమిటి? రియల్ ఎస్టేట్ బిజినెస్సు గట్రా ఏమయినా చేస్తున్నారా? మీ వాళ్ళెందరు ఫారిన్‌లో వున్నారు? ఇవీ - మీ విలువలకూ, హోదాలకూ

సంకేతాలు. అంతేగానీ మీ తెలుగు భాషాస్థాయి, ఉచ్చారణ, మీకు సాహిత్యం పట్ల అందునా ప్రాచీన సాహిత్యంపట్ల ఆసక్తి, మీ అభినివేశం ఇవన్నీ ఎవరికి కావాలి? చింతపండు అమ్ముకునే వాడి దగ్గర నుంచయినా సరే నువ్వు అతగాడిని స్పాన్సరర్‌గా చేసి ఏం సాధించగలవు అన్నదే కౌంట్ అవుతోంది. ధన సంపాదన ఒక్కటే తిరుగులేని విలువ. దాని ముందు అన్నీ బలాదూర్" అన్నాడు ఫణిగాడు.

"అయితే కవిత్వం పేరుమీద కూడా అడుక్కోవడమే నేటి నీతి అంటావ్. నీ మహత్తర కవిత్వం అంత ముష్టెత్తుకుని గ్రంథ రూపంలో వేయకపోతే వచ్చే నష్టమేమిటి? బంగాళాఖాతంలో వాయుగుండం వస్తే అది ఆంధ్రాకు కాకుండా ఒరిస్సాకుపోయి రాజకీయంగానూ, ఆర్థికంగానూ మనల్ని దెబ్బ తీసిందని ఏడ్చాడట ఎవడో నీలాంటి వాడే. అన్నింటిలోంచీ లబ్ధి పొందాలన్నదే ఆశ, ఆకాంక్ష అయి విలువల్నీ, త్యాగాల్నీ విధ్వంసం చేస్తే ఆనందమూ, సుఖమూ నిలుస్తాయనేనా నీ నమ్మకం" అన్నాను నేను.

"కూల్ డౌన్ బావగారూ! కూల్ డౌన్. ప్రెజెంట్ ట్రెండు చెప్పాను నేను. నొప్పింపక తా నొవ్వక బెస్ట్ ఫ్రెండ్‌గా వుండడం నేటి రివాజు కాదు. బెగ్, బారో ఆర్ స్టీల్ అని పుస్తకం గురించి ఎవడో చెప్పినట్లు, ఇవాళ అదంతా ధనార్జన ఎత్తుగడల విలువలోనిదే అయింది. తెలుగుముక్క, తెలివిగల ముక్క రెండూ కావాలి ఇవాళ అంటే - కుదిరేలా లేదంటున్నారు. ఎనీహౌ! ఇంకా మీ లాంటి ఆర్తిపరులు కొందరున్నారు. భాష, సాహిత్యం, విలువలు, తెలుగుదనం అని ప్రాకులాడేవారు. ఇప్పుడు ఈ శతాబ్దపు చివరి అంచుల్లోకి, కొత్త శతాబ్ది ప్రాంగణంలోకి అడుగు పెట్టబోతున్నాం. ఒకరకంగా ఇది ఒక సంధికాలం. గతానికీ, భవిష్యత్తుకీ ముడివేసే నిశితమైన చూపు అవసరమైన వర్తమానం ఇది. మనచూపు ఏమి చూపుతుందో వర్తమానం ఏ వర్తమానం తీసుకొస్తుందో ఆగి చూసి విని వెళ్ళవలసిందే" అన్నాడు ఫణి.

*సోమవారం, 1 నవంబర్ 1999*

# బుక్సూ - లుక్సూ!

"మరదే మండుద్ది" అన్నాడు గోపాలం.

"విషయం ఏమిటి మహానుభావా" అన్నాను.

"సంసారం అంటే ఇల్లూ, ఇల్లాలూ, పిల్లలూ, బంధుకోటి మాత్రమే కాదు. హిందీలో సంసార్ అంటే ప్రపంచం అనీ, సంస్కృతీ, సాహిత్యం, రాజకీయాలు కలబోసుకోడంలో మిత్ర ప్రపంచానికీ పెద్ద స్థానం వుంటుందనీ అన్నవాడివి నువ్వే. అంచేత నువ్వింక ఇంట్లోంచి బయటి ప్రపంచంలోకి వచ్చి ఈ వారాంతాలయినా మిత్ర ప్రపంచంతో కబుర్లు కలబోసుకో. లేకపోతే ఇల్లే సంసారం, ఇల్లే ప్రపంచకం గాడివయిపోగలవు" అన్నాడు గోపాలం. "అంతేకాదు. వీలున్నప్పుడల్లా మీ వాళ్లనూ తీసుకురా" అన్నాడు "సోమవారం సంసారాలు వారాంతానికి మారాయంటే ప్రపంచకం ఏమీ మారిపోయిందని కాదు. భావనా ప్రపంచంలో కొత్తకోణం, దృష్టిపథంలో మిత్రవాక్యత సంతరించుకున్నప్పుడు ఇతివృత్త అవగాహనలో నవ్యత కనిపిస్తుంది. అది సహజం. ఉన్నది ఒక్క తెలుపు రంగే. అదే ఏడు రంగుల ఇంద్ర ధనుస్సుగా పట్టకం మీద పడిన కిరణమై రూపుదాలుస్తుంది. అలాగే సత్యం ఎప్పుడూ ఒక్కటే. దానిని మనం ఎక్కడ నిలబడి, ఎవరితో కలిసి ఎలా చూస్తున్నాం అనేదాన్నిబట్టే విశిష్టత కనబడడం, ప్రయోజనం అనిపించడం జరిగేది" అన్నాను నేను.

"అవునవును. పేరుకు బాలల చలనచిత్రోత్సవాలు. కనబడేది అందరూ పెద్దలయినట్లేనా?" అంటూ ప్రవేశించాడు చిదంబరం.

"చిదంబరం! ఇవాల్టి పిల్లలు పిల్లలు కాదయ్యా పిడుగులు. నీతికథలు, జంతువుల మిష పెట్టి చెప్పే విషయాలు, యానిమేషన్ అంటే ఎగిరి గంతేసే వాళ్లు తగ్గి, మేం పెద్దల చిత్రాలు ఎందుకు చూడకూడదు? అని ప్రశ్నించేవాళ్లు తయారవుతున్నారు. "మాకూ అన్ని సంగతులూ తెలుసుకోవాలని వుంటుంది. పిల్లలకు సంబంధించిన విషయాలంటూ మీరు ప్రత్యేకించి ఏవో చెబితే, అవి మీకు తెలియక మీరు చెప్పుకునేవి అనిపిస్తోంది. మాకు పిల్లలకంటూ ప్రత్యేకించి మీరు ఉద్దేశించింది కొన్ని విషయాలనా? లేక ఆ విషయాలను వివరించే తీరునా?" అని ఓ పదోక్లాసు కుర్రాడు నిలదీసాడు" అన్నాడు గోపాలం.

"పిల్లలను ఇవాళ మనం ఆలోచనా జీవులుగా ఉంచుతున్నామా? పెంచుతున్నామా? అనే అనుమానం వస్తూంటుంది నాకు. పిల్లలను కూడా ఆడియో క్యాసెట్లకు, వీడియో గేమ్‌లకు అప్పగిస్తున్నాం తప్పితే ఆలోచనను పెంచే పుస్తకపఠనం వైపుకు మరల్చగలుగుతున్నామా?'' అన్నాడు పాండురంగ.

"భేషయిన మాటన్నావోయ్ పాండూ! ప్రస్తుతం ఈవారం గ్రంథాలయ వారోత్సవాలూ జరుగుతున్నాయి. కానీ చలనచిత్రోత్సవాల హడావుడిలో ఇది మరుగునపడిన విషయమై పోయినట్లుంది. పుస్తకం అంటే పిల్లలకు క్లాసు పుస్తకాలు మాత్రమే అనేలా నిర్ధారణ చేసేసాం. ఈసెట్లు, ఎంసెట్లు, ఐ.ఐ.టి. ఎంట్రన్సులూ అంటూ రకరకాల పోటీ పరీక్షలకోసం క్లాసుపుస్తకాలు రుబ్బడమే ఎక్కువైపోతోంది. వినోదం, వికాసం, మానసిక ఉల్లాసం, వ్యక్తిత్వ వికాసం పెంచే పుస్తకాలను పిల్లలకు అందించగలుగుతున్నామా అని మనల్ని మనం ప్రశ్నించుకోవాలి'' అన్నాను నేను.

"అసలు పుస్తకం, కలం, ఔట్‌డేటెడ్ అయిపోతున్నాయి క్రమంగా. కంప్యూటరూ, మౌసూ అంటే తెలుసుగానీ కాగితమూ, కలమూ అంటే ఏమిటని భవిష్యత్తులో పిల్లలు ప్రశ్నిస్తారేమో!'' అన్నాడు గోపాలం.

"కంప్యూటర్‌వల్ల మెదడు మీదా, ఆలోచనల మీదా దీర్ఘకాలిక ప్రభావం ఎలా వుంటుందని పరిశోధనలు జరుగుతున్నాయి. ఒకమాట మాత్రం నిజం. ఒక పుస్తకం చదువుతున్నప్పుడు, అందులోని విషయం మీద శ్రద్ధను కేంద్రీకరించి, అర్థం చేసుకుంటూ, ఆ అర్థమైన దాని ఆధారంగా ఆలోచనలు పెంచే మెదడు యొక్క సంవిధానానికీ, కంప్యూటర్ మీద పనిచేస్తున్నప్పుడు ఉండే మెదడు సంవిధానానికీ ఖచ్చితంగా తేడా వుందట. ఓ పత్రికలో చదివాను'' అన్నాడు చిదంబరం.

"సంసారమనే విషవృక్షానికి రెండే అమృతఫలాలున్నాయట. ఒకటి సద్గ్రంథ పఠనం. రెండోది సజ్జన సాంగత్యం అన్నారు మన పెద్దలు. అంచేత పుస్తకాలు చదవడం, మంచి స్నేహాలు చేయడం అవసరం. ఇవాల్టి పిల్లలను మనం వీటికి దూరం చేసేస్తున్నాం కాదూ!'' అన్నాడు చిదంబరం.

"పిల్లల దాకా ఎందుకు? పెద్దలం మనం మాత్రం ఏం చేస్తున్నాం. ఆఫీసునుంచి ఇంటికి పోయి అర్ధరాత్రి దాకా టీవీఛానెళ్ళకు అతుక్కుపోయే పెద్దలు వృద్ధి చెందుతున్నారు కానీ, తాను పుస్తకం చదువుతూ, సాక్షి వ్యాసాల్లో పానుగంటి వారన్నట్లు ఇంటి ఇల్లాలిని పక్కన కూచోబెట్టుకుని ఓ మంచి పుస్తకం చదివి వినిపించే మగాళ్లు, వినే ఇల్లాళ్లు ఎందరున్నారు? పిల్లలకు కథలు చెప్పే సంస్కృతి ఏదీ? అమ్మమ్మలూ, తాతయ్యలూ

కూడా తమ కళ్లను పుస్తకాలకు ఎడం చేసేసి టీవీలకు మాత్రం అప్పచెప్పడానికి రెడీ అయిపోతున్నారు. చందమామ కథల పత్రిక మళ్లీ వస్తోందంటే నాబోటివాడు ఆనందిస్తే, దానికి అంత ఆనందం ఎందుకు? అని ఆశ్చర్యపోయే వాళ్లున్నారాయె" అన్నాను నేను.

"నవీన నాగరికత వేళ్లకు బంగారు ఉంగరాలు సమకూరుస్తోంది కానీ, మణికట్టు దగ్గర నరాలనే బలహీనం చేసేస్తోంది అన్నాడు ఒకాయన. పుస్తకాల్ని మరచిన జాతి తన మస్తకాన్ని మరచినట్లే" అన్నాడు గోపాలం.

"6 అంగుళాలు ఇంటూ 12 అంగుళాలు సైజుగల టీపాయ్ మీద అలంకరించడానికి ఓ మంచిపుస్తకం చెప్పవోయ్ గోపాలం" అంటూ అప్పుడు ఎంటరయ్యాడు సన్యాసిరాజు. అంతా గొల్లుమని నవ్వుతూంటే "పోన్లే పాపం! పుస్తకాలు అలంకారం కోసం కాదు. కానీ పుస్తకాలంత అందంగా ఇంటిని అలంకరించేది మరోటి లేదనయినా గ్రహించినందుకు సంతోషిద్దాం" అన్నాను నేను.

*శుక్రవారం 19 నవంబర్ 1999*

# '...మోసం డిగా డిగా'

ఉస్సురస్సురంటూ వచ్చాడు సన్యాసి.

'ఏంటి నాయనా? ఆ 'అలసిపోయానుబాబూ' డీలాతనం. అంత కష్టపడిపోయే రాచకార్యం ఏమిటి వెలగబెట్టినట్లో' అన్నాడు చిదంబరం.

హాస్పిటల్‌కి వెళ్లి వస్తున్నాను అన్నాడు సన్యాసి.

'అయ్యోపాపం! అదేం! ఏమయిందేమిటి?' అన్నాడు చిదంబరం.

'నాకేం కాలేదు. నా మిత్రుడు బైరాగికి మోకాళ్లు బాగా వాచిపోతేనూ ఏమిటో పరీక్షలు చేయించుకుందామని ఓ ప్రైవేటు కార్పొరేట్ హాస్పటల్‌కి వెళ్లాడు. వాళ్లేమో జాయినైపొమ్మన్నారు. ఆ పరీక్షలూ, ఈ పరీక్షలూ ఏవో చాలా చెయ్యాలన్నారు' అన్నాడు సన్యాసి.

'మీవాడు పోలీసు డిపార్ట్‌మెంట్‌లో ఏమయినా పనిచేస్తున్నాడా ఏమిటి?'

'అరె! నీకెలా తెలుసు?'

'తెలియడానికేముంది. గెస్‌వర్క్ అంతే. మీవాడికి మోకాళ్లు బాగా వాస్తున్నాయి అన్నావు కదూ! బహుశా అది మెదడువాపు వ్యాధి అయివుంటుంది' అన్నాడు చిదంబరం.

'అదేమిటి? మెదడువాపు వ్యాధికి మోకాళ్లు వాస్తాయా'

'వాయవు. కానీ మీవాడికి మెదడు మోకాల్లో వుంటుంది కదా! అంచేత వాపు అక్కడ కనబడుతోందన్నమాట' అన్నాడు చిదంబరం.

గోపాలం పడీపడీ నవ్వాడు. సన్యాసికి చిదంబరం తన మిత్రుడు బైరాగిని అంతమాటన్నందుకు కోపం వచ్చినట్టుంది. ఉస్సురుస్సురులు మానేసి బుస్సుబుస్సులు మొదలెట్టాడు - 'పోలీసులూ మీ మిత్రులే. పోలీసులు వున్నది ప్రజల కోసమే. శాంతి భద్రతల పరిరక్షణకూ, నేరరహిత సమాజ స్థాపనకూ వారికి సహకరించడం మన బాధ్యత' అన్నాడు సన్యాసి చిదంబరం వైపుతీవ్రంగా చూస్తూ.

'నిజమే. కానీ పోలీసులకూ రోగాలు వస్తాయి. వారికొచ్చే రోగం వల్లే ఒక్కోసారి సమాజంలో నేరాలు పెరుగుతాయి. నిజంగా నేరరహిత సమాజం రావాలని పోలీస్ వ్యవస్థ త్రికరణ శుద్ధిగా ఆశిస్తుందనుకుంటున్నావా? వట్టి భ్రమ. అదే జరిగితే వారూ వుండరు. వారి ఉద్యోగాలూ వుండవు. తమ అస్తిత్వం కోసమేనా వాళ్లు శాంతి

భద్రతలకు విఘాతం కలగాలనీ, నేరాలు జరగాలనీ ప్రార్థిస్తుంటారు. కానీ నిజంగా అలా జరిగినపుడు ఏం చేయలేక నిస్సహాయంగా చేతులెత్తేస్తూంటారు' అన్నాడు చిదంబరం.

'మరీ అలా మాట్లాడేయకు, ఎన్నో నేరాలు వెలుగులోకి వస్తున్నాయంటే వారి సామర్థ్యమే కారణం' అన్నాడు సన్యాసి.

'పిచ్చివాడా! ఇప్పుడూ సమాజంలో నేరాలు చీకట్లోనే జరుగుతున్నా యనుకుంటున్నావా? అవి జరగడమే పట్టపగలు పూర్తి వెలుగులోనే జరుగుతున్నాయి. కనిపెట్టవలసిన వాళ్లూ, పట్టుకోవలసిన వాళ్లే గుడ్డినాయాళ్లలాగ అంధకారంలో పడికొట్టుకుంటున్నారు' అన్నాడు చిదంబరం.

'చిదంబరం! ఒక్క పోలీసులనే తప్పుపట్టడం అన్యాయం. నేరాలను అరికట్టే బాధ్యత కేవలం వారికొక్కరికే అంటగట్టేసి నేరాలు జరగడానికి కూడా వారి అసమర్థతే కారణం అని తీర్పు చెప్పేయడం దారుణం. మనవంటివారే మనలోనివారే. పొట్టకోసం వారు పోలీసులు అయ్యారు గానీ - పోలీసు వ్యవస్థ సమాజ వ్యవస్థలోని భాగమే కానీ, దానిని అధిగమించి దానిని కంట్రోల్ చేసే వ్యవస్థ ఏమీ కాదు అని మరిచి పోకు. ఆ మాటకొస్తే రాజకీయం ముందు అన్నీ దిగదుడుపే కదూ. అసలు వాపు అంతా రాజకీయానిది. పైకి బలుపు అంటారు గానీ నిజానికి మెదళ్లు, అన్నిటి మొదళ్లూ వాపువ్యాధికి గురవుతున్నది రాజకీయ విషక్రిమివల్లనే. మేలు చేసే బాక్టీరియా కంటే కీడుచేసే క్రిములే పెరుగుతున్నాయి. ఆలోచించాల్సిన మేధావి మెదళ్లు కూడా రోగమయం అయ్యే పందులు సంచరిస్తున్నాయి' అన్నాడు గోపాలం.

'మంచి మాటన్నావ్ గోపాలం! నా మిత్రుడు బైరాగి కూడా హాస్పటల్లో విరాగిలా ఈ మాటే మరోరకంగా అన్నాడు. ఒకప్పుడు దొంగతనం, దోపిడీ అంటే - గోడకు కన్నంవేసి ఇంట్లో దూరడం, దారికాచి వంటరిగా వచ్చేవారిని దోచుకోవడం మాత్రమేగా ఉండేది. మోసాలు అంటే ఏవో కనికట్టు పనుల్లానూ, మాటల్లో బురిడీలుగాను వుండేవి. కానీ ఇవాళ అన్నీ హైటెక్ లెవల్లోకి వెళ్లిపోయాయి. సైబర్ నేరాలు స్వైరవిహారం చేస్తూ కాలరెత్తుకు తిరుగుతున్న కాలంలో, ఆకలివేసి రొట్టెను దొంగిలించిన వాడిని అరెస్టుచేసి చితకబాదే నేరనిరోధక స్థాయిలోనే ఆలోచిస్తున్నాం. వేలిముద్రల నిపుణత్వం చేతులూ, కాళ్ల సంచారాన్ని గుర్తించగలదు గానీ నేరబుద్ధినీ, మోసగాడి మెదడు పనితీరునీ గుర్తించలేదు కదా! అన్నింటికన్నా చిత్రం 'డబ్బు ముడ్లో దేవుడున్నాడు' అన్నట్టుగా కోట్లాది రూపాయల స్కామ్‌లు, నేరాలు చేసేవాడిని నిజానికి రోడ్డుమీదకి

ఈడ్చుకొచ్చి చితకబాదాల్సింది పోయి వాడివంక అందరూ అబ్బురంగా, విభ్రమంగా, వినయంగా ప్రవర్తిస్తూ - దరిద్రంతో బియ్యం బస్తా దొంగిలించినవాడినో, మందుల షాపులోంచి రోగిష్టి తల్లికోసం ఓ మందుసీసా కొట్టేసినవాడినో, ఆకలికి తాళలేక పసిబిడ్డను అమ్ముకోడానికి సిద్ధపడిన తల్లినో దారుణంగా దండిస్తూ ఇంటరాగేషన్ పేరుతోనో, లాకప్‌లోనో వారి చావుకు కారణమయ్యే నేరాన్ని పోలీసుల చేతనే నిర్వర్తింపబడేలా వ్యవహరిస్తున్నాం. మరి ఇంతలా మనలో, మన నైజంలో, మన ఆలోచనా సంవిధానంలో పరిణామం వచ్చిందంటే నాగరీకం పేరుతో హైటెక్ పేరుతో మన మెదళ్లు ఎలా వాచిపోతున్నాయో మనం గ్రహించగలుగులుగుతున్నామా?' అన్నాడు చిదంబరం.

'పోలీసులకు కాదు మెదడు మోకాల్లోవుంటున్నది. 'కోలా'హలంగా మోసాలుచేస్తున్న వారికి గుడ్డిగా సహకరిస్తున్న బ్యాంకు వాళ్లు, గవర్నమెంట్ ఫైనాన్సర్లు, డబ్బున్నవాడికి ఎరవేసి తమ వాడిని చేసుకోవాలనుకునే రాజకీయ పార్టీల వాళ్లు తమ మెదళ్లు ఎక్కడున్నాయో పరీక్షించుకోవడం బెటర్. కొందరికి మోకాల్లోనయినా మెదడుంటోందేమో గానీ, కొందరికి అసలు ఆ పదార్థమే వున్నట్టులేదు. అంచేత లేనిదానికి రోగం వచ్చే ప్రశ్నే లేదు కదా! అన్న ధీమాతో శ్రీశ్రీ గారన్నట్టు 'సందులలో పందులవలె' తామే విచ్చలవిడిగా 'పదండిముందుకు పదండిత్రోసుకు పోదాంపోదాం పైపైకి' అయిపోతున్నారు. ఈ పైపైకి వట్టి పైపైకేననీ వాస్తవానికి ఏ గుజ్జూ లేని డొల్ల బతుకేననీ లోలోకి వెడితేగానీ అర్థం కాదు. హృదయంలోకి వెళ్లని వాడికి బుద్ధి వికసించదు. మనం మనసులూ, హృదయాలూ మానవ సంబంధాలూ అన్నిటినీ 'డబ్బు' గాడి పాదాల చెంత పారేసి, కొయ్యగుర్రంలా ఊగుతున్నంత కాలం - ఏ సెంచరీలోకి వెళ్లినా, కాలపురుషుడు మనల్ని డీప్‌ఫ్రై చేసిన గోబీమంచూరియాలా నంచుకు తింటుంటాడు అంతే. దండం డిగాడిగా మోసం డిగాడిగా' అన్నాడు గోపాలం.

*శుక్రవారం, 3 డిసెంబర్ 1999*

# కంపీటర్ కర్మ (పరి)పాకం!

"**కం**ప్యూటర్లకూ మతం వుంది తెలుసా'' అన్నాడు సన్యాసి ప్రవేశిస్తూ.

"అడ్డగోలు కబుర్లంటే ఇవే. మోకాలికీ బోడిగుండుకీ ముడిపెట్టాట్ట నీలాంటివాడే ఎవడో'' అన్నాడు చిరాకు ముఖంతో చిదంబరం.

"కొత్త శతాబ్ది కానీ, మిలీనియం కానీ 2001 జనవరి ఒకటిన గానీ రావు. ఒక్క వై2కె సమస్య పేరుతో, కంప్యూటర్లు సృష్టిస్తాయని భావించిన అంశంవల్లనే - 'తొందరపడి ఓ కోయిల ముందే కూసిన' చందాన ఇంత హంగామా జరిగింది. అసలు కాలగణనం క్రీస్తుశకం పేరున చేయడం ప్రపంచ వ్యాప్తంగా స్థిరపడడానికి - ఇంగ్లీషు క్యాలెండర్లు, ఈ ఆధునాతన కంప్యూటర్లే కదా కారణం! అంచేత కంప్యూటర్ కూడా క్రిస్టియన్ మతానుయాయే. 'కం - పీటర్' అని మన భారతి కూడా 'ఈమె' యిల్లులోకి ప్రవేశింపచేసింది మనల్ని, మన శాలివాహనుడూ, తెలుగు పంచాంగాలే కాదు దేశంలోని సంక్రాంతుల (వివిధ భాషల తాలూకు) సమస్త కాలగణనలూ దీనిముందు బబ్బున్నాయి'' అన్నాడు సన్యాసి.

"అందుకనే నిన్ను సన్నాసి అన్నది. ఊరందరిదీ ఒకదారి అయితే,ఉలిపికట్టెదింకో దారి అన్నట్టు సౌలభ్యం కోసం, ఒక ఏకసూత్రత కోసం సర్వాంగీకారమై అనుసరణీయమవుతున్న ఒక విధానాన్ని ఇలా మతం పేరునా, జాతీయత పేరునా ఎద్దేవా చేయడం సబబుకాదు. అసలు మతం అంటే ఏమిటి? ఒక మార్గం మటుకే. పసులవన్నె వేరు పాలెల్ల యొక్కటి - పుష్పజాతి వేరు పూజయొకటి దర్శనంబులారు దైవంబు ఒకటయా' అన్నాడు వేమన. అందరి లక్ష్యమూ, సంకల్పమూ, గమ్యమూ ఒకటే అయినప్పుడు దారులు వేరయినా నష్టమేమిటి? అంతా కలిసి ఒక రాచబాట వేసుకోడంలో తప్పేమిటి? బియ్యపు గింజలమీదా, పంచదారరేణువులమీదా, నూలుదారం మీదా, తాటాకు మట్టమీదా మతం రాసిలేదు. మన అభిమతం పేరుమీదే మనం మతం రంగులు పులుముతున్నాం.'' అన్నాడు చిదంబరం.

"భేష్! చిదంబరం మంచి మాటన్నావ్! చూడు సన్యాసీ! నువ్వు గ్రహించాల్సిన అసలు నిజం ఒకటుంది. ఇప్పుడు మతంకన్నా, బలీయమైనది ఒకటుంది. అదే రాజకీయం. 'మతాతీత రాజకీయాలు' అనేమాట వినేవుంటావు. 'రాజకీయాతీత మతం' గురించి ఆలోచించాల్సిన రోజులొచ్చాయి ఇప్పుడు. ఎన్ని కంప్యూటర్లు వచ్చి సాంకేతికాభివృద్ధి జరిగినా మనిషి బ్రతుక్కే రాజకీయం 'కంపీటర్' (పోటీదారు) అయిపోయింది. ఇప్పుడు శాసిస్తున్నది రాజకీయాలుగానీ మతాలు కావు. అవికూడా వాటిముందు దిగదుడుపు. రాజకీయం అంటే - దేవు 'డెదిగి' రావడం కాదు దేవుడే 'దిగి' వస్తున్నాడు'' అన్నాడు పాండురంగ.

"మనం కర్మపరిపాకాల గురించి ఆలోచించడం లేదు. ఇప్పుడు 'కర్మపా' గురించి ఆలోచిస్తున్నాం. చైనానుండి కర్మపా లామా రాకలో రాజకీయం చూస్తున్నాంగానీ మతం స్పృహ వుందా? టిబెటన్ బౌద్ధులలోని ఒక పాయ 'కర్గ్యూపా'. వారికి ఉగ్యేన్ థిన్లే దోర్జీ అనే పదునాలుగేళ్ళ కుర్రవాడు 'కర్మపాలామా' అనే గురుత్వ హోదా ఇంకా తీసుకుంటున్నాడు. సిక్కిం గాంగ్‌టక్‌వద్ద రూమ్‌టెక్ ఆరామంనుండి ఆయన - సంప్రదాయ గురుత్వ ప్రతీకలైన ఓ నల్లటోపీని, కొన్ని సంగీత శబ్దవాయిద్యాలను, తీసుకోడానికి వస్తున్నారనేదే విషయం కావచ్చు. కానీ చైనా వ్యతిరేకీ, టిబెటన్ బౌద్ధులందరి గురువూ అయిన దలైలామా ఆశీర్వాదం కూడా ఈ కర్మపాకు వుండడం వల్లనూ, ఆ వేళకే అమెరికా ప్రభుత్వపు టిబెట్ వ్యవహారాల అనుసంధానకుడు జూలీ దలైలామాను కలవడంవల్లనూ, చైనా ప్రభుత్వానికి మింగుడుపడ్డంలేదు. అయితే 'కర్మపా' గా దోర్జీని చైనా ప్రభుత్వమే ఎంపిక చేసినా - ఇప్పుడా కుర్రవాడు తమకు అనుకూల వైఖరి అవలంబిస్తాడో లేదోననే అనుమానంతో భారతదేశానికి వచ్చిన అతనికి రాజకీయ శరణు ఇవ్వరాదని ఇండియాకు హెచ్చరిక చేసింది. టిబెటన్ల స్వాతంత్ర్య కాంక్షకు కర్మపా ఊపిరులూదితే, ఆయన్ని మనదేశం సమర్థిస్తే, 'భారత్ చీనీ భాయ్ భాయ్' అని దశాబ్దాల క్రితపు నినాదానికీ, అభిమతానికీ విఘాతం కలగవచ్చు. కాబట్టి ఇప్పుడు కర్మపా విషయంలో మన వైఖరికి హటాత్తుగా నిఘా దృష్టి ఏర్పడింది. మరి ఈ నేపథ్యంలో మత విషయం అయినా రాజకీయం ముందు వామనమై పోతుందా లేదా" అన్నాడు గోపాలం.

"ఇవాళ ప్రపంచంలో ఎక్కడో ఏదో జరుగుతోంది మనకేమిటిలే అని పట్టించుకోకుండా వుండడం అసాధ్యం. ప్రతిదాంట్లోనూ మన ప్రమేయం అనివార్యంగా వస్తుంది. ఎక్కడ ఏం జరిగినా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దాని ప్రభావం మనమీద వుంటుంది. కర్మపా రాక విషయం మాకు ముందుగా తెలీదని గానీ, తెలిసాకనైనా మా వైఖరి ఇది అనిగానీ మన ప్రభుత్వం చైనా ప్రభుత్వానికి అవగతమయ్యేలా వ్యవహరించక తప్పదు. ఇవాళ అన్నీ ఒకదానితో ఒకటి లంకెలు వున్నవే. కంప్యూటర్లు, ఇంటర్‌నెట్‌లూ అంటే ఏమిటి? ప్రపంచంలోని అనేక విషయాల లంకెలను మన ముందు సాక్షాత్కరింపచేసి సహకరించేవి. వాటిని సద్వినియోగం చేసుకుంటున్నామా లేదా అన్నదానిమీద మన వ్యక్తిత్వం ఆధారపడి వుంటుంది. అంచేత సన్యాసీ! కంప్యూటర్ల మతం గురించి కాదు నువ్వు ఆలోచించాల్సింది ఒక ఐక్య ప్రపంచం గురించీ, మానవ సంబంధాల గురించి. పరుగులిడే కాలంతో 'కంపీటర్'లుగా మనం వున్నామా లేదా అన్నదే తేల్చుకోవాలి. అందరితో కలిసుంటూనే మన అస్తిత్వాన్ని నిలబెట్టుకోవాలి. ఆ సంకల్పమే మన మతం కావాలి" అన్నాడు చిదంబరం ముక్తాయింపుగా.

*శుక్రవారం, 14 జనవరి 2000*

# ప్రేమ 'పోటు'

'ప్రేమ త్యాగం కోరుతుంది' అన్నది పాత సిద్ధాంతంగా మారుతోందనిపిస్తోంది. పూర్వం భగ్న ప్రేమికుడు దేవదాసు టైపులో 'జగమేమాయ బ్రతుకేమాయ' అని పాడుకోవడమో, 'ఎక్కడ వున్నా ఏమయినా నీ సుఖమే నే కోరుకున్నా' అని జెంటిల్‌గా తప్పుకోవడమో చేసేవాడు. గడ్డాలు పెంచుకుని, శాలువాలు కప్పుకుని, ఎండిన చెట్టుకి చెయ్యి అనించి విషాద గీతాలు ఆలపించి, మహా అయితే సినిమా రీలుని కొంచెం పెంచేవాడు. మరి ఇప్పుడు ప్రియురాలు తనను కాదన్నదనో, పెద్దల అభీష్టానికనుగుణంగా పెళ్లాడుతానంది అనో 'కసిక్కున' పొడిచిపారేసే అఘాయిత్యపు ప్రేమికులు తయారవుతున్నారు. పదోక్లాసు చదువుతున్న ప్రియురాలిని క్లాసురూంకెళ్లి కత్తితో నరికేసేవాళ్లూ, లెక్చరర్ ఉద్యోగం చేసుకుంటున్న సుధా హృదయిని శేషంలేకుండా కడతేర్చేవాళ్లూ పెరుగుతున్నారు. ఇవాళ్టి దేవదాసు పార్వతిని పొడిచి పారేస్తున్నాడు. ప్రేమచిహ్నంగా తాజ్‌మహళ్లు కట్టడం కాదు, ప్రేమకాదంటే ప్రియురాలికే గోరీ కడుతున్నారు. 'లవ్ ఎట్ ఫస్ట్ సైట్'లు కాకుండా ఫస్ట్ 'బైట్'లు కొరుకుళ్లూ, కొడవళ్లూ పెరుగుతున్నాయి. ఇదీ నేటి ప్రేమ పేరిట ప్రపంచం'' అన్నాడు చిదంబరం పేపరుని టేబుల్ మీద పడేస్తూ.

"చిదంబరం! ఊరికే ఎక్సైయిట్ అవకు. లోకం మారుతున్నప్పుడు లోకపు పంథా కూడా మారుతుంది.మనం కొత్త శతాబ్ది మనుషులం కదా! మానవీయ విలువలకు కూడా నవీనాకృతులు వస్తాయి తప్పదు. మనుషుల్లో క్రూరత్వం, ద్వేషం, అసూయ, జుగుప్స పెరుగుతున్నాయి కాబట్టే 'ప్రేమికులరోజు'కి మరీ ప్రాముఖ్యం వస్తోంది. ఎల్లుండి సోమవారం 'వాలంటైన్స్ డే'. ప్రేమించిన వారికోసం త్యాగాలుచేసిన వాలంటైన్స్ గతించి, వయలెన్స్ (హింస) చేసే వాళ్ళని ప్రేమికులుగా అసలు ఎలా పేర్కొనాలో నాకు అర్థం కావడంలేదు. నిజానికి ప్రేమలో స్వార్థం, సంకుచితత్వం, తను ప్రేమించినమనిషి తనదే కావాలన్న ఆరాటం అర్థంచేసుకోగలం. కాదనను. కానీ అందుకు ఏమాత్రం విఘాతం కలిగినా ఆ ప్రేమ హింసగా, ద్వేషంగా మారడాన్ని ఎలా అర్థం చేసుకోవాలో, ఆ విధ్వంసనైజం వైపుకి మనిషి మరలకుండా ఏం చేయగలగాలో ఎవరయినా ఆలోచిస్తున్నారా?'' అన్నాడు సన్యాసి రాజు.

"వలపెరుంగక కులికి
బ్రతికి మురిసేకంటే
వలచి విఫలమ్మొంది

విలపింపమేలురా' అన్నాడు కవి. 'భగ్న విలాపంలో' ఉదాత్తత ఉందేమో గానీ, వైఫల్యంవల్ల ఆత్మాహుతికి తలపడినా, తిరగబడి హత్యకు తలపడినా అది అపసవ్య లక్షణమే గానీ 'ప్రేమ' లోని ఔన్నత్య ప్రతీక కాదు. 'ప్రేమ' అనే పదానికున్న అనిర్వాచ్య ఔన్నత్యాన్ని, ప్రేమానుభూతిని సర్వనాశనంచేస్తూ ఇలాంటి చర్యలు - ప్రేమ అంటే భయాన్నీ, బీభత్సాన్నీ పెంచి, రాక్షసత్వం వైపు పోతున్నామని నిరూపిస్తున్నాయి కదా!" అన్నాడు చిదంబరం.

"నిజం చెప్పావ్! ప్రేమ అభివ్యక్తం కాకుండా గుండెల్లో వుండిపోయినా ప్రమాదం లేదు. కానీ అభివ్యక్తమైన ప్రేమ తిరస్కృతిని సహించలేనప్పుడే ఇటువంటి ప్రమాదాలు వస్తున్నాయి. తమ ప్రేమను పెద్దలు కాదన్నారని జంటగా అసువులు బాసిన ప్రేమికుల గురించి విన్నప్పుడూ, ఏ కారణాన్నో ఒకటి కాలేక ప్రేయసీ ప్రియులు ఎడబాసినపుడు సానుభూతితో 'అయ్యోపాపం' అనగలమేమో గానీ ఇదేమిటిది? కాదన్న మనిషిని కత్తితో పొడిచి చంపడం, అమానుషంగా హత్యచేయడం, అది ప్రేమ భావనలకు పరాకాష్ట అని విశ్వసించడం ఎలాసాధ్యం? ప్రేమ అంటే రెండు హృదయాలు ఒకటిగా పల్లవించడం, పలవరించడం అని అనుకునేటట్లయితే అసలు 'వన్ సైడెడ్ లవ్' ప్రేమ ఎలా కాగలుగుతుంది? అది ఆరాధనో, అభిమానమో, మూగవేదనో మాత్రమే కాగలుగుతుంది. ప్రేమికుడు పిరికివాడు కాకూడదు నిజమే కానీ పిడివాదంతో కత్తి పిడి పట్టుకుని కర్కశంగా బయలుదేరేవాడూ కాకూడదు. 'ప్రేమించు ప్రేమకై ప్రేమించు సుఖముకై ప్రేమించు ముక్తికై' అని కవి అన్నాడంటే భగవంతునికీ భక్తునికీ మధ్య అనుసంధానమైన ఉదాత్త పరీమళ భావన ప్రేమ అనేగానీ, ప్రళయానిలవీచిక అనికాదు" అన్నాడు సన్యాసిరాజు.

"ద్వేషాలను, మోసాలను, కోపాలను, క్రూరత్వాలను నశింపచేసేది ప్రేమగానీ - వాటికి దారితీసే దాన్ని ప్రేమ అనరాదు. ప్రేమ హృదయ పరిధులను విశాలం చేయాలి గానీ సంకుచిత స్వార్థ ఉన్మాదంగా మారకూడదు. నిజానికి ఈనాటి సినిమాలు విలనిజాన్ని హీరోయిజంగా చిత్రీకరించి చూపుతున్న ప్రభావంవల్లనే ఇటువంటి అనారోగ్య ధోరణులు, దుష్ట సంస్కృతి ప్రబలుతోంది. పూర్వం నాయకుడు అంటే సహృదయుడు, సంస్కారి, మృదుభాషి, స్థిరచిత్తుడు, విశ్వసనీయుడు, ప్రేమ

పాత్రుడు అయ్యుండేవాడు. అలాంటి వాడినే సమాజం నాయకునిగా భావించేది. గౌరవించేది. 'పూజకొద్దీ పురుషుడు' అంటే అటువంటి వాడని అమ్మాయిలూ తలిచేవారు. కానీ ఈ రోజు 'మేక కసాయివాడినే నమ్ముతుంది' అన్న చందాన విలనిజాన్నే హీరోయిజంగా భావించి వలచే తీరు తరుణుల్లోనూ, తరుణం చూసి తమ పబ్బంగడుపుకునే వేగవాంఛ యువకుల్లోనూ కూడా పెరుగుతోంది.

మొత్తం తరంతరం అంతా ఇలానే తయారవుతోందని నా ఉద్దేశ్యం కాదు. కానీ ప్రేమలో కూడా స్వచ్ఛతకూ, నైర్మల్యానికీ, త్యాగానికీ ఉదాత్తతకీ చోటు ఇరుకై మిగతావన్నీ ఆక్రమించుకుంటున్నాయి అనాలి. అంచేత కనీసం 'ప్రేమికుల రోజు' అని చెప్పుకునే 'వాలంటైన్స్‌డే' లాంటి రోజునయినా స్వచ్ఛమైన ప్రేమకు, సంస్కారవంతమైన స్నేహబంధానికి, విశ్వసనీయమైన వాంఛానుభూతికి ఇంత చోటిచ్చి ప్రతి హృదయం ప్రేమలోని నిజమైన గాఢత గురించీ, త్యాగ నిరతి గురించీ తలచి తన్మయమై తరిస్తుందని ఆకాంక్షిద్దాం' అన్నాడు ఏకాంబరం సన్యాసినీ, చిదంబరాన్నీ సమన్వయించి సమాధానిస్తూ.

*శనివారం, 12 ఫిబ్రవరి **2000***

# మృత్యుసాధన జీవనం

"ఇన్‌ఫ్రారెడ్‌రే అనే గ్లాసులు కళ్ళకు ధరిస్తే రాత్రి కూడా పగల్లా కనిపిస్తుంది. గనుల్లోనూ, లోతయిన భూగర్భ ప్రాంతాల్లోనూ పనిచేసేవారు వీటిని వాడుతూంటారు. చీకట్లో యాభై గజాల దూరంలోని మనిషినో, వాహనాన్నో చుట్టుపక్కల ఎలాంటి దీపపు వెలుతురు లేకున్నా ఈ గ్లాసులవల్ల చూడడం సాధ్యమవుతుంది. ఈ నైట్‌విజన్ గ్లాసులు చీకట్లో కూడా చూడగల పిల్లికళ్లల్లా దృశ్యాన్ని పట్టపగలు చేసేటంత అత్యాధునిక పరికరాలు. మనిషి పరిశోధనలు, సాంకేతిక ప్రతిభలు ఎంతలా విస్తరిస్తున్నాయో గమనించారా" అన్నాడు పాండురంగ.

'గమనించాల్సింది అదేనంటావా పాండూ' అంటూ చిదంబరం ఇలా గొంతు విప్పాడు -

"ధరలు తగ్గిన చాకులు, బాకులు, కత్తులు, కటారులు గురించి గత వారమేగా బడ్జెట్ నేపథ్యంలో మాటాడుకున్నాం. ఒకటోక్లాసు కుర్రాడు తరగతి గదిలో సాటి విద్యార్థిని తుపాకీతో పేల్చేసిన అమెరికా సంఘటనతో హింసా ప్రజ్వలనం గురించి కూడా మాట్లాడుకున్నాం. ఇంతలో చూడు! మొన్నటికి మొన్న బుధవారం రాష్ట్రంలో క్యాబినెట్ హోదాగల ఒక మంత్రి మాధవరెడ్డి మందుపాతరకు బలి అయిపోయారు. దోపిడీకి అణచివేతకూ గురి అవుతున్న సమాజంలోని వివిధ వర్గాలను ఏకీకరించి ఒక నూతన ప్రజాస్వామిక విప్లవ సాధనకు పోరాడుతా మన్న సిద్ధాంతం ప్రవచించిన వారు విప్లవం అంటే దారుణంగా చంపడం అనే రూఢ్యర్థాన్ని స్థిరీకరించే విధంగా తయారుకావడమంత విషాదం, ఆత్మవంచన మరొకటి లేదనాలి.

భూమిలో పాతిన ఓ మందుపాతర డబ్భై అయిదేళ్లు సజీవంగా వుండి ఎప్పుడయినా పేలగల అవకాశాలున్నాయని వియత్నాం యుద్ధ సమయంలో ఆమెరికన్లు పాతి వెళ్లిపోయిన మందుపాతరలు ఆ యుద్ధం ముగిసిపోయి మూడుపదులకు పైగా కాలం గడిచినా అవి ఇప్పటికీ పేలుతున్నాయన్న వాస్తవాలు నిరూపిస్తున్నాయి. అలాగే మాధవరెడ్డిని బలి తీసుకున్న మందుపాతరను చాలారోజులకు ముందే ఒక పథకం ప్రకారం పాతి వుంచారనీ, నువ్వన్నట్లుగా ఆరోజు రాత్రి వారు ఇన్ ఫ్రారెడ్‌రే వంటి నైట్ విజన్ గ్లాసులే ధరించి ఆరోడ్డులో ఎలాంటి వీధి దీపాలూ అవీ లేకున్నా అంతటి చీకట్లోనూ సరిగ్గా మంత్రి వాహనాన్నే గుర్తుపట్టి, గురిచేసి పేల్చివేసారని భావిస్తున్నారు.

అంటే ఏమిటన్నమాట.విలువయిన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా విధ్వంసానికి ఎలా ఉపయోగించాలన్న మేధస్సునీ, నడవడికనూ అలవరుచుకుంటున్నారంటే దీనిని ఏ సిద్ధాంతంగా, నూతన ప్రజాస్వామిక విలువగా పరిగణించాలో నాకు అర్థం కావటంలేదు'' అన్నాడు చిదంబరం.

“ఇలాంటి చర్యలూ, సంఘటనల వల్ల ప్రజల్లో భయభీతులే కాదు, ఆ భూపతు సిద్ధాంతాలు ప్రవచించేవారి పట్ల అంతరాంతరాల్లో ఒక ఏహ్యత, జుగుప్స, నిరాదరణ కూడా ఏర్పడడం ఖాయం. హింస మాత్రమే గొప్పదనీ, సాహసికమైన వీరోచిత కార్యమనీ, సమస్యల పరిష్కారానికి అది అనివార్యమనీ భావించడం, విశ్వసించడం జరుగుతోంది అంటేనూ, తదనుగుణమైన హింసా వాతావరణం విస్తరిస్తోంది అంటేనూ దానిని మానవ ప్రగతి అనుకోవడమంత సిగ్గుచేటు ఇంకొకటి లేదు. జీవన పరమార్థం. మృత్యు ముఖమూ, మృత్యు సాధన కాదు. జీవితం జీవించడానికే. చంపడానికి గానీ, చంపబడడానికి గానీ జీవించడం జీవనం కాజాలదు. అన్యాయాలకు, అక్రమాలకు, అవినీతులకూ, అబద్ధాలకు అన్నింటికీ మృత్యువే దండన అయ్యేట్లయితే ఈపాటికి ఈ భూమిమీద మనిషి అనేవాడి ఉనికికే అవకాశం, అర్హత, లేదు. సంస్కరణల గురించి ఆలోచించ వలసిందిపోయి సంహారాల గురించి ఆలోచిస్తూ అన్నిటికీ చావే సమాధానం అనేట్లయితే, అయ్యేట్లయితే ఇంక మనిషి గొప్పతనం ఏముంది? మనిషి జీవికకు అర్థం ఏముంది? మనం కనుగొన్నదీ, అన్వేషించిందీ, సాధించింది ఏదయినా వుంటే అది మానవాళి జీవన పరమార్థానికి ఉపకరించేది కావాలే గానీ, మానవ విధ్వంసానికి కాదు. అందువల్లే పెరుగుతున్న శాస్త్ర సాంకేతిక ప్రగతి పట్ల కూడా అది వినియోగమవుతున్న తీరు పట్ల భయవిద్వేషాలు కలుగుతున్నాయి. మానవీయ విలువలకోసం శ్రమిస్తున్న విజ్ఞులకు కూడా పెరుగుతున్న విజ్ఞానాభివృద్ధి నైతిక విలువల పతన హేతువా? అన్న సందేహం పుడుతోంది. యాపిల్ పండు కోసుకు తినడానికి ఉపయోగించాల్సిన చాకు, ఎదుటివాడి పీకె తెగగోయడానికి వినియోగిస్తే అది చాకు తప్పు అనో, అందుబాటులో లేని యాపిల్‌పండు దోషమనే అనలేం కదా! ఎదుటివాడి పీకె తెగగోసిన వాడి కారణాలను, మానసిక వైక్లబ్యాన్ని, దానికి దారితీసిన పరిస్థితులనూ వీటన్నింటినీ కూడా విశ్లేషించాల్సిందే కదా! కానీ మొట్టమొదట ఖండించవలసింది ఆ దారుణ చర్యను మాత్రమే'' అన్నాడు మామయ్య.

“బాబాయ్‌గారూ! దైవాంశ గానీ, రాక్షసాంశగానీ మానవునిలో వున్నవే. ఏది ఎప్పుడు ప్రకోపం చెందుతుందో, అందునా అణచుకుని జయించవలసిన రాక్షసాంశ ఎంత

త్వరితంగా ఎగసి వ్యాప్తం కాగలదో, గ్రహించి నియంత్రించలేకపోవడం కూడా మానవ వైఫల్యమే. ఎందరు బాబాలు, స్వాములు, గురువులు పుట్టుకువస్తున్నా వారుకూడా సృష్టి స్థితులకన్నా లయకారుల గానే హొయలు వొలకబోసే పరిస్థితి వస్తోందనిపిస్తోంది. ఎందుకంటే అశాంతి నిలయాలుగా, ద్వేషధామాలుగా ప్రాపంచిక ధనార్జనా మార్గాలుగా అవీ మారిపోతూండమేకదా కారణం'' అన్నాడు సన్యాసి రాజు.

"జననం గురించీ జీవనం గురించీ జీవుడిని ఆలోచింపచేసి, తర్కవితర్కంతో తనను తాను తెలుసుకునే తీరువైపు తరలించేది మృత్యు ఘటనమాత్రమే. చచ్చే బ్రతుకులకన్నా బ్రతికే చావుల గురించి అన్వేషించడం మనిషి జీవనం కాకపోతే బాగుంటుంది కదూ'' అన్నాడు మామయ్య విరాగిలా.

*శనివారం, 11 మార్చి 2000*

# చుట్టు'కొనే' పొగ!

**మా**మయ్య ఎంటరవుతున్నాడని ఎవరూ వేరే చెప్పనవసరం లేదు. విఐపికి పైలట్‌లాగా - మామయ్య ఎంట్రన్స్‌ను 'చుట్టవాసన' పట్టించేస్తుంది. చుట్టకూ తనకూ విడదీయలేని చుట్టరికం అంటాడు తను. "ఏదో వ్యసనం లేని వాళ్ళెవర్రా అబ్బాయ్! పగతోనో, వగతోనో కాకుండా, పొగతో గుండె నిండడం పెద్ద డేంజరు కాదులే! ఏం చేస్తాం!వ్యసనమే అన్నా, కొందరి జీవశక్తే అది. అంచేత గిరీశం అంతటివాడి చేత. 'పొగత్రాగనివాడు దున్నపోతై పుట్టున్' అనిపించారు గురజాడ వారు. ఆరోగ్యానికి హానికరం అని తెలిసినా, జీవికకూ, వ్యక్తిచేతనకూ ఆకరంగా మారిపోయిందీ చుట్ట. అంచేత తప్పదు'' అన్నాడు మామయ్య.

"అది కాదు బాబాయ్‌గారూ! చుట్టా, బీడి, సిగరెట్ అంటూ చుట్టకే అగ్రతాంబూలం ఇచ్చారు ఎందుకు? మీకు తెలుసోతెలీదో! కవి నాగభైరవగారు 'దగ్ధగీతం' అంటూ ఓ కవితా సంపుటి ఈ చుట్ట చుట్టూరానే ప్రధానంగా వెలయించారు. చుట్ట కాడని 'స్పైనల్ కార్డు' అన్నారు. తన ప్రియమైన ధూమపానం పొగలోంచే ఎన్నో పిట్టలు దిక్కుల్లో కవిత్వాలై రెక్క విప్పాయంటూ. 'మమకార బంధురమైన నా గుండె మానస సరోవరాన్ని వెదుక్కుంటూ. హంసలా ఎప్పుడో ఎగిరిపోతుంది. అప్పుడీ కట్టెకు. కట్టెలతోకాదు. పొగ చుట్టలతో చితిపేర్చండి' అంటూ ఆయన - అమృతాన్ని ఆకుల్లో నింపుకున్న చుట్టే తనను సజీవంగా వుంచుతోందన్నారు'' అన్నాడు చిదంబరం.

"మహానుభావుడు మా బాగా సెలవిచ్చాడోయ్ చిదంబరం! ప్రాణవత్ శక్తికి ఒక్కొక్కరికీ ఒక్కో చిదంబర రహస్యం వుండచ్చు. అది కొందరికి వ్యసనంగా తోచవచ్చు. బిల్ క్లింటన్ అంతటి పెద్ద మనిషికే అమెరికాలో ఓ మెరిక లాంటి పిల్ల ఉల్లాసంగా అతగాడు వుండడానికి హేతవయిందన్నారా లేదా! అదెందుకు గుర్తు చేస్తున్నానంటే, వ్యసనంగా పైకి కనిపించేవి కొన్ని, కొందరి జీవశక్తులుగా రూపాంతరం చెందినప్పుడు నిషేధాలు విధించినా అవి మృతప్రాయం కాక తప్పదు'' అన్నాడు మామయ్య.

"పొగాకుకు 'పొగరాకు' అని పేరు పెట్టిన వాళ్ళున్నారు. కానీ చూసారూ! ప్రస్తుతం పొగాకు రైతులు మునుపెన్నడూ లేని సంక్షోభం తమను ఆవరించిందని మొన్న గురువారం రాష్ట్రంలో ఆందోళన వ్యక్తం చేశారు. పొగాకు రైతులు, వ్యాపారులు,

ఎగుమతిదారులు పన్నుతున్న వ్యూహాలవల్ల తాము లక్షలాది రూపాయల ఖర్చుతో పండించిన పొగాకుకు సరియైన గిట్టుబాటు ధర లభించడం లేదని ఆర్తి చెందుతున్నారు.'' అన్నాడు సన్యాసిరాజు.

“ఓ స్థిరమైన విధానాన్ని కేంద్ర వాణిజ్య శాఖ అసలు రూపొందించలేదబ్బాయ్! పొగాకు పండించే రైతుల సంక్షేమంకోసం నెలకొల్పిన పొగాకుబోర్డు కూడా వ్యాపారులు, ఎగుమతిదారుల పక్షం వహించి తమ బ్రతుకును పొగచూరుస్తున్నాయని మొన్న నా మిత్రుడు ఎంకటయ్యి తన గోడు వెళ్ళబోసుకున్నాడు. సీజన్ ప్రారంభంలో పొగాకు బోర్డు 96.3 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తిని లక్ష్యంగా ప్రకటించింది. కానీ నిజానికి దానికన్నా 40 మిలియన్ కిలోల పొగాకు ఎక్కువే ఉత్పత్తి అయిందిట. కానీ ఎగుమతులు లభించేది వందవేల టన్నులకు కాక కేవలం వ్యాపారుల దగ్గరున్న యాభైవేల టన్నులకే అయితే రైతుకు లభించేది ఏమిటన్న అతని ఆవేదన సహజమే కదా! '' అన్నాడు మామయ్య.

“రానున్న సీజన్‌ను 'క్రాప్ హాలిడే'గా చేసి ప్రస్తుతం పొగాకు రైతుల వద్దనున్న పొగాకును ఎన్.టి.సి అంటే నేషనల్ టుబాకో కంపెనీ ద్వారా, ఆంధ్రప్రదేశ్ ఉత్పత్తిదారుల సమాఖ్య ద్వారా, కొనుగోలు చేయిస్తే బాగుంటుంది కదా! లేదా 'రైతుబంధు' పథకాన్ని ఈ పొగాకు రైతులకు కూడా వర్తింపజేయవచ్చు కదా!'' అన్నాడు సన్యాసిరాజు.

“వాళ్ళు కోరుతున్నదీ అదేనోయ్ రాజా! క్రిందటి ఏడాది సంక్షోభ సమయంలో ఎన్.టి.సి మార్కెట్‌లో ప్రవేశించి 249 వేల టన్నుల పొగాకు కొంది.అలాగే రాష్ట్ర ఉత్పత్తిదారుల సమాఖ్య కూడా 26 వేల టన్నుల పొగాకు కొంది. కానీ ఈ సంవత్సరం అవి మార్కెట్‌లోకి ప్రవేశించలేదు. సరికదా కేంద్ర వాణిజ్య శాఖ కూడా మౌనంగా వుండిపోయింది. రాష్ట్రంలో రైతుపక్షాన నిలబడి మద్దతురేటు కల్పించాల్సిన అధికారులూ, వ్యాపారులూ ఎగుమతిదారులతో కుమ్మక్కయినందు వల్లే రైతులు మోసపోతున్నారనీ, ఎన్నో కొనుగోలు కేంద్రాలు మూతపడ్డాయనీ అసలు ఎన్.టి.సి గుత్తాధిపత్యం తగ్గడానికి విదేశీ కంపెనీలకు ప్రవేశం కల్పించడం మంచిదనీ రైతు మిత్రులు అంటున్నారు. వాళ్ళ వేదన సహజమే మరి'' అన్నాడు మామయ్య.

“అంతేకాదు బాబాయ్‌గారూ! ప్రస్తుతం మన రాష్ట్రం, కర్ణాటక రాష్ట్రం రెండింటి మొత్తం పొగాకు పంట 210 మిలియన్ కిలోలు వుంది. గత పదేళ్లుగా పొగాకు రైతులకు లభిస్తున్న ధర పెరిగిన వ్యవసాయ ఖర్చులతో పోలిస్తే పాపం ఎలాంటి పొంతనా లేకుండా వుంది. క్రితం ఏడాది కిలో పొగాకుకు కేవలం 35 రూపాయలు మటుకే

వచ్చింది. పెట్టుబడి మటుకు ఐదు రెట్లు పెరిగింది. ఎగుమతి ఆర్డర్లు బాగా పెరిగితేనే కానీ ఈ సంక్షోభం నుండి గట్టెక్కడం కష్టమే" అన్నాడు సన్యాసి. "అలాగే రాబోయే సీజన్‌ను క్రాప్ హాలిడేగా ప్రకటించాల్సిందే" అని కూడా అన్నాడు.

"చుట్టను చుట్టుకుని సుఖాలూ, హాయిలే మీ బోంట్లకు వున్నాయనుకున్నాం గానీ, పొగాకు పండించే రైతులను చుట్టుముట్టుతూ ఇన్ని కష్టాలు, కడగండ్లూ వున్నాయని తెలీలేదు.

"కాలి బూడిదయాక
స్మోకింగ్ ఈజ్ ఇన్‌జూరియస్ టు హెల్త్
ఈ హెచ్చరికను నా సమాధిపైన
శిలాక్షరాలతో చెక్కించండి
వారసులకు నా వీలునామాగా వినిపించండి"

అని నాగభైరవ 'దగ్ధగీతం'లో అన్నారుగానీ, పొగాకు కాల్చేవారే కాదు, పంటగా తెచ్చే రైతులు కూడా అదే వేదననూ, ఆర్తినీ, వారసులకు మిగిల్చే స్థితి వస్తే దారుణమే మరి" అన్నాడు చిదంబరం.

మామయ్య పైపంచెతో తడిసిన కళ్లను వొత్తుకుంటూ చుట్టకోసం లాల్చీ జేబు లోకి చెయ్యి పోనిచ్చాడు.

*శనివారం, 18 మార్చి 2000*

# ఆవు సంగతులు

'మా వాడిని అర్జెంటుగా ఏ మానసిక వైద్యుడికయినా చూపించాలంటావా అని అడిగాడు సన్యాసిరాజు చిదంబరాన్ని బేలగా. 'మళ్ళీ ఏమొచ్చింది' అన్నట్లు వాళ్ళిద్దరివైపూ చూసాడు పాండురంగ.

"మొన్న పరీక్షల్లో 'గోమాత అని ఏల అందురు? తల్లి వైశిష్ట్యమును వివరింపుడు' అని ప్రశ్న వస్తే సన్యాసి కొడుకు ఆవు సంగతి వదిలేసి తల్లి సంగతి ఇలా రాసాట్ట. 'తల్లి ఆవు వంటిది. ఆవువలె తల్లి సాధుజంతువు. తల్లిపాలు ఇచ్చును ఆవుకు తోకవలె తల్లికి జడవుండును. తల్లిపాలు గొప్పబలము. వాటిలో రక్తము వుండును...' ఇలా రాసుకుంటూ పోయాడట. గోమాత గురించి రాయమంటే గోవును గురించి వదిలేసి మాత గురించి రాయడమేంటిరా అని అడిగితే, 'ఆవు గురించి ఎవరికయినా తెలుస్తుంది. ఆవుకీ తల్లికీ గల పోలికలూ, తేడాలూ కదా రాయమని ప్రశ్న అడిగిన వాళ్ళ ఉద్దేశం' అన్నాట్ట. 'పాలూ-రక్తమూ ఏమిట్రా ఈ తికమక అంతా' అని అడిగితే 'అదేమిటి మేనకా గాంధీగారే ఆవుపాలల్లో రక్తం వుంటుదన్నారు. ఆవుపాలల్లో రక్తం వున్నప్పుడు ఆవువంటి తల్లిపాలల్లోనూ ఖచ్చితంగా రక్తం వుంటుంది కదా' అని డబాయించాడట. గోవును తల్లితో పోల్చినప్పుడు వైస్‌వర్సా తల్లిని ఆవుతో పోల్చి రాస్తే తప్పేమిటని వితండవాదం వేసుకున్నాడట. అంచేత ఏం పాలుబోక ఇదిగో ఇలా సన్యాసి తలపట్టుకూర్చున్నాడు" అని వివరించాడు చిదంబరం.

పాండురంగ నవ్వు ఆపుకోలేకపోయాడు. "చూడు సన్యాసీ! మీ వాడు దినపత్రికలు చదువుతాడనుకుంటా, చదివితే చదివాడు గాని, ఇలా వాడిసొంత తెలివితేటలు ప్రదర్శించడానికి అవి ప్రేరకాలయితే ఇదిగో ఇలాంటి ఉపద్రవాలే పుడతాయి. పత్రికలు తాను అన్న మాటల్ని వక్రీకరించి వ్యాఖ్యానిస్తూ రాసాయని మేనకాగాంధీ గారు స్వయంగా వాపోయారు కదా! ఆవు పాలల్లో రక్తం వుంటుందని తాను అనలేదనీ, ఆవుపాలు వాటి దూడలకు స్వంతమనీ, ఆ తల్లిపాలను సదరు దూడలకు దక్కనీయకుండా, ఆవుపాలను పిండుకుని అమ్ముకోవడం దారుణమనీ, ఆవుపాలు తాగి ఎదగవలసిన పిల్లదూడలను ఎదగనీయకుండా. వాటిని కబేళాలకు తరలించడం అమానుషమనీ, అలా దూడలకు దక్కకుండా ఆవుపాలు త్రాగుతున్న వారు దూడల రక్తం తాగుతున్నట్లేనని, తాను ఆవేశంగా జరుగుతున్న వాస్తవాలపట్ల ప్రతిస్పందించి

ప్రసంగిస్తే - దానిని పత్రికల వారు వక్రీకరించి, ఆవుపాలల్లో రక్తం వుంటుందని తాను అన్నట్లుగా రాసి, తాను తెలివితక్కువ దాన్ననీ, ఏ మానసిక వైద్యుడినో సంప్రదించాలనీ అనేంత లెవెల్లో వ్యాఖ్యానించారనీ మేనకగారు వాపోయారు. ఇంతటికీ కారణం ఆవిడ ఉపన్యాసానికి పత్రికలు చేసిన రిపోర్టింగే కదా కారణం. మీవాడు కూడా మేనకగారి లాగానే ఆవేశంతో గోమాత అన్న మాటలో 'గో' కన్నా 'మాత'కు ప్రతిస్పందించి ఆవును తల్లితో కాకుండా, తల్లిని ఆవుతో పోల్చి రాసాడంటే భవిష్యత్తులో పత్రికా రిపోర్టింగులో కొత్త పుంతలు తొక్కే విలేఖరిగా ఎదిగే ఛాన్సులు బోలెడున్నాయిలే. మరేం భయపడకు. ఎవరు ఎలా మాట్లాడినా తాననుకున్నట్లే రిపోర్టింగ్ చేసే లక్షణం నేటి విలేఖరులలో కొందరి ఉపజ్ఞే. మీటింగుకో, సభకో వెళ్ళకుండానే ఆహ్వానపత్రాన్ని అనుసరించి రిపోర్టింగ్ చేసేవాళ్ళూ, రానివాళ్ళను కూడా వచ్చినట్లే కాక, వచ్చి అనర్గళంగా ఉపన్యసించినట్లుగా వారి ప్రసంగంలోని సారాంశాన్ని కూడా రాసేసేవారూ వున్నారు. మొన్న ఓ పెద్ద మనిషి అనివార్య కారణాలవలన తాను ఒక సభకు వెళ్ళకపోయినా తాను ఆ సభకు హాజరై ప్రసంగించినగట్లుగా తన ప్రసంగ సారాంశం కూడా రావడం చూసి నివ్వెర పోయాడు. సదరు పత్రికా విలేఖరి ఎవరో కనుక్కొని అతగాడికి ఫోన్‌చేస్తే "మీరు సాధారణంగా ఏరోజూ ఏ సభా ఎగవేయరు కదాసార్! పైగా రోజూ మీ ప్రసంగాలను వింటూనే వుంటానాయె. మీరు వస్తే ఏంమాట్లాడతారో నాకు తెలీదా! అంచేత మీ సభను మిస్ చేసానేమో అనే ఆవేదనతో, అయినా మీకు అన్యాయం జరగకూడదనే ఆకాంక్షతో వార్త రాసేసాను సార్! మీ సభ మర్నాడు ఏ పేపర్లో రిపోర్ట్ కాకపోయినా మీరెంత ఫీలవుతారో కూడా నాకుతెల్సుకదా సార్! అని గొప్ప వినయ విధేయతలతో సమాధానం ఇచ్చాడట. సదరు నిత్యసభా ప్రాసంగికుల వారికి తనమీద అతనికున్న భక్తి శ్రద్ధలకు, ప్రేమాదరాలకు నవ్వాలో, ఏడవాలో అర్థం కాలేదట. నిత్యం వుండేదానికి నవ్యత్వం సంతరించాలనే విలేఖరి ఉత్సుకతే - సన్యాసీ! మీవాడికి గూడ వున్నట్టుంది. అంచేత మరేం బాధపడకు. తల్లిని ఆవుతో పోల్చి, ఆవుకు తోకలానే తల్లికి జడ వుండును అని రాసినందుకు స్త్రీ వాదులందరూ మీ వాడిపై నిరసన ప్రకటించడంద్వారా ముమ్ముందు మీ వాడికి నెగిటివ్ పబ్లిసిటీ వచ్చి ఆ విధంగా కూడా పేరు తెచ్చుకోవచ్చు" అన్నాడు పాండురంగ.

"నిజమే సన్యాసీ! కొందరికి వట్టి ఆవు వ్యాసమే వచ్చునుకో. అటు తిప్పీ ఇటు తిప్పీ అన్నిటికీ దాన్నే వాడుతుంటారు. మన మంత్రులు కొందరు ఏ సభ జరిగినా, తాము ఏం మాట్లాడినా అందులో తప్పక ముఖ్యమంత్రి గారిని పొగడడమో, లేక తాము వెళ్లిన విదేశీయానాన్ని ఎలాగోలాగ ప్రస్తావించడమో ఎలా చేస్తుంటారో - అలాగే ఇదీన్నీనూ,

ఆవు గురించి మేనకాగాంధీ గారికీ, మీ వాడికీ తెలిసిన సంగతుల కంటే వేరేవి పాండురంగయినా చెప్పగలడా?" అన్నాడు చిదంబరం ఉడికిస్తున్నట్లుగా.

"పాండూ! అలా సవాళ్ళు విసరకు. రెండువేల సంవత్సరాలకు ముందు ఆవులు చాలా ఎత్తుగా వుండేవి. అప్పుడు నిలుచునే పాలను పితుక్కోవాల్సి వచ్చేదిట. 18వ శతాబ్దం నాటికి ఒక పెరిగిన ఆవు - దూడకంటే పెద్దదిగా వుండేది కాదు. పరిణామ ప్రక్రియవల్ల అద్భుతమైన మార్పు వచ్చేసింది. అయితే సంకరజాతుల ఉత్పాదన విధానాలవల్ల నికరంగా 960 రకాల ఆవులు ఏర్పడ్డాయి. ఆవులు సాధారణంగా 1.5 మీటర్ల ఎత్తు కంచెలను పిల్లి అంత సామర్థ్యంగా దాటగలవు. గంటకు 40 కి.మి. వేగంతో పరుగెత్త గలవు. ఆవులకు ఉప్పుఎక్కువ ఇష్టం అనుకుంటారు గానీ వాటికి ఉప్పు, చక్కెర రెండూ పెట్టినప్పుడు సాధారణంగా చక్కెరనే కోరుకుంటాయి. ఆవుల వాసనాశక్తి అమోఘమైనది. వెయ్యి దూడలుగల మందలో కూడా తన దూడను ఇట్టే గుర్తిస్తుంది. ఆవు అరుపులో పదకొండు రకాల స్వరాలు పుడతాయి. దూడను పరామర్శించడంలో ఆవు - తల్లిగా ఇలాంటి పలు స్వరాలు జనింపచేస్తే, దూడలు అవి సులభంగా గ్రహిస్తాయి. ఆవులు బాగా ప్రవృద్ధి చెందటానికి వాటికీ మానసికశాంతి చాలా ముఖ్యం" అన్నాడు పాండురంగ.

"భేష్ పాండురంగా! విలేఖరి అంటే నీలా వుండాలి. మా వాడిని నీ దగ్గరకు పంపిస్తా సెలవుల్లో, వాడి ఆవు వ్యాసాన్ని అధునీకరించి పుణ్యం కట్టుకో" అన్నాడు సన్యాసి, చిదంబరం చిద్విలాసంగా నవ్వుతూ వింటూంటే.

*శనివారం, 29 ఏప్రిల్ 2000*

# ఆ'రోగమే' మహాభాగ్యం

"చిన చేపను పెద చేపా పెద చేపను పెదచేపా..." అంటూ వచ్చాడు సన్యాసిరాజు. 'ఏంటి రాజుగారూ! ఇవాళ మీ ఇంట్లో చేపల కూరేమిటండీ' అన్నాడు ఫణి నవ్వుతూ. 'ఒరేయ్ తమ్ముడూ! నీకసలు బుర్రలేదేంట్రా? చేపా చేపా అంటే చేపల గురించనేనా? రాజుగారు. చిన చేపను పెదచేపా అని అంటున్నారంటే, బలహీనుడిని బలవంతుడు దోపిడీ చేస్తున్నాడనే విషయాన్నే చెబుతున్నారు. అంతేనా అన్నయ్యగారూ!' అంది మా ఆవిడ.

'ఆహా ఓహో! కరెక్ట్‌గా కనిపెట్టేసావమ్మా! రోజు రోజుకు సమాజాన్ని చూస్తోంటే వొళ్ళు మండిపోతోంది. అధికారం, డబ్బు వున్నవాడిదే పెత్తనం. అది వున్నవారు కూడా వాళ్లూ వాళ్ళూ సయోధ్యగానే వుంటారు. ఇద్దరూ కలిసి పేదవాడినీ బలహీనుడినీ అణచి, లేనివాడిని మరింత లేని వాడిగా, వున్నవాడిని మరింత వున్నవాడిగా చేయాలని చూస్తారేకాని, సమాజ ఫలాలు, ప్రగతి ప్రణాళికల ఫలితాలూ అందరికీ సమానంగా అందాలని మాత్రం ఆలోచించరు. చిన్న విషయం దగ్గరనుంచి పెద్ద విషయం దాకా అంతే! ప్రపంచ బ్యాంకు నిబంధనలకు ఇచ్చే విలువ సామాన్యుడి ప్రయోజనాల పరిరక్షణకు ఛస్తే ఇవ్వరు. కరెంటు, నీరు అన్నీ ఖరీదే! భరించేది, నిజాయితీగా బ్రతికే సామాన్యుడేకాని, అక్రమార్జనలు, స్కాములుచేసే దొరలు కాదుకదా!వారికేం? వారికి వేటి ధరలు పెరిగినా చింతలేదు. చేతనయినంత దోపిడీ స్థాయిని పెంచుకుంటూ పోయి, అన్యాయమని అరిచిన వాళ్ళ నోళ్ళను సైతం - తమకున్న డబ్బూ, అధికారంతో చట్టాలను కూడా చుట్టాలుగా చేసుకుని, అన్యాయమన్న వాడినే అన్యాయమైపోయేలా చేస్తారు, చూస్తారు. అంతకన్నా చిత్రం ఏమిటంటే ఆ డబ్బూ, అధికారాలతోనే పేదవాడితో పేదవాడినే మొట్టించే కుట్రలూ పన్నుగలరు. మొత్తానికి చినచేపను పెదచేపా పెదచేపను పెదచేపా సూత్రంతో ఒకరినిమించి ఒకరు ఎదుటివాడిని మింగి జీర్ణించుకోవడం ఎలాగా అనే ప్రయత్నిస్తుంటారు" అన్నాడు సన్యాసిరాజు.

'నిజమే రాజుగారూ! అంతదాకా ఎందుకు? ప్రతిదాన్నీ వ్యాపారం చేసుకోడానికీ, దోపిడీ మార్గంగా మలచడానికీ ప్రయత్నించే ఓ మింగుడుగాళ్ళ వర్గం ఎప్పుడూ వుంటూనే వుంటుంది. అస్మారోగుల కోసం బత్తిని సోదరులు ఉచితంగా పంపిణీచేస్తూ వచ్చిన చేపమందు వ్యవహారం ఏటికేడాదీ ఎలా పరిణామం చెందిందీ ప్రత్యక్షంగా

కనబడుతూనే వుంది కదా! మెన్నటికి మొన్న చేపమందు పంపిణీ హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏర్పాటుచేసినప్పుడు నకిలీపాస్‌ల వ్యవహారం, బ్లాక్‌లో చేపమందు అమ్మకం ఎంత జోరుగా జరిగిందో వార్తలు రానేవచ్చాయి. సంక్షేమ విషయాల్లో సైతం సంక్షోభాన్ని సృష్టించడానికీ, ఎదుటివారి అవసరాలను ఆసరా చేసుకుని వారి అమాయకత్వాన్నీ అత్రుతనూ అడ్డం పెట్టుకుని తమ పబ్బం గడుపుకునే స్వార్థపరులూ, కొందరు దాదారాయుళ్ళూ ఎలా వ్యవహరించారో ఎందరికో అనుభవైక వైద్యం అయింది కూడా' అన్నాడు ఫణి.

'అసలు చేపమందులో చేప ముఖ్యమా, మందు ముఖ్యమా తెలియని వాళ్ళు కూడా వున్నారు కనుకే, చేపలను బ్లాక్‌లో కొందరమ్మితే, మందును పెద్దమొత్తంలో కాజేసి దాన్ని బ్లాక్‌లో అమ్మినవారు కొందరున్నారట. చేపతో కాకుండా అరటిపండుతో కూడా మందు సేవించవచ్చని ఇంకొందరు వెజిటేరియనిజాన్ని ప్రచారంచేసి క్యాష్ చేసుకోజూసారట' అంది మా ఆవిడ.

'అసలు ఉబ్బసవ్యాధి తగ్గడానికి చేపమందు ఎంతమేరకు ఉపయోగకరం అని శాస్త్రీయ ఆధారంఏదీ ఇంతవరకూ దొరికినట్లు మాత్రం లేదు. మందుతయారీ అంతా బత్తిని కుటుంబ రహస్యమేనంటున్నారు కొందరు. రెండు మూడేళ్ళు వరుసగా వేసుకుంటే తమకు నయమైందని కొందరంటే, తమకేమీ గుణం కనిపించలేదని అన్నవారువున్నారు. పథ్యం సరిగ్గా పాటించకపోతే ప్రయోజనం లేకుండా పోతుందని అన్నవారున్నారు. అసలు ఏటికేడాదిగా చేపమందుకోసం వచ్చేవారి సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోతోందని కొందరంటున్నారు' అన్నాడు ఫణి.

'బిలీఫ్ ఈజ్ యువర్‌గాడ్' అన్నాడు టాల్‌స్టాయ్. దేనికైనా నమ్మకం విశ్వాసం ప్రధానం ఫణిగారూ! ఎంతో మందికి నమ్మకం కుదిరింది కనుకే - చేపమందు పంపిణీ మృగశిరకార్తె ప్రవేశవేళ ఒక బృహత్ కార్యక్రమంగా రూపొందింది. ప్రభుత్వ ప్రమేయం, పోలీసుల ప్రమేయం, దళారుల ప్రమేయం సంభవించింది' అన్నాడు సన్యాసి.

'అదేనండి బాబూ అంటూన్నది! నమ్మకమూ, విశ్వాసమూ పెరిగినకొద్దీ అందులో ఒకవంక మౌఢ్యమూ, మరోవంక దోపిడీ జాడ్యమూ ప్రవేశిస్తుంటాయి. ఎక్కడయితే బాహుళ్యం వుంటుందో, అక్కడ నెమ్మదిగా బాఢ్‌కోతనం ప్రవేశిస్తూంటుంది. ప్రచార్భారటులూ, హంగామాలు పెరిగినకొద్దీ నిష్ఠ, నిజాయితీ పలచబడడం మొదలుపెడతాయి. సేవ కాస్తా షేవ్‌గా పరిణామంచెందే పరిస్థితులు పుట్టుకు వస్తాయి. అక్రమాలు, అన్యాయం, దోపిడీలు ఎంటరవుతాయి' అన్నాడు ఫణి.

'మా తాతగారు అంటూండేవారు. మహిమాన్వితమైన మంత్రశక్తులు కూడా స్వార్థం ప్రవేశిస్తే సమూలంగా నశించిపోతాయిట. సేవాపరాయణులు కూడా ప్రచారార్భటుల్లో పడితే శాంక్టిటీ. అంటే పవిత్రత అంతరిస్తుందిట. అసలు విశ్వాసం మందుగా పనిచేస్తుందని పెద్దలు ఏనాడో చెప్పారు. మందీ మార్బలాలూ, అట్టహాసాలూ, తన అవసరం తీరేందుకు అత్రపడిన మనిషిని భయాందోళనలకు గురిచేసే చుట్టూ పరిస్థితులూ, క్రమేపీ విశ్వాసాన్ని దెబ్బతీసి చంపేసే ప్రమాదం ఉంది. చిన చేపను పెదచేపా పెదచేపను పెదచేపా అనే సూత్రం అణచివేత, దోపిడీ, దౌర్జన్యాలకే కాదు నమ్మకాలకూ విశ్వాసాలకూ కూడా వర్తిస్తుంది. అవసరంపై అవకాశం, అవకాశంపై ఆశ, ఆశపై అత్రమం అధిపత్యం పెంచుకుంటున్న కొద్దీ మూలాల్లో కదలిక వచ్చి విశ్వాసం హరించుకుపోవచ్చు. అరోగమే మహాభాగ్యం అని, దానిమీద సేవగా కాక డబ్బు చేసుకోవడంగా బ్రతికే వాళ్ళ ఆటకట్టబడక తప్పదు' అంది మా ఆవిడ కాఫీ పెట్టడానికి లేస్తూ. సన్యాసిరాజు సాలోచనగా తల పంకించాడు.

*శనివారం, 10 జూన్ 2000*

# అమ్మాయే పుట్టాలీ....

"శ్రీదేవి మళ్ళీ కడుపుతో వుంది తెలుసా?" అంది మా ఆవిడ.

"ఎవరూ! మన లలితగారి పెద్దమ్మాయా? తనకు ఇద్దరు పిల్లలు, ఎప్పుడో ఆపరేషన్ చేయించేసుకుంది అన్నావుగా" అన్నాను నేను.

"మీకు ఎప్పుడూ మీ ఫ్రెండ్స్, బంధువుల గోలే! నేను చెబుతున్నది సినీ నటి శ్రీదేవి గురించి. మొన్న ఓ ఫిలిం జర్నల్‌లో ఈ విషయం బ్రహ్మాండంగా రాశారు" అంది మా ఆవిడ.

హతోస్మి! శ్రీదేవి కడుపుతో వుంటేనూ, మాధురీదీక్షిత్ కన్సీవ్ చేయబోతూంటేనూ నీకేమిటిట ఆనందం? వాళ్లేమయినా నీకు అమ్మతరుపు చుట్టాలా, అత్తతరుపు చుట్టాలా" అన్నాను నేను శ్రీమతిని ఉడికిద్దామనే.

"అదేమన్నమాట! వాళ్లు లక్షలాది జనాలకు పరోక్షంగానైనా పరిచితులు కనుకే వారి విషయాలు వార్తలవుతాయి. మీ లలితగారి పెద్దమ్మాయి శ్రీదేవి కడుపుతో వున్నా, లేకున్నా లోకానికేం పట్టదు. సినిమా నటి శ్రీదేవి కనుకే అందరూ అనుకునేది. తనకు ఇంతకుముందు ఒక పాప కదా! ఇప్పుడు బాబుపుడతాడని ఆశ పడుతున్నారట" అంది శ్రీమతి.

"అక్కా! చూస్తుండు. ఈసారి కూడా తనకు పాపే పుడుతుంది" అన్నాడు ఫణి. శ్రీమతికి ఛర్రున కోపం వచ్చింది. "ఎందుకురా అలా అంటావ్? బాబుకావాలని అనుకుంటూంటే 'పాప పుడుతుంది'అని పెద్ద జ్యోతిషం తెలుసున్న వాడిలా ప్రకటిస్తున్నావ్! అసలు నీకు శ్రీదేవి అభిమాన నటి కాదా ఏమిటి అలా అంటున్నావ్! అయినా అంత ఇది పనికి రాదురోరేయ్!" అంది తను.

"మరదే మండుద్ది. ఆడపిల్ల పుడుతుందంటే నీకెందుకంత ఉక్రోషం. ఒక ఆడపిల్ల పుడితే ఇంక ఖచ్చితంగా మగ పిల్లాడే పుట్టాలని రూలుందా? మగపిల్లాడిని కనడం కోసమనే మళ్ళీ కడుపుతో వుందా? అసలు ఫిలిం ఫీల్డులోనయినా హీరోయిన్లకు వున్న గిరాకీ, గ్లామర్ హీరోలుకుందా చెప్పు. అసలు మీ అడవాళ్ళే ఆడపిల్లల గురించి ఆలోచించడం లేదనిపిస్తుంది. మారుతున్న సమాజంలోనయినా 'గర్ల్‌ఛైల్డ్' ప్రాముఖ్యంపెరగాలి"అన్నాడు ఫణి ఎక్సయిటవుతూ.

"సరే నువ్వు శ్రీదేవి-బాలీవుడ్ సంగతి చెబుతున్నావ్! బ్రిటిష్ పత్రికల టాబ్లాయిడ్‌లు ఛెర్రీ బ్లెయిర్ 'బేబీ' గురించి కొద్దినెలలుగా రాస్తూనే వున్నాయి తెలుసా! శృంగార రసాధి దేవతగా కీర్తింపబడుతున్నందుకే 'మడోన్నా' కడుపుతో వున్న విషయం గొప్ప న్యూస్ అయి కూచుంది. ఆమె కడుపులో రూపుదిద్దుకుంటున్న జీవం గురించి అప్పుడే బోలెడు ఊహాగానాలు, కబుర్లు దట్టిస్తున్నాయి అక్కడి పత్రికలు. ఆమెకు పుట్టబోయే పిల్లవాడు (అవును! మగపిల్లాడినే కలలుకంటున్నాయి పత్రికలు కూడాను) వాడు ఎలా వుంటాడు, పెరిగి ఏమవుతాడు అని ముచ్చట్లాడుతున్నాయి. మడొన్నా స్వయంగా తాను 'వట్టి మనిషి' కానందువల్ల వచ్చే సమస్యలను సాల్వ్ చేసుకునే బిజీలో వుంటే, పుట్టబోయే తండ్రి - ఓ భారతీయగురువు సలహామేరకు భార్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ గంటల తరబడి ఆమె వీపు రాస్తున్నాట్ట కూడాను" అన్నాను నేను శ్రీమతి సినీ సరదాకి విదేశీ మసాలా జోడిద్దామని.

"సర్లెద్దురూ! మడొన్నా సంగతి వేరు. శ్రీదేవి సంగతి వేరు" అంది మా ఆవిడ. తన లాజిక్కేమిటో నాకు తెలీలేదు. మడొన్నా అయితేనేం, శ్రీదేవి అయితేనేం - స్త్రీ స్త్రీయే. సినీ నటి సినీ నటే. ఆమె పాప్ స్టార్ అయితే, పోనీ ఈమె టాప్ స్టార్. కడుపు రావడం సంతోషవార్త అయితే ఎవరి విషయమైనా సంతోషించాలి కదా! ఆ మాటే అందామనుకుంటూంటే ఫణి టాపిక్ మలుపు తిప్పాడు.

"అక్కా! శ్రీదేవి కడుపుతో వున్న కబురు కంటే, ఇప్పుడు ప్రియాంకాగాంధీ కడుపుతో వున్న విషయం జాతీయ వార్త అయింది. రాబర్ట్ వధేరా ప్రియాంకను తల్లిని చేసాడు. ఢిల్లీలోని దాదాపు మూడునాలుగు పత్రికలు తమ మొదటి పేజీలో ప్రియాంక కడుపుతో వున్న విషయం గొప్పగా రాసాయి. తల్లిగా సిగ్గుపడుతున్న (అయ్‌మీన్! ఆనందంతో) ప్రియాంక ఫోటో కూడా వేసాయి. ఇప్పడీ వార్త దేశ ప్రగతిలో భాగం అన్నంతగా సంతోషిస్తున్న వారున్నారు. ఒక కొత్త ఉత్సాహాన్నీ, ఆశనూ పొందుతున్నారు కూడాను. ఆమెకు పుట్టబోయే బిడ్డ అమ్మాయి అయితేనే బాగుంటుందనీ, గర్ల్‌ఛైల్డ్ గురించి మన దేశం ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనంగా రాణిస్తుందనీ, మహిళల పట్ల వివక్ష మనకు లేదని చాటడానికి దోహదంగా వుంటుందనీ భావిస్తున్న వారున్నారు" అన్నాడు ఫణి.

అసలు మన దేశంలో పెళ్లయ్యాక అమ్మాయి నెల తప్పడం కోసం ఎదురు చూడడం, ఆ సంతోష వార్త కుటుంబాన్ని కుదపడం, గాజులు పెట్టడం, సీమంతం వేడుకలూ, పుట్టబోయే బిడ్డ గురించీ. పెట్టబోయే పేరు గురించీ కలలూ, ప్రణాళికలూ,

అమ్మాయి మగబిడ్డనే కనాలనే అంతర్గత వాంఛలు, ఏ కారణం చేతయినా ఆడ శిశువు పుడితే నైరాశ్యం, ఆడపిల్లను కన్న ఆమె పట్ల ఉదాసీనత, "నెలనెలా డాక్టర్ పరీక్షలు చేయించి బాగా పోషకాహారం పెట్టింది ఆడ పిల్లను కనడానికేనా" అన్న తరహా ఈసడింపులు, భర్త, అత్తమామల ఆరళ్లు - ఇలాంటి కథలన్నీ చాలా మామూలు అయిపోయాయి. కడుపుతో వుండడం ఎంత కమనీయ వార్తో, ఆమె సుఖంగా ఆడ పిల్లను ప్రసవించింది. అన్నదీ అంత కమనీయ వార్తగా దేశంలో విస్తరించగలగాలి. మడోన్నా కానీండి, శ్రీదేవి కానీండి, ప్రియాంక గాంధీ కానీయండి - ముఖ్యంగా గ్లామర్ ప్రపంచంలో, ప్రముఖ స్థానాల్లో వున్న స్త్రీలు ఇవాళ సమాజంలో తమ ప్రభావాన్ని చూపుతున్నారు కనుక, అందుకే అలాంటి వారికి ఆడపిల్లలు పుట్టడం అనేది జరిగితే అది సమాజానికి మంచినీ మేలునీ చేకూర్చు వార్తే కాగలుగుతుంది. 'శ్రీదేవికీ ఆడపిల్ల, ప్రియాంకకీ ఆడపిల్ల , మా అమ్మాయికీ, మా కోడలుకీ కూడా ఆడపిల్ల' అన్న తరహా భావనవల్ల మానసికంగా ఒక ఆనందం, ప్రశాంతత లభించేటప్పుడు ఆడపిల్ల జననాన్ని కూడా ఆనందంగా ఆహ్వానించే సుగుణం పెంపొందడం నిజంగా సంతోషదాయకం కదా! ఈమాటే నేను శ్రీమతితో అంటే -

"అవునండీ నిజమే! నన్నడిగితే శ్రీదేవికీ, మడొన్నాకీ, ప్రియాంకకీ అందరికీ ఆడపిల్ల పుడితేనే బెస్టు! ఒరేయ్ ఫణీ! నీ మాటే రైటవ్వాలిరా! గర్ల్ ఛైల్డ్ అంటే మహాలక్ష్మి పుడితేనే సమాజాన్ని పట్టి పీడిస్తున్న అనేక దరిద్రాలు వదులుతాయి. ఆడయినా మగయినా శిశోదయం సంతోషప్రదం అయినప్పుడు, 'ఆడ శిశువు జననం'మరింత ఆనందప్రదం కావాలని ఆకాంక్షిద్దాం". అంది తనూ తలపంకిస్తూ.

*శనివారం, 17 జూన్ 2000*

# పే'పర్స్' న్యూస్!

"వెధవ పేపరు వెధవ పేపరాని" అంటూ మా ఆవిడ సణుక్కోవడం నాకు స్పష్టంగానే వినిపిస్తోంది. ఎటొచ్చీ అదృష్టవశాత్తూ ఆవిడ సణుగుడు వేళకి పేపరు చదువుతున్నది నేను కాదు. ఈ స్నేహిత్‌గాడు కూడా తక్కువవాడుకాదు. మొహం కడుక్కుని పాలు తాగేసి స్నానం చేసేసి అప్పుడోసారి అవాల్టి న్యూస్‌పేపర్ తిరగేస్తే ఇబ్బందేం లేదు. కానీ వాటన్నింటినీ వాయిదావేసి పేపరు పట్టుక్కూచుంటేనే మరి వాళ్ళమ్మకు వొళ్ళు మండేది. 'మీరయినా చెప్పరేం' అని ఆవిడ నన్ను కూడా సీనులోకి లాగి గదమాయిస్తూంటుంది. న్యూస్‌పేపర్‌కు అడిక్ట్ అయ్యేవాడి బలహీనతేమిటో నాకూ తెలుసు. అలా హెడ్‌లైన్స్ చూసి వదిలేద్దామని తిరగేసినా ఏదో అంశం పట్టుకుంటుంది. దాన్నిచదివి కొంచెం చూపు పక్కకు మళ్లిస్తే మరింకేదో ఆకట్టుకుంటుంది.

ఇంతచేసీ చదివే విషయం మరీ మహత్తరమైంది కాకపోనూవచ్చు. 'వెధవ పేపరు' అని మా ఆవిడ అన్నది అసలు కర్మధారయమా షష్ఠీతత్పురుషమా అని నాకు డౌటు వచ్చింది. వెధవయొక్క పేపరా? వెధవదయిన పేపరా? ఆ నింద పేపర్‌కా పేపర్‌ను చదూతున్న వాడికా అంటే, పైకి పేపర్ కారణంగా పనులు ఆలస్యం చేస్తున్న పుత్రరత్నానికి అనిపించినా, అసలు అంతటికీ కారణం పేపర్ కనుక టోటల్‌గా న్యూస్‌పేపర్ పట్ల నిరసన కావడానికి కూడా అవకాశముంది.

"అయినా ఆ పేపర్లో ఏముంటుందో నాకర్థంకాదు. గంటలు గంటలు దానికి అతుక్కుపోవడం ఏమిటో అస్సలు అర్థంకాదు. అయినా అది ఇంట్లోనే వుంటుంది కదా, సాయంత్రమో రాత్రో చదూకోవచ్చు కదా, పొద్దున్నే విలువైన సమయాన్ని దినపత్రికకోసం వృధా చేయడం ఎందుకు" అని శ్రీమతి రుసరుస కంటిన్యూ అయింది. నిజమే పొద్దున్నే న్యూస్‌పేపర్ చదవడమెందుకు? వార్తల్లోని ముఖ్యాంశాలు ఏ రేడియోలోనో టీవీలోనో మహాఅయితే ఓ అయిదు పదినిముషాల్లో అందుకునే అవకాశం వుంది కదా అని నాకూ ఓ క్షణం అనిపించింది. కానీ అక్షరాస్యుడై అంతో యింతో ఆలోచించేవాడికి పేపర్ తిరగేస్తే తప్ప తోచని స్థితి చాలామందిలో వుంది.

కానీ నిజానికి ఒకప్పటి వార్తాపత్రికలకున్న విలువ ఈనాడు తగలబడిపోతున్న మాట మాత్రం వాస్తవం. మొన్న స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో స్వయంగా

రాష్ట్రపతి నారాయణన్‌గారు 'నేరస్తులను హీరోలవలె గ్లామరైజ్ చేసి చిత్రించడం పత్రికలకు తగదని' అన్నారు. ఓ పాశ్చాత్య తత్త్వవేత్త అంటాడు. "మానసిక క్రమశిక్షణ దృష్ట్యా పత్రికలు చదవడం హానికరం. పదినిముషాలలో మనస్సు నలభై విషయాలను గురించి ఆలోచించడ మంత దరిద్రం మరోటిలేదు" అని.

కేంద్రం గురించీ, రాష్ట్రంగురించీ, సిటీలోని ఓ జోన్ గురించీ, ఓ దారి దోపిడీ గురించీ, ఓ రేప్ గురించీ, ఓ హత్య గురించీ, మరో ఆత్మహత్య గురించీ, విదేశీ ప్రముఖుని రాక గురించీ, రోడ్డు ప్రమాదం గురించీ, మధ్యలో క్రీడల గురించీ, బిజినెస్ గురించీ, ఇలా 'నానాగోత్రేభ్యాం' తంతులో పేపర్ వుంటోంది కాబట్టే చూసే ఎవ్వరైనా వారి వారి మానసిక ధోరణి దృష్ట్యా ఏదో అంశంతో ముందు పట్టుకుని ఆ తర్వాత ముందుగా చదివిన వార్త తాలూకు ఉత్కంఠంనుంచో, విషాదంనుంచో తేరుకోవడానికి మరో వార్తాంశంవైపుకి జరుగుతూ, మధ్యలో ఎడిటోరియల్‌వైపో, సెంటర్ ఆర్టికల్ వైపో పఠనాన్ని మలుచుకుంటూ - మొత్తానికి పేపరు పట్టుకుంటే ఓ పట్టాన వదలలేనితనంతో సతమతమయ్యేవారు ఎందరో వున్నారు.

సెన్సేషన్, వ్యాపారమూ వార్తాపత్రికల రెండు కళ్ళు అయిపోయాక వాటి దృష్టి మారిపోవడంలో ఆశ్చర్యం ఏముంది. అంతదాకా ఎందుకు? ఒకప్పుడు అంటే ఓ పది ఇరవై ఏళ్ల క్రితం వరకూ కూడా రాష్ట్రపతి దేశప్రజలనుద్దేశించి చేసిన ప్రసంగం పేపర్లహెడ్‌లైన్ ఐటమ్‌గా వస్తూ, వారి ప్రసంగం పూర్తి పాఠాన్ని కూడా ప్రచురిస్తుండేవి పత్రికలు. ఇప్పుడు రాష్ట్రపతి ప్రసంగాంశమైనా, మొదటి పేజిలోనే అయినా ఓ మూలకిపోతుంది. దేశ ప్రథమ పౌరునిగా ఆయనకు ఇచ్చే గౌరవం అది. ఆయన ఏం మాట్లాడినా అది విలువైనదని కావాలన్న రూలేంలేదుకదా అంటారు. వీరప్పన్ వ్యవహారం ఫ్రంట్‌పేజీ హెడ్‌లైన్స్‌గా వుండడం ఎందుకు విధాయకమవుతోందో, అందరికీ పనికివచ్చే ఒక సంక్షేమ అంశం ఒక అప్రధాన వార్తగా మరెక్కడో ఎందుకు చోటుచేసుకుంటోందో ఎవరైనా వివరించగలరా? దేనినైనా 'గ్లామరైజ్' చేయడం గురించి రాష్ట్రపతి ఆర్తితో వ్యాఖ్యానించారంటే అందులో గింజుకోవలసిందేమీ లేదు. 'వ్యాపార జర్నలిజమే' ప్రధానాంశం అయినప్పుడు పత్రికల ధోరణి అలానే వుంటుందాయె మరి.

పత్రికలకు సమాజంపట్ల బాధ్యత లేదా అంటే - బాధ్యత వుంది కనుకే జన జీవనంలోని అంశాలలోకి చొచ్చుకుపోతున్నామనీ, అస్తవ్యస్త సమాజానికి అసలైన దర్పణం పడుతున్నామనీ అంటారుగానీ, పత్రికల యజమాన్యానికి నేడు కావలసింది ముందు సర్క్యులేషనే కానీ స్థాయీవిలువలు కావు. ఓ పేపరుకు పేరు రావడానికి విలువలను దిగజార్చడానికయినా వారు రెడీ అయిపోతుంటే పత్రికలమధ్య పోటీకూడా

అందించే వార్తా విలువలబట్టీ, కథనాలబట్టీ, బాధ్యతాయుతమైన ధోరణిబట్టీ కాకుండా, కేవలం అమ్మకాలను పెంచుకునే మార్గంలో - ఏ వార్తలు మార్కెట్ సరుకులు కాగలుగుతాయో అటే మొగ్గు చూపడం జరుగుతోంది మరి.

అయితే మరో తమాషాఏమిటంటే నేరాలు, ఘోరాలు గ్లామరైజ్ అవుతూ, ప్రతి నాయకులే హీరోలుగా చిత్రితమవుతున్నా, వీటికి కొమ్ము కాస్తున్న రాజకీయాల సంగతీ, ఆ రాజకీయ నాయకుల సంగతీ వచ్చేసరికి ఎందరు నిజంగా నేరమయ రాజకీయాలు నెరపుతున్న వ్యక్తులను డీ గ్లామరైజ్ చేసి తూర్పారబట్టి ధైర్యంగా ఎండగట్టగలుగుతున్నారు? 'ఒకేఒక్కడు' - పత్రికలు ఎలా వుండాలో, వార్తలు ఎలా వుండాలో చెప్పగల దీటుగాడిగా జర్నలిస్టులను కొనేసుకోగలిగేటట్టయితే 'పేపర్స్'ల్లో అంతకన్నా జర్నలిజానికి అవమానం ఏముంటుంది. నేరస్తులను గ్లామరైజ్ చేయకపోవడం ఒక్కటే కాదు, వారికి వత్తాసుగా వుంటున్న రాజకీయాలనూ, నేతలనూ కూడా పత్రికలు డీగ్లామరైజ్ చేయగలగాలి. ఆ దమ్ముచూపుతున్న ఎడిటర్లెందరు? వారికి స్వేచ్ఛనిస్తున్న యాజమాన్యం ఎంత? అన్నది తెలియని సంగతేమీ కాదు కదా!

'ఓ అత్యాచారం వార్త పెద్దక్షరాలతో వివరంగా ప్రచురిస్తారు. వ్యక్తిత్వ వికాసానికి ఉపకరించే ఒక మంచి పుస్తకం ఆవిష్కరణ సభను విస్మరిస్తారు. హెడ్‌లైన్స్‌లో మంచినీ, మానవత్వాన్నీ పెంచే వార్తలు విరివిగా రావేమిటో' అని రాష్ట్రంలో సాహిత్య అకాడమీ కార్యదర్శిగా పనిచేసిన కీర్తిశేషులు ఇరివెంటి కృష్ణమూర్తిగారు ఎంతో ఆవేదన చెందుతుండే వారు. దేశ ప్రథమ పౌరుడైన నారాయణన్‌గారి ఆర్తి కేవలం వారి ఒక్కరిదే కాదు, దేశ ప్రజల్లో ఎందరో చెందుతున్న ఆందోళనే. స్వాతంత్రోద్యమంలో పత్రికలు నిర్వహించిన పాత్ర, స్వాతంత్ర్య పరిరక్షణలో అంతటి ఉదాత్త విలువలతోనూ కొనసాగగలిగితే 'వెధవపేపరు' అని యధాలాపంగా మా ఆవిడా అనదుకదా అన్పించింది.

*శనివారం, 19 ఆగస్టు 2000*

# స్వయం 'సేవక్'

"మోకాళ్లు బాగా నొప్పి పెడుతున్నాయోయ్" అన్న మా ఆవిడతో.

"అంతలా ఆలోచించకండి" అంది తను.

ప్రతి చిన్న విషయాన్నీ పెద్దగా చేసి ఆలోచిస్తాననీ, తనచేత కాళ్లు పట్టించుకుంటేనే నొప్పులు ఇలా చేత్తో తీసినట్లు మాయమైపోతాయని - సైకలాజికల్‌గా ఫీలవుతుంటాననీ తను అంటూంటుంది. అవునా! తనా మాట అనగానే ఫణి కిసుక్కున నవ్వాడు.

"ఏమిట్రా నవ్వుతావ్! ఇందులో నవ్వడానికేముంది" అంది తను ఫణితో.

"అది కాదక్కా! బావగారు మోకాళ్లు లాగుతున్నాయంటే 'అంతలా ఆలోచించకండి' అంటావేమిటి? అంటే ఆలోచించే ఆయన మెదడు మోకాళ్లో వుందని నీ అభిప్రాయమా?" అన్నాడు ఫణి.

'నిజమేస్మీ! అలానే ధ్వనించే వీలుంది కదా' అని నేను కాస్త గుర్రుగా చూసా మా ఆవిడవైపు.

"ఛ!ఛ!ఛ! ఒరేయ్ అలా పెడార్థాలు తీయకు. బావగారు ప్రతిదీ ఎక్కువగా పట్టించుకుంటారు కనుక, ఆ నొప్పుల గురించి ఆలోచిస్తున్న కొద్దీ సైకలాజికల్‌గా ఇంకా ఫీలవుతారని అలా అన్నానంతే" అంది శ్రీమతి తన తమ్ముడు ఫణిని కసురుతూ.

మళ్లీ తనే నా వైపు తిరిగి- " అయినా మీకూ యాభై ఏళ్లు వస్తున్నాయి గదా! వంట్లో పటుత్వం తగ్గుతూంటుంది సహజంగానే. బెంబేలు పడిపోకండి! ప్రధాని వాజ్‌పేయ్‌గారికి మోకాలిచిప్ప మార్చక తప్పదన్నారట డాక్టర్లు. రాజకీయంగా వున్న నొప్పులు చాలక అదనంగా పాపం అదొకటి! 'మోకాలి చిప్ప సంగతి ఎలా వున్నా అసలు ప్రధానిగా ఆయన్ని మార్చేస్తే బెటర్' అని సందులో సందుగా ఓ కాంగ్రెస్ మనిషి వ్యాఖ్యానించారట. అంతటి పెద్ద మనిషే కీళ్లనొప్పులు వున్నా నిబ్బరంగా, శుబ్బరంగా న్యూయార్క్ ట్రిప్పులూ అవీ తిరిగి వస్తున్నప్పుడు వారంరోజులు మార్నింగ్ జాగింగ్ చేసి మీరు మోకాళ్ల నొప్పులు అంటే ఎలా చెప్పండి" అంది శ్రీమతి.

"పోన్లేవే అక్కా! పాపం! బావగారి ఉద్దేశం నువ్వు కాస్త కాళ్లు పట్టాలనే కదా! అందులో తప్పేం వుంది. పతివ్రతా శిరోమణుల లక్షణమే కదా అది. విష్ణుమూర్తుల వారి కాళ్లు పడుతున్న లక్ష్మీదేవి బొమ్మ ఎంత పాపులరో వేరే చెప్పాలా! నువ్వు కూడా కాస్త పతిపాదసేవ చేసుకో! కావలిస్తే నేనో ఫోటో కూడా తీస్తా" అన్నాడు ఫణి.

"ఆ శషభిషలేం కుదరవు. అంత సీన్లేమీ అక్కర్లేదు. నాకు పతివ్రతా సర్టిఫికెట్లు లేకపోతే ఇప్పుడు మునిగిపోయిందేమీ లేదు. పైగా నా నడుం నొప్పులూ, వెన్నులో బాధా నేనెవరికి చెప్పుకోను? కాళ్ల నొప్పులయితే డాక్టర్‌కు చూపించుకుని మందులు వాడాలి. అంతేగాని కాళ్లొత్తుతూ కూర్చునే తీరికా, వీలూ నాకు లేవు సంయ్యో" అంది శ్రీమతి తలాయించి పారేస్తూ.

"నీ పాద కమలసేవయు నీ పాదార్చకుల తోడి నెయ్యము...అంటూ చిన్నప్పుడు పద్యం చదివే దానివి కదుటే! భర్తే స్వయం విష్ణువు అన్నారు" అన్నాడు ఫణి.

"గాడిద గుడ్డు కాదూ! ముందొరేయ్ నువ్వు నోర్మూసుకో! ఎవరి ఆరోగ్యంవారు కాపాడుకోవాలి. అవతలి వారి మీద - కాళ్లొత్తడానికయినా సరే ఆధారపడడం మానేయాలి. అయినా అసలు మీ అందరికీ చాకిరీ చేసి మేం ఎంత అరిగిపోతున్నామో, మా నడుములు ఎలా పడిపోతున్నాయో, అంట్లుతోమీ, బట్టలుతికీ మా చేతులు ఎలా లాగేస్తున్నాయో మీకేమయినా పడుతోందా?" అంది శ్రీమతి ఫణిని కసురుకుంటూనే నా వైపు తిరిగి.

"కాదనను అక్కా! ఐవిల్ ఎగ్రీ! కానీ చూసావ్! పాస్ బైఠో తబీయత్...అంటూ ఓ హిందీపాట వుంది. దగ్గరగా కూర్చుంటే స్వస్థత చేకూరుతుందనీ, మృత్యువైనా సరే వెనుదిరిగి పోతుందనీ గాఢంగా ఓ ప్రియుడు తన చెలి గురించి అనుభూతి రమ్యంగా పాడతాడు. భార్యాభర్తల మధ్య వుండేది ఆ గాఢానుభూతి, తోడు అనేదే అందుకోసం కదా" అన్నాడు ఫణి.

" ఓరేయ్ నారదుడు పారిజాత పుష్పం గురించి వర్ణించినట్లు నువ్ డైలాగులుకొట్టకు. రేపొద్దున నీ పెళ్లయ్యాక చూస్తానుగా! తోడూనీడా అవన్నీ సరే! కానీ ఎంత భార్యాభర్తలయినా 'ఒకటిగా శయనించే దాంపత్యం తలల మధ్య సప్తసముద్రాల అనుల్లంఘనీయ వ్యత్యాసం' అని చలంగారన్నట్లు ఎవరి వ్యక్తిత్వాలు, ఎవరి ఆలోచనలు వారికి వుంటాయి. భార్యాభర్తలయినా సరే, ఒకరికోసం ఒకరు ఎంత తోడూనీడా అయినా, తమదైన వ్యక్తిత్వాలను కోల్పోనక్కర్లేదు. సంసారం - 'తందానతాన' బుర్రకథగా వుండడంలో రంజులేదు. అభిప్రాయ భేదాలుంటూనే - ఒకరి అభిప్రాయాలను ఒకరు గౌరవించుకుంటూ మనగలగడంలోనే వుంది" అంది శ్రీమతి.

"సెల్ఫ్ హెల్ప్ ఈజ్ బెస్ట్ ఫణీ! ఇప్పుడు హోటళ్లలో కూడా చూడు! 'దర్శన్' పేరుతో - సెల్ఫ్ హెల్ప్ కౌంటర్లతో బోలెడు హోటళ్లు బ్రహ్మాండంగా నడుస్తున్నాయి. అసలు ఎప్పుడైనా ఎవరి పని వారు చేసుకోవడం బెస్టు. ఇంకొకరి మీద ఆధారపడిన కొద్దీ లోకువైపోతాం కూడాను. ఇంకోళ్లచేత సేవలు చేయించుకోకుండా, మంచమెక్కకుండా

ఊపిరున్నంతవరకూ బతికేయడమంత గొప్ప అదృష్టం మరొకటుండదు." అన్నాను నేను.

"మరే మరే దానినే 'స్వయం సేవక్' అనవచ్చు" అంది శ్రీమతి.

"అక్కా! 'స్వయం సేవక్' అంటే తనకు తాను సేవ చేసుకునేవాడు అని నువ్వను కుంటున్నట్లున్నావ్ గానీ, 'సేవ' చేసేవాడు సేవకుడు. తాను స్వయంగా భారతదేశానికి సేవచేసే వ్యక్తిననే ఉద్దేశంతోనే ప్రధాని వాజ్‌పేయ్‌గారు తాను 'స్వయం సేవక్' నని అంటే, దానికి నీలానే పత్రికలు పెడార్థాలు తీసి ఆయన మాటలకు వేరే కలర్ అద్దాయి. 'స్వయానా సేవకుడు' స్వయం సేవకుడు గానీ, కేవలం తన పనిమటుకే తాను చేసుకునేవాడు స్వార్థపరుడౌతాడు" అన్నాడు ఫణి.

"స్వయం సేవక్ కాకపోయినా మీ బావగారు మటుకు 'స్వయంషేవక్'లే" అంది శ్రీమతి. "ఆయన గడ్డం ఆయనే గీసుకుంటారు. దానికోసం సెలూన్‌కు వెళ్లరు. అంచేత 'స్వయం షేవక్'లే కదా!" అంది నవ్వుతూను.

"సర్లే 'పతి పదషేవ్‌యె భాగ్యముగా' అని నువ్వు పాడకు. బావగారికది చాలు" అన్నాడు ఫణి.

*శనివారం, 16 సెప్టెంబర్ 2000*

# వినికిడి సడి!

ఫణిగాడు - స్నేహిత్‌గాడు ఎదురు కూర్చునుండగా చెబుతున్నాడు.

"ఓ గాయకుడు అరణ్యామధ్యంలో కూర్చుని అద్భుతంగా పాటపాడుతున్నాడు. జింకలు, కుందేళ్లు, తోడేళ్లు, నక్కలు అన్నీ కూడా ఆ గానాన్ని మైమరచి వింటున్నాయి. ఇంతలో హఠాత్తుగా పొదలమాటు నుండి ఓ సింహం దూకి అతనిమీద పడి మింగేసింది.

"అంత అద్భుతంగా పాడుతున్న వాడిని పొట్టనపెట్టుకోడానికి నీకు మనసెలా ఒప్పింది" అని అడిగింది పులి.

"ఛ! పాడుతున్నాడా! నాకు కొంచెం చెవుడు కదా! వినిపించలేదుస్మీ" అందిట సింహం.

అంచేత మహోపద్రవానికి చెవుడు కారణం అవుతుందనడానికి అదే కాదు దాఖలా! రోడ్ల మీద వెనుకవచ్చే వాహనాల హారన్లూ అవీ విన్పించక పాదచారులో, ముందు వాహనాల వాళ్లో యాక్సిడెంట్ల పాలవుతున్న సందర్భాలు వుంటున్నాయని ఓ సర్వేలో తేలింది. అంతకన్నా గమత్తు - విషాదం అనాలేమో! ఏమిటంటే -అసలు ప్రయాణంలో రహదారిమీద చెవులు సరిగా వినబడకపోవడానికి కారణం వాహనాలు చేసే పెద్ద పెద్ద రొదలేననీ, మనిషి చెవి భరించలేనంత స్థాయి డిసిబుల్స్‌లో అనేక వాహనాలు ధ్వనులు చేస్తున్నాయనీ ఆ సర్వేయే చెప్పింది.'సర్వేజనా సుఖినోభవంతు' అనుకుందామన్నా కుదరక ధ్వని కాలుష్యంవల్ల బధిరులవుతున్న వారి సంఖ్య ఇటీవల గణనీయంగా పెరిగిందిటరా అల్లుడూ!

నిజానికి - కాలుష్యంలో - ధ్వని చేసే హాని పరిసరాలకే కాదు, వ్యక్తుల శారీరక అనారోగ్యాలకు, గుండెదడలకూ కారణమవుతోంది. ముఖ్యంగా దేవాలయాలూ, మసీదులూ లౌడ్‌స్పీకర్లను అమర్చుకుని తెల్లవారుఝామున ఒక్కసారిగా భోంయ్యిమన్న ఒక లౌడ్ స్పీకర్‌లో ఉదయ ప్రార్థనే - గుండె బలహీనంగా వున్న ఓ మధ్య వయస్కుడిని హఠాత్తుగా మృత్యువాతపడేలా చేసిందని వార్తవచ్చింది. పబ్లిక్ న్యూసెన్స్ చట్టం క్రింద పెద్ద స్థాయిలో లౌడ్ స్పీకర్లను వాడడం నేరం. కానీ, మతం పేరున జరిగే చర్య కావడంతో ఎవరూ ఏం చేయలేకపోతున్నారనిపిస్తుంది. అంటే ఎవరూ కేసు పెట్టలేకపోతున్నారనుకుంటా.

తెలుసుగా! ధ్వనిని డెసిబుల్స్‌లో కొలుస్తారు.110 డెసిబుల్స్ దాటిన ధ్వని ఏదైనా చెడుచేసే అవకాశాలు ఎక్కువట. కార్యాలయాల్లో కూడా నిశ్శబ్దపు గదిలో ఎయిర్‌కూలర్లు, టైప్‌మిషన్లు చేసే ధ్వనులవల్ల కూడా పని నైపుణ్యంలో దెబ్బ తగిలే అవకాశాలున్నాయిట. నీకో తమాషా తెలుసా! రైలులో ప్రయాణం చేస్తున్న ఒకాయన పక్క తాతగారిని చూసి "నాకు సడన్‌గా చెముడొచ్చేసింది తాతగారూ! మీరు ఇందాకట్నుంచీ ఏదో మాటాడుతున్నా నాకు ఒక్కముక్క వినిపించడం లేదండి బాబోయ్!" అని గోలపెట్టాడట. దానికా తాత గారు - "నేను ఇందాకట్నుంచీ వక్క పలుకు నములుతున్నాను గానీ, ఒక్క ముక్కా మాటాడందే" అన్నారట.

"నువ్వు మంచి యజమానివయితే ఒక్కోసారి అంధత్వం నటించు. అదే ఉత్తమ సేవకుడివయితే చెవిటితనం అలవర్చుకో" అని ఇంగ్లీషులో ఓ సామెత వుంది. అసలు ఇవాళ వినడం అనే కళ చాలా మందిలో తగ్గిపోతోందిలే. చెవిటి తనం అనేది పుట్టుకతో వుందంటే వాళ్లు ప్రధానంగా మూగివారు కూడా అయ్యుండవచ్చు. కానీ చెముడు అనేది చెవికి సంబంధించిన లోపాలవల్ల కూడా వస్తుంది. కొందరు చెవుల్లో గులివి ఎన్నాళ్ళయినా తీసుకోరు. కొందరు ఏ అగ్గిపుల్లనో, పిన్నునో పుచ్చుకుని చెవిని అస్తమానూ కెలుక్కుంటూ వుంటారు. అలాంటప్పుడు 'ఇయర్ డ్రమ్'కు ఏ మాత్రం దెబ్బ తగిలినా చెముడొచ్చేస్తుంది.

"చెముడువల్ల ఒకే ఒక్క హాయీ,అద్భుతమైనహాయీ ఏమిటంటే భార్య సాధింపులు వినక్కర్లేదనేదే. అలాంటి అదృష్టంనీకుంది. ఆ అదృష్టం నాకులేదు.' అని సోక్రటీసు తన దగ్గర కొచ్చిన ఒక చెవిటి మనిషికి కాగితం మీద రాసి అనునయించాడట.

"ఎక్కడికి పోతున్నారు జపానికా" అని అడిగారు ఓ శాస్త్రిగారు శర్మగారిని.

"కాదు జపమునకు" అన్నారు శర్మ.

"అలాగా! జపానికి అనుకున్నాలెండి"అన్నారు శాస్త్రిగారు.

ఇద్దరూ వినికిడి లోపం వున్న వారయితే ఇలాంటి సంభాషణే సాగుతూంటుంది.

'వినదగునెవ్వరు చెప్పిన' అన్నారు. వినడంలో, వినిపించుకోవడంలో తేడా వుంది. వింటారు కానీ కొందరు విన్నది విన్నట్లుగానే వదిలేస్తారు. కానీ వినిపించుకునే వాళ్లే విన్నది ఏ కాస్త అయినా అందులోని సారాంశాన్ని, స్వారస్యాన్ని అందుకోడానికి ప్రయత్నిస్తారు. మాట్లాడటం కళ అనుకుంటాం గానీ నిజానికి శ్రోతగా వినడమూ ఒక మంచికళ" అని ఏకధాటిగా చెప్పుకు పోతున్న ఫణి స్నేహిత్ వైపు చూసేసరికి వాడు చేత్తో చిటికెలు వేస్తూ తలూపుతూ కనిపించాడు. ఇంతసేపూ వాడి తలతాటింపు చూసి

తననే శ్రద్ధగా వింటున్నాడనుకున్న ఫణి వాడి చిటికెలకు అనుమానం వచ్చి తేరి చూస్తే తెలిసింది - వాడు 'వాక్‌మెన్' ప్యాంటు జేబులో పెట్టుకుని సింగిల్ ఇయర్‌ఫోన్ చెవిలో దోపుకుని పాప్‌సాంగ్స్ ఏవోఎంజాయ్ చేస్తున్నాడు.

ఫణిగాడికి వొళ్లుమండి స్నేహిత్ చెవిలో ఇయర్‌ఫోన్ తీసేసి "ఏమిటి నా మాటలు వినకుండా పాటలేవో వింటున్నావ్? కనీసం ఆ సంగతయినా నాకు చెప్పవచ్చుగా. నా ఎదురుగా కూచుని ఈ డ్రామా ఎందుకు" అన్నాడు.

"నేను పాప్‌సాంగ్స్ టేప్‌రికార్డర్‌లో పెట్టుకుంటే భయంకరమైన సౌండ్ బాబోయ్ భరించలేనని గోలెడతావుగా! అంచేత నిన్ను డిస్టర్బ్ చేయడం ఎందుకని ఈ అరేంజ్‌మెంట్ చేసుకున్నాను. ఇవాళ అసలే ఇంటర్నేషనల్ డే ఆఫ్‌ది డెఫ్. పాశ్చాత్య సంగీతాన్ని సైగల్ బాణీలో వినాలనే బాపతు నువ్వు! అంచేత మావా! నీ చెవి ఇటు వొగ్గకు. నా చెవి నీ సుత్తిని చెవి వొగ్గి వినాలని ఆశించకు" అని స్నేహిత్ లేచి చక్కాపోయాడు. 'వినబడనిసుఖం, అసలు లోపంఎందుకయ్యిందీ అని' గొణుక్కున్నట్లున్నాడు ఫణి.

*శనివారం 23 సెప్టెంబర్ 2000*

# అక్రూర మృగం - క్రూర మానవం

"మీ ఇంట్లో నువ్వు పులిలా వుంటావా పిల్లిలా వుంటావా అని అడిగితే నా స్నేహితుడు రామం పిల్లిలా వుంటాననే చెప్పాడు. ఎందుకో ఊహించగలవా" అని అడిగాడు ఫణి స్నేహిత్‌ని.

"బహుశా పులిలావుంటే వాళ్లావిడ తోలు వొలిచేస్తుందనేమో" అన్నాడు స్నేహిత్.

"నీతలకాయ్" అని వాడి నెత్తిన చిన్న మొట్టుమొట్టి "మా రామం పిల్లిలా వుంటానని ఎందుకన్నాడంటే వాళ్లావిడకి పిల్లి అంటేనే భయంట" అని పెద్దగా నవ్వాడుఫణి.

"అదే కదా మరి! పులిలా వుండగలగడమంటే అవతలివారిని గడగడలాడించ గలగటం అనేదిపోయి ఇవాళ పీక్కి ఉచ్చుబిగుసుకుని తోలు వొలిపించుకోవడంగా మారిపోయింది కాబట్టే క్రూర జంతువయినా 'కూర' జంతువుగా మారిపోతోంది కాబట్టే మృగంఅంటే భయపెట్టేది అన్న మాటే 'మటాష్' అయిపోయింది" అన్నాడు స్నేహిత్.

"ఒరేయ్ ప్రతిదీ - పులి, పిల్లి అటూ భార్యాభర్తలకు లింక్‌చేస్తే తప్ప మీకు సంతోషం కలగదేంట్రా! 'మేల్ ఛావనిజం' - అంటే ఇందులో కూడా మగ దురహంకారమే బయటపడుతోంది" అంది మా ఆవిడ వాళ్ల డైలాగుని కామెంట్‌చేస్తూ.

"అక్కా! పులులు మగవయినా, ఆడవయినా అసలు వాటి సంతతే అంతరించి పోతోంది. ఆరోగ్య సంరక్షణ పేరుతో ఇచ్చిన ఇంజెక్షన్ వికటించి ఆ మధ్య ఒక జూలో పులులు మృత్యువాత బడితే, పాపం! అన్నెం పున్నెం ఎరుగని ఏడాది 'సాకీ' పులిపిల్ల హైదరాబాద్ జూలో హత్యకు గుర్త్తె, చర్మం అంతా దుండగీళ్ళు వొలుచుకుని నీటి తొట్టెలో పారేయబడి అమానుష చావు చచ్చింది. ఆడపులి, ఆడ సింహం మగ వాటికన్నా భయంకరమైన క్రూరత్వం కలిగినవి అనీ, తమ పిల్లల సంరక్షణలో అవి తమ సంతానానికి ఏ ప్రమాదమైనా ముంచుకొస్తే రక్షణకు ఆగ్రహోద్రేకంతో రెచ్చిపోతాయనీ అంటారు. అలాంటిది కన్నతల్లి 'కరుణ' ముందే పిల్ల 'సాకీ' చచ్చి పోతే ఇవాళ ఆ తల్లిపులి మనిషి అంటేనే భయపడుతోందిట"అన్నాడు ఫణి.

"అవున్రా తమ్ముడూ! నిజంగానే ఇవాళ 'అన్నెం పున్నెం ఎరుగని పులి' 'అమానుషంగా పులిపిల్లను చంపడం' అన్న నీ మాటలు క్రూర జంతువుల విషయంలో

ఉపయోగించబడ్డాయి ఏమిటా అని ఏ వ్యాకర్తా తప్పుపట్టడు.' 'పులిని చూస్తే పులి ఎన్నడు బెదరదు. మాయరోగమదేమోగాని మనిషి మనిషికి కుదరదు' అని ఓ కవిగారు పాట రాసినట్లు ఇవాళ అత్యంత క్రూరమృగం ఎవరంటే మనిషి అనే నిర్ధారణ అవుతోంది. సమాజంలో ఇవాళ జరుగుతున్న హింసా, రక్తపాతం, హత్యలూ మారణ హోమాలూ చూస్తుంటే ఆటవిక న్యాయం కూడా దీని కన్న బెటరేనని, అడవిలో వేటాడే జంతువుల్లో కూడా ఆహారసంపాదనకోసం ఇంత క్రూరత్వం లేదనీ అనిపిస్తుంది. అమానుషం అంటే మృగత్వం అనే అనుకునేవాళ్లంగానీ ఇవాళ అసలు 'మృగత్వం' అన్నదే భయంకర 'మానుషం' గా వుంది. పర్యావరణం, ప్రకృతి సమతుల్యత అంటూ కబుర్లు చెప్పి, చట్టాలు చేసి, సంరక్షణ పేరుతో, అభయారణ్యాల పేరుతో జంతువులను జూలలో పెట్టి, అడవిలోకన్నా భయంకరమైన ఆపదల పాలుచేసి, వన్య మృగాలను వండుకు తింటున్న ఘనతకూడా మనిషిదే నేడు. పులులు, సింహాలను చూసి మనిషి భయపడటం కాదు - మనిషిని చూసి క్రూరమృగమే భయంతో కరిగి నీరవుతోంది" అంది మా ఆవిడ పులిపిల్ల కథనంపట్ల ఆర్తితో.

"అమ్మా! ప్రతి తల్లీ తన పిల్లల గురించి ఆరాట పడుతుంది. ఇవాళ పులి పిల్ల గురించి కూడా నువ్వు బాధపడుతున్నావంటే 'అమ్మతనం'లోని గొప్పదనం తెలుస్తోంది. 'సాకీ' హత్యతో దానితల్లి 'కరుణ'కు సంతాప సందేశాలు నీ లాంటి తల్లుల నుండి అందుతున్నా విని, కని అర్థంచేసుకోగల చిత్తవృత్తిలేక అది బేలగా మారి పాపం అన్నం నీళ్లూ కూడా ముట్టడం లేదట. కళ్లముందే కన్నపిల్ల హత్య చూసిన పులితల్లికి తనలోని 'పులి'తనం అనేదే పోయిందని కూడా అర్థంకాదు కదా" అన్నాడు స్నేహిత్. అమ్మతనం గురించి వాడి మాటలు సహజంగా కమ్మదనంగా తోచి మా ఆవిడ కళ్లల్లో వాత్సల్యం తొణికిసలాడింది.

"అది కాదురా అల్లుడూ! ఇవాళ మృగత్వం, మానవత్వం అన్నవి తమ లక్షణాలను మార్పిడీ చేసుకున్నాయేమోనని నా ఫీలింగు! తమ జోలికి రాని వారిని పులులయినా కవ్వించి మీదబడి చంపుతాయనుకోను. కానీ మనిషే - బోనులో బంధించిన పులి మీదపడి, తన స్వార్థం కోసం, ధనార్జన అనే మైకంతో దాన్నిచంపి తోలువొలచాడంటే ఏమనుకోవాలి? మైకం అంటే కూడా మెకము అంటే మృగానికి సంబంధించింది అనీ మృగ'మదం'తో చేసిన పనిని మైకంకమ్మి చేసాడని అనడమూ వుంది. కానీ పాపం ఇవాళ మెకాలేవీ కూడా మోకాలి మీద లంఘించగల స్థితిలో లేవు. వాటి చిప్పలకూ ఇవాళ ఆపరేషన్ ఏదైనాచేస్తే తప్ప వాటి 'పరేషాన్' తొలిగి ఈ మానవ పరికల్పిత

బంధనాలను తెంచుకుని సహజారణ్యాల లోనికి పారిపోగలిగేలా లేవు. కొందరు దొంగ సన్యాసులు పులులవుతున్న నేడు అసలు పులులు పాపం సర్వసంగ పరిత్యాగంతో సన్యాసులవుతున్నాయి'' అన్నాడు ఫణి.

"తమ్ముడూ! 'అవినీతి' అనేదే ఇవాళ గొప్ప 'మాంసం'.దాన్ని భక్షణ చేస్తున్న మనిషి 'క్రూర జంతువులని' మనం అనుకుంటున్న వాటిని మించిన క్రూరమృగం అయిపోయాడు. 'లేడి మాంసం రుచి మరిగిన పులి' అనుకోవడం మాని, 'పులి మాంసం రుచి మరిగిన మనిషి'గా పరివర్తన చెందుతున్నాం అంటే 'డబ్బు సంపాదన' అనేది గొప్ప వేటగా, ఆటవిక ఆటగా ఎలా మారిపోయిందో అర్థం అవుతోంది. డబ్బు, అధికారం అనేవి మనిషికి మొలుచుకొచ్చిన రెండు కొమ్ములు. ఖడ్గమృగం కొమ్ముకన్నా వీటి పదునెక్కువ. ఏనుగు దంతాలు అపహరించడమే కాదు, పులుల, సింహాల చర్మాలను వొలిచి కూడా వాటిని అమ్ముకుని బ్రతకాలనుకోవడం - శరీరం అమ్ముకుని బ్రతికేదానికన్నా హేయమైన చర్య. సెక్స్ వర్కర్‌కన్నా - మ్యాచ్ ఫిక్సరూ, 'మాన్ ఈటర్ కన్నా -అటవీ జంతువుల హంటర్లు తుచ్ఛులు, దరిద్రులు'' అంది మా ఆవిడ ఆగ్రహంగా. ఆడపులికి 'కరుణ' అని పేరెందుకు పెట్టారో నాకు అర్థం అయ్యింది.

*శనివారం, 14 అక్టోబర్ 2000*

# ఆ 'గాలి పటం'!

"ఏదపదవె వయ్యారి గాలిపటమా" అంటూ పాడుకుంటూ ఎంటరయ్యాడు చిదంబరం. "ఎప్పటిపాట తండ్రీ! గాలిపటం మీద ఇటీవల హిందీ చిత్రాల్లో గొప్ప దృశ్య చిత్రీకరణలూ, సరికొత్తపాటలూ వుండగా "ఛల్ ఛల్‌రే పతంగ్" కాలం నాటి పాట ఎందుకు మహానుభావా" అని ఎద్దేవా చేసాడు గోపాలం.

చాలా రోజుల తర్వాత మళ్ళీ మిత్రబృందం కలిసాం. కబుర్లకూ, కాలక్షేపాలకూ కొదవేముంది! కొత్త సంవత్సరంలో వారాని కొకసారయినా రెగ్యులర్‌గా కలుసుకుని, దూరమై పోతున్న మైత్రీ మానవ సంబంధాలను పునరుద్ధరించుకోవాలని కలిసి ఒక తీర్మానమయితే చేసుకున్నాం. ఎవరి సంసారాలు, ఎవరి ఉద్యోగాలు, ఎవరి తాపత్రయాలు వారికి వుండగా - అసలు ఇలా కలుసుకోవడం అనేది కూడా వెనుకబడిపోతోంది. ఇళ్ళల్లో పర్సనల్ కంప్యూటరు పెట్టుకుని, ఇంటర్‌నెట్ సౌకర్యం పెట్టుకుని, హాయిగా ఎవరింట్లో వారు కూచుని, వాయిస్‌మెయిల్ ద్వారా కూడా 'ఛాట్' చేసుకునే వీలుండగా - మిత్ర మండలులూ, మైత్రీ సమావేశాలు ఎందుకు అనుకోగలమా? ఎంత ఐ.టి. అభివృద్ధి సాధించినా, మనిషీ మనిషీ ముఖతః కలుసుకుంటే వుండే ఆనందం, కలసి కబుర్లాడుకోవడంలో వున్న అనుభూతి, కంప్యూటర్ స్క్రీన్‌మీద సందర్శించుకోగలమా? అందుకే కాబోలు - ఇటీవల భాగస్వామ్య సదస్సు మూడు రోజుల వేడుక ప్రారంభదినాన్నే ఉపరాష్ట్రపతి కృష్ణకాంత్‌గారు సాంకేతికాభివృద్ధిని ప్రశంసిస్తూనే, సమస్యల పరిష్కారానికీ, పేదరికం నిర్మూలనకూ అదే అంతిమ సాధనం అనుకోవడాన్ని నిరసించారు. రేస్‌లూ, గర్ల్‌ఫ్రెండ్‌లూ, కంప్యూటర్లూ ఇవన్నీ వ్యక్తుల ఆర్థిక స్థితులను అతలాకుతలం చేసేవని హెచ్చరించారు. ఈ మాటే గోపాలంతో అన్నాను నేను. తనూ బాబుగారి హైటెక్ సంవిధానాలకు వంత పాడేవాడేగానీ, 'పిడుక్కీ బియ్యానికీ ఒకటే మంత్రం' అన్నట్లు అన్నింటినీ కంప్యూటర్‌తో అనుసంధానించడం తగదని తనూ ఒప్పుకున్నాడు.

"బ్రిటన్ ప్రాజెక్టులు వస్తేగానీ పేదరికం పోదనీ, చైనా ఐటీ రంగాన్ని అధిగమిస్తే గానీ మనకు పురోగతి లేదనీ అనుకోవడం మరీ విడ్డూరం. దేశీయతను ఇంతలా వదిలేసుకుని ప్రపంచీకరణ రేసులో పరుగులు తీయడం ప్రజాస్వామ్య ప్రభుత్వాల సంవిధానానికే చేటు. పురోగతి చెందిన దేశాలు అనుకుంటున్నవి సైతం సుఖశాంతుల పరిస్థితులతో లేవు. డబ్బులూ, యంత్రాలూ సమకూర్చలేని శాంతిని మనస్సు

మాత్రమే ఇవ్వగలుగుతుంది. మనుషుల మధ్య మానసిక సంబంధాలు లేక సమస్తం వ్యాపార లావాదేవీలే అనుకుంటే ఎలా? భారతదేశంలోని గొప్పసంపత్తి మానవసంబంధాలే. ఆ మానవీయ సూత్రాన్ని తెంపేసుకుని వాణిజ్య ఆకాశంలో ఎంత ఎత్తుకు ఎదిగినా, ఎగిరినా అది తాడుతెగిన గాలిపటం తంతే అవుతుంది'' అన్నాడు గోపాలంతో చిదంబరం.

"ఇవాళ ఈ గాలిపటాన్ని పట్టుకున్నావేంటి తండ్రీ! ఏది మాటాడినా 'ఖీంచ్' అటే వుంటోంది'' అన్నాడు గోపాలం.

"జీవితం గాలిపటమనే సంకేతంలో గొప్ప సాంకేతిక భావనలూ వున్నాయి బ్రదర్! మనిషి తాను స్వేచ్ఛగా, హాయిగా రంగురంగులతో విహరించాలనే మహత్త్వాకాంక్షకు చిహ్నంగానే గాలిపటం రూపొందింది అనాలి. ఎంత ఎత్తుకు ఎగరాలంటే అంత దీర్ఘసూత్రం అవసరం. పడగొట్టే ప్రతిపక్షాలన్నీ ఎదుర్కోవడానికి కరుకుగానూ, గరుకుగానూ వుండే 'మాంజా' అదేనయ్యా, గాజుదారంకూడా ఒకటి ముందులోనే సిద్ధం చేసిపెట్టుకోవాలి. అన్నింటికంటే ముఖ్యం, దారపు ఒకకొస నీ దగ్గర పట్టుగా లేకపోతే మాత్రం బ్రతుకు తాడుతెగిన గాలిపటమై ఎటుకొట్టుకుపోతుందో, ఏమైపోతుందో ఊహించలేం'' అన్నాడు చిదంబరం.

"గాలివాటు బ్రతుకు ధోరణులు తగ్గాలోయ్ చిదంబరం! గాలిపటం ఎగరేసినట్లు జీవితాన్ని ఎగరేస్తానంటే అది సబబుగా లేదు., నువ్వు పక్షివి కాలేక, గాలిపటం ఎగరేసి సంతోషిస్తున్నావ్. నువ్వు నీ రెక్కలు ముక్కలు చేసుకుని ఎంతో సంపాదిస్తే తప్ప గాల్లో ప్రయాణించే విమానయానం చేయలేవు. సముద్రాలు దాటడానికి నీ మనస్సు ఉత్సహించినా నీ గదిలోనే, నీ మదిలోనే సముద్రాలు ఉప్పొంగడాన్ని నీవు గమనించకుండా వుండలేవు'' అన్నాడు సన్యాసిరాజు కల్పించుకుంటూ.

"బాబోయ్! నువ్వు కవిత్వభాష మొదలెట్టకు సన్యాసీ! అసలే అర్భకులం. తట్టుకోలేం. "బాబుగారి కంప్యూటర్ భాష. బావగాడి కవిత్వ ఘోష'' రెండూ ఉపద్రవాలకు దారి తీస్తాయని భయంగా వుందని ప్రకటించాల్సి వచ్చేలా వుంది'' అన్నాను నేను మా ఫణిగాడిని తలుచుకుంటూ.

"గాలిపటం గాలిపటం రంగురంగులా గాలిపటం'' అని మళ్లీ పాట ఎత్తుకున్నాడు చిదంబరం.

"చిదంబరం! ఇవాళ నువ్వు అంబరాన్నీ, అంబరంలో గాలిపటాన్నీ వదలవా తండ్రీ! ఇరవై ఏడు దేశాల నుంచి ఏడువందల యాభై మంది ప్రతినిధులు భాగస్వామ్య

సదస్సులో పాల్గొనడానికి వచ్చారన్న ఆనందంతో - అంతా పరిశ్రమలు - పెట్టుబడులు, రాష్ట్రంలో వనరులు అని గిరికీలు కొడుతున్న పద్ధతిలో ఇవాళ భోగి, రేపు సంక్రాంతి, ఎల్లుండి కనుమ అని ఈ మూడు రోజులూ నువ్వు గాలిపటంతోనే కనుమరుగవ్వాలను కుంటున్నావా ఏంటి?" అన్నాడు గోపాలం కొంచెం సీరియస్‌గానే.

"చనువొసంగిన యప్పుడె చక్కిని చేరనౌ, చేరివేడనౌ' అన్నట్లు పదుగురూ చేరినప్పుడే మన డబ్బా వాయించుకోవడం, వాయించుకోడానికి ఇంకో కొత్త డబ్బా ఇమ్మనడం బెస్టు కదా! పల్లెల్లో బ్రతకాలనుకుంటున్న జన్మభూమి రైతుకు నీళ్ళూ, కరెంటూ ఇవ్వలేంగానీ - ఇక్కడ పరిశ్రమపెట్టే వాడికి మాత్రం (మన బావీ, మన మోటారూ, జనరేటరూ ఎలా పాడయ్యి తగులడినా) - వాడివల్ల మన ఆర్థిక స్థాయి అమాంతం పెరిగిపోయి హాయిగా గాలిలో గాలిపటంలా విహరించవచ్చని కలలుగని 'మబ్బుల్లో నీరు చూసీ ముంత వొలకబోసుకున్నట్లు' వనరులు కల్పిస్తూ సంచరించడం మనకే చెల్లిందిలే. ఏ బ్రిటిష్ వాడు తన కంపెనీతో ఎంటరై వందలేళ్లు (లేళ్లూ, దుప్పులూ కాదు, సంవత్సరాలు) మనను బానిసత్వంలోకి తోసాడో, ఆ బానిస బంధనాలు. త్రెంచుకుని స్వతంత్రులమై, స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ స్వాతంత్ర్యానంతరం యాభై నాలుగేళ్ళ ఈ కాలాన మళ్ళీ ఆ బ్రిటన్ కంపెనీలు మన దగ్గరకొచ్చి పరిశ్రమలు పెడితేగానీ మన పేదరికాన్ని దూరం చేయడం సాధ్యం కాదు అని విశ్వసించి, అందుకోసం శ్రమించడమంత దారుణం మరొకటి లేదుగాక లేదు' ' అన్నాడు ఆవేశంగా చిదంబరం.

"సంక్రాంతి పూటా కాంతుల గురించి మాటాడుకోక క్రాంతులు, విప్లవాల గురించి మాటాడుకోవడం ఏమిటయ్యా బాబూ! పారిశ్రామిక సంక్రాంతి తప్ప పల్లెల్లో రైతులకు సంబంధించిన, సస్యసంక్రాంతులు అదృశ్యం అయిపోతుంటే చూస్తూ వుండిపోవాల్సిందేనా! గంగిరెద్దులూ ఐ.టి.వైపుకే వచ్చి బుర్రలు ఊపుతూ, తరుణీ లలామలూ కంప్యూటర్ ముగ్గుల్లోకే దిగిపోతూ, హరిదాసులూ హైటెక్‌దాసులై పోవడమే అభినవాంధ్ర సంక్రాంతి అయి, అదే స్వర్గాంధ్రమూ, స్వర్ణాంధ్రమూ అనుకుంటే ఇంక చెప్పేదేముంది? సంక్రాంతి అంటే సూర్యుడు తన రథాన్ని మలుపు తిప్పే వేళ అట! సూర్యకాంతిపై ఆధారపడ్డ చంద్రుడి కళలూ మరి మొన్నటి గ్రహణం తరువాత ఏ గ్రహగతులు పడతాయో చూడాల్సిందే" అంటూ సన్నాసిరాజు ఉడిపిహోటల్‌కు దారి తీయించాడు.

*శనివారం, 13 జనవరి 2001*

# మార్పు మన తీర్పు

నేను వెళ్ళేసరికి ఒక్కడూ కూచుని గోపాలం ముసిముసిగా నవ్వుకుంటున్నాడు ఇంకా తొట్టి గ్యాంగ్ సభ్యులెవరూ ఎంటరయినట్లు లేదు.

"ఏమిటి మిత్రమా నీలో నువ్వే నవ్వుకుంటున్నావ్" అన్నాను.

"అబ్బే మరేం లేదు. నా ప్యాంటు గుండీలు కుడుతూ నిన్న మా ఆవిడ - 'మా ఆడవాళ్లే లేకపోతే మీ ప్యాంటులకు గుండీలు అవీ ఎవరు కుడతారు' అంది. నేను వెంటనే - 'మీ ఆడవాళ్ళే లేకపోతే అసలు మాకు ప్యాంటులే అక్కర్లేదుగా' అన్నాను అన్నాడు నవ్వుతూ.

నేనూ నవ్వేసి - "అయితే ఆడవారి వల్లనే మగవారు నేర చరితులవుతున్నా రంటావా" అన్నాను తమాషాగా.

అదిగో ఆ మాట చెవినేసుకుంటూ ప్రవేశించాడేమో మా చిదంబరం - "నేర చరితులే లేకపోతే అసలు రాజకీయాల అవసరమేమిటి? రాజకీయాలు వున్నదే అందుకోసం కదా! చట్టాల అవసరం ఎప్పుడు? ఉల్లంఘించే వారంటూ వున్నప్పుడు. దొంగలున్నారని పోలీసు స్టేషన్లా? పోలీసు స్టేషన్లకోసం దొంగతనాలా" అన్నాడు కుర్చీ లాక్కుని కూర్చుంటూ కొంచెం వ్యంగ్యంగా.

"ఇది ఖాళీ కుర్చీ కనుక సరిపోయింది. కానీ ఖాళీ చేయించి కూర్చున్నావనుకో! అది రాజకీయం అవుతుంది" అన్నాడు గోపాలం.

"కిస్సా కుర్సీకా' అన్నదందుకే. కుర్చీ - పదవికీ, అధికారానికీ, హోదాకీ సంకేతం. కుర్చీ మీద కూచున్నవాడిని పాలకుడు, శాసనకర్త అంటున్నాం. అయితే ఒకడిని కుర్చీ ఎక్కించేది గానీ, దింపించేది గానీ అంటూ - ఒక సంవిధానమూ, శక్తీ మనకున్నాయి. దానికే 'ఎన్నికలు' అని పేరు పెట్టుకున్నాం. ప్రజాస్వామ్య వ్యవస్థలో అందరూ కుర్చీ మీద కూచోడానికి అర్హులు కనుకనే, ఎవరు కూర్చోవాలి అనేది నిర్ణయించడానికి ఎన్నికల సంవిధానం ముఖ్యమైంది. ఎన్నికల కమిషన్ స్వర్ణోత్సవాలు మన దేశంలో ఈ ఏడాది నిర్వహించుకుంటున్నాం. యాభై ఏళ్లుగా మన దేశంలో ఎన్నికల కమిషన్ ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేస్తూ వచ్చింది' అన్నాడు చిదంబరం.

సన్యాసిరాజు, శాస్త్రి, భాస్కరం అప్పుడే వచ్చి చేరారు. చిదంబరం మాటలు మొత్తం విన్న సన్నాసి అందుకున్నాడు. "మన ఎన్నికల సంవిధానం భ్రష్టు పట్టిందని నా ఉద్దేశం.

ఎన్నికల సంస్కరణలు ముందుగా చాలా అవసరం అని నా గాఢాభిప్రాయం. ఎందుకంటే - రాజకీయ పార్టీలు నేరచరిత్ర కలిగిన వ్యక్తులకు టిక్కెట్లు ఇవ్వకూడదని మొన్న రాష్ట్రపతి స్వయంగా అన్నారు గానీ, ఆ బుద్ధే రాజకీయ పార్టీలకు వుండి వుంటే - దేశం ఎందుకిలా తగులడుతుంది. రాజకీయాలు నేరమయం కాకుండా కాపాడడానికి ఎన్నికల కమిషన్‌లో - శేషన్‌లాంటి ఉద్దండ పిండాలు వుండి చేసిన ప్రయత్నాలు ఎలా బెడిసికొట్టి, చివరకు ఎన్నికల కమీషన్‌లో కమీషనర్ల నియామకం కూడా రాజకీయం అయ్యే స్థితి, ఎలావచ్చిందో తెలియని సంగతి కాదు కదా! నేరచరిత్ర కలిగిన వారూ, చివరకు శిక్షలు పడిన వారూ సైతం ఎన్నికల్లో పాలుపంచుకుంటూ, చట్టసభలకు ఎన్నికవుతున్నారంటే ఆ లోపం ప్రజాప్రాతినిధ్య చట్టంలోనూ, ఎన్నికల నియమ నిబంధనావళిలోనూ వున్నట్లే అవుతుంది గానీ, రాజకీయ పార్టీల నుండి సచ్ఛీలతను ఆశించడం దొంగల్లో మానసిక పరివర్తనం ఆశించడం గానే తయారవుతుంది తప్ప ప్రయోజనం వుంటుందా?'' అన్నాడు సన్యాసి.

"బ్రదరూ! 'సెల్ఫ్ డిసిప్లైన్' అంటే 'స్వయం సిద్ధ క్రమశిక్షణ' అనేది రాజకీయ పార్టీలకు వుండి వుంటే - నువ్వన్నట్లు పరిస్థితులు ఇంత దాకా ఎందుకొస్తాయి? 'ఆయనే వుంటే...' అని సామెత చెప్పినట్లు, మన నైజం ఎలాంటిదంటే -ఎవరిదో పైనుంచి భయమో, భక్తో వుంటేతప్ప, మనం చేయాల్సిన పనులనయినా సక్రమంగా చేయం. చేసేవాళ్ళెవరో నలుగురున్నా - కూసేగాడిదొచ్చి మేసేగాడిదను చెరిపిందన్నట్లు - ఒక రాజకీయ పార్టీలోకొంత సచ్ఛీలత కనబడుతున్నా, ఆ సచ్ఛీలతకు ప్రతిగా ఓటమీ, పరాజయాలే దక్కుతూ - నేరచరితులకే పట్టాభిషేకాలు జరిగే పరిస్థితులు పెరుగుతూన్నప్పుడు, అంతా కలసి ఆ పరిస్థితులను సంస్కరించి, సజావుచేయవలసింది పోయి - పదవీ అధికార పట్టాభిషిక్తులవడానికి తామూ అంతకంటే ఎక్కువగా నేరాలకూ, ఘోరాలకు ఒడిగట్టే స్థితికి పాల్పడుతున్నారా లేదా? అంటే ఏమిటన్నమాట! నేరాలకు తగిన శిక్షలుండి, నేరస్తులూ శిక్షల పాలయితే తప్ప - మిగతా వారికి తాము నేరం చేయకూడదన్న తలంపు, చేస్తే శిక్షపడుతుందన్న భయమూ కలగవు'' అన్నాడు భాస్కరం.

"రాష్ట్రపతి అంటే ఈ దేశానికి ప్రథమ పౌరుడు. రాజకీయాలు నేరమయం అయ్యాయని ఆయనే ఆవేదన చెందుతున్నారంటే - అది ప్రజాభిప్రాయానికి దర్పణమే. కానీ చట్టాలు, శాసనాలు, సంవిధానాలు ఎలాంటివంటే - వాటికి ఆయనేనా బద్ధులేకదా! అమాయకులైన బస్సు ప్రయాణీకుల్ని నిష్కారణంగా కాల్చి తగులబెట్టిన నేరస్తులు ఏ కారణం వల్లనైతేనేమి ఆయన క్షమాభిక్షకు నోచుకునే అవకాశం

లభించిందంటే దానికి కారణం ఆయన - అంతరాత్మ సాక్షి అనో, ప్రబోధమనో అనలేం. అన్నా - ఆయనను అలా ఆలోచింపచేసిన పరిస్థితులూ, మన సంవిధానాలూ అలాంటివి - అని ఒప్పుకుని తీరాలి. అంటే ఏమిటన్న మాట! వ్యవస్థలోనే ఎక్కడో తిరకాసు వుంది. చట్టంలో సవరణలు తెచ్చినంత మాత్రాన, రాజకీయాల్లో నేర చరితులకు టిక్కెట్లు ఇవ్వబడని పరిస్థితి వచ్చి, సమస్యకు పరిష్కారం లభిస్తుందని అనుకోలేమని ఆయనే అన్నమాట - నిజమేగానీ, మానసిక పరివర్తనకు దోహదపడే విధంగా చట్టాలు వుండాలి. ఇప్పటికీ మనదేశంలో దైవభక్తి, పాపభీతి అనేవి మనుషుల్లో కొంతయినా మిగిలి వున్నాయి. కనుకనే ధర్మం, న్యాయం, నీతి, శాంతి అనేవి కనీసం ఒక్క పాదంతో అయినా కుంటుతున్నాయి" అన్నాడు చిదంబరం.

"మంచి మాటన్నావోయ్ చిదంబరం! ఇంకొక మాట చెప్పనా - అధికారమూ, పదవిలో వున్నవారు మామూలు ప్రజల్లా బేలమాటలూ, అసహాయతలూ వ్యక్తపర్చడం కాకుండా - లోపాలను సరిదిద్దే సంస్కరణల గురించీ, చట్టాలకు వున్న బలాలను గురించీ మాటాడుతూ, నిజంగా అందుకు అనుగుణమైన దిశగా అవకాశం వచ్చినప్పుడు తమ అధికారాలను వినియోగించి, నిరూపించి చూపగలగాలి. అప్పుడే ఆ పదవుల గౌరవం పెరుగుతుంది. దిశానిర్దేశం చేయగల హోదాలో, స్థాయిలో వున్నవారు - మానవీయ భావనలతో ఆలోచించడం, ప్రవర్తించడం ఎంత ప్రశంసనీయమో అవసరమైనప్పుడు తగిన సంస్కరణలకు అవకాశం కల్పించి, కొంత పారుష్యంగా మొదట తోచినా - పరిస్థితులను చక్కదిద్దే విధంగా - చట్టాలు బలంగా రూపొందడానికి దోహదపడి - వాటిని కఠినంగా అమలు జరగడానికి అవకాశం కల్పించాలి. సామ, దాన భేద దండోపాయాలు అని ఊరికే అనలేదు. ప్రజాస్వామ్య రాజకీయాల్లో వాటికి ఎప్పుడెప్పుడు ఎలా చోటిచ్చి శాంతి, సౌఖ్యాలనూ, సమ సమాజాన్నీ, - ఏర్పరచగలమన్నదే మన ముందున్న కర్తవ్యం" అన్నాడు గోపాలం.

*శనివారం, 20 జనవరి 2001*

# గోతులు తవ్వుదాం రండి!

'అశోకుడు రోడ్లు వేయించెను' అని పాఠంలో చదివి - 'అదేవిటి బాబాయ్! రోడ్లు తవ్వించెను' అని వుండాలేమో గదా? అని ఆరేళ్ళ మా అన్న కొడుకు - (ఆరేళ్లు...కొడుక్కి, మా అన్నకు కాదులే) అడిగాడు. దానిని బట్టి, ఇప్పటి కుర్రకారుకి మన రోడ్ల తవ్వకాల గురించి ఎంత గాఢమైన దృష్టి వుందో అర్థం కావట్లే" అన్నాడు చిదంబరం.

"రాజధానిలో రోడ్ల కథ, చిదంబర రహస్యమేమీ కాదులేవోయ్! ఏ విదేశీ అతిథో వస్తున్నాడని రాత్రికి రాత్రి రోడ్డు పడుతుంది. ఆయన అట్లా వచ్చి తుర్రుమనగానే రాత్రికి రాత్రి అదే రోడ్డు తవ్వకాల పాలవుతుంది. ఏదో గుప్తనిధుల కోసం తవ్వినంత హడావుడిగా మళ్లీ ఎవరూ చూడకుండా పని కానిచ్చేసుకోవాలన్నంత ఆత్రంగా తవ్విపారేస్తారు. రోడ్లన్నీ గతుకులు, గుంతలు. దాన్ని మళ్లీ పూడ్చడం మటుకు ఓ పట్టాన జరగదు. ఈలోగా ఆర్థోపెడిక్ డాక్టర్లు బాగుపడేలా ఆ గోతుల్లో పడి కాళ్లు చేతులు విరగ్గొట్టుకునేవారు, గ్యారేజీల వాళ్లు బాగుపడేలా వాహనాలు వాటిల్లో పడి దెబ్బతినడాలూ పెరగడం సంభవమవుతూంటుంది. ఈ రోడ్డు చాలాబాగుంది అని గట్టిగా అనుకోడానికి లేదు. అనుకున్న మర్నాడు ఆ రోడ్డు అవతారమే మారిపోతుంది" అన్నాడు సన్యాసి.

"నీటిపారుదల, టెలికాం, విద్యుత్ శాఖ అధికారులు ప్రజా సేవకోసమే, వాళ్లకా సదుపాయాలను విస్తరించడానికే రోడ్లను యథేచ్ఛగా తవ్వేస్తూ వుంటారాయె. మరి ప్రస్తుతం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇంటింటికీ విస్తరించాలని ఆశిస్తుండడంతో ప్రైవేటు కంపెనీలు అంటే టాటా, రిలయెన్స్, ఎయిర్‌టెల్, జీటివి, ఇన్‌కేబుల్ లాంటి కంపెనీలన్నీ రోడ్ల తవ్వకాల్లో పోటీపడుతున్నాయి. 'అయ్యా! మూడు నెలలు ముందుగా చెప్పండయ్యా' అని మున్సిపల్ అధికారులు ఎంత మొత్తుకుంటేమటుకు లాభం ఏమిటి? ఎవడిపని వాడికైపోవాలి. బిఎస్ఎల్, విదేశీ సంచార్ నిగమ్ లాంటి సంస్థలు కూడా తామూ రోడ్లు తవ్వాల్సిందేనని ఉత్సాహిస్తున్నయి" అన్నాడు శర్మ.

"ప్రభుత్వ ప్రైవేటు ఏజెన్సీలు ఒక ప్రణాళిక లేకుండా చేస్తున్న ఈ రోడ్ల తవ్వకాల వల్ల ప్రయోజనం మాట ఎలావున్నా నష్టాలు సంభవిస్తున్నాయి. రోడ్ల అందాలు తగులడడం మాట అటుంచి నీటి పైపులకు, డ్రైనేజీ సిస్టంకు, విద్యుత్‌కు, టెలిఫోన్ లైన్లకు కూడా దెబ్బ తగిలి అవాంతరం ఏర్పడుతోంది. రోడ్డు కటింగ్ చార్జీలు

మున్సిపాల్టీ వసూలు చేసే మాట నిజమే అయినా, పైపులైన్లు, డ్రైనేజీ గొట్టాల కంటే రోడ్డు కటింగ్ చార్జీలు ఎక్కువవుతున్నాయని వాటర్‌వర్క్స్ లాంటి డిపార్ట్‌మెంట్స్ గోలెడుతున్నాయిట. అసలు అందుకే ఇటీవల ట్రెంచ్‌లెస్ టెక్నాలజీ యంత్రాన్ని కొని రోడ్లతవ్వకం పని సులభం చేయాలనీ, రోడ్డు ఉపరితలంనుండి ఒక మీటరున్నరగుంత తవ్వి దాని ద్వారా భూమిని చీల్చుకుంటూ సొరంగంలా చాలా దూరం వెళ్లగలిగే ఈ యంత్రం ద్వారా తవ్వకాల బెడద తగ్గించాలనీ భావించారు. కానీ మన రోడ్లకూ అందునా రాయిరప్పా వుండే హిల్స్ ప్రాంతాల రోడ్లకు ఆ యంత్రం వేస్ట్ అని తేలింది. కోల్‌కటా నగరంలో ఇదే యంత్రంతో రెండు గంటల్లో కిలోమీటరు పొడవు రోడ్డు చీల్చగలిగితే, మన దగ్గర సగం రోజుకి పైగా పడుతోందిట" అన్నాడు గోపాలం.

"జరగవయ్యా జరుగు. ఇంఖహడొస్తున్నాడు' అని బాపు కార్టూన్ గుర్తొస్తుంది నాకు. దారమ్మట పోయేవాడు - అలానే పక్కగా పోతున్న ఏ అందమైన అమ్మాయినో చూస్తూ గోతిలో పడే సంఖ్య గణనీయంగా పెరిగేలా మన గోతులు వుంటున్నాయన్నమాట. ఇక, వాహనాల వాళ్ల సంగతి సరేసరి. అందమైన ఏ హోర్డింగో ఆకర్షిస్తే కాస్తచూపు అటు మళ్లిందా బ్యాలన్స్ తప్పి పడ్డాడన్నమాటే. 'రామ్మారా' అంటూ ఏ మ్యాన్‌హోలో, గొయ్యో రెడీగా వుంటుంది. అసలు ఇలా రోడ్లు ఎవరిమానాన వారు తవ్వి పారేయకుండా ఓ పద్ధతిఅంటూ ఏమీ కుదరదా" అన్నాడు చిదంబరం.

"ఎందుకు కుదరదయ్యా! మహా బాగా కుదుర్తుంది. ఆ మాట మున్సిపల్ అధికారులూ అంటున్నారు. కానీ క్రమశిక్షణతో అంతా కలిసిరావాలి కదా! ప్రైవేట్ ఏజెన్సీలు, ప్రభుత్వ శాఖలు ఎవరి అవసరాలకు వారు రోడ్డు తవ్వే అవసరం లేకుండా అందరి వినియోగానికి వీలుగా మార్గం ఏర్పాటుచేసి సుగమం చేసే వీలుంది. దానినే 'కామన్‌డక్ట్' అంటారు. రోడ్డును నిర్దుష్ట మార్గంలో ఓ పది అడుగుల ఎత్తు వుండేలా సొరంగందారిగా తవ్వి, అందులో ప్రత్యేకంగా అరలు ఏర్పరచవచ్చు. పైప్‌లైనులు వేయాలనుకున్నా కేబుల్స్ వేయాలనుకున్నా తగిన రుసుముకు ఎవరికి వారికి వేరు వేరు అరలను కేటాయించవచ్చు. తమ అరను లాక్ చేసుకునే వీలు కూడా వుంటుంది. తమ పైప్‌లైన్ సామర్థ్యం, కేబుల్ వైర్ సామర్థ్యం అనుసరించి అరలను ఎంచుకునే అవకాశం ఆ కంపెనీలకు వుంటుంది. విదేశాల్లోని ప్రముఖ నగరాల్లో ఈ 'కామన్ డక్ట్' విధానం చక్కగా అమలువుతోంది" అన్నాడు గోపాలం.

"మనసుంటే మార్గం వుంటుందన్నారయ్యా గోపాలం! మన వాళ్లకు పోటీతత్వం, అవతలివాడిని పడగొట్టి అయినా, తాము ఎదగాలన్న తత్వం వుండడంవల్లే - గోతులు తీయడంలో కూడా 'ఎదుటివాడికి ఎలా గోతులు తవ్వాలా' అనే దృష్టి ఎక్కువ. తాను

తీసిన గోతిలో అవతల వాడు పడకూడదనీ, తానే పడాలని ఆకాంక్ష. ఎదుటివాడికోసం కాదు - ఈ గోతులు తనకోసం తవ్వుకోవడంవల్లే, ఎదుటివాడి అవకాశాలు పోగొట్టడం ద్వారా వారి బిజినెస్‌కు చక్కగా గోతులు తవ్వానని సంతోషిస్తున్నాడన్నమాట. ట్రెంచ్‌లెస్ టెక్నాలజీ వల్లకాదనీ, 'కామన్ డక్ట్' సంగతి చూద్దాంలెమ్మనీ నిర్లక్ష్యంవహిస్తుండడం వల్లనే రహదారులు ఎప్పుడుపడితే అప్పుడు, ఎవరి బుద్ధికి ఎలా తోస్తే అలా, గునపపుపోట్లకూ, గుండెపోట్లకూ గురయ్యి తూట్లు పడుతున్నాయి. 'రోడ్డు ఆత్మకథ' అని రాస్తే అద్భుతమైన కావ్యం అవుతుంది" అన్నాడు సన్యాసి.

"కళ్లుంటే చాలదు. ఆ కళ్లకు చూపు వుండాలి. 'చూపు'అంటే విజన్. ఊరికే 'ట్వంటీ ట్వంటీ', 'ఫిఫ్టీ ఫిఫ్టీ' అంటే సరిపోదు. వ్యక్తి స్వార్థ ప్రయోజనాలు కాక, ప్రజల సామూహిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకున్నప్పుడు - 'కామన్ డక్ట్' లాంటిది 'అనివార్యమైన యాక్ట్'గా రూపొందించి అమలుపరచడం కష్టమేమీ కాదు. 'అందరికోసం' అనే కొందరయినా, కామన్‌గా సరైన విజన్‌తో వ్యవహరించాలి కదా మరి! రోడ్లు వేయించడంతో సరిపోదు. వేయించిన రోడ్లమీద 'వే' సరిగా వుండేలా, ప్రయాణం సజావుగా సాగేలా చూడాలి" అని తేల్చాడు చిదంబరం.

*శనివారం, 24 ఫిబ్రవరి 2001*

# 'తాళి' బన్స్

"తాళిబన్లు అంటే ఎవరు ఫణి మామా" అని అడిగాడు స్నేహిత్.

"స్త్రీలు" అన్నాడు క్లుప్తంగా ఫణి.

"ఏమిటోయ్! ఆ చెప్పడం" అన్నాను నేను.

"మరి మీవాడు తాలిబన్లు అనలేదు. 'తాళి'బన్లు అన్నాడు కదండి బావగారూ!" అన్నాడు ఫణి.

"అయితే మటుకు"

"బుద్ధ విగ్రహాల్ని బద్దలు కొట్టేది తాలిబన్లు. బుద్ధిగా బుద్ధుడిలా వుండే మగవాళ్ళ విగ్రహాన్నీ, నిగ్రహాన్నీ బద్దలు కొట్టేది స్త్రీలు అనగా 'తాళి'బన్లు" అన్నాడు ఫణి.

"వింటున్నా వింటున్నా! ఒరేయ్ తమ్ముడూ! నీ 'మేల్‌ఛావనిజం' నీకేం 'మేలు' చేయదురొరేయ్! నిన్నగాక మొన్నే అంతర్జాతీయ మహిళాదినోత్సవం జరిగింది. మొక్కుబడిగా -'స్త్రీలు అన్ని రంగాలలో ముందుకు రావాలి. స్త్రీలపై అణచివేత నశించాలి' అని నీబోటి కవిపుంగవులంతా సభల్లో, సమావేశాల్లో, పత్రికల్లో, కవితల్లో నినాదాలు చేసి అంతటితో పని అయిపోయిందని చేతులు దులిపేసుకుని పబ్లిగ్గా ఫెమినిస్టులుగా, ప్రైవేట్‌గా మేల్ ఛావనిస్టులుగా వ్యవహరించడమంత ఆత్మవంచన, కుట్ర ఇంకొహటి లేదు" అంటూ వంటింట్లోంచి రయ్యిమని దూసుకొచ్చింది మా ఆవిడ.

"దొరికిపోయావ్ మావా" అన్నాడు స్నేహిత్.

"చేసుకున్న వాళ్లకు చేసుకున్నంత మహదేవ" అన్నాను నేను.

"అట్టే ఆగండి. అంటే ఏమిటి మీ ఉద్దేశం? వాడింకా పెళ్లి చేసుకోలేదు. చేసుకున్నది మీరు. మీరిప్పుడు మహదేవా' అనుకోవాల్సిన పరిస్థితి ఏమిటిట మహానుభావా" అంది శ్రీమతి.

"చెప్పు మహాను'బావా'" అన్నాడు ఫణి.

"ఓర్నాయనో! అక్షయ తూణీరంలోని బాణం నా వైపు సంధించావేమిటి రాణీ" అన్నా నేను.

"రాణీ! రేరాణీ! అంటూ ఫ్యూడల్ రాచరికపు సంబోధనలు చేయకండి. నాకు గిట్టదు. అసలు మీ మగాళ్లంతా ఒకటే. మొగుడుకాని, తమ్ముడుకాని, పుత్రుడుకాని అంతా మగబుద్ధి పోనిచ్చుకోరు ఇసుమంతయినా" అంది తను.

"ఇది మరీ బావుందక్కా! మగాళ్లకు మగబుద్ధికాక ఆడబుద్ధి ఎలా వుంటుంది. అయినా అసలు బుద్ధికి ఆడా, మగా ఏమిటి" అన్నాడు ఫణి.

"మహదేవా' అన్నారుగా! మహదేవుడంటే శివుడు. శివుడంటే అర్ధనారీశ్వరుడు. అంటే ఆడా, మగా, ఫిఫ్టీ ఫిఫ్టీ అన్నమాట. స్త్రీని అందునా భార్యను 'అర్థాంగి' అన్నారు. మహిళను 'ఆకాశంలో సగం' అన్నారు. ప్రపంచ జనాభాలో సగం స్త్రీలే. కానీ పార్లమెంటు సీట్లలో ముప్పయ్ శాతం ఇవ్వడానికి గింజుకుపోతున్నారు. లలనలు ఊరుకోరు. తరుణులు తాము అనుకున్నది సాధించితీరుతారు" అంది ఆవేశకంఠంతో శ్రీమతి.

ఫణి కిసుక్కున నవ్వాడు.

"నవ్వుతావేమిట్రా" అని కళ్లెర్ర చేసింది తను.

"అబ్బే! అది కాదక్కా! స్త్రీ, మహిళ, లలన, తరుణి అటూ పలు పర్యాయవాచక శబ్దాలు వాడావుకదా! వాటిని అసలు సాధికారికంగా, ఉచిత పద ప్రయోగాలుగా ప్రయోగించావా? వాటి అర్థాలు నీకు తెలిసే అలా వాడావా? అని నవ్వొచ్చింది" అన్నాడు ఫణిగాడు.

"అంటే ఏమిటట? అంది తను.

"మహిళ అంటే అసలు 'మత్తిల్లిన స్త్రీ' అని అర్థం. 'లలన' అంటే లాలిత్యం గలది. తరుణి అంటే వయసులోవున్నది. ఒక్కో పదానికి ఒక్కొక్క వ్యుత్పత్తి అర్థం వుంది. అసలు అది తెల్సా నీకు" అన్నాడు ఫణి.

"ఇప్పుడు వ్యాకరణం మీద లెక్చరా"

"వ్యాకరణం మీద కాదు. వ్యాకరణం గురించి అనాలి"

"ఒక్కటిస్తా. విషయాన్ని పక్కదోవ పట్టించడం వుంది చూసావా? అదే అసలు మగబుద్ధి" అంది తను.

"అయిలే. నాన్నగారూ! మిమ్మల్నే అంటోంది" అన్నాడు స్నేహిత్.

"ఏడిశావ్ వెధవా" అంది తను.

"అసలు 'వెధవ' అనే పదం నిఘంటువులలో లేదు తెలుసా అక్కా! 'విధవ' అంటే పెనిమిటి లేని స్త్రీ అని అర్థం వుంది కదా అని, 'వెధవ' అనేది స్త్రీ లేని ఏ పెనిమిటి నుద్దేశించో అనుంటారు" అన్నాడు ఫణిగాడు.

"అంటే వెధవ అంటే భర్త అని అర్థమా మామా" అన్నాడు స్నేహిత్.

"మీరిద్దరూ నోరు మూస్తారా! ఇదే సుత్తి వాగుడు అంటేనూ. ఇలా బండగా, మొండిగా మాటాడ్డం కూడా మగబుద్దే. మృదువుగా, మంచిగా, లాలిత్యంగా మాటాడుతాం కాబట్టే 'కాంతాసమ్మితం' అన్నారు" అంది శ్రీమతి.

"అసలు నీకో విషయం తెలుసా అక్కా! మగువ అన్నదానికి స్త్రీ అని అర్థం చెబుతున్నారు కానీ మగు అంటే అసలు మగవాడనే. మగు అంటే మగ వాడి వంటి 'వ' అంటే వాక్కు, నోరు కలది అనే అర్థంలో 'మగువ' అనే మాట వచ్చింది. మగువలు అంటే అర్థం..."

"నోప్రాబ్లం! అననీ! మాకు అలాంటి గొంతుండనీ. మీరు గొంతెట్టుకు అరిచి ఆధిక్యం చూపగలమనుకుంటారు. నిజానికి మేం అలా అనుకోము. అదీకాక అసలు ఈ పదజాలం అంతా సృష్టించింది మీ మగ సమాజం కాదూ! ప్రాచీన సాహిత్యమూ, మునుపటి కవులూ, రచయితలూ, స్త్రీల గురించి సృష్టించిన వైపరీత్య భావజాలాన్నంతా త్రోసిరాజనడమే మా సంకల్పం. స్త్రీవాద కవిత్వానికి మీరంతా ఎలా గింజుకున్నారో మాకు తెలుసు. ఫెమినిజం అంటే ఇప్పటికీ మీలో చాలామందికి వణుకే. ఫెమినిస్టులు పురుష ద్వేషులేం కాదు. పురుషాహంకారాన్ని, అధిపత్యాన్ని ద్వేషిస్తారు. కుటుంబాన్ని కాదనడం వారి సంకల్పం కాదు. కుటుంబం పేరిట గుర్తింపు లేని చాకిరీని నిరసిస్తారు. సంతానోత్పత్తి, లైంగికత్వం, ఇంటిపని ఇవన్నీ స్త్రీ వ్యక్తిగత సమస్యలు కాదు. సామాజిక సమస్యల్లోని భాగంగా గుర్తించినప్పుడే ఆశించిన మార్పు సాధ్యం. స్త్రీల సాధికారికత పురుషప్రపంచం ఇచ్చే దానం కాదు. మా స్వతస్సిద్ధ హక్కు. సమానహక్కు. అవసరమైతే పోరాడే సాధించుకుంటాం. పైకి బుద్ధ విగ్రహాల్లానే వుంటూ స్త్రీలను అణచివేతకు గురిచేసే పురుషాధిక్య సమాజ విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి మీరు 'తాళి'బన్లు అని మమ్మల్ని అన్నా సరే! క్షమించకూడని చరిత్రను నిర్ద్వంద్వంగా తిరస్కరించి కొత్త చరిత్ర రాస్తాం" అంది శ్రీమతి ఆవేశంగా. కానీ తన గొంతులోని స్థిరతకు మేం కట్టుబడిపోయాం.

*శనివారం, 10 మార్చి 2001*

# రికార్డు బ్రేక్!

"రికార్డ్ బ్రేకొ" అన్నాడు స్నేహిత్.

"పోతే పోయిందిలే. సి.డి. కొనుక్కుందాం. పాత పాటలు కూడా సి.డి.ల్లో వస్తున్నాయి" అన్నాడు ఫణి నవ్వుతూ.

స్నేహిత్ వాళ్ళ మామ వైపు గుర్రుగా చూసాడు. "మనింట్లో గ్రాంఫోన్‌రికార్డు ఎప్పుడో వుండేదనీ, అది వెళ్ళిపోయినా - అప్పటికొన్ని సెవన్టీఎయిట్ **ఆర్.పి.ఎం.** రికార్డులు మిగిలివున్నాయనీ, అందులో రికార్డే ఇప్పుడొకటి పగిలి పోయిందనీ నా ఉద్దేశ్యం కాదని నీకూ తెలుసు మామాజీ! అనవసరంగా సైడ్‌ట్రాక్ చేయకు విషయం" అన్నాడు.

"ఒరేయ్ తమ్ముడూ! వాణ్ణెందుకురా ఏడిపిస్తావ్! క్రికెట్‌లో రికార్డు సృష్టించిన మన తెలుగు హీరో వి.వి.ఎస్.లక్ష్మణ్ గురించివాడు ఆనందపడుతున్నాడని నీకు తెలీదాఏంటి! 70 ఏళ్లభారత్ క్రికెట్ చరిత్రలో ఒక ఇన్నింగ్స్‌లో ఇంత వరకూ ఏ భారత క్రికెటరూ సాధించనన్ని పరుగులు తీసి కంగారూలకు కంగారెత్తించాడు కదా లక్ష్మణ్! అవును కదరా కన్నా" అంది మా ఆవిడ.

"యూ ఆర్ గ్రేట్ మమ్మీ! లక్ష్మణ్ విజయం వల్లనే మ్యాచ్ ఫిక్సింగ్‌ల మచ్చతో అందరూ ఆసక్తి కోల్పోతున్న క్రికెట్‌పట్ల మళ్లీ నూతనోత్తేజం, ఆసక్తీ కలిగాయి. అదీ రికార్డు బ్రేకే" అన్నాడు స్నేహిత్, వాళ్లమ్మ తన అంతరంగాన్ని గ్రహించిన ఆనందంతో.

"కానీ ఒరేయ్ భాంజా! మచ్చలు ఒక చోట పోతే, మరో చోట వస్తున్నాయి. ఫలానాది స్వచ్ఛంగా వుంది అనుకోడానికి వీల్లేదు. ఓ లక్ష్మణ్ 'నాటౌట్' అయితే ఇంకో లక్ష్మణ్ 'డకౌట్' అయి ఇంకో రికార్డు బ్రేకయింది. బి.జె.పికి దళిత సారధ్యం అన్న గొప్ప రికార్డు నిలదొక్కుకోకుండానే, పార్టీ ఫండ్ కోసం పడిన కక్కుర్తివల్ల, బంగారం లాంటి పదవిని త్యజించక తప్పలేదు బంగారు లక్ష్మణ్‌గారికి. అసలు కధకు సారధ్యం ఎవరు వహించినా దొరికిపోయిన దోషానికి ఎవరో ముందు 'బక్రా' కావలసిందే కదా! ప్రధాని అన్నట్లు 'దాల్ మే కుఛ్ కాలా హై'. వెనుక ఏమున్నా ముందు మాడుపగిలే స్థితయితే వచ్చింది. అదీ రికార్డు బ్రేక్" అన్నాడు ఫణిగాడు.

"ఒరేయ్ తమ్ముడూ! డబ్బెవరికి చేదు చెప్పు. నిజంగా అధికారంలో వున్న పార్టీకి విరాళాలు వస్తుంటాయి. వాటిని స్వీకరించకుండా ఏ పార్టీ వుంది చెప్పు" అంది శ్రీమతి.

"అక్కా! కధ వట్టి విరాళానికి సంబంధించిందయితే పేచీయేలేదు. కానీ మొన్నటి దాకా తమ నైతికత గురించీ, స్వచ్ఛతను గురించీ ప్రజలను ఊదరగొట్టి, తామే మిస్టర్ క్లీన్‌ల మన్న భావన కలిగించి, అధికారంలోకి వచ్చిన ఒక పార్టీకి - అధ్యక్షత వహిస్తున్న పెద్ద మనిషి - ఎవరికో రాజకీయంగా పనులు చేసి పెట్టడానికి ఒప్పుకుంటూ, అందుకు ప్రతిగా పార్టీ ఫండుగా విరాళం సేకరించాం అంటే, అది విరాళం ఎందుకవుతుంది లంచం అవుతుంది గానీ! మిగతా పార్టీలన్నింటికన్నా తమదే గొప్ప స్వచ్ఛమైన ఉదాత్తవిలువలుగల పార్టీ అని నమ్మబలికిన వారు, ఇవాళ మిగతా వారికి అవినీతిలో తామేమీ తీసిపోమని నిరూపించుకోగలిగారంటే నిజంగా అదీ రికార్డు బ్రేకే కదా" అన్నాడు ఫణిగాడు.

"అసలు తెహల్కా డాట్‌కామ్ వాళ్ళు ఈ ప్రోగ్రాం ఎందుకు చేసినట్లు మామాజీ" అని ప్రశ్నించాడు స్నేహిత్.

"కరెక్ట్‌గా అడిగావురా! ఒరేయ్ తమ్ముడూ! వీడికి నువ్వు సమాధానం చెప్పు. డాట్‌కామ్ వాళ్ళ ప్రోగ్రాంకు ఎవరో స్పాన్సరర్లు వుండకుండా వుంటారా? అసలు నిర్మాతలు, దర్శకులు ఎవరో వుండి వుంటారు. 'దాల్ మే తో కుఛ్ కాలా హై' అంటే ఆ నల్లమట్టి బెడ్డలు పప్పులో కలిపిన హస్తమేదో వుండే వుంటుంది కదా! కావాలని అప్రతిష్టపాలు చేయడానికీ, సంక్షోభం సృష్టించడానికీ, రాజకీయంగా జరిగిన కుట్ర ఎందుకు కాకూడదూ" అంది శ్రీమతి.

"అక్కా! ఒక్క విషయం గుర్తుపెట్టుకో. అధికారంలో, కుర్చీలో వున్న వాడు తనను పడగొట్టే పనులు జరుగుతుంటాయనే జాగరూకతతో ఎప్పుడూ వుండాలి. పదవి, అధికారం ఏదీ గులాబీల పాన్పు కాదు. ఒకవేళ అలాగే అనుకున్నా, గుచ్చే ముళ్లు అంటిపెట్టుకునే వుంటాయనీ, అవి గుచ్చుకోకుండా వ్యవహరించాలనీ గ్రహించుకుని వర్తించగలగాలి. తాము అధికారంలో వున్నాం కాబట్టి, ఏం చేసినా చెల్లుతుందనీ, ఏదయినా ప్రతికూలత వచ్చినా తమ అధికారంతో అణచివేయగలమనీ అనుకోవడం పొరపాటు. పార్టీ అధ్యక్షుడిగా బంగారు లక్ష్మణ్ చేసిన దానికి, ప్రధానిగా తనకు ప్రమేయం లేదని వాజ్‌పేయ్‌గారు అనలేరు కదా! ఎటొచ్చీ ఆయనే అన్నట్లు మచ్చ తెచ్చిన పని వెనుక కథనం బయల్పడాలి. రక్షణ శాఖ, ఆర్మీల కేంద్ర బిందువుగా ఈ అవినీతి భాగోతం బయల్పడడం మరింత అప్రతిష్ఠాత్మకమైన విషయం" అన్నాడుఫణి.

"సరిహద్దుల్లో కమ్యూనికేషన్ వ్యవస్థ ఏర్పాటుకు సంబంధించి ఇజ్రాయిల్ కంపెనీతో హోం మంత్రి ఎల్.కె. అద్వానీ కార్యాలయం 1300 కోట్ల రూపాయల ఒప్పందం

చేసుకుందనీ, ఈ వ్యవహారంలో కూడా 325 కోట్లు చేతులు మారాయనీ తెహల్కా డాట్ కామ్ మరో రికార్డు వేసింది మామాజీ" అన్నాడు స్నేహిత్.

ఈ దేశంలో ఇవన్నీ ఇప్పుడు అతి మామూలై పోతున్నాయి. ఉత్థాన చరిత్రలూ వుంటాయి. పతన చరిత్రలూ వుంటాయి. ఉత్థానమనుకున్న దానిలో పతన అంశాలు ఒక్కసారిగా బయటపడితే హఠాత్తుగా జీర్ణించుకోవడం కష్టం. తెల్లటి బట్టలు వేసుకువెడుతున్న వాడిమీద, వాడు ఎంత సామాన్యంగా తనదారినతాను పోతున్నా, ఏ కారులో వెళ్ళేవాడో శాడిస్టుగా బురదచల్లే ప్రయత్నం చేస్తాడు. అలాగని అసలు తెల్లబట్టలు కట్టుకోకుండా వెళ్ళడమే సబబు అని నిర్ధారించలేం కదా! కానీ ఇటీవల ఏ రంగం చూసినా ఎంతో కొంత కల్మషం, కశ్మలం లేనిదంటూ ఏదీ కనిపించడంలేదు. 'దాల్ మే తో కుఛ్ కాలాహై' అని అనుకోవడం మాత్రమే కాదు! అందువల్ల ఎంతో కొంత - మచ్చే అందం, ఆనందం అనే భావుకతకు ప్రతివాడూ లోనవుతున్నాడేమో ననిపిస్తోంది. విలువలు మారుతున్నాయి. మారుతున్న విలువలతో బాటు ఆలోచనా విధానాలు మారుతున్నాయి. దొరికితే దొంగలు. దొరక్కపోతే దొరలు. 'ఒక్క వేలు చూపి ఒరులను నిందించ మూడువేళ్లు నిన్ను వెక్కిరించు' అన్న చందాన అందరిదీ అంతో యింతో గురివింద చందమే. తన నలుపును తాను గ్రహించి స్వస్వరూప జ్ఞానంతో తనను తాను సవ్యంగా తీర్చిదిద్దుకోవాలిగానీ - అద్దం బద్దలు కొట్టి 'రికార్డు బ్రేక్' అంటే సరికాదు.

*శనివారం, 17 మార్చి 2001*

# కలిపి కుట్టే నైజం!

'క్రానియోపాగస్' అన్నాడు చిదంబరం అంతవరకూ చదివిన పేపర్ ముడిచి టేబుల్ మీద పడవేస్తూ.

"ఎవరూ?" అని అడిగాడు సన్యాసి.

"ఎవరేమిటి?"

"ఎవర్నో క్రాక్, పాగల్ అనీ, పిచ్చివాళ్ళనీ తిడుతున్నావ్ కదా" అన్నాడు సన్యాసి. గోపాలం, చిదంబరం ఘొల్లున నవ్వారు.

"నవ్వుతారేమిటీ" అన్నాడు సీరియస్‌గా మొహం పెట్టి సన్యాసి.

"నేనన్నది 'క్రానియోపాగస్' అని. అది నీకు క్రాక్, పాగల్ అని వినబడింది మరి! మెదడు కలిసిపోయి పుట్టే కవలల పుట్టుకను క్రానియోపాగస్ అంటారు. నేపాల్‌కు చెందిన స్కూల్ టీచర్ సంధ్యకు పుట్టిన ఇలాంటి కవల అమ్మాయిల్ని, సింగపూర్ ఆస్పత్రి వర్గాలు 96 గంటలపాటు అత్యంత అరుదైన శస్త్ర చికిత్స చేసి, విజయవంతంగా వేరు చేసి బ్రతికించారు. పదకొండు నెలల క్రితం తలలు అంటుకుపోయి పుట్టిన జమునా శ్రేష్ఠ, గంగా శ్రేష్ఠలకు పునర్జన్మనిచ్చినట్లయిందని పేపర్లో చదివి 'క్రానియోపాగస్' అనే ఆ పదాన్ని జనాంతికంగా ఉచ్చరించాను నేను! నువ్వేమో క్రాక్, పాగల్ అని ఎవర్నో తిడుతున్నాననుకున్నావ్ టాలెంట్‌గా" అన్నాడు చిదంబరం.

"అదేమిటి? 'సయామీస్' కవలలు అని అనడం పేపర్లో చదివానే నేను" అన్నాడు సన్యాసి.

"శరీరభాగాలు కలగలసి జన్మించడాన్ని సయామీస్ అంటారు. తలలు కలసిపోవడమేకాక వారిలో మెదడు కూడా కలగలసిపోవడంతో ఈ శస్త్రచికిత్స చాలా కష్టమైంది, విశిష్టమైంది అయింది. కలగలసిపోయిన మెదడులోని సూక్ష్మనరాలను వేరుచేసి ఎవరివి వారికి తిరిగి అతికించడానికి ఎంత ప్రయాసపడి వుంటారో డాక్టర్లు ఊహించు!

చాలా ప్రమాదాలతో కూడుకున్న ఇలాంటి అరుదైన శస్త్రచికిత్స ప్రపంచంలో జరగడం ఇది కేవలం నాలుగోసారిట. డాక్టర్ కీత్‌గో అనే వైద్య బృందం నాయకుడు ఈ మాట చెబుతూ, ఇప్పటికి వీటిలో ఒక్కటి మాత్రమే విజయవంతమైందని అన్నారు" అన్నాడు గోపాలం.

"గోపాలం! 'నాయకుడు', 'ఒక్కటే విజయం' లాంటి పదాలు నీ సైన్స్ కబుర్లలో చెబితే, సన్యాసి ఆలోచన ఎటో పోతుందయ్యా! అసలే మనం అన్నదొకటయితే క్రాక్, పాగల్ అనీ ఇంకోలా విషయం మార్చేస్తున్నాడు చూశావా" అన్నాడు నవ్వుతూ చిదంబరం.

"నా రాజకీయ స్పృహ మీకు అలా నవ్వుతాలు గానే వుంటుందిలే! కానీ చూడండి బ్రదర్! మెదడు అంటూ వున్నప్పుడు రాజకీయాల గురించి ఆలోచించకుండా వుండడం అనేది అసాధ్యం" అన్నాడు సన్యాసి.

"అవునా! ఛా! మాకు తెలీదులెండి! రాజకీయాలకు మెదడు అక్కర్లేదను కుంటున్నానే" అన్నాడు చిదంబరం.

గోపాలం చిదంబరాన్ని వారించాడు. "చిదంబరం! నువ్వన్నట్టు సన్యాసి ఆలోచనలు మనం అంటున్నదానినుంచి వేరే మలుపు తిరిగే మాట నిజమే కావచ్చు కానీ, దానిలో ఔచిత్యమూ, ఒకరకమైన అవినాభావ సంబంధమూ లేకపోలేదు. శరీర భాగాలు కలిసిపోయి పుట్టడాన్ని సయామీస్ అంటారు కదా, మెదడు కలిసిపోయి పుట్టడాన్ని క్రానియోపాగస్ అని ప్రత్యేకించి వ్యవహరిస్తారా అని సన్యాసి డౌట్! అంతేనా సన్యాసీ" అన్నాడు గోపాలం.

"అంతేనా అంటే ఇంకా వుంది గోపాలం! శాస్త్ర సాంకేతికంగా పురోగతి సాధిస్తూ, అభివృద్ధి పథంలో పోతున్నా క్రాక్, పాగల్‌గా తయారవుతున్న మన రాజకీయాల్లో నేర ప్రవృత్తి పూర్తిగా కలగలసిపోయింది కదా! రాజకీయాలు నేరప్రవృత్తి అనే దాన్ని మనం ఇప్పుడు సయామీస్ అనాలా, క్రానియోపాగస్ అనాలా అని నా డౌట్! ఏ సామాజిక వైద్యుడు శస్త్ర చికిత్స చేసి వాటిని విడదీయగలడు అని నా ఆర్తి" అన్నాడు సన్యాసి.

చిదంబరం సన్యాసివైపు మెచ్చుకోలుగా చూసాడు. "మంచి మాటన్నావ్ సన్యాసీ! నీ ఆలోచన అలా ఎందుకు పోయిందో ఇప్పుడు నాకు అర్థమైంది. ప్రతిదీ రాజకీయం చేయడం, రాజకీయమైన ప్రతిదానికీ అవినీతితో, నేరంతో విడదీయలేని సంబంధం ఏర్పడి పోవడం, నిజంగా విచారించదగిన విషయాలే. పక్కసందు రాజకీయాల నుంచి ప్రపంచ రాజకీయాల వరకూ నేడు నేరమూ, హింసా అనేవి విజయవంతంగా కలిసిపోతున్నాయి. విడివిడిగా వుండాల్సినవీ, అసలు వుండాల్సిన అవసరమే లేనివీ ఇలా కలగలసిపోవడం; నిజానికి కలసికట్టుగా వుండాల్సినవీ, ఏకోన్ముఖం కావలసినవి ఛిద్రమైపోవడం ఇంతకన్నా దారుణమేముంది చెప్పు! కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లున్న ఢిల్లీ నార్త్ బ్లాక్‌పైనే దాడి చేసే ప్రయత్నాలు జరిగాయంటే, విధ్వంసక ఆలోచనలు రాజకీయాల్లో ఏ స్థాయికి చేరుతున్నాయో ఇవాళ కొత్తగా చెప్పక్కర్లేదు. హత్యలు,

మారణకాండలు, మానవబాంబులు ఇవన్నీ రాజకీయ సంస్కృతితో 'సయామీస్'గానో 'క్రానియోపాగస్'గానో మారుతున్నాయన్నమాటేగా!'' అన్నాడు చిదంబరం.

"దుర్మార్గాన్ని దోపిడీని పారద్రోలడానికి వ్యవసాయాన్ని సమష్టీకరించడమే ఏకైక మార్గం' అని డా.బాబా సాహెబ్ అంబేద్కర్ అన్నారు. సోవియట్ రష్యా వ్యవసాయక పద్ధతిని అభినందిస్తూ అప్పట్లో ఆయన అన్నమాట అది. కానీ ఇవాళ వ్యవసాయ ప్రధానమనుకుంటున్న మన దేశంలోనూ వ్యవసాయ రంగం చిన్నచూపుకు గురౌతోంది. రైతుకష్టాలు ఇబ్బడిముబ్బడి అయ్యాయి. మన వ్యవసాయం అంతా ఇప్పుడు రాజకీయ వ్యవసాయమైపోయింది. ప్రపంచీకరణ పంట కోసం మనం ఇవాళ నాటుతున్న విత్తులు విస్ఫోటనాలవుతున్నాయి.

అంబేద్కర్ అన్నట్లే 'ఏ దారిలో వెళ్ళాలనుకున్నా కులమనే పెనుభూతం మనదారికడ్డంగా నిలుస్తుంది. కులభూతాన్ని చంపకుంటే రాజకీయ సంస్కరణలు, ఆర్థిక సంస్కరణలు విఫలమౌతాయి'. కానీ మనం ఆ భూతాన్ని పెంచి పోషిస్తున్నాం.

మొన్నటికి మొన్న మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ టంకర గ్రామంలో దేవాలయ ప్రవేశం చేసిన దళితులను నిర్బంధించి జరిమానా విధించిన అగ్రవర్ణ భూస్వామ్య ధోరణి బహిర్గతమైంది. తరతరాలుగా ఇలా విడదీయలేక అంటిపెట్టుకుని వున్న అనేక అమానుష అంశాలకు విజయవంతమైన శస్త్ర చికిత్స జరిగేదెప్పుడు? రాజకీయాలు హింసానేరాలు ఫిడివడి హింసానేరాలు శాశ్వతంగా కన్నుమూస్తే సంతోషమే, కానీ తమాషా ఏమిటంటే పోలీసులు, జైళ్ళు, రక్షణ శాఖ ఇవన్నీ నేరాలు హింసలమీద ఆధారపడి బ్రతుకుతున్నవే, వీటి బ్రతుకుతెరువు కోసం వాటిని పెంచి పోషించడమే కాకుండా వీలైనంత కలగలిపే చర్యలు జరుగుతున్నాయి. అదే అసలయిన విషాదం'' అన్నాడు గోపాలం.

*శనివారం, **14** ఏప్రిల్ **2001***

# అంతా నాటకం!

'**చె**ల్లియో చెల్లకో తమకు సేసిన ఎగ్గులు సైచిరందరున్' అని పద్యం ఎత్తుకున్నాడు ఫణిగాడు.

'వహ్వా! మావాజీ! ఇది ముషార్రఫ్ రాక సందర్భంగా హెచ్చరిక బాపతు పద్యమా? లేక నందీనాటకోత్సవాల 'ఉత్సాహ' వృత్తమా?'' అని ప్రశ్నించాడు స్నేహిత్.

"ఒరేయ్ భాంజా! నాటకం ఏదయినా హృద్యమైనదే. పద్యంతో రాణించేది ప్రస్తుతాన్ని అంతగా అలరించదేమోనని 'పాత కాలం పద్యమైతే వర్తమానం వచన గేయం' అని మహాకవి వాక్రుచ్చి వుండవచ్చు గానీ, పద్యాన్ని నెత్తిన పెట్టుకునే వాళ్ళు కవుల్లోనూ నాటకాభిమానుల్లోనూ కొల్లలుగా వున్నారిప్పటికీ''.

"కావచ్చు. కానీ పాయింటు పద్యం గురించి కాదు. అసలు నాటకం గురించనుకుంటాను'' అన్నాడు స్నేహిత్.

"నాటకాంతం హి సాహిత్యం అన్నారు. స'హిత' మైనదానికి నాటకం పరాకాష్ట అని భావన. నిజానికి నాటకమే సజీవం. ప్రపంచమే ఒక నాటక రంగం. ప్రజలంతా పాత్రధారులు. నడిపే సూత్రధారుడు. 'కలడు కలండనెడువాడు కలడో లేడో' అనే సదసత్సంశయానికి గురి చేస్తున్న ఓ 'శక్తి మానుడే' అన్నది ఆధ్యాత్మిక భావనగా కూడా చెలామణీ అవుతోంది. నాటకం లేకుండా కటికవాస్తవాలు తేటతెల్లం కావు. పైగా నాటకాల్లో అంతర్నాటకాలు వుంటాయి. 'అంత నాటకాలూ వేయాల్సిందేనా' అంటే రాజకీయాలు కూడా వత్తాసు పలుకుతాయి. వాజ్‌పేయి గారు ముషార్రఫ్‌ను చర్చలకు భారతదేశం ఆహ్వానించడం, ముషారఫ్ గారు చర్చల సంగతి 'అల్లా' వుంచినా, తను పుట్టిపెరిగిన ఇల్లు, తన బాల్యం ఓ మారు చూసి జ్ఞాపకం చేసుకునేందుకుని అయినా ఆనందంగా అంగీకరించడం, పాకిస్థానీ ఇస్లామిక్ గ్రూపులు చర్చలకు వద్దనడం, మాతో కూడా చర్చిస్తేగానీ కాశ్మీర్‌సమస్య కొలిక్కిరాదని హురియత్ నాయకులు హుంకరించడం ఇదంతా ఒక రాజకీయ నాటకం గాక మరేమిటి? అసలు సమస్యను పరిష్కరించాలన్న చిత్తశుద్ధి ఎందరిలో ఉందన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నేకదా'' అన్నాడు ఫణి.

'మామాజీ! నీ చింకి లెక్చర్ పొడుగాటి డైలాగులు వదులుకోలేని మన తెలుగు సాంఘిక నాటకం వ్యవహారానికి మంచి దాఖలాగా వుంది. సంభాషణలు సుదీర్ఘంగా

వుండడం వల్ల నాటకం రక్తి కడుతుందనుకోవడం పొరపాటు. సామాజికనిష్టమైన రసాన్ని పాత్రధారులు తమ అభినయ చర్యల ద్వారా ఉత్పన్నం చేయగలగాలి. 'వట్టి మాటలు కట్టిపెట్టోయ్' అని గురజాడ వూరికే అనలేదు. 'వూని ఏదైనను మేల్ చేసి జనులకు చూపవోయ్' అన్నాడు. అంచేత యాక్షన్ ప్రధానం. ఇక్కడ యాక్షన్ అంటే ఆచరణ అనేగానీ ఉత్తుత్తి నటన కాదుస్మీ'' అన్నాడు స్నేహిత్.

"ఒరేయ్ స్నేహితూ! నువ్వు తెలివి మీరిపోయావురా! నువ్వు మాటాడుతున్నదీ, మాటాడదలచిందీ రాజకీయాలో, నాటకమో తెలీకుండా రెంటికీ వర్తించేలా నర్మగర్భంగా పలుకుతున్నావ్. తొండముదిరి ఊసరవెల్లి అయిందంటే ఈ వ్యవహారమే'' అన్నాడు ఫణి.

"నో...నో! తొండ ముదిరి ఊసరవెల్లిగా రంగులు మార్చుకుంటున్న ఇన్నాళ్ళ కాశ్మీర్ కథనాన్ని వారం వారం శాస్త్రీయంగా భూమిలో చదువుతూ కూడా నీకింకా కాశ్మీర్ అంటే యాపిల్ పండ్లూ, యాపిల్ పండ్ల లాంటి అమ్మాయిలూ తప్ప సమస్య గురించిన పాయింట్ అర్థం కాలేదేమోనని నా డౌట్ మామాజీ! లేక అర్థమయ్యీ వ్యవహారం అమీతుమీ తేల్చలేని నాయకత్వం తంతేనా నీదీనూ'' అంటూ స్నేహిత్ ఫణిని నిలేసాడు.

"ఒరేయ్! నువ్వింకా బచ్చాగాడివి. ఓ వ్యాసమో, పుస్తకమో చదివేసి అంతా తెలుసు అనుకోకు. అసలు వ్యవహారం చాలా సున్నితమైనది. అమీతుమీ తేల్చేది అయితే ఇంత కాలం సాగదీయాల్సిన, ఐమీన్ సాగవలసిన అగత్యమే లేదు కదా! పుస్తకాలు చదివి, థియరీ పఠించి, ఒకడు నటుడు ఎలా అయిపోలేడో, రంగస్థలం మీద కెక్కి, పాత్రను జనం ముందు అభినయించి రసోత్పన్నం చేసి ప్రేక్షకుల కరతాళ ధ్వనులందుకుంటే తప్ప నటుడిగా ఎలా గుర్తింపు సాధ్యం కాదో, అదే విధంగా సమస్యను కూలంకషంగా గ్రహించడంతో చాలదు. వాస్తవిక సమాజ వేదికపై సాటి దేశాలనే పాత్రలతో బాటు కలసి వ్యవహరిస్తే తప్ప కొన్ని సమస్యలు పరిష్కారం కావు. పైగా కొన్ని ఒకదానితో ఒకటి ముడిపడిన సమస్యలు. చిక్కుపడిన దారాన్ని శ్రద్ధగా, సహనంగా ఎలా చిక్కులు విడదీయాలో అలాగే కొన్ని ప్రధాన సమస్యల పట్ల వ్యవహరించాలి. ముషార్రఫ్‌తో జరగబోయే మన వాజపేయ్ గారి చర్చలు ఆ దిశగా ఒక ముందుడుగు కాగలుగుతాయి. అంతే'' అన్నాడు ఫణి.

"మామాజీ! అసలు నాటకాలు ఆడుతోన్నది ఎవరంటావ్'' అని ప్రశ్నించాడు స్నేహిత్.

"ముమ్మాటికీ పాకిస్థానే అని మనకు తెలుసు. కానీ మనమేనని వాళ్ళంటారు. కానీ 'కనబడని చెయ్యేదో ఆడుతోంది నాటకం' అని భావించే వాళ్ళున్నారు'' అన్నాడు ఫణి.

"నేనొకటి అడిగితే నువ్వొకటి చెబుతావ్. నంది నాటకోత్సవాలకు ఎన్నికయిన నాటకాల గురించి నేనడుగుతోంది" అన్నాడు స్నేహిత్.

"నీ సంగతి నాకు తెలుసురోరేయ్! నేను ఆ సంగతి చెబితే నువ్వు 'నేనడుగుతోంది అసలు కాశ్మీర్ సమస్య పరిష్కార విషయంలో' అని ప్లేట్ ఫిరాయిస్తావ్. అసలు నాటకం ఆడుతోంది నువ్వే" అన్నాడు ఫణి నవ్వుతూ, "అబ్బే లేదు మామా! నాటకాలకు మంచి ఆదరణ లభిస్తోందనీ, ఆడిటోరియం అంతా నిండిపోయే సరికి ముందు వరండాలలో అమర్చిన టీవీ సెట్లలో కూడా ప్రేక్షకులు నాటకాలు చూసి ఆనందిస్తున్నారనీ చదివి ముచ్చటేసింది" అన్నాడు స్నేహిత్.

"నాటకానికి ఆదరణ ఎపుడూ వుంటుంది అల్లుడా! ఒకప్పుడు పద్య నాటకాలు ఆంధ్రదేశాన్ని ఎలా ఉర్రూతలూపాయో అందరికీ తెలుసు. ఇప్పటికీ పరిషత్తు నాటకాలు అంటే జనంలో ఎంతో క్రేజ్ ఉంది. అయితే ప్రయోగాల పేరుమీదా, పాశ్చాత్య నాటకాల ప్రభావంతోనూ, అక్కడి చారిత్రక నేపథ్యాన్నీ, మన సమాజ పరిస్థితులనూ బేరీజు వేసుకోకుండా కేవలం ఒక సుపీరియారిటీ ఫీలింగ్‌తో నాటక రచనలు చేసేవారూ, ప్రదర్శనలు ఇచ్చేవారూ తయారవడంతో నాటకం కూడా జనసామాన్యం నుండి దూరమవుతూ కేవలం మేధావుల క్రీడగా 'ప్రయోగం ప్రయోగమే' అన్నట్లుగా మిగిలిపోయే సందర్భాలూ చోటు చేసుకుంటున్నాయి. నేలవిడిచి చేసే సాము ఏదయినా గారడీయో, గమ్మత్తో అని పించుకుంటుంది గానీ జన ప్రయోజన హేతువు, రసానంద సేతువూ కాలేదు" అన్నాడు ఫణి.

స్నేహిత్ రెండు చేతులతో గట్టిగా తప్పట్లుకొట్టి "వెల్‌సెడ్ మామాజీ! వెల్‌సెడ్! రాజకీయానికయినా, రంగస్థలానికయినా అన్వయించే సంగతి చెప్పావ్! నువ్వొ ఎప్పుడో నాటకాలకు జడ్జి అయిపోతావు చూడు" అన్నాడు నవ్వుతూ. ఫణి నవ్వుతూనే స్నేహిత్‌కు ఒక జెల్ల కొట్టాడు.

*శనివారం, 2 జూన్ 2001*

# టీకప్పు 'సైన్స్'

**"టీ** రెడీ" అంది శ్రీమతి డైనింగ్‌టేబుల్ దగ్గర కంచంమీద చెంచాతో బెల్లుకొడుతూ.

"ఈ హెచ్చరికమోతలు ఎప్పటి నుంచి బావగారూ!" అన్నాడు ఫణి.

"నోర్మోసుకో తమ్ముడూ! ఇది హెచ్చరిక ఎందుకవుతుంది. ఇన్విటేషన్ అనగా ఆహ్వానం' అంది శ్రీమతి.

"టీ తాగడం అనేది ఒక మామూలు విషయం అయితే, ఉదయమే మొహాలు కడుక్కోగానే కాఫీ, టీలు సేవించడం యథాలాపంగా జరిగిపోయే విషయం. దానికి ఇలా రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్, ఘంటానాదం ఎందుకని నా డౌట్" అన్నాడు ఫణిగాడు.

"భలే మావాజీ! సరిగ్గా అన్నావ్. ఐ.ఐ.టి. కోచింగ్‌లో నా పురోగతి, అందుకు అవరోధాలు, పైగా ఆశించిన విధంగా మార్కులు రాకపోవడానికి నా బాధ్యత మొదలయిన విషయాలు చర్చకువచ్చి తానే కాకుండా, నాన్నగారి చేతా, నీ చేతా కూడా నాకు 'ప్రీచింగ్' క్లాసు పీకే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంచేత నేను ఈ టీపార్టీని బహిష్కరిస్తున్నాను" అన్నాడు స్నేహిత్.

"ఒరే స్నేహితూ! నీ చదువు విషయంలో చర్చలే అనవసరమని నా అభిప్రాయం. ఎందుకంటే అది చర్చనీయాంశం కన్నా, ముఖ్యంగా ఆచరణీయాంశం అన్న చిత్తశుద్ధి నీకుండాలి. నీ మేలుకోరి పెద్దలు చెప్పేమాట వినడానికికూడా నువ్వు సుముఖంగా లేకపోతే ఎలా?" అన్నాడు ఫణి.

"మీ అమ్మ ముషార్రఫ్ కాదు. నేనేమీ హురియత్ నేతనూ కాదు. ఒరేయ్ స్నేహితూ! నువ్వు ఎన్.డి.ఎ.లా, మీ ఫణి మామ కాంగ్రెస్‌లా ఫీలై పోయి 'ప్రభాత కాఫీ సేవనాన్ని' ఓ సమస్యగానూ, టీకప్పులో తుఫాన్‌గానూ చేయడం వుంది చూసారూ! దీన్నే గోరింతలు కొండంతలు చేయడం అంటారు" అన్నాను నేను.

"పొద్దున్నే అమ్మానాన్నల ముఖాముఖి సమావేశం జరిగితే అది వాళ్ళ ప్రైవేట్ వ్యవహారం. దానికి మన ప్రమేయం, ఇన్వాల్వ్‌మెంట్ ఎందుకు మామాజీ! వాళ్ళు టీ తాగుతూ ఏం భేటీ పడతారో వాళ్ళ ఇష్టం. మనకు కావలసింది మన వ్యవహారాలు చక్కబడటం. ఇల్లు అనే ఉపఖండంలో శాంతి నెలకొనడం. విజయాల దిశగా పురోగమనం చెందడం అంతేకదా" అన్నాడు స్నేహిత్.

"ఒరేయ్ భాంజా! నువ్వన్నమాట నిజమే గానీ, ఏకపక్ష నిర్ణయాలు జరగకుండా వుండాలంటే సుహృద్భావ చర్చలు జరగాల్సిందే. అయితే నువ్వన్నట్లు అన్నీ అందరి సమక్షంలో చర్చించేవి కాకపోవచ్చు. ప్రధానచర్చల ముందు కొన్ని ఉపసమావేశాలు జరిగితే దానికి బెంబేలు పడడం ఎందుకు?'' అన్నాడు ఫణి.

"ఒరేయ్! మీరు ఎవరొచ్చినా రాకపోయినా నా 'టీ' నేను తాగేస్తాను. మీ నాన్నగారు 'హుర్రే' అని వచ్చినా, 'వర్రీ' అని రాకపోయినా ఆగేది లేదు'' అంది శ్రీమతి వాళ్ళతో.

"బావగారు రాకుండా ఎలా అక్కా! అసలు ఆయనకు సంపూర్ణత నీతోనూ, నీకు సంపూర్ణత ఆయనతోనూ కదా'' అన్నాడు ఫణి.

"ఒరేయ్ తమ్ముడూ! దోజ్ డేస్ ఆర్ గాన్! అంటే ఆరోజులు పోయాయి. అసలు ఆడవాళ్ళు మగాళ్ళమీద ఆధారపడింది సంతానం కోసం. మగాళ్ళు తాము స్త్రీలను సంతానవతులను చేసి సృష్టిని సముద్ధరిస్తున్నామని బోర విరుచుకు తిరుగుతున్నారు. ఇప్పుడు పురుషుని అవసరం లేకుండానే సంతానం కనే సైన్సు వచ్చేసింది. సంఝో'' అంది శ్రీమతి.

"ఒరేయ్ స్నేహితూ! నువ్వేదో నోట్ బుక్ కొనుక్కోవాలన్నావుగా లేట్ చెయ్యకుండా వెళ్ళి కొనుక్కోరాదూ'' అన్నాను నేను. "ఫణి మామ డబ్బులిచ్చాడు. నేనిప్పుడే వస్తా'' అంటూ స్నేహిత్ బయటకు వెళ్ళాడు.

"అక్కా ఎదుగుతున్న పిల్లాడు. వాడిముందీ డైలాగులు ఏమిటే'' అన్నాడు ఫణి.

"అందుకేనటండీ వాణ్ణి నోట్‌బుక్ వంకన పంపించిందీ'' అంటూ శ్రీమతి -

"మనం చెప్పకపోతే మాత్రం వాడికి తెలియవనుకుంటున్నారా సంగతులూ! మనం చదవడానికయినా బద్ధకిస్తామేమోగానీ, అసలు ప్రిపరేషన్ ఎలా వున్నా, న్యూస్ పేపర్ విషయాలు మటుకు క్షుణ్ణంగా చదువుతాడు వాడు'' అంది శ్రీమతి.

"నువ్వంటున్న విషయం నేనూ చదివాను అక్కా! పురుషులతో ప్రమేయం లేకుండానే శరీరంలోని ఏదో ఒక భాగంలోని జీవకణం నుంచి జన్యు పదార్థాన్ని తీసుకుని స్త్రీల నుంచి విడుదలయ్యే అండకణాలతో ఫలదీకరణ జరిపించే సరికొత్త పరిజ్ఞానాన్ని ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసారట. 'సొమాటిక్ కణాలు' అనబడే ఓ రకమైన జీవకణాలను శరీరం నుంచి తీసుకుని, వాటిని అండ కణాలతో ఫలదీకరణ జరిపించడం ద్వారా ఈ ప్రక్రియలో సంతానోత్పత్తి కలిగించవచ్చని మెల్ బోర్న్‌లోని మెనాష్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలంటున్నారు. సొమాటిక్ కణాల్లో రెండు జతల క్రోమోజోన్లు అవరోధం నివారిస్తూ, అదనపు క్రోమోజోమ్‌లను తొలగించే సరికొత్త రసాయనిక ప్రక్రియను అభివృద్ధి చేయడంతో ఈ అవకాశం ఏర్పడిందట. అయితే

ఈ ప్రక్రియద్వారా అభివృద్ధి పరిచిన పిండాలు గర్భాశయంలో ఎంతవరకూ, ఎలా అభివృద్ధి చెందుతాయనే దాని మీద ఈ ప్రయోగ విజయాలు ఆధారపడి వుంటాయి'' అన్నాడు ఫణి.

"ఓ అయిదారు నెలల్లో ఈ పరిశోధనలకు సంబంధించిన అనుమానాలకు సమాధానం లభిస్తుందంటున్నారు తమ్ముడూ!'' అంది శ్రీమతి.

"మామా హర్రియప్! ఇప్పటికయినా ఆలస్యం చేయకుండా నువ్వు పెళ్ళిచేసుకో! లేకపోతే అసలు నీ అవసరానికే, అస్థిత్వానికే విలువలేకుండా పోతుంది'' అంటూ స్నేహిత్ ఎంటరయ్యే సరికి మేం నివ్వెరపోయాం.

"పొద్దున్నే ఏడయినా కాకుండా పుస్తకాలషాపు తెరిచేదెవ్వరు? మీరు తరిమారని నేను వెళ్ళిపోతే నా తెలివి ఏం కాను! గుమ్మం దాటాక గుర్తొచ్చింది. ఆగిపోయాను'' అంటూ స్నేహిత్ "మామాజీ! నీ పెళ్ళి మాత్రం కాశ్మీర్ సమస్యలా నాన్చకు మహానుభావా'' అన్నాడు.

"నా గొడవ నీకెందుకురా! ఇంతకీ టీ తాగడానికి వస్తున్నావా లేదా?'' అన్నాడు ఫణి.

"నేను కాఫీ, టీలు తాగను. స్వచ్ఛమైన పాలు తాగుతా'' అని స్నేహిత్ అనేసరికి అంతా నవ్వేసాం.

*శనివారం **14** జులై **2001***

# స్పూనరిజం

కొత్తగా స్టేజి ఎక్కినవాడు భయంతో 'గయుడా! భయము వలదు' అనడానికి 'భయుడా! గయము వలదు' అనేసినట్లు 'జయంబు నిశ్చయంబురా భయంబు లేదురా' అనడానికి బదులు 'భయంబు నిశ్చయంబురా' అని పాడుకుంటూ ఎంటరయ్యాడు సన్యాసి.

"ఏమోయ్ సన్యాసీ! తెలిసే పాడుతున్నావా లేక తెలియక పాడుతున్నావా? అదేనా పాట తీరు" అని నిలదీసాడు చిదంబరం.

"అవునా! గమనించనే లేదుస్మీ! ఇలా అస్తవ్యస్తం కావడాన్ని ఇంగ్లీషులో ఏదో అంటారు కదా! తొట్రుపాటు వలనా, భయంవలనా జరిగేవి - ఒక్కోసారి ఇలా అనుకోకుండా నోటంట యధాలాపంగా వచ్చేయడం చిత్రమే' అన్నాడు సన్యాసి.

"మాటలు తిరగబడి చమత్కారం వచ్చే ఈ వాగ్వికృతిని 'స్పూనరిజం' అంటారోయ్ సన్యాసీ! తొట్రుపాటూ, భయమే కాదు. మందమతివల్లా, మతిమరుపువల్లా కూడా ఇలా సంభవిస్తూంటుంది. ... ఒకమాట అనబోయి ఆ వరుసలోనే దానికి సన్నిహితమైన మరోమాటనో, లేదా ఒకే ఒక అక్షరం తారుమారుతో పలకడంవల్లనో ఈ స్పూనరిజం పుడుతుంది" అన్నాడు చిదంబరం.

"మాటల్లో తడబాటు అర్థం చేసుకోవచ్చు. హాస్యంగా అది తేలిపోవచ్చు. కానీ చేతల్లో తడబాటు చేటు తెస్తుంది. ఇవాళ అన్నమాటను ఇంతలోనే మార్చేస్తూ చేతల్లో వ్యవహరించడం స్పూనరిజం అని సరిపెట్టకోలేం కదా! అది మేనరిజం అని కూడా అనుకోలేం" అన్నాడు పాండురంగ.

"అది నిజమేనోయ్ పాండూ! కానీ సరియైన మాటకూ, చేతకూ ఆస్కారం ఇవ్వని పరిణామాలు ఒక్కోసారి సంభవిస్తూ వుంటాయి. పైకి చూస్తే అవి 'ధ్వజం' ఎత్తవలసిన సంగతిగానే అనిపిస్తాయిగానీ, అంతరార్థాలు గమనిస్తే అందులో ఏదో పరమార్థం కనబడకపోదు. తెహల్కా వ్యవహారంలో జార్జి ఫెర్నాండెజ్ గారి ప్రమేయం, దోష నిర్ధారణ ఏమిటో తెలీకుండానే - తిరిగి ఆయనకు రక్షణ శాఖను అధికారికంగా మంత్రి పదవితో కట్టబెట్టడం కొందరికి మింగుడుపడడం లేదంటే అదే కారణం. వాజ్‌పేయిగారి 'స్పూనరిజం చేష్టది' అనే వారుంటారు. పాపం! ఆయనను అనుకోవడం ఎందుకులే! అసలు ప్రకృతికి కూడా ఈ తడబాటు,అస్తవ్యస్తం అంటుకుంటోంది. కాబోలు!

లేకపోతే స్వాన్ నీటికోసం కూడా కరువు పరిస్థితితో ఇబ్బందిపడే రాళ్ళసీమ అనే రాయలసీమకు ఇటీవల వరదలు ముంచెత్తే పరిస్థితి వచ్చిందంటే వరుణదేవుడే తడబడి ప్రవర్తించినట్లుగా లేదూ! ఇదంతా కూడా చేష్టాగత స్వానరిజమేనేమో'' అన్నాడు చిదంబరం.

"భయంబు నిశ్చయంబురా... అని నా నోటంట పాట వచ్చిందంటే తెలీకుండానే నా మనసులో యుద్ధ భయం లాంటిదేదో బాగా ముసురుకుందంటారా అయితే'' అడిగాడు సన్యాసి.

"అదేదో నీకే తెలియాలి. మొన్న ఢిల్లీలో జరిగిన ఓ విలేకరుల సమావేశంలో అమెరికన్ బ్రాడ్‌కాస్టింగ్‌కు చెందిన మహిళా జర్నలిస్టు ఒకరు మన విదేశాంగమంత్రి జస్వంత్‌సింగ్‌నే ప్రధానమంత్రి అనుకుని ప్రశ్నించిందట. నేను ప్రధానిని కానని ఆయన చెబితే పొరబాటుకు నాలిక కరుచుకుందిట. అంతా నవ్వుకుంటూంటే అమెరికా విదేశాంగ మంత్రి పావెల్‌గారు మరింత సరదాగా 'హలో ప్రైం మినిస్టర్' అంటూ జస్వంత్‌కు షేక్‌హ్యాండ్ ఇచ్చి జస్వంత్‌ను మరీ ఇరుకున పెట్టారట. తడబాట్లు, పొరబాట్లు చిన్నచిన్నవయితే క్షమాపణలతో పోతుంది గానీ లేకపోతే సమస్యలే మరి'' అన్నాడు పాండురంగ.


"పాకిస్థాన్ అను' అని చెప్పి, మా పాప వెంటనే 'నీ పిలక పీకిస్తాన్' అంటుంది. పిల్లలు ఇలాంటి ఆటలు, మాటలు కలిగివుండడం మామూలే. వాళ్ళ మనసుల్లో వేరు దుష్ట భావనలు ఏం వుండవు. అది మాటల సరదా అంతే. కానీ ఆఫ్ఘాన్‌లోనూ, కొన్ని ముస్లిం దేశాలలోనూ పిల్లలను చిన్నతనం నుంచే మత మౌఢ్యంతోనూ - అన్యమత విద్వేషకుల గానూ పెంచి పోషిస్తున్నారంటే బాధ కలుగుతుంది. నిష్కల్మషమైన పసి మనసులను పగ, ద్వేషం, అసహనంతో నింపడం బాధాకరం. దారుణం కూడాను'' అన్నాడు సన్యాసి.

"అవును. నువ్వన్న పరిస్థితులే భవిష్యత్తు గురించిన భయాలను కూడా పేనుతున్నాయి. అగ్రవాదమూ తప్పే. ఉగ్రవాదమూ తప్పే. అహంకరించినవాడూ నాశనం అవుతాడు. వినాశనం సృష్టించేవాడూ విధ్వంసం అవుతాడు. 'తుపాకీల హతం చేసి కృపాకీల వెలిగించుము' అన్నాడు కవి దాశరథి. సంగరం అనంగరంగంలోనూ వుంది. ఆఫ్ఘాన్ సారంగంలోనూ వుంది. దేహాలమధ్యా దేశాలమధ్యా కూడా యుద్ధాలుంటాయి. అలాంటప్పుడు శుభ్రంగా ప్రేమించుకోక యుద్ధాలెందుకు చేస్తారో అర్థంకాదు అంటాడు ఓ కవితలో కవి ఇస్మాయిల్. యుద్ధానికి సన్నద్ధంగా దేహాన్నీ దేశాన్నీ వుంచడం అవసరమే. కానీ కండపెంచాను కనుక అది కరగడానికి ఎవరో ఒకర్ని గుద్దుతా

చంపుతా అంటే అదేం లాజిక్కు? నీ మానాన నీవు బ్రతుకు. ఎదుటి వాడిని వాడి మానాన వాడిని బ్రతకనీ. ఒకరి మానాన్ని నీవు హరించకు, మానహరణాలనే స్మరిస్తూ మారణహోమాలను సృష్టించుకుంటూ పోతే అది అంతిమ న్యాయం అవుతుందనుకోడం పొరపాటు'' అన్నాడు చిదంబరం.

"ఒక్క వేలు చూపి ఒరులను నిందించ మూడువేళ్లు నిన్ను వెక్కిరించు'' అన్నారోయ్ పెద్దలు. గురివింద తన కిందవున్న నలుపును ఎరగదని సామెత. ఒకరిని నియంత్రించాలని భావించేవాడు ముందు తాను 'నియంత' కాకుండా నియంత్రణలో వుండాలికదా! అవతలివాడు కవ్వించినా, తాను సంయమనంలో వుంటాడు స్థితప్రజ్ఞుడు. అయితే అది అసమర్థతతోనో, భీరుత్వంతోనో కాదు. అమెరికా ప్రస్తుతం తనకు అందిస్తున్న స్నేహ హస్తం చూసుకుని - పాక్ భారత్ మీద పేట్రేగిపోకుండా వుండేందుకే తన జాగ్రత్తలో తాను భారత్ యుద్ధస్పృహతో వుంది. ఉన్నానని ఋజువు పరచుకుంటూ వుంది. భారత్ రణోన్మాదంతో ఏమీ లేదు. అమెరికాను కూడా ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశంగా పరిగణిస్తూ - ప్రపంచంలో రెండు అతి పెద్ద ప్రజాస్వామ్య దేశాలైన భారత్, అమెరికాలు సహజ మిత్రులని ప్రధాని వాజ్‌పేయి అభిప్రాయపడ్డారు. వచ్చేనెల 9న ఆయన అమెరికా పర్యటనకు ఇది నేపథ్యవాక్యమే గానీ స్నూనరిజం కాదని మనం విశ్వసించాలి'' అన్నాడు పాండురంగ. "జయంబు నిశ్చయంబురా భయంబు లేదురా'' అని ఈ మాటు సజావుగా కూనిరాగం తీసాడు సన్యాసి.

*శనివారం, **20** అక్టోబర్ **2001***



# సుధామ

అసలు పేరు : అల్లంరాజు వెంకటరావు

జననం : 25.11.1951 ఆదివారం

అమ్మ : రాజేశ్వరమ్మ, నాన్నగారు : కీ॥శే॥ కామేశ్వరరావు

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రాచ్యవిద్య చదివి తెలుగులో పోస్టుగ్రాడ్యుయేషన్. 'అభ్యుదయ కవిత్వంలో భావచిత్రాలు' (ఇమేజరీ) గురించి యం.ఫిల్ పరిశోధన చేసారు.

కొంతకాలం ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి రచయితల సంఘం ఉపకార్యదర్శిగా, యువభారతి ఉపాధ్యక్షులుగా ఉన్నారు. కరీంనగర్ బిషప్ సాలమన్ జూనియర్ కళాశాలలో 1975లో రెండేళ్లు తెలుగులెక్చరర్ ఉద్యోగం. 1978లో ఆకాశవాణిలో చేరి పదోన్నతిపై 1991 నుండి కార్యక్రమ నిర్వహణాధికారిగా ఉన్నారు. 1983లో ఆకాశవాణి జాతీయ కవిసమ్మేళనంలో తెలుగుకవిగా ప్రాతినిధ్యం. 1974లో 'మేం', 1990లో 'అగ్నిసుధ' కవితాసంకలనాలు ప్రచురించారు.

'అగ్నిసుధ'కు ఆ ఏటి ఉత్తమ వచనకవితా సంకలనంగా కలహంసి-బాబయ్య, ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డులు లభించాయి.

కవిగా, కాలమిస్టుగా, కార్టూనిస్టుగా, సమీక్షకునిగా, రచయితగా, వక్తగా, రేడియో'వాడి' గా తెలుగు పాఠకులకు, శ్రోతలకు పరిచితులు.

మామూలయిన అలవరసలలో... ఇలవరసల కబుర్లు సుధామ 'సం.సా.రాలు'.